

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## సదాశివపేట, సంగారెడ్డి జిల్లా (తెలంగాణ)

సంచిక : ఏప్రిల్- 2024 ISSN -2457-0796

## అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక
## భారతీయ సాహిత్యం - త్రిగుణములు
## 12 ఆగస్టు, 2023

UGC APPROVED JOURNAL
మూసీ ప్రత్యేక సంచిక
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక



వ్యవస్థాపకులు

శ్రీ బి.ఎన్.శాస్త్రి



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 6 (2) ఏప్రిల్ - 2024

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013


**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

# అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# భారతీయ సాహిత్యం - త్రిగుణములు

**12 ఆగస్టు, 2023**

## మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2024

ప్రతులు : 500

కాపీలకు : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, తెలంగాణ

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**

మేనేజర్, **మూసీ మాసపత్రిక,**

2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఫోన్ : 934 797 1177

**email : editormusi@gmail.com**

# భారతీయ సాహిత్యం - త్రిగుణములు

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

**12 ఆగస్టు, 2023**

## సంపాదక మండలి

గౌరవ సంపాదకులు

**ఆచార్య టి. పతంజలి, ప్రధానాచార్యులు**

ప్రధాన సంపాదకులు

**డా యస్. బేబీ రమణి, తెలుగు శాఖాధిపతి**

**నిర్వాహక మండలి**

శ్రీ వినాయక కుమార్, వైస్ ప్రిన్సిపాల్

డా.డి.పద్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్

శ్రీమతి కె.అనురాధ, అసిస్టెంట్ ప్రొఫెసర్, బోటనీ

శ్రీమతి పి.సావిద్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, కామర్స్

శ్రీ డి.సర్వయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, మాథ్స్

శ్రీమతి ఎ.మంజుల, హిస్టరీ లెక్చరర్

శ్రీ పి.రాజిరెడ్డి, ఫిజిక్స్ లెక్చరర్

శ్రీ టి.శంకరయ్య, జువాలజీ లెక్చరర్

శ్రీ ఎ.చంద్రశేఖర్, కామర్స్ లెక్చరర్

కుమారి ఎస్.స్రవంతి పొలిటికల్ సైన్స్ లెక్చరర్

**సాంకేతిక సహకారం**

కుమారి ఎఫ్. భవాని, కంప్యూటర్ లెక్చరర్

**తెలుగు శాఖ**

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల

**సదాశివపేట, సంగారెడ్డి జిల్లా**

# విషయసూచిక


ఆచార్య తాడేపల్లి పతంజలి : **త్రిగుణ 'శ్రీముఖం'** 8

నామాట : **రమణి** 11

1. డా. కె.యస్.వి.వి.యస్.నారాయణ మూర్తి : **భాగవత స్మరణ-సాత్త్విక తపస్సు** 13
2. డా. వి.ఎన్. మంగాదేవి : **పాండవ మధ్యముడు – సాత్త్విక గుణము** 21
3. డా. జంపాల అనురాధ : **మహాభారతం-కౌశిక వృత్తాంతం-త్రిగుణ నిరూపణ** 24
4. డా. మఠపతి మాంతయ్య : **శ్రీ దేవీ భాగవత పురాణము-సత్త్వ,రజస్తమో గుణములు** 28
5. డా. ఎస్.బేబీ రమణి : **సత్త్వగుణాధిక్యతచే శాంతియుత నవసమాజ స్థాపన** 33
6. డా. ఎ.వెంకట ప్రసాద్ : **మహాభారత ఉద్యోగపర్వంలో కనిపించే సత్త్వగుణము** 37
7. డా. ఎస్. రమాదేవి : **సద్గురువు ఈనాటి ఆవశ్యకత** 42
8. డా. రాపోలు శ్రీనివాస్ : **ధర్మరాజు త్రిగుణములు** 48
9. డా. ఎన్. మల్లికార్జున్ : **త్రిగుణములలో సత్త్వగుణ వైశిష్ట్యము** 53
10. డా. జె. సీతాపతి రావు : **మహాభారత కథ సంబంధి నవలల్లో త్రిగుణాలు** 57
11. డా. జి. వెంకటలక్ష్మి, డా. గంజి శశిధర్ : **గజేంద్రమోక్ష ఘట్టంలో త్రిగుణాత్మకత** 63
12. డా.ఎన్.విజయలక్ష్మి : **ఆంధ్రమహాభారతం – మహర్షులు-త్రిగుణాలు** 66
13. డా. పఠాన్ ఖాసింఖాన్ : **ధర్మవ్యాధ బోధలో సత్త్వగుణ శోభ** 71
14. డా. కపిల భారతి : **రామాయణంలో కౌసల్య పాత్ర-త్రిగుణములు** 75
15. ఎస్. రజిత : **ఎఱ్రన అరణ్యపర్వ శేషంలో సుశీలుని కథ-త్రిగుణములు** 78
16. డా. బూర్గుల స్వరూప : **మహాభారతంలో ధర్మరాజు సత్త్వగుణము** 81
17. డా. బి. భవాని : **త్రిగుణములు-రామప్ప రభస పాత్రల పరిశీలన** 85
18. డా. నందూరి అనంతలక్ష్మి : **గజేంద్రమోక్షం-త్రిగుణ ప్రభావం** 89
19. డా. సి. నర్సింహులు : **మహాభారతంలో కౌశికుని కథ-సత్త్వ,రజో గుణములు** 95
20. డా. బి. కాథరినా : **శ్రీపాదస్వాతి కథల్లో త్రిగుణాలు** 99
21. పి. కుసుమ కామేశ్వరి : **కథ-త్రిగుణములు** 102
22. డా. పి. కమల సుధారాణి : **మహాభారతంలో త్రిగుణములు** 105
23. డా. జె. సంతోష్ కుమార్ : **త్రిగుణ స్వరూప స్వభావ వివేచనం** 109

24. డా. యు. ఝాన్సీ : తెలుగు స్త్రీవాద కథ-రజోగుణం 118

25. వాడ్రేవు నాగమణి : శ్రీమద్భగవద్గీత – త్రిగుణాల పరిశీలన 123

26. డాక్టర్ పప్పుల వెంకటరమణ : మనుచరిత్ర – ప్రవరుని సత్వగుణం 126

27. డా. ఎం. మునిలక్ష్మి : భగవద్గీత-త్రిగుణాత్మక సందేశం 130

28. శ్రీమతి పి.శారద : శ్రీ మద్రామాయణము – త్రిగుణములు 133

29. డా. ఎమ్. సమత : ప్రహ్లాద చరిత్ర – హిరణ్యకశిపుడు – త్రిగుణాలు 137

30. డా. ఎం. రమేశ్ బాబు : మానవ జీవితం త్రిగుణాత్మకం 141

31. దేవరకొండ ప్రవీణ్ కుమార్ : జగన్నాథ కథ –సత్త్వగుణ పరిచయం 145

32. అరుణ గెంటి : భగవద్గీత మరియు వివేకచూడమణిలో రజోగుణం యొక్క విశ్లేషణం 149

33. హిమబిందు వేదుల : వాడ్రేవు వీరలక్ష్మీదేవి కథలు – త్రిగుణముల ప్రస్తావన 152

34. నోసిన వెంకటేశ్వర్లు : సత్త్వగుణానికి ప్రతీక – మహాసాధ్వి సీతాదేవి 156

35. ఎమ్. ప్రదీప్ :సత్త్వగుణ సంపన్నుడు ప్రహ్లాదుడు 159

36. డాక్టర్ వీపూరి వేంకటేశ్వర్లు : త్రిపురాసుర సంహారం – త్రిగుణాత్మక పరిశీలన 163

37. కపర్తి స్వరాజ్యం : భాగవతం పరమాత్మ స్వరూపం – కర్మ సిద్ధాంతం 166

38. వై. బుజ్జి : శ్రద్ధాత్రయ విభాగ యోగము త్రిగుణాల నిరూపణ 174

39. డా. డి. అనంతలక్ష్మి, శ్రీమతి కె.రాజేశ్వరి : त्रिगुणों के आधार पर रावण का चरित्रचित्रण 178

40. గుండే పవన్ కుమార్ : त्रिगुणाः 181

41. కేరేటి లిఖిత : भगवद्गीतायां सत्त्वगुणस्य विवेचनम् 185

42. ఉపద్రష్ట సత్యవాణి : त्रिगुणाः 188

ISSN 2457-0796 UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# త్రిగుణ "శ్రీముఖం"

- ఆచార్య తాడేపల్లి పతంజలి
ప్రాచార్యులు
సదాశివపేట

భారతీయ సాహిత్యం త్రిగుణాలు అను శీర్షికతో మా సదాశివపేట ప్రభుత్వ స్నాతక కళాశాల నిర్వహించిన అంతర్జాల సమావేశంలో పాల్గొని, విలువైన వ్యాసాలను అందించిన సాహితీవ్రతులకు, స్ఫూర్తి దాయకమైన ప్రసంగాలు చేసిన పెద్దలందరికి నమస్కారం.

నైతిక సంప్రదాయ బలంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి విలువలతో కూడిన ఈ సమావేశాన్ని నిర్వహించి, వ్యాసాలను ఒక సంచికగా వెలుగులోకి తీసుకు వస్తున్న మా తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎస్ బేబీ రమణ గారికి ముందుగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఒక సదస్సు లేదా చర్చాసభను (సెమినార్) నిర్వహించేది మనకి తెలియనటువంటి విషయాన్ని కొత్తగా నేర్చుకోటానికి. అలాగే ఇంతకుముందు మన జ్ఞాపకాల పొరల్లో అట్టడుగున దాగి ఉన్నటువంటి విషయాల్ని మరల పైకి తెచ్చుకుని జ్ఞానానందాన్ని పొందటానికి. మన జీవితం ఆనందమయంగా ఉండాలి. అసలైన అటువంటి ఆనందం జ్ఞానం. అందుకే పరమాత్మని జ్ఞానానందమయుడని పిలుస్తారు (జ్ఞానానందమయం దేవం.)

త్రిగుణాలు అంటే ఏమిటో అందరికీ తెలిసిన విషయమే. సత్వ రజస్ తమో గుణాలు. సత్వ గుణము, రజోగుణము, తమోగుణము. ఈ మూడు మన జీవితంలో మనతోటే అంటిపెట్టుకొని ఉంటాయి.

రామకృష్ణ పరమహంస ఒక చక్కటి కథ ద్వారా ఈ మూడు గుణాలను చక్కగా ఆవిష్కరణ చేసారు. మనం ఈ కథని జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ మూడు గుణాల స్వరూప స్వభావాలు మన హృదయానికి చక్కగా పట్టుకొంటాయి.

ముగ్గురు దొంగలు ఉన్నారు. ఆ అరణ్యంలో పోతున్నటువంటి ఒక ధనికుని పట్టుకున్నారు. పట్టుకున్న తర్వాత అతని దగ్గర ఉన్నటువంటి ధనం దోచుకున్నారు.

దోచుకున్న తర్వాత ఆ ముగ్గురు దొంగలలో మొదటి దొంగ( తమోగుణం). "ఒరేయ్! వీడు ఊర్లోకి వెళ్లిన తర్వాత ఎవరైనా పంపించి మనలను చంపే ప్రయత్నంచేస్తాడు కాబట్టి వీడిని చంపేద్దాం" అన్నాడు మిగతా ఇద్దరు దొంగలు ఒప్పుకోక పోవటంతో చిరాకుతో మొదటివాడు ఆప్రదేశంనుంచి వెళ్లిపోయాడు.

రెండో దొంగ (రజోగుణం) "వీడిని చెట్టుకు కట్టేసి వెళ్లిపోదాం "అన్నాడు మూడవదొంగతో. అలాగే ఆఇద్దరు ఆ దొంగలు ఆ ధనికుని చెట్టుకు కట్టేసారు.

తరువాత కొద్దిసేపటికి మూడోదొంగ రెండవ దొంగతో "నువ్వు ముందు నడు. నేను తరువాత వస్తాను" అని చెప్పి రెండవవాడిని మూడో దొంగ (సత్వ గుణం) పంపించి వేసాడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) UGC CARE List Approved Journals హైదరాబాద్ ఏప్రిల్ - 2024

రెండవ దొంగ వెళ్లిపోయిన తరువాత మూడవ దొంగ (సత్వ గుణం) ఆ ధనికుని కట్లు ఊడదీసి అతనితో ఇలా అన్నాడు. " నిన్ను చూస్తుంటే నాకు చాలా జాలి వేస్తోంది. నీ ఇంటికి వెళ్లు" అన్నాడు. ఆ ధనికుడు "ఈ అరణ్యంలో ఈ చీకటిలో దారి తెలిసిన నువ్వు నాకు దారి చూపించు" అన్నాడు.మూడవ దొంగ ( సత్వ గుణం) ఆ ధనికునికి ఊరు పొలిమేరలదాక దారి చూపించాడు. "ఇక్కడి దాకా వచ్చావు కదా! మా ఇంటికి కూడా వచ్చి వెళ్ళు" అని ధనికుడు మూడవదొంగతో అన్నాడు. "లేదండి నేను ఆ పని చేయలేను. నేను వెళ్ళిపోతున్నాను" అని చెప్పి ఆ మూడో దొంగ వెళ్లిపోయాడు.

ఈ కథని త్రిగుణాలకి సంబంధించి ఎన్నో విశేషాలతో విశ్లేషించుకోవచ్చు.

తమోగుణం (మొదటి దొంగ) చీకటితో నిండి ఉంటుంది. తనకు అడ్డు వచ్చిన వారిని చంపేస్తానంటుంది. మంచి, చెడు ఆలోచన చేయదు.

ఇక రజో గుణం (రెండవ దొంగ) మనలిని ఈ సంసారంలో కట్టేస్తుంది.

సత్వ గుణం (మూడవ దొంగ) దారి చూపిస్తుంది. జీవితంలో ఎలా ప్రవర్తించాలో, ఎలా నడవాలో తెలియ చేసి మార్గం చూపిస్తుంది.

అయితే ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి. సత్వ గుణం తప్పకుండా దారి చూపిస్తుంది కానీ ఆ పరమాత్మ దగ్గరికి మాత్రం చేర్చదు. త్రిగుణాతీత స్థితి మాత్రమే భగవత్సన్నిధికి చేరుస్తుంది. అందుకని సత్వ గుణము నుంచి త్రిగుణాతీత స్థితికి మనం చేరాలి.

ఈ మూడు గుణాలు మనలో కలిసే ఉంటాయి.

శరీరమునకు సంబంధించిన ఇంద్రియాలలో, అంతఃకరణములో చైతన్యము, వివేకశక్తి కలిగితే మనలో సత్త్వగుణము వృద్ధిచెందినదని భావించాలి (భగవద్గీత14.11)

లోభము, స్వార్థబుద్ధితో కర్మాచరణము, అశాంతి, విషయభోగములలో అధికమైన కోరిక కలిగితే లాలస మనలో సత్త్వగుణము వృద్ధిచెందినదని భావించాలి. (భగవద్గీత 14 – 12)

అంతఃకరణమును మోహింపచేసే వ్యర్థచేష్టలు, వివేకశక్తి కోల్పోవటం జరిగితే మనలో తమోగుణము అధికమైనదని భావించాలి. (భగవద్గీత 14 –13).

భగవద్గీతలో దైవాసురసంపద్విభాగ యోగములో (16వ అధ్యాయములో 1నుండి 03 శ్లోకాలు) స్వామి సత్వగుణాలకు సంబంధించి ఈ 26 లక్షణాలు చెప్పాడు.

"నిర్భయత్వం, అంతఃకరణ శుద్ధి ,ఆధ్యాత్మిక జ్ఞానములో స్థిరత్వం, దానము, ఇంద్రియ నిగ్రహం, యజ్ఞము చేయటం, సత్ గ్రంధ పఠనం, తపస్సు, నిష్కపటత, అహింస, సత్యసంధత, క్రోధము లేకుండుట, త్యాగము, శాంతి, తప్పులు వెదకకుండా ఉండటం, సర్వ భూతముల పట్ల దయ, దురాశ లేకుండుట,సౌమ్యత, సిగ్గు (లజ్జ), చపలత్వంలేకుండుట, దృఢసంకల్పం. ఓర్పు, మనఃస్థైర్యము.పరిశుభ్రత. ఎవరిపట్ల కూడా శత్రుత్వం లేకుండుట. దురభిమానం లేకుండుట".

పై సత్వ గుణాలను అలవరచుకోవటానికి, మానసిక స్వచ్ఛతను పొందటానికి మనం ప్రయత్నించాలి. ఈ సదస్సులోని ప్రసంగాల ద్వారా, వ్యాసాల ద్వారా అటువంటి స్వచ్ఛతను పొందటానికి మనం ప్రయత్నిద్దామని, అందుకు విలువైన వ్యాసాలు కల ఈ సంచిక ఒక కరదీపిక అవుతుందని ఆశిస్తున్నాను.

ధన్యవాదాలు

***********

# నా మాట

మానవ జీవనం త్రిగుణాల సమాహారం. ప్రతి ఒక్కరిలో ఈ సత్త్వ, రజో, తమోగుణాలు తమ ప్రభావాన్ని చూపుతూనే ఉంటాయి. కానీ ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఈ మూడు గుణాలలో ఒక్కగుణం మాత్రమే ఆధిక్యతను కలిగి యుంటుంది. ఏ గుణం అధికంగా ఉంటుందో అతడు ఆ గుణ ప్రధానుడవుతాడు. మనకు కలిగిన గుణ ప్రాధాన్యతనుబట్టి మన సుఖసంతోషాలు ఆధారపడి ఉంటాయి. అందుకే త్యాగరాజు "శాంతములేక సౌఖ్యము లేదు" అని పలికినా,

**"తన కోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకురక్ష దయచుట్టంబౌ**
**తన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖము నరకమండ్రు తథ్యము సుమతీ"**

అని సుమతీ శతకకారుడు తెలిపినా ఆ పలుకుల వెనుక అంతర్లీనంగా ఉన్న సందేశం ఏమంటే, సత్త్వగుణాన్ని పెంపొందించుకోవడమే. ఈ గుణ ప్రాధాన్యత గృహసంబంధిత విషయాలలోను, ఉద్యోగ నిర్వహణకు సంబంధించిన అంశాలలోను, సమాజ సంబంధ విషయాలలోను ప్రతినిత్యం మనను అనుసరిస్తూనే ఉంటుంది.

మనం సత్త్వగుణాన్ని అనుసరిస్తే, ఆ సత్త్వగుణంనుండి లభించే అలౌకికానందం కేవలం మనపై మాత్రమేకాక, మన చుట్టూఉండే పరిసరాలపై కూడా ప్రభావాన్ని చూపుతుంది. కానీ నేడు మన సమాజంలో కుటుంబజీవనం మొదలుకొని సామాజిక, రాజకీయ అంశాలవరకూ కూడా రజో, తమోగుణాల ఆధిక్యత ఎక్కువగా కనిపిస్తుంది. కనుకనే అనుబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. పగ, ప్రతీకారాలతో సాటి మనిషి ప్రాణాలను తృణప్రాయంగా చూస్తున్నారు. ధనదాహంతో తల్లిదండ్రులను సైతం చంపే కుమారులున్నారు. ఈ విధ్వంసకరమైన ఆలోచనలన్నింటికీ కారణం రజో, తమో గుణాలు తమ ఆధిక్యతను ప్రదర్శించడమే. అందుకే వేమన ఇలా అన్నాడు.

**"మంచివాడు లేడు మహిమీద వెదకిన**
**కష్టులెందరైన కలరు భువిని**
**పసిడిలేదుకాని పదడెంత లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ"**

లోకంలో ఎక్కడ వెతికినా మంచివాళ్లు కన్పించరు. నీచులు ఎక్కడపడితే అక్కడ కన్పిస్తారు. బంగారం దొరకడం కష్టంగానీ, బూడిద దొరకడం కష్టంకాదుకదా అన్నాడు వేమన. అదేవిధంగా రజోతమోగుణాలు కలిగినవారు ఎక్కువగా కన్పిస్తారుకానీ సత్త్వగుణం కలిగినవారు అరుదుగా కన్పిస్తారు.

ఈ సత్త్వగుణాన్ని అలవరచుకోవాలంటే ఓర్పు, సహనం పెంచుకోవాలి. అయితే అందుకు ముందుగా దృఢంగా సంకల్పించాలి. నిత్య సాధన ఆచరించాలి. ఈ నిశ్చల తపస్సును జీవితాంతం ఆచరించాలి. తద్వారా నేను పూర్వం నిర్వహించిన సెమినార్లలో ఒకటైన ఆశ్రమధర్మాలను సక్రమంగా పాటించడం జరుగుతుంది.

దానివల్ల నా మరొక సెమినార్ అయిన అరిషడ్వర్గాన్ని జయించడం జరుగుతుంది. అరిషడ్వర్గాన్ని జయించడంవల్ల నా సెమినార్లలో మరొకటియైన చతుర్విధ పురుషార్థాలలోని మోక్షాన్ని, జీవిత లక్ష్యాన్ని చేరుకుంటాము. ఈ లక్ష్యంతోనే ఈ త్రిగుణాల గురించి సమాజానికి జ్ఞాపకం చేసి, సత్త్వ సంపన్నులతో కూడిన నవసమాజమే పరమార్థంగా ఈ సెమినార్ నిర్వహిస్తున్నాను. నా ఈ సదస్సునకు సహకరించిన సత్త్వగుణ ప్రధానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు.

మీ

**రమణి**

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# భాగవత స్మరణ - సాత్త్విక తపస్సు

**డా. కె.యస్.వి.వి.యస్.నారాయణ మూర్తి,**
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
నారాయణగూడ,

**"జన్మాద్యస్య యతోన్వయాది తరతశ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మహృదాయ ఆదికవయే ముహ్యంతి యత్సూరయః
తేజోవారిమృదాం యధా వినిమయో యత్ర త్రిసర్గో మృషా
ధామ్నాస్వేన సదా నిరస్తకుహకం - సత్యం పరంధీమహి"**

ఇది సంస్కృత శ్రీభాగవతంలోని మొదటి శ్లోకం. ఇక తెలుగులో పోతనామాత్యుల వారి శ్లోకసమాన ప్రారంభ పద్యం జగద్విఖ్యాతం. 'శ్రీకైవల్యపదం' చేరుకోవడం కోసం తాను చింతన చేస్తూ మనల్ని అందరినీ తనవెంట పయనమయ్యేలా, మంత్రశాస్త్ర రూపంలో, ఓం ఐం హ్రీం శ్రీం బీజాక్షరాలను 'మహత్వ కవిత్వ పటుత్వ సంపదలు'గా ప్రసాదించమని ఆ శ్రీదేవిని కోరి, సాహిత్య తపస్సును మనచేత ఆచరింప చేసిన మహనీయుడు 'తెలుగుల పుణ్యపేటి'. - భాగవత స్మరణ ఒక సారస్వతానీక సాత్త్విక తపశ్చర్య. జీవుని ఉన్నతికి సోపాన పంక్తి ఈ గ్రంథంలోని ద్వాదశ స్కంధములు. త్రిగుణములలో సత్వగుణ వృద్ధి చేత మాత్రమే జీవుడు ఆత్మోన్నతిని సాధించగలుగుతాడు.

**పరిచయం**

ఈ వ్యాసంలో సత్వగుణ శబ్ద వివరణ, భాగవత పఠన పాఠనాదుల వల్ల కలిగే ప్రయోజనం, నేటికాలంలో ముఖ్యంగా యాంత్రీకరణ వేగవంతమై ప్రగతి పేరిట ఆకాశానికి నిచ్చెనలు వేసి, పునాదులు లేని ఆకాశహర్మ్యాలను నిర్మించే యత్నాల కారణంగా పతనమవుతున్న యువతకు సద్వమార్గాన్ని సూచించడం ప్రధాన అంశం.

**ముఖ్యపదాల ప్రస్తావన:**

సత్వ రజ స్తమో గుణాలు - తపస్సు - భాగవత శబ్ద నిర్వచనం - సత్వదానం - సాత్త్విక భోజనం - మనోధర్మ జీవనం - ఆత్మోన్నతి - మానసిక ప్రశాంతత సాధించడం - ఆత్మవిశ్వాసం పెంచుకోవడం - సత్వగుణాభివృద్ధి చేత - ఉన్నత జీవన విధానం - ప్రపంచ శాంతి సాధన - ఆత్మానంద సంధాన కావ్యానందోపలబ్ధితో బ్రహ్మానంద స్థితిని సాధించడం చరమలక్ష్యం.

**సత్వగుణ ప్రాధాన్యం:**

"త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

**సాత్త్విక రాజసీ చైవ తామసీ చేతి తాంశృణు" (17-2)**

అర్జునునికి కలిగిన సందేహానికి శ్రీకృష్ణుని సమాధానం ఇది. మానవులలో స్వభావరీత్యా భేదాలుంటాయి. కర్మలు చేసేవారు లోకంలో మూడువిధాలుగా ఉంటారు. వారు, 1. సాత్త్విక, 2. రాజసిక, 3. తామసిక గుణవర్తనులు.

సత్ యొక్క భావం సత్త్వము. అంటే ఉనికి. అదే స్వభావం. ఈ స్వభావం అనేది వ్యక్తి గుణాన్ని ప్రోత్సహిస్తుంది. సంకల్పం లేకుండా సంఘటనల కారణంగా కూడా స్వభావం నిర్మాణమవుతుంది. పారమార్థిక చింతన కలవారి మధ్య ఉన్న వ్యక్తి... ఆ లక్షణాన్ని తానూ అనుసరిస్తాడు. అలాగే దొంగల గుంపులో ఉన్న వ్యక్తి తోటివారి సహవాసంతో తానూ అలాంటి గుణాన్నే అలవరుచుకుంటాడు. కానీ ఒక్కోసారి **"మనుష్యాణాం సహస్రేషు..."** అనే మినహాయింపు కారణంగా ఈ స్వభావగుణం, భాగవత ప్రథమశబ్ద ఫల నిరూపణార్థంగా 'జన్మాద్యస్య...' ప్రకటితమవుతుంది. స్వభావం, పరిస్థితి అనేవి ఒక విధమైన సంకల్పాన్ని కలిగించగలవే కానీ, ఆ సంకల్పంతో జీవుని బంధించలేవు. స్వభావం అచేతనం. జీవుడు చేతనం. కనుక స్వతంత్రుడు. ఈ స్వతంత్రత కారణంగా జీవుడు, శరీరానికి అందించే సత్త్వగుణాభివృద్ధికర చర్యలతో జీవోన్నతికి దారితీసే సవ్యమైన మార్గాన్ని అనుసరిస్తాడు.

**"గుణాస్సత్త్వం రజస్తమః ప్రకృతేర్గుణాః - సత్త్వరజస్తమాసీత్యుచ్యతే"** - ప్రకృతి యొక్క గుణాలు సత్త్వరజస్తమాలు. **'సతో భావ సత్త్వం తత్ జ్ఞానహేతుః'** యదార్థంగా తెలుసుకోబడేది సత్తు. దాని భావం సత్త్వం - అది జ్ఞానహేతువు అని అమరసింహుడు తెలియచేశాడు. అలాగే సత్త్వశబ్దం ద్రవ్యానికి, ప్రాణానికి, ఉద్యోగానికి, కలిగిన వస్తువు యొక్క భావం సత్త్వం. 'ద్రవ్యే - సత్త్వే నివిశతేపైతీతి - అసుషు - అంతస్సత్త్వ ఇతి. వ్యవసాయ ఉత్సాహః, తత్ర - సర్వత్ర సత్వసంపన్న ఇతి. ప్రాణిమాత్రే యథా - సర్వసత్వహితే రత ఇతి. 'సత్వం గుణే పిశాచాదౌ బలే ద్రవ్యస్వభావయోః సద్భావే వ్యవసాయేచ చిత్తే ప్రాణిషు శబ్యత' అని విశ్వప్రకాశంలో ఉన్నట్లుగా కూడా ఉదహరించడం గమనించవచ్చు. అలాగే సత్త్వం వల్ల వ్యక్తమయ్యేది సాత్వికం. సత్వేన నిర్వృత్తం సాత్వికం... ఇవి ఎనిమిది విధాలుగా ప్రకటింపబడతాయి. **"స్తంభ ప్రళయ రోమాంచా స్స్వేదో వైవర్ణ్యవేపథూ, అశ్రు వైస్వర్య మిత్యష్టౌ సాత్వికాః పరికీర్తితాః".** దీనినే వ్యాఖ్యానిస్తూ కావ్యాలోక వ్యాఖ్యానం 'పరగత సుఖదుఃఖాదుల, నరయగ భావించి యట్ల యలరుట సత్త్వ, స్ఫురణము, తద్భవభావము, లరయగ సాత్త్వికులయ్యెనవి యెట్లన్నన్'... అంటూ పరుల కష్టసుఖాలను చూచి పలుమార్లు భావించడం వల్ల సహృదయునిలో ఏర్పడే చిత్తసంస్కారం 'సాత్త్వికభావం' అని వివరిస్తుంది. భరతుని నాట్యశాస్త్రంలో సాత్త్వికశబ్ద విచారం ఉంది. సాత్త్వికాభినయాన్ని, ఈ శాస్త్రకారుడు జ్యేష్ఠాభినయం అంటాడు. (22వ అధ్యాయం) సత్త్వం చిత్తవృత్తి రూపమై అవ్యక్తంగా ఉండాలి. ఇది రెండు విధాలు... 1. అభ్యంతరము, 2. బాహ్యము. మనస్సులో వాయు ప్రసరణ మార్గంలో సంక్రమించేది అభ్యంతరం. బయటకు కనిపించే దేహ సంబంధమైనది బాహ్యం. (బాహ్యాభ్యంతరశ్శుచిః) ఈ రెండూకూడా అష్టవిధాలుగా లోకానికి వ్యక్తమవుతాయి. ఇక్కడే భాగవత స్వభావాన్ని మనం అన్వయం చేసికోవచ్చు. ఈ బాహ్య స్వరూపమనేది కూడా సంవేద రూపమైన అభ్యంతర ఫలమే. అంటే అవ్యక్తమైన చిత్తవృత్తి దేహవ్యాప్తమైనప్పుడు, రోమాంచాదులు కలుగుతాయి. దానితో అభ్యంతరమైన సత్త్వం ఊహించుకోవచ్చు.

మనం చేసే చేష్టాలంకారాదులు సైతం దేహధర్మాలైనా అవన్నీ కూడా సత్త్వగుణ జన్యాలే. భావ, హావ, హేలాదులు అన్నీ సత్త్వగుణ ప్రకటనకు మార్గాలు. వీటిని వివరించేది భాగవతం. దానిని తెలుసుకోవడమే తపస్సు.

**భాగవత పరమార్థం**

శ్రీభాగవతానికి ఉన్న సుమారు 36 వ్యాఖ్యలలో భాగవతార్థ దీపిక అన్నపేరుగల శ్రీధరాచార్యుల అద్వైత వ్యాఖ్య అత్యంత ప్రసిద్ధం. భాగవతంలోని ప్రతినాయక పాత్రలు సైతం సత్త్వగుణాన్ని ఆధారం చేసుకుని భావప్రకటన చేయడం ఒక విశేషం. అంధతామిస్రం, తామిస్రం, మహామోహం, మోహం, తమస్సు అనే అయిదూ అవిద్యా వృత్తులు. వీటినే అవిద్యాపంచకాలు అని కూడా అంటారు. త్రిగుణాలలో మూడోది కూడా తమస్సు. తమోవివేకో మోహస్యాదంతఃకరణ విభ్రమః... అవిద్యా పంచపద్వేషా... అని పతంజలి యోగశాస్త్రంలో కూడా ప్రస్తావన ఉంది. శ్రీధరీయ వ్యాఖ్యలో తమస్సు అంటే చిత్త విభ్రమ. ఆ చిత్తవిభ్రమను తొలగించే శక్తి సత్త్వగుణానికే ఉంది. అది తెలుసుకోవడమే తపస్సు. భాగవతం సత్త్వగుణ ప్రతిపాదకమైనందువల్ల 'సాత్వతసంహిత' అనే పేరు కలిగి ఉంది. ఇది ధర్మప్రబోధకమైనది, నిగమకల్పతరువు. భక్తిజ్ఞాన వైరాగ్యాల చేత మోక్షమార్గాన్ని సుగమం చేయగలదు.

భాగవతంలోని ద్వాదశస్కంధాలలో.... నారదుని పూర్వజన్మ, పరీక్షిత్తు శాపవృత్తాంతం ప్రథమస్కంధంలోని ప్రధాన ఘట్టాలు. అలాగే ద్వితీయంలో... శుకుడు పరీక్షిత్తుకు ముక్తిమార్గం చెప్పడం; తృతీయంలో విదుర మైత్రేయ సంవాదం, కపిలుడు దేవహూతికి భక్తియోగం చెప్పడం, చతుర్థంలో ధ్రువోపాఖ్యానం, పురంజనోపాఖ్యానం; పంచమంలో భూగోళ వర్ణన; షష్ఠంలో అజామిళుని కథ, చిత్రకేతోపాఖ్యానం; సప్తమంలో సుయజ్ఞోపాఖ్యానం, ప్రహ్లాదచరిత్రం; అష్టమంలో గజేంద్రమోక్ష కథ, వామనావతార వృత్తాంతం; నవమస్కంధంలో అంబరీషోపాఖ్యానం, శ్రీరామచరితం, యయాతి చరితం, రంతిదేవుని కథ; దశమంలో కృష్ణుని లీలలు, శ్యమంతకోపాఖ్యానం, కుచేలోపాఖ్యానం; ఏకాదశంలో కృష్ణుడు ఉద్ధవుడికి చేసిన పరమార్థోపదేశం; ద్వాదశంలో మార్కండేయోపాఖ్యానం ... ఇవీ సుప్రసిద్ధ సత్త్వగుణ ప్రతిపాదక కథనాలు. నిజానికి సంపూర్ణ భాగవతమే సత్త్వగుణ ప్రోషితమైనది అనాలి.

కుటుంబం – వ్యక్తి జీవన విధానాన్ని సత్త్వగుణ ప్రేరితమై జీవితాన్ని ఎలా మార్చుకోవాలో బోధించేది రామాయణం కాగా, సమాజం – వ్యక్తి ధర్మాన్ని సత్త్వగుణ సంపన్నుడైన ధర్మరాజు ఎలా నిర్వహించుకోగలిగాడో బోధించేది భారతం. ఈ క్రమంలో అంతరంగంతో వ్యక్తి ఏ విధమైన సంబంధాన్ని కలిగి ఉండాలో, సత్త్వగుణాధారితంగా బోధించేది భాగవతం. **'చదువుకు ఇద్దరు... తపస్సుకు ఒక్కరు'** అనే నానుడి మనకు తెలిసిందే! భాగవత స్మరణ, మననం ఒక సత్త్వగుణ ప్రతిపాదకమైన సారస్వత తపస్సు.

భాగవతం తండ్రీకొడుకుల కథ. తండ్రి వ్యాసుడు చెబితే, పరీక్షిత్తు కొడుకు జనమేజయుడు వింటాడు... అది భారతం. కొడుకు శుకుడు చెబితే, జనమేజయుడి తండ్రి పరీక్షిత్తు వింటాడు. ఇది భాగవతం.

**మానవ సంబంధాలు – వర్గీకరణ**

నేటికాలంలో మానవ సంబంధాలు సత్త్వగుణం ఉనికిని పోగొట్టుకుని అనేక అవస్థల పాలు అవుతున్నాయి. కుటుంబ సంబంధాలు, ప్రాంతీయ సంబంధాలు... ఇలా వివరిస్తే సాంస్కృతిక, మతపరమైన, స్త్రీ–పురుష, ఉద్యోగ, సహపాఠ, స్నేహ, రాజకీయ, ఆసక్తి విషయ, రాజకీయ విషయ, పని ఆధారిత, మానవత, కుల,

సంఘానికి అంతరంగానికి కల సంబంధాలుగా పలువిధాలుగా వర్గీకరించవచ్చు. కృష్ణుడు -కుచేలుడు, ద్రోణుడు -ద్రుపదుడు, కృష్ణార్జునులు, కర్ణ-దుర్యోధనులు తదితర ఉదాహరణలతో భాగవతం సత్త్వ స్వభావాన్ని పెంచుకొని జీవితాన్ని ఎలా అర్థవంతంగా మార్చుకోవచ్చో విశ్లేషిస్తుంది.

మానవ సంబంధాలు భాగవతం వినడం వల్ల మెరుగవుతాయి. సప్తాహం ద్వారా వింటాం. అనడం ద్వారా ప్రచారమవుతాయి. భాగవత కథలను అంటుంటాం. మననం చేసుకోవడం ద్వారా మనలో సత్త్వగుణాన్ని పెంపొందిస్తాయి. ఎల్లప్పుడూ తలచుకుంటూ ఉంటాం. ఇతరులకు సహాయపడడం, ఇతరుల సహాయాన్ని స్వీకరించడం అనే రెండు మార్గాల ద్వారా కూడా, భాగవతం మనలో సత్త్వగుణాన్ని పెంపొందిస్తుంది.

**సత్త్వగుణం పెంచుకోవడం ద్వారా ప్రయోజనాలు:**

ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉండడం (ప్రహ్లాదుడు); ఇతరుల పక్షం నుంచి ఆలోచించడం (వామనావతార కథ); అందరితో స్నేహభావనలను పెంచుకోవడం (అంబరీషోపాఖ్యానం); స్వయంకృతాపరాధాన్ని అంగీకరించడం (గజేంద్రమోక్షణ కథ); నిలబెట్టుకోలేని వాగ్దానాన్ని చేయకపోవడం (నారదుడి కథ); చూడడం, వినడం, నేర్చుకోవడం (పురంజనోపాఖ్యానం); సాంఘికంగా కలివిడి స్వభావాన్ని కలిగి ఉండడం (అజామిళుడి కథ); నిస్వార్థ బుద్ధితో సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం (రంతిదేవుని కథ); ఇతరులను విమర్శించకపోవడం (శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చేసిన పరమార్థోపదేశం); సానుకూల దృక్పథంతో ఆలోచనలు చేయడం (కర్దమ దేవహూతి కథ); అనేవి ప్రధానంగా భాగవతం ద్వారా మనలో సత్త్వగుణాన్ని పెంచే మధుర ఘట్టాలుగా స్వీకరించవచ్చు.

సత్త్వగుణం పెంచుకునే నిమిత్తమై 1. ఆర్ష సంప్రదాయాన్ని అనుసరించడం, 2. బ్రహ్మజ్ఞానం అలవరచుకోవడం, 3. భక్తిమార్గాన్ని అనుసరించడం, 4. నియమపూర్వక జీవితాన్ని కొనసాగించడం, 5. సాహసోపేత ధర్మాలను వ్యక్తిగతంగా స్వీకరించి ముందుకు సాగడం, 6. ధనం ఉన్నదనే అహంకారాన్న విడిచిపెట్టడం, 7. సత్సంగత్వాన్ని అభిలషించడం... అనే సప్తలక్షణాలను అలవరచుకోవాలి అని విజ్ఞుల వాక్కు. సత్త్వగుణాన్ని పెంపొందించుకోవడం అంటే మనస్సు స్థిరంగా, ప్రశాంతంగా ఉండే మానసిక స్థితిని కలిగి ఉండడం అనాలి. ఇందుకోసం పంచలక్షణాలను కలిగి ఉండాలి.

**1. ఆరోగ్యకరమైన సాత్త్విక ఆహార స్వీకరణ:**

**"ఆయుస్సత్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః**
**రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః" (భ.గీ. 17-8)**

ఆయుస్సును, మనోదేహ బలాలను, ఆరోగ్యాన్ని, సుఖాన్ని, ప్రీతిని పెంచేవి... రసగుణం కలవి, మనోహరమైనవి... సత్త్వగుణం కలవారికి ఇష్టమైన ఆహారాలని శ్రీకృష్ణుడు భగవద్గీతలో వివరించాడు. మితాహారం తిని, లోనకల పరమాత్మను భక్తితో ధ్యానిస్తే (భ.గీ. 7-10) మనలో సాత్త్వికబుద్ధి పెరుగుతుంది.

**2. శారీరక మానసిక పరిశుభ్రత:** అపవిత్రః పవిత్రోవా... బాహ్యాంభ్యంతరశ్శుచిః శుద్ధి ప్రక్రియ చేపట్టడం ద్వారా పరిశుభ్రతను అలవరుచుకోవచ్చు. ప్రహ్లాదచరిత్ర ఈ లక్షణ ఫలితాలను వివరిస్తుంది.

**3.విశ్రాంతి స్వీకరించడం:** సదా పనిచేసే లక్షణం రాజసిక స్వభావం కలవారిది. విశ్రాంతిలో దైవాన్ని గుర్తించడం సత్త్వగుణం కలవారిది. అయితే సదా విశ్రాంతిని అభిలషించడం యోగ్యం కాదు. అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. రెండింటి మధ్య సమతౌల్యత పాటించాలి. చూసేవి, వినేవి మన స్వభావాన్ని శాసిస్తాయి కనుక పనిమధ్య, తరచూ తీసుకునే విశ్రాంతిలో విష్ణువు ఉనికిని గుర్తించాలి అని కూడా ప్రహ్లాద చరిత్ర బోధిస్తుంది. (పానీయంబులు త్రావుచున్....)

**4.తోటివారి ఎడల సత్ప్రవర్తన:** సృజనాత్మకత మనలో సత్త్వగుణాన్ని పెంచుతుంది. మానవ సంబంధాలను మెరుగు పరిచినా, సమూలంగా నాశనం చేసినా, అంతా మనమే కారణభూతులం అవుతాం.

**5.సూర్యాస్తమయం అనంతరం లౌకిక కర్మను నివారించడం:** లోకంలో ఒక శ్లోకం సుప్రసిద్ధం... ప్రాతుర్ద్యూత ప్రసంగేణ, మధ్యాహ్నే స్త్రీ ప్రసంగకః రాత్రౌ చోర ప్రసంగేన కాలో గచ్ఛంతి ధీమతాః ... వినడానికి ఇది కొంత వ్యతిరేకార్థం ఇస్తున్నది. కానీ అంతరార్థం ఇది కాదు. ఉదయం జూదం ఆడడం అంటే భారతం చదవాలి, మధ్యాహ్నం స్త్రీ ప్రసంగమంటే రామాయణం చదవాలి, రాత్రి చోరప్రసంగమంటే శ్రీకృష్ణుని కథలు కల భాగవతాన్ని స్మరించాలి. ఆరోగ్యకరమైన ఇలాంటి అలవాట్లు అలవరచుకోగలిగితే మనలో సత్త్వగుణం వృద్ధి పొందుతుంది. సారస్వత తపస్సు

భగవద్గీతలోని పదిహేడో అధ్యాయం శ్రద్ధాత్రయ విభాగయోగం. ఈ అధ్యాయం పూర్తిగా సత్త్వగుణ సంబంధిత అనేక విషయాలను సుబోధకం చేస్తుంది. భగవద్గీతకు వ్యాఖ్యానం భాగవతం అని కూడా విజ్ఞులు అంటారు. ఈ అధ్యాయం కారణంగానే లోకంలో ఈ ఉక్తి స్థిరపడింది. 'తేషాం నిష్ఠాయకా కృష్ణ సత్త్వమహో రజస్తమః' అనే అర్జునుడి సందేహానికి కృష్ణుడి సమాధానాలే ఈ అధ్యయం. "భాగవత మహాపురాణే పారమహం స్యాం సంహితాయాం...' అని భాగవతంలోని ప్రతి అధ్యాయం చివరిలో ఉంటే, గీతలో 'ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే....' అని ఉంటుంది. ఈవిధమైన వాకర్య సముదాయం మరే గ్రంథంలోనూ మనకు కానరాదు. ఈ అధ్యాయంలోని 15వ శ్లోకం 'అనుద్వేగకరం వాక్యం...' వ్మాయ తపస్సు అని వివరిస్తుంది. ఇక 14వ శ్లోకం వాచిక తపస్సును తెలియచేస్తుంది. 16, 17వ శ్లోకాలు మానసిక తపశ్చర్య ఎలాగో వివరిస్తాయి.

అనుద్వేగకరం వాక్యం – ఇతరుల మనస్సును నొప్పింపనిది (రంతిదేవుని మాట)

స్వాధ్యాయాభ్యసనం – చదువు గొప్పతనం – ప్రహ్లాదచరిత్ర – ప్రతినాయకుడైన హిరణ్యకశిపుడు సైతం 'చదవని వాడజ్ఞుండగు – చదివిన సదసద్వివేక చతురత గలుగున్' అంటాడు.

**ఫలాపేక్ష లేకపోవడం – విదుర మైత్రేయ సంవాదం, ముచికుందుని వృత్తాంతం**

**నిశ్చలమైన మనస్సు కలిగి ఉండడం – ధృవోపాఖ్యానం**

**పరమాత్మను గురించిన మననం – కర్దమ ప్రజాపతి గృహస్థ జీవితం**

పరిశుద్ధ భావాలు కలిగి ఉండడం – ఇవన్నీ కూడా వివిధ తపశ్చర్యలుగా ఈ యోగంలో వివరింప బడ్డాయి. వీటికి వ్యాఖ్యానాలే భాగవతంలోని కథలు. ఈ కథలను స్మరించడం ద్వారా మనలో సత్త్వగుణం పెరుగుతుంది. జీవనం వికాసమవుతుంది.

సాత్త్విక కర్మఫలత్యాగం

గీతలో 18వ యోగమైన సన్యాసయోగం కూడా భాగవతానికి మూలాధారం. త్యాగం త్రివిధం (18-4). ఇందులో మొదటిది, సాత్త్విక కర్మత్యాగం. చేసే పనిని, ఆ పనిపైన మమకారం లేకుండా దానివల్ల వచ్చే ఫలంపైన ఆసక్తి లేకుండా కర్మాచరణ చేయాలి. రంతిదేవుని కథ ఈ ధర్మాన్ని బోధిస్తుంది. సత్త్వగుణ సంపన్నులు కర్మఫలత్యాగులు. రాగద్వేషాలతో సంబంధం పెట్టుకోరు.

**సాత్త్విక జ్ఞానం**

ఒకటి అయినప్పటికీ వేర్వేరుగా విభజింపబడి సమస్త చరాచర ప్రాణులయందు ఒక్కటై నాశరహితమైన ఆత్మవస్తువును, ఒకటిగా తెలుసుకునే జ్ఞానాన్నే సాత్త్వికం అంటారు.

**"ప్రాతుర్ద్యూత ప్రసంగేణ, మధ్యాహ్నే స్త్రీ ప్రసంగకః రాత్రౌ చోర ప్రసంగేన కాలో గచ్ఛంతి ధీమతాః ..."** వినడానికి ఇది కొంత వ్యతిరేకార్థం ఇస్తున్నది. కానీ అంతరార్థం ఇది కాదు. ఉదయం జూదం ఆడడం అంటే భారతం చదవాలి, మధ్యాహ్నం స్త్రీ ప్రసంగమంటే రామాయణం చదవాలి, రాత్రి చోరప్రసంగమంటే శ్రీకృష్ణుని కథలు కల భాగవతాన్ని స్మరించాలి. ఆరోగ్యకరమైన ఇలాంటి అలవాట్లు అలవరచుకోగలిగితే మనలో సత్త్వగుణం వృద్ధి పొందుతుంది.

**సారస్వత తపస్సు**

భగవద్గీతలోని పదిహేడో అధ్యాయం శ్రద్ధాత్రయ విభాగయోగం. ఈ అధ్యాయం పూర్తిగా సత్త్వగుణ సంబంధిత అనేక విషయాలను సుబోధకం చేస్తుంది. భగవద్గీతకు వ్యాఖ్యానం భాగవతం అని కూడా విజ్ఞులు అంటారు. ఈ అధ్యాయం కారణంగానే లోకంలో ఈ ఉక్తి స్థిరపడింది. **'తేషాం నిష్ఠాయకా కృష్ణ సత్త్వమహో రజస్తమః'** అనే అర్జునుడి సందేహానికి కృష్ణుడి సమాధానాలే ఈ అధ్యయం. **"భాగవత మహాపురాణే పారమహం స్యాం సంహితాయాం..."** అని భాగవతంలోని ప్రతి అధ్యాయం చివరిలో ఉంటే, గీతలో

**'ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే....'** అని ఉంటుంది. ఈవిధమైన వాకర్య సముదాయం మరే గ్రంథంలోనూ మనకు కానరాదు. ఈ అధ్యాయంలోని 15వ శ్లోకం 'అనుద్వేగకరం వాక్యం...' వ్మాయ తపస్సు అని వివరిస్తుంది. ఇక 14వ శ్లోకం వాచిక తపస్సును తెలియచేస్తుంది. 16, 17వ శ్లోకాలు మానసిక తపశ్చర్య ఎలాగో వివరిస్తాయి.

**అనుద్వేగకరం వాక్యం:** ఇతరుల మనస్సును నొప్పింపనిది (రంతిదేవుని మాట)

**స్వాధ్యాయాభ్యసనం:** చదువు గొప్పతనం - ప్రహ్లాదచరిత్ర - ప్రతినాయకుడైన హిరణ్యకశిపుడు సైతం **'చదవని వాడజ్ఞుండగు - చదివిన సదసద్వివేక చతురత గలుగున్'** అంటాడు.

**ఫలాపేక్ష లేకపోవడం:** విదుర మైత్రేయ సంవాదం, ముచికుందుని వృత్తాంతం

**నిశ్చలమైన మనస్సు కలిగి ఉండడం:** ధృవోపాఖ్యానం

**పరమాత్మను గురించిన మననం:** కర్దమ ప్రజాపతి గృహస్థ జీవితం

**పరిశుద్ధ భావాలు కలిగి ఉండడం** - ఇవన్నీ కూడా వివిధ తపశ్చర్యలుగా ఈ యోగంలో వివరింప బడ్డాయి.

వీటికి వ్యాఖ్యానాలే భాగవతంలోని కథలు. ఈ కథలను స్మరించడం ద్వారా మనలో సత్త్వగుణం పెరుగుతుంది. జీవనం వికాసమవుతుంది.

**సాత్త్విక కర్మఫలత్యాగం**

గీతలో 18వ యోగమైన సన్యాసయోగం కూడా భాగవతానికి మూలాధారం. త్యాగం త్రివిధం (18-4). ఇందులో మొదటిది, సాత్త్విక కర్మత్యాగం. చేసే పనిని, ఆ పనిపైన మమకారం లేకుండా దానివల్ల వచ్చే ఫలంపైన ఆసక్తి లేకుండా కర్మాచరణ చేయాలి. రంతిదేవుని కథ ఈ ధర్మాన్ని బోధిస్తుంది. సత్త్వగుణ సంపన్నులు కర్మఫలత్యాగులు. రాగద్వేషాలతో సంబంధం పెట్టుకోరు.

**సాత్త్విక జ్ఞానం:**

ఒకటి అయినప్పటికీ వేర్వేరుగా విభజింపబడి సమస్త చరాచర ప్రాణులయందు ఒక్కటై నాశరహితమైన ఆత్మవస్తువును, ఒకటిగా తెలుసుకునే జ్ఞానాన్నే సాత్త్వికం అంటారు.

భౌతిక దృష్టికి ఈ ప్రపంచం సమస్త పదార్థాలు విభజింపబడి ఉన్నట్లు వేరుగా ఉంటాయి. కానీ అంతా ఒకటే. జ్ఞానాన్ని 'శ్రీకైవల్య పదంబు చేరుటకు...' అంటూ ప్రారంభమైన భాగవతం సత్త్వం పెంచుకుంటే కలిగే జ్ఞానరూప సారస్వత తపస్సుగా మనకు అంతరార్థంగా బోధించింది. భిన్నత్వంలో ఏకత్వం చూడగలిగిన జ్ఞానమే సాత్త్విక జ్ఞానం.

**ఉపసంహారం**

మనదేశంలో అనేక మతాలవారు ఉన్నారు. హిందువులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, ముసల్మానులు ఇలా ఉండగా అనేక భాషలవారూ ఉన్నారు. వివిధ శీతోష్ణ పరిస్థితులు ఉన్నాయి. ఈ భేదాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. కానీ భిన్నత్వం ఏకత్వం అన్నట్లు 'భారతీయం' అన్నిటా, అందరిలోనూ కనిపిస్తుంది. ఇది సర్వభూతాత్మ భావం. **'తనయందు నఖిల భూతములయందు నొక భంగి సమహితత్త్వమున బరగువాడు...'** ఇది ప్రహ్లాదుని పరిచయ పద్యం, పోతన ప్రోక్తం. **'ఆత్మవత్సర్వ భూతానామేకః ప్రియసుహృత్తమః**
(7-4-31) సంస్కృత భాగవత, వ్యాసవాక్యం. శ్రద్ధ, కర్మ, ఆచరణ, ఆహారం, జీవనం, మాట, దృష్టి.... ఇలా ఏ విషయమైనా సత్త్వగుణంతో కూడుకున్నచో, ఆ వ్యక్తి సమత్వ భావనలు పెంచుకుని, ఆత్మశాంతిని తాను పెంచుకుని, ప్రపంచశాంతికి కారకుడవుతాడు.

భాగవతం నిగమ కల్పతరుగళితమైన ఫలం. భాగవత మాహాత్మ్యం, పద్మపురాణం ఉత్తర ఖండంలోని మొదటి ఆరు అధ్యాయాలలో సవిస్తరంగా చెప్పబడి ఉంది. భాగవత స్మరణ కేవలం యువతకు మాత్రమే కాకుండా సర్వేసర్వులకు కూడా సత్త్వగుణాభివృద్ధిని కలిగిస్తుంది. ఇది పరమోత్తమమైన జీవన రసాయనం.

**"తమాది దేవం కరుణానిధానం తమాల వర్ణం సుహితావతారమ్**
**అపార సంసార సముద్రసేతుం భజామహే భాగవత స్వరూపమ్"**

ఇది భాగవతాన్ని కీర్తించడం - పద్మపురాణాంతర్గతం.

స్థితం సత్త్వే ప్రసీదతి (సం.భా. 1-2-19) అని వ్యాసభాగవత వాక్యం. పోతన భాగవతమైనా, వ్యాసప్రోక్తమైనా రెండూ ఉపాదేయాలే! దేహి చేసే సమస్త కర్మలూ సత్త్వ (మంచితనం, ప్రకాశం), రజస్సు (ఇష్టం, అభిరుచి), తమస్సు (అజ్ఞానం)లచే నిర్వహింపబడతాయి. వీటిలో మంచితనం మంచిది. దీనిద్వారానే సంపూర్ణజ్ఞానాన్ని పొందగలుగుతాం. కనుక భాగవత స్మరణ – సాహిత్య అధ్యయన పూర్వక సారస్వత సాత్త్విక తపస్సు. ఈ తపస్సు సర్వోత్తమం. సత్యసాధనకు సోపానం.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. అమరకోశం, గురుబాల ప్రబోధినీ వ్యాఖ్య, జయలక్ష్మీ పబ్లికేషన్స్, 2006
2. కావ్యాలోకం, తెలుగు అకాడెమీ, 1991
3. నాట్యశాస్త్రం, గుప్తభావ ప్రకాశికా సహితం, అజంతా ప్రింటర్స్, సికింద్రాబాద్, 1959
4. పురుషార్థ ప్రబోధిని, గోపాల్ కో, 2005
5. శ్రీమదాంధ్ర మహాభాగవతము, గీతాప్రెస్, 2016
6. శ్రీమద్భాగవత మహాపురాణం, గీతాప్రెస్, గోరఖ్ పూర్, 2005
7. శ్రీమహాభాగవతము, తెలుగు విశ్వవిద్యాలయం, 1987

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# పాండవ మధ్యముడు సాత్త్విక గుణము

**డా. వి. యన్. మంగాదేవి,**
తెలుగు శాఖాధ్యక్షులు,
మారీస్ స్టెల్లా కళాశాల(అటానమస్),
విజయవాడ.

**"సత్త్వం రజస్తమ ఇతి గుణా: ప్రకృతి సంభవా:॥**
**నిబధ్నంతి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్" భగవద్గీత 14-5శ్లోకం.**

ఈ సత్వ, రజోస్తమో గుణాలే జన్మలకు కారణమవుతాయి. ఏ గుణం ప్రవృద్ధమైతే తదనుగుణంగా కర్మ చేసి తత్ఫలితంగా జన్మ లభిస్తుంది.

ఇతిహాసమైన మహాభారతంలో పాండవుల ధర్మనిరతిని చూసినట్లైతే వారి ప్రకృతి గుణాలు వారు చేసిన కర్మలు సుబోధకమవుతాయి.

ఆంధ్రమహాభారతంలో అంగిరసం ధర్మవీరము అని డా॥జి.వి.సుబ్రహ్మణ్యంగారు ప్రతిపాదించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు కూడా తెలుగు భారతంలో ధర్మ వీరమే ప్రధానమనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వ్యాస భారతం శాంత రస ప్రధానమైనప్పటికి ఆంధ్ర మహాభారతంలో అంగి రసం ధర్మ వీరమే అని విమర్శకుల అభిప్రాయం.

నాయకాశ్రయమైన రసము ధర్మ వీరమైనా, శాంతమైన ఆ నాయకాశ్రయమైన ప్రకృతి సత్త్వమే.మహా భారతంలో నాయకుడైన ధర్మరాజు అతని సోదరుల ప్రకృతి గుణము సత్త్వము. మహాభారతంలో ధర్మశక్తియైన ధర్మరాజుకి భౌతికమైన అండదండలనిచ్చేది భీముడు. ధర్మరాజుకు దైవబలాన్ని అందించినవాడు పాండవ మధ్యముడైన అర్జునుడు.

ఈ పాండవ మధ్యముడైన అర్జునుడు జన్మ విషయాన్ని పరిశీలించి చూసినట్లైతే పాండురాజు శతశృంగ పర్వతం మీద ముల్లోకాలను జయించగల కుమారుని పొందాలని దేవేంద్రుని ధ్యానిస్తూ ఏకాగ్ర బుద్ధితో ఏకాంతంగా ఒంటికాలిపై నిలబడి దేవేంద్రుని గూర్చి తపస్సుచేసి,దేవేంద్రుని వరం పొంది దేవేంద్రు దయతో అతనితో సమానమైన పుత్రుడిని పొందమని కుంతికి చెబుతాడు. కుంతిదేవి దుర్వాస మహర్షి యిచ్చిన మంత్రంతో ఇంద్రుడిని ప్రార్థించి,

**"స్థిర పౌరుషుండు లోకోత్తరుండుత్తర ఫల్గునీ ప్రథమ పాదమునన్**
**సుర రాజునంశమున భాసుర తేజుండు వంశకరుండు సుతుడుదయించెన్"**

ఉత్తర ఫల్గునీ నక్షత్ర ప్రథమ పాదంలో దేవేంద్రుని అంశతో అర్జునునికి జన్మనిస్తుంది. ఆ రోజు

**"శత శృంగ నగేంద్రము శత ధృతి సర్గ దినంబ పోలె త్రిభువన భూత**
**ప్రతతి బరిపూర్ణ శోభాధృతి నింద్ర తనూజు జన్మదినమున నొప్పెన్"**

శతశృంగ పర్వతం మూడు లోకాలలోని భూతాలతో శోభిస్తూ వుండగా, మహర్షులు, దేవతలు చేసే ఆశీర్వచనాలతో నిండిపోయినది.

పాండురాజు మరణానంతరం పెదనాన్న వద్దకు చేరిన పాండవులు, కౌరవులతో కలిసి ద్రోణాచార్యుని వద్ద విలువిద్యలు నేర్చుకుంటున్నప్పుడు ద్రోణాచార్యులు తన కోరిక ఎవరు తీర్చగలరని అడుగగా అర్జునుడు తాను తీర్చుతానని చెప్పి, వినయంతో గురుపూజ చేసుకుంటాడు. అయితే అశ్వత్థామ అర్జునునికి చీకటిలో భోజనం పెట్టవద్దని ఆజ్ఞాపించినా, ఒక రోజు అర్జునుని భోజన సమయంలో దీపం ఆరిపోగా అలాగే భోజనం ముగించి, ఆ చీకటిలోనే విద్యలన్నింటిని సాధన చేసి నేర్చుకుంటాడు అర్జునుడు.

**"పాయక చీకటి యందును నేయంగా నభ్యసించు నిట్టి యెడం గౌ**

**తేయ ధనుర్ జ్యా ధ్వని విని, ధీయుక్తుడు ద్రోణు దరుగు దెంచి ముదమునన్"** అది విని సంతోషంతో ద్రోణుడు అర్జుననికన్నా వీరెవ్వరూ అధికులు కానట్లుగా విలువిద్య నేర్పిస్తానని చెపుతాడు.

ఇక్కడ వరకు అర్జునుని పాత్రను పరిశీలించినట్లైతే అర్జునునిలో సాత్త్విక గుణం కనిపిస్తుంది. ఇది అర్జునుని యొక్క ప్రకృతి గుణం.

**"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశక మనామయమ్**

**సుఖ సంగౌన బధ్నాతి జ్ఞాన సంగేన చానఘ"**

నిర్మలమైన సత్వ గుణము, జ్ఞానాభిమానము వలన మానవున్ని బంధిస్తుంది. అర్జునునిలో ఈ సత్త్వ గుణము వృద్ధి చెందుట వలన మనశ్చాంచల్యము లేదు. ఇంద్రియములు చేతన శక్తిని పొంది గురువు యొక్క అభిమానమునకు పాత్రుని చేసినది.

ఏకలవ్యుని విషయంలో మాత్రము అర్జునుని మనసు చలించినది. ఏకలవ్యుని విలువిద్యా నైపుణ్యమును చూచి గురువైన ద్రోణాచార్యునితో

**" నా కంటెను, మీ కంటెను లోకములో నధికుడతి బలుండు ధనుర్వి**

**ద్యా కౌశలమున నాతడు, మీకుం బ్రియ శిష్యుడటే యమిథ్యా వచనా"**

ఇక్కడ అర్జునుని సత్త్వ గుణము అణిచి వేయబడి, ఏకలవ్యునిపై అసూయ వ్యక్తం చేయబడింది.

**'రజస్తమాశ్చాభి భూయ సత్త్వం భవతి భారత**

**రజ స్సత్త్వం తమశ్చైవ తమ స్సత్త్వం రజస్తథా" ။ గీత 14-10**

ఇక్కడ అర్జునునిలో ప్రకృతి గుణమైన సత్త్వమును నిరోధింపబడి, రజో గుణము వృద్ధి చెందినది.

**"లోభ: ప్రవృత్తిరారంభ: కర్మణామశమ: స్పృహా**

**రజస్యేతాని జాయంతే వి వృద్ధే భరతర్ష భ"**

రజోగుణము వృద్ధి చెందినప్పుడు లోభము, స్వార్థబుద్ధి ఉత్పన్నమగును.

రజోగుణము వృద్ధి చెందుట వలన గాఢమైన ఇచ్ఛ, తానే గొప్ప విలు విద్యాపారంగతుడిని కావాలనే కోరిక వలన ఏకలవ్యునిపై అసూయ జనించి, మనచాంచల్యముచే గురువైన ద్రోణాచార్యుని అమిథ్యా వచనా అని అధిక్షేపించాడు.

ఇక అర్జునుడు పాశుపతాస్త్రాన్ని సంపాదించుకునే సమయంలో అర్జునుని సత్త్వ గుణం వృద్ధి చెంది తపో వీరుడైన అర్జునుడు త్రికరణ శుద్ధితో ఈశ్వరుని గూర్చి

"నిరంతర త్రి రాత్రోపవాసమున నొక మాసమును ద్విగుణిత త్రిరాత్రోప వాస వ్రాతమున రెండవ మాసమును, పక్షోపవాసంబున తృతీయమును, ఊర్ధ్వ బాహుండై యేక పాదాంగుష్ఠాగ్రమున నిలిచి వాయు భోజనము చేయుచు చతుర్థ మాసమును తపంబోనర్చె". ఇంతటి తపస్సుకు మూలము అర్జునుని సత్త్వము తపస్సులకు ఫలితము పాశు పతాస్త్ర సముపార్జన.

పాండవ మధ్యముని ఈ దైవబలమే ధర్మశక్తియైన ధర్మరాజుకి అండదండ అంతే కాదు. అర్జునుడే కురు వంశాభివృద్ధికరుడు కూడా. నరుడయిన అర్జునుని లోని ప్రకృతి గుణమయిన ఈ సత్త్వమే నారాయణునికి ప్రీతి ప్రాతుని చేసినది.

**ఆధార గ్రంథాలు**

1. డా॥ వి. సుబ్రహ్మణ్యం జి (సంపాదకులు) –2008 ఆంధ్ర మహాభారతం టి.టి.డి.ప్రచురణలు, తిరుపతి.
2. డా॥ వి. సుబ్రహ్మణ్యం జి– 1996 ఆంధ్ర మహాభారతం అమృతతత్త్వ సాధనం – షష్ఠిపూర్తి ప్రచురణ– హైదరాబాద్
3. డా॥ వి. సుబ్రహ్మణ్యం జి– 1980 రసోల్లాసము – నవోదయం ఎడిటరరి & కల్చరల్ ఆర్గనైజేషన్ – హైదారాబాద్
4. డా॥ ఎ. కృష్ణమాచార్యులు యం, డా॥ వెంకటరామయ్య గోలి (అనువాదకులు) – 2019 భగవద్గీత గీతాప్రెస్, ఘోరఖ్‌పూర్
5. భగవద్గీత ఉషశ్రీ 2005, మహాలక్ష్మి బుక్‌కార్పొరేషన్ – విజయవాడ

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# మహాభారతం కౌశిక వృత్తాంతం త్రిగుణ నిరూపణ

**డా॥ జంపాల అనూరాధ,**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
ఎస్.ఆర్. &బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్&సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి),
ఖమ్మం. తెలంగాణ.

మానవ ప్రవృత్తిలోని మూడు ప్రధాన గుణాలను భారతీయ ప్రాచీన సాహిత్యం అనేక కోణాలలో విశ్లేషించింది. భారత ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు వంటి ప్రాచీన సాహిత్యమే కాక ఆధునిక కాల్పనిక సాహిత్యం కూడా త్రిగుణాలని విశేషంగా ప్రస్తావించింది.

నిజానికి త్రిగుణాతీతమే బ్రహ్మ స్వరూపం అని వేదాంత భావన. ఆధ్యాత్మిక రచనల్లో ముఖ్యంగా అద్వైత భావనలో త్రిగుణ విశ్లేషణ చాలా విపులంగా ఉంటుంది. శ్రీమద్భగవద్గీత కూడా త్రిగుణాత్మకమైన మాయారూపాన్ని ప్రస్తావించింది.

వ్యాసభారతం వనపర్వంలోని కౌశిక ధర్మవ్యాధుల వృత్తాంతంలో ఆధ్యాత్మికపరంగా విస్తృతమైన ధర్మచర్చ ఉంది. ధర్మయుత జీవనం వల్ల మానవజీవితంలో చేకూరే ప్రయోజనాలు, సమాజపరంగా, ఆధ్యాత్మికంగా ధర్మయుత జీవన ఫలితాలనూ ఈ కథలో వివరించాను.

సత్వరజస్తమోగుణ స్వరూపమేమిటి? ఈ గుణములకు మూలమైన బుద్ధి స్వరూపం ఎలాంటిది? త్రిగుణాత్మకమైన బుద్ధి వల్ల చేసే కర్మల ఫలితమేమిటి? మానవుడు ధర్మానుగతమైన జీవనవిధిలో త్రిగుణాల పాత్ర ఎలా ఉంటుంది మొదలైన విషయచర్చను కౌశిక ధర్మవ్యాధుల వృత్తాంతం ఆధారంగా విశ్లేషించటమైంది.

**"సర్వ ద్వారేషు దేహేస్మిన్ ప్రకాశ ఉపజాయతే**
**జ్ఞానం యదాతదా విద్యాద్వివృద్ధం సత్వమిత్యుత"**

**(గీ. 14 అ. 11 శ్లో)**

**భావం:** ఈ దేహమునందలి శ్రోత్రాది సకల ద్వారముల యందు, చిత్తవృత్తి స్వరూపమైన జ్ఞానమనెడి ప్రకాశమెపుడు కలుగునో, అప్పుడు సత్త్వగుణము అభివృద్ధి చెందును.

శ్రీమద్భగవద్గీతలో భగవానుడు 'గుణత్రయ విభాగ' మనే పేరుతో త్రిగుణాల్ని వివరిస్తూ ప్రత్యేక అధ్యాయాన్నే ప్రసాదించాడు. ఈ విభాగంలో త్రిగుణ స్వరూపం ఇలా వివరించారు. "సత్త్వము రజస్సు తమస్సు" అనే మూడు గుణాలతో బాటు వీటికన్న వేరైన, నాశరహితమైన ఆత్మను దేహమందు బంధించుచున్నవి.

చిత్తవృత్త స్వరూపమైన జ్ఞానము కలిగినప్పుడు "సత్త్వ గుణము", లుబ్ధత్వము కామ్యకర్మల ఆసక్తి ఇంద్రియ నిగ్రహం లేకుండుట, మనశ్శాంతి కరవు కలిగినచో "రజో గుణము. బుద్ధిమాంద్యము, బద్ధకము, అజాగ్రత్త, అజ్ఞానము పెరిగినచో 'తమోగుణము' వృద్ధి అయినట్లు గుర్తించమని తెలిపాడు.

సత్త్వగుణము వల్ల దైవత్వం, రజోగుణం వల్ల మానవత్వం, తమోగుణం వల్ల పశుత్వం కలుగుతాయనీ, త్రిగుణాతీతమైన ఆత్మసాక్షిని తెలిసికొన్న జీవుడు తన స్వరూపమును (పరబ్రహ్మ స్వరూపాన్ని) పొందుతున్నాడని కృష్ణభగవానుడు తెలిపాడు.

అద్వైత వేదాంత శాస్త్రము ప్రకారము కర్మయోగి తనలోని త్రిగుణాల వలన, మూడు విధములు అగుచున్నాడు.
**సాత్వికుడు:** దేనియందు ఆసక్తిలేక కార్యసిద్ధి అసిద్ధి వికారములు లేక, ధైర్యము కలిగినవాడు.
**రాజసుడు:** విషయాసక్తి కలిగిన లోభి. కార్యపు ప్రాప్తా ప్రాప్యములయందు శోక హర్షములు గలిగిన హింసాత్మకుడు, అశుచి.
**తామసుడు:** అవివేకి, చంచల చిత్తము గలవాడు. జడుడు, సోమరి, దు:ఖశీలుడు. అద్వైత వేదాంత శాస్త్రంలో యజ్ఞ, దాన, తపాలను కూడా గుణ భేదములతో విభాగించారు. అట్లే జ్ఞాన కర్మలను కూడా గుణ భేదముతో విభాగించారు. బుద్ధిని, ధైర్యమును, సుఖమును కూడా గుణభేదముతో విభాగించారు.

ఈ విధముగా త్రిగుణ సంబంధ జ్ఞాన చర్చ గీత, భారతము, అద్వైత వేదాంత శాస్త్రము మొదలైన అనేక గ్రంథాలలో విశేష విశ్లేషణారీతిలో మానవ ప్రయోజనకరంగా నిక్షేపించబడి ఉంది.

**భారతము కౌశిక వృత్తాంతము:**

పూర్వం వేదాధ్యయన సంపన్నుడు, తపోధనుడు, ముని, ధర్మశీలుడు అయిన కౌశికుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఒకనాడు అతడు చెట్టుక్రింద వేదాధ్యయనంలో ఉండగా పైనుండి ఒక కొంగ రెట్ట వేసింది. రెట్ట తన మీద పడగానే కౌశికుడు కోపముతో తీవ్ర దృష్టితో కొంగను చూడగా అది నేలపై బడి విగతజీవి అయ్యింది. కోపం తగ్గాక కౌశికుడు చాలా చింతించాడు.

అనంతరం అతడు గ్రామంలో భిక్షాటనకు వెళ్ళాడు. ఒక ఇంటి ముందు ఆగి భిక్షకై పిలిచాడు. ఇంటి యజమానురాలు అప్పుడు పాత్రలు తోముతుంది. పిలుపు విని ఆమె 'ఇదుగో వస్తున్నాఉండు' అంది. కౌశికుడు ఆగాడు. ఈలోగా ఆమె భర్త ఆకలితో ఇంటి వచ్చాడు. ఆమె పతి సేవలో కౌశికుని భిక్ష సంగతి మరచింది. చాలా సేపటికి ఆమెకు గుర్తు వచ్చి బిక్ష తెచ్చింది. కౌశికుడు కోపించాడు. "ఇంత ఆలస్యం ఉంటే నన్ను ఉండమని ఎందుకు చెప్పావు. వెంటనే పొమ్మని చెప్పవచ్చు గదా!" అని కోపంతో తపించాడు. ఆమె క్షమాపణ కోరింది. తాను పతి సేవలో ఉన్నానని తెలిపింది. కౌశికుడు ఇంకా కోపించి **"బ్రాహ్మణయతి గొప్పవాడు కాదా! మేము తలచుకొంటే భూమండలాన్నే భస్మం చేయగలం"** అన్నాడు.

ఆమె శాంతంగా **"మహర్షీ... కోపించకండి. మీ క్రోధదృక్కులకి మాడిపోవడానికి నేను కొంగను కాను"** అంది. ఇంకా తామస గుణ లక్షణమైన క్రోధం గురించి సోదాహరణంగా చెబుతూ... ఒక మహర్షి కోపం వల్ల సముద్ర జలం ఉప్పుగా మారి త్రాగటానికి పనికి రానిదైంది. మానవ శరీరంలోని శత్రువు క్రోధం. కోపాన్ని, మోహాన్ని విడిచిపెట్టి ఇతరులు తనని హింసించినా మళ్ళీ వారిని హింసించని వాడినే దేవతలు బ్రాహ్మణునిగా భావిస్తారు. ధర్మస్వరూపం చాలా సూక్ష్మమైంది. నీవు వేదాధ్యయన తత్పరుడవు పవిత్రుడవేగాని నీకు యధార్థజ్ఞానం లేదని భావిస్తాను.

నీవు మిథిలాపురములోని ధర్మవ్యాధుని వద్దకు వెళ్ళి ధర్మ స్వరూపం తెలుసుకోవచ్చు. నేను అధిక ప్రసంగం చేస్తే క్షమించు అంది.

కౌశికుడు ఆ పతివ్రత శక్తికి ఆశ్చర్యపడి, కృతజ్ఞత తెల్పి మిథిలాపురం వెళ్ళి ధర్మవ్యాధుని కలిశాడు. వ్యాధుడు మాంసం దుకాణంలో మాంసం అమ్మేవాడు. కౌశికుని ఆహ్వానించి అతని రాక తనకి ముందే తెలుసునని సూచించి తన ఇంటికి తోడ్కొని వెళ్ళాడు.

ధర్మవ్యాధుడు కౌశికుని కోరిక మేరకు ధర్మ స్వరూపాన్ని వివరిస్తాడు. త్రిగుణ లక్షణాల్ని చక్కగా తెలుపుతాడు. ధర్మవ్యాధుని బోధనలో కొన్ని...

**"శీలంలేని వాడైన మానవుడు కాలానుగతంగా శీలవంతుడుగా మారవచ్చు"**

**"నన్ను ప్రశంసించే వారినీ నిందించే వారినీ అందరినీ నా మంచి నడవడితో సంతోషపెడతాను"**

**"ఎవరైనా తన విషయంలో చెడుగా ప్రవర్తిస్తే దానికి బదులు తాను కూడా చెడుగా ప్రవర్తించరాదు"**

**"పరనింద, ఆత్మ ప్రశంస వదలనివాడు ఎంత గుణవంతుడైనా లోకంలో గౌరవం పొందడు"**

**"పాపాలకు నివాసస్థానం లోభమే". "ఉత్తముల సత్కార్యాలన్నీ సత్యం మీదనే నడుస్తాయి."**

**"ఇంద్రియ సంయమనానికి సారం-త్యాగం."**

**"సజ్జనులు తమ బుద్ధిని అదుపులో పెట్టుకుంటారు"**

స్వధర్మాన్ని వదిలితే అధర్మం అవుతుంది కనుక మాంస విక్రయం నాకు స్వధర్మమే కాబట్టి దీనిని విడువలేను. **"పుణ్య కర్మానుష్ఠానం వల్ల జీవునికి దేవత్వం, పుణ్యపాపకర్మల మిశ్రమం వల్ల మానవజన్మ, తామస కర్మల వల్ల పశుజన్మ లభిస్తాయి." "చరాచర జగత్తు అంతా బ్రహ్మమే."** పంచభూతాల గుణాలైన శబ్ద స్పర్శరూప రస గంధాలు వాటి గుణాలు. ఈ గుణాలకు పరస్పర సంక్రమణ ఉంది. ఈ ఐదు కాక ఆరవతత్వమే చేతన. ఇదే మనస్సు. ఏడవతత్వం బుద్ధి. ఎనిమిదోతత్వం అహం. వీటితో బాటుగా ఐదు జ్ఞానేంద్రియాలు, ప్రాణం, త్రిగుణాలు కలిసి మొత్తం 17 తత్వాలు. ఇవి అవ్యక్త సమూహం. ఈ సమూహం బుద్ధి గుహలో దాగుంటాయి. వ్యక్త అవ్యక్త తత్వాలన్నీ కలిపి 24. ఈ తత్వ సముదాయమే వ్యక్తావ్యక్త రూపమైన గుణాలు. ఇవన్నీ పరబ్రహ్మ స్వరూపాలే. అని విశదంగా వ్యాధుడు, కౌశికునికి బ్రహ్మతత్వం బోధించాడు.

ఈ విధంగా కౌశికుడు, ధర్మవ్యాధుని వలన అనేక ధర్మసూక్ష్మాలను గ్రహించి, అతనికి ప్రదక్షిణ చేసి, నమస్కరించి సెలవు తీసుకుని స్వగృహం చేరి మాతాపితరుల సేవలో తరించాడు.

**కౌశికుని కథలో త్రిగుణ నిరూపణ:**

కౌశికుడు వేద వేదాంగాలు చదివినా ఆయనలో రాజస ప్రవృత్తి వలన కోపం చెందాడు. కాని కొంగ మరణం అతనిని బాధించింది. పశ్చాత్తాపపడ్డాడు. భిక్షా సమయాన అతి నిరీక్షణ, ఆకలి అతనిలోని తామసాన్ని ప్రేరేపించాయి. అజ్ఞానివలె అసంగతంగా పతివ్రతతో బ్రాహ్మణాధిక్యతను గూర్చి ప్రసంగించాడు. ఆమె బోధ వలన తిరిగి సాత్విక గుణంతో నిలిచాడు.

తపస్సుతో జ్ఞాన సంపన్నునిగా వెలిగే కౌశికుని వంటి పండితుడే కర్మానుసారంగా సందర్భానుసారంగా త్రిగుణ సంపన్నుడై ప్రవర్తించాడు. పరబ్రహ్మతత్వ విచారణలో ముముక్షువై ఉన్న అంతటి మునికే త్రిగుణ ప్రభావం తప్పలేదు.

కథలో కౌశికునికి బోధ చేసి, ధర్మవ్యాధుని వద్దకు వెళ్ళమని సూచించిన పతివ్రత - పరమసాధ్వి. పూర్తి సాత్వికమూర్తి. కర్మానుష్ఠానం గలదే అయినా కర్మలో స్వార్థ చింతన లేదు.

ఇక ధర్మవ్యాధుడు, స్వధర్మ నిర్వహణలో ఉండి మాంస విక్రయం చేస్తున్న పూర్తి సాత్వికమూర్తి. ధర్మసూక్ష్మత తెలిసి పూర్తి ధర్మ నిరతితో జీవనం సాగించే సత్వగుణ సంపన్నుడు.

కౌశిక, ధర్మవ్యాధుల కథలో పలు విధాలుగా త్రిగుణ చిత్రణ ఉంది. కౌశికునిలో మనం మొదట మూడు గుణాలను గమనించగలం. ధర్మవ్యాధుని బోధన తర్వాత పూర్తి సత్త్వగుణ సంపన్నుడైనాడు.

**ముగింపు:**

వ్యాస భారతంలోని వనపర్వంలో గల కౌశిక – ధర్మవ్యాధుల వృత్తాంతంవల్ల త్రిగుణాల స్వరూపాన్ని గుర్తిస్తాం. జ్ఞానాధికుడు, ధీరుడు, దోషాల్ని ఎంచనివాడు, జితేంద్రియుడు, శాంతుడు అయినవాడు సాత్వికుడు.

లోక విషయ పరిజ్ఞాని, సలహాలు ఇచ్చేవాడు, అహం కలిగినవాడు, ఆశగలవాడు రాజసుడు. అజ్ఞాని, అవివేకి, అతినిద్రాలోలుడు, ఇంద్రియజయం లేని కోపిష్టి తామసుడు.

త్రిగుణాలలో తామసాన్ని పూర్తిగా పరిహరించి తగుపాళ్ళలో రాజసాన్ని మేళవించిన సాత్వికగుణంతో నేటి ప్రజ మెలగగలిగితే సామరస్యపు సమాజం వర్ధిల్లుతుంది.

**ఆధార గ్రంథాలు**

1. శ్రీమలయాళస్వాములవారు ప్రకాశకులు : శ్రీవ్యాసాశ్రమమూ ఏర్పేడు శ్రీమద్భగవద్గీత 2002 (15వ ముద్రణ)
2. డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి డా॥ సూరం శ్రీనివాసులు– వ్యాస మహాభారతం (తెలుగు వచనం) వనపర్వం 2 ప్రచురణ : శ్రీలలితా త్రిపుర సుందరీధార్మిక పరిషత్ –విజయవాడ – 2010
3. పరమార్థ తత్వ ప్రకాశము అను అద్వైత వేదాంత శాస్త్రము గ్రంథకర్త–కొత్త సంగయ్య (రచయిత స్వీయ ప్రచురణ) రచన–1940, ప్రచురణ–1975

ISSN 2457-0796 UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# శ్రీ దేవీ భాగవత పురాణము - సత్వరజస్తమోగుణములు

**డాక్టర్ మఠపతి మాంతయ్య,**
అసోసియేట్ ప్రొఫెసర్ (తెలుగు),
ప్రభుత్వ కళాశాల (అటానమస్),
సంగారెడ్డి.

సత్వరజస్తమోగుణాలకు మూడింటికి మూడు శక్తులు ఉన్నాయి. సత్వ గుణానికి జ్ఞానశక్తి, రాజస గుణానికి క్రియాశక్తి, తామస గుణానికి ద్రవ్యశక్తి. మానవునిలో ఆయా సందర్భాలను అనుసరించి ఈ మూడు గుణాలు ఒకదానిపై మరొకటి ఆధిపత్యం వహిస్తాయని శ్రీ దేవీ భాగవత పురాణం పేర్కొంటుంది.

**"సాత్వికస్య జ్ఞానశక్షి రాజసస్య క్రియాత్మికా**
**ద్రవ్య శక్తిస్తామసస్య తిస్రశ్చ కథితాస్తవ"**

ఈ గుణత్రయాలు మనస్సును మథింప జేస్తుంటాయి. వివిధ పనులు చేయిస్తుంటాయి . తామసమైన ద్రవ్యశక్తి నుండి శబ్దస్పర్శరూపరస గంధాలు అనే పంచ తన్మాత్రలు సముద్భవించాయి. ఈ ఐదింటిలో శబ్దగుణం ఆకాశం. స్పర్శ గుణం వాయువు. రూపగుణం అగ్ని. జలం రసగుణం కలది. పృథ్వి గంధ గుణం కలిగి ఉంటుంది. రాజసగుణం క్రియాశక్తి. దీని నుండి శ్రోత్రత్వగ్రసనాచక్షు రాఘ్రాణములు ఐదు ఇంద్రియాలు ఆవిర్భవించాయి. వీటిని జ్ఞానేంద్రియాలుగా పేర్కొనడం జరిగింది.

ఇవి కాకుండా మరొక ఐదు కర్మేంద్రియాలు ఉన్నాయి. వాక్పాణి పాద వాయు గుహ్యాలు. ఇంకా ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన అనే ఐదు వాయువులున్నాయి. ఈ పదిహేనింటికీ రాజసవర్గము అని పేరు. క్రియాశక్తి సమన్వితాలైన ఈ పదిహేను సాధనాలు. జ్ఞానశక్తి వీటికి ఉపాదానం.

శ్రీ దేవీ భాగవత పురాణములో పేర్కొన్న విధంగా సాత్వికమైన జ్ఞానశక్తి నుండి తూర్పు ,ఆగ్నేయం, దక్షిణ, నైరుతి, పడమర, ఉత్తర, ఈశాన్య , ఊర్ధ్వ, అధోదిక్కులు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వినీదేవతలు ఆవిర్భవించారు. వీరందరూ జ్ఞానేంద్రియాలకు అధిష్ఠాన దేవతలు.

బుద్ధి మొదలైన అంతఃకరణ చతుష్టాలైన చంద్రుడు, బ్రహ్మ ,రుద్రుడు, క్షేత్రజ్ఞుడు అనే నలుగురు అధిదేవతలు. వీరే కీలాధిష్ఠాతృదేవతలు. మనస్సుతో కలిపితే మొత్తం పదిహేను. ఇది సాత్వికవర్గం. **"అణోరణీయాన్మహతో మహీయాన్"** అనే వేద వచనానుసారం పరమాత్ముడు స్థూల సూక్ష్మ రూపాలలో

ఉంటాడు. **"అంతర్బహిశ్చతత్సర్వంవ్యాప్యనారాయణస్థిత్ణ"** అనే నారాయణసూక్త వచనానుసారం భగవంతుడు లోపట, బయట అంతటా వ్యాపించి సర్వాంతర్యామియై ఉన్నాడు. జ్ఞాన రూపం మాత్రం నిరాకారమే. సాధకుని సాధనావస్థక్రమంలో చేసే ధ్యానాదులకు ఉపకరించేది పరమాత్ముని స్థూలరూపం.

ఈ విధమైన తామస రాజస వర్గాల కలయికతో స్థూలరూపం ఏర్పడుతుంది. అంటే పంచతన్మాత్రలు, దశేంద్రియాలు, పంచప్రాణాలసంసర్గం. దీనినే **"పంచీకరణం"**అని కూడా అంటారు. ఈ విషయాన్ని గ్రహించిన సాధకునకు భూత సముద్భవమంతా తెలుస్తుంది. ఆకాశం కేవలం శబ్ద గుణకం. వాయువుకి శబ్ద స్పర్శలు రెండు ఉన్నాయి. అగ్నికి శబ్దస్పర్శరూపాలు అనే మూడు గుణాలున్నాయి. జలమునకు శబ్ద స్పర్శ రూప రసాలు అనే నాలుగు గుణాలు ఉన్నాయి. పృథ్వికి శబ్దస్పర్శరూప రసాలతో పాటు గంధం అనే ఐదవ గుణం కూడా ఉన్నది. స్థూలరూపంగా బ్రహ్మాండోత్పత్తి ఈ అంశాల కలయికతో ఏర్పడుతుంది. ఈ కారణంగా ఎనభై లక్షల జీవరాశులు ఏర్పడ్డాయి.

ఇక సత్వగుణం ప్రీత్యాత్మకమైనది. సుఖాల నుండి ప్రీతి ఉద్భవిస్తుంది. దీనిని సత్వ లేదా సాత్విక గుణం అంటారు. ఋజుత్త్వం, సత్యం, శౌచం, శ్రద్ధ, క్షమ, ధృతి, దయ, లజ్జ, శాంతి, సంతోషం, వీటన్నింటితో సత్వ ప్రతీతి కలుగుతుంది. ఇది నిశ్చలంగా ఉంటుంది. ఈ సత్వగుణ ప్రతీతి ధర్మం పట్ల ఆసక్తిని కలిగిస్తుంది. మంచి పనులు చేయడంలో శ్రద్ధను పెంపొందిస్తుంది. అశ్రద్ధను నిత్యము నివారిస్తుంది.

తత్వత్రయాన్ని గుణత్రయాన్ని తెలుసుకున్న మునులు శ్రద్ధను కూడా సాత్వికశ్రద్ధ, రాజసిక శ్రద్ధ, తామసిక శ్రద్ధ అని మూడు రకాలుగా విభజించారు. సాత్వికశ్రద్ధ స్వచ్ఛమైన తెలుపు వర్ణంలో ఉంటుంది. రాజసిక శ్రద్ధ ఎరుపు వర్ణంలోఉంటుంది. తామసిక శ్రద్ధ నలుపు వర్ణంలో ఉంటుంది. ఆయా గుణములను బట్టి ఆయా రంగులు నిర్ణయించబడ్డాయి.

రాజస గుణంగల వ్యక్తిలో ద్వేషం, ద్రోహం, మాత్సర్యం, అలసత్వం, పనుల పట్ల నిర్లక్ష్యం, ఉత్కంఠ, నిద్ర మొదలగునవి ఉద్భవిస్తాయి. తామస గుణముగల వ్యక్తిలో అజ్ఞానం, భయం, వివాదశీలం, కార్పణ్యం, కుటిలత్వం, రోషం, వైషమ్యం, అతినాస్తికత్వం మొదలగునవి ఉద్భవిస్తాయి. ఇతరులకు కీడు కలిగించడం తామస గుణం యొక్క ప్రధాన లక్షణం.

**"సత్వం ప్రకాశితవ్యం నియంతవ్యం రజస్సదా**
**సంహర్తవ్యం తమ్మ కామం జనేల శుభమిచ్ఛతా"**

ఈ గుణత్రయంలో సత్వ గుణాన్ని ప్రకాశింపజేయాలని రజోగుణాన్ని నియంత్రించాలని, తమోగుణాన్ని అంతమొందించాలని, (దగ్గరకు రానీయకూడదని) శ్రీదేవీ భాగవత పురాణం పేర్కొంటుంది.

ఈ గుణత్రయములు సత్వరజస్తమోగుణములు నిరంతరం ఒకదానితో మరొకటి పోట్లాడుకుంటూ ఉంటాయి. ఒక దానిని ఆశ్రయించి మరొకటి ఉంటుంది. కాబట్టి ఈ గుణాత్రయాలు నిరాశ్రయాలు కావు. కేవలం సత్వం, కేవలం రజస్సు, కేవలం తమస్సు ఎక్కడా ఉండవు. ఎప్పుడు కలహించుకుంటూ కూడా కలిసే ఉంటాయి. అందుకే ఇవి అన్యోన్యాశ్రయాలు.

జ్ఞాతమైన పని పట్ల శ్రద్ధ అనేది ఫలానుభూతి లభించేంతవరకు ఉంటేనే అది పరిజ్ఞాతం అవుతుంది. ఏదైనా ఒక విషయం గురించి విన్నంత మాత్రం చేత, చూసినంత మాత్రం చేత అది పరిజ్ఞాతం కాదు. అనుభవములోకి రావాలి.

ISSN 2457-0796 UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాల గురించి ఎవరో ఒక వ్యక్తి చెప్పగానే విన్న వ్యక్తిలో రాజసమయిన కోరిక పుట్టి, ఆయా తీర్థక్షేత్రాలను సందర్శించి, నదులలో మునిగి స్నానమాచరించి, పూజలు, దానాలు చేసి, ఇంటికి తిరిగి వచ్చిన తరువాత, మళ్లీ యధావిధిగా రాగద్వేషాలు, కోపతాపాలు, కామ క్రోధాలకు లోనవుతే, ఆ వ్యక్తి చేసిన పుణ్యక్షేత్రాల సందర్శనం వృథా అవుతుంది. కేవలం శ్రమ మాత్రమే మిగులుతుంది. ఇది రజోగుణ లక్షణం.

శాస్త్ర అధ్యయనం వల్ల సత్వగుణం వృత్తి పొందుతుంది. లౌకిక విషయాదుల పట్ల వైరాగ్యం కలుగుతుంది. ఈ సత్వ గుణం కూడా రజస్తమో గుణాల సాంగత్యం వల్ల నిత్యం పరాభవం చెందుతూ ఉంటుంది. నిరంతరం మనసులో సంఘర్షణ జరుగుతూనేఉంటుంది. కావున మానవుడు సాధకుడు సత్వ గుణాన్ని నిరంతరం కాపాడుకుంటూ ఉండాలి. అది సమున్నతంగా పెరిగినప్పుడు వైరాగ్యం ఆవిర్భవిస్తుంది. తుచ్ఛమైన ఐహిక భోగాల పట్ల మనసు వికలం చెందుతుంది. తద్వారా బుద్ధి ధర్మ మార్గాన్ని అనుసరిస్తుంది. తమోరజో గుణాలను జయించగలుగుతుంది. బాహ్యమైన లౌకికమైన సంపదలను ఆశించకుండా, దైవభక్తి పెరిగి యజ్ఞ యాగాదులు, సత్కర్మలు, దానధర్మాలు, సత్కర్మలు చేయుటయందు ఆసక్తి కలుగుతుంది. మనసు తేలికపడుతుంది. సాత్విక భోగాలను తిరస్కరిస్తుంది. బుద్ధిమంతుడైన వాడు మొదట రజోగుణాన్ని నియంత్రించాలి. ఆ తరువాత తమోగుణాన్ని అంతమొందించాలి.

అప్పుడే వ్యక్తి సత్వగుణ సంపన్నుడవుతాడు. అలా కాకుండా రజోగుణం పెరిగితే అధర్మకార్యాలు చేయుటలో శ్రద్ధ పెరుగుతుంది. సనాతన ధర్మం పట్ల వ్యతిరేక భావాలు కలుగుతాయి. తమోగుణం పెరిగితే వేద శాస్త్రాల పట్ల, తమ పూర్వులు ఆచరించిన సాంప్రదాయ బద్దమైన ఆచారాల పట్ల విశ్వాసం నశిస్తుంది, అక్రమ పద్ధతులలో( దుష్కర్మలతో) ధనం సంపాదించాలని కోరిక కలుగుతుంది. మనసు తన స్వాధీనంలో ఉండదు. శాంతి నశిస్తుంది. క్రమక్రమంగా సత్వగుణాలు కనుమరుగైపోతాయి. కామ, చోర భావాలు రాజ్యమేలుతాయి.

ఈ గుణత్రయాలు ఒంటరిగా ఉండవు. అన్యోన్యాశ్రితాలై ఉంటాయి. ఒకానొక సందర్భంలో రజస్తమో గుణాలను పుట్టిస్తుంది. మరో సందర్భంలో రజోగుణం సత్వతమో గుణాలను ఆవిర్భవింపజేస్తుంది. మరికొన్ని సందర్భాలలో తమోగుణమే సత్వరజో గుణాలను జనింపజేస్తుంది.

ఈ విధంగా గుణత్రయాలు ఒకదానికొకటి కారణాలవుతూ ఉంటాయి. ఈ గుణత్రయ సాంగత్యం చాలా విచిత్రంగా ఉంటుంది. లఘు ప్రకాశత్వం, విశదత్వం అనేవి సత్వగుణ సంకేతాలు. దేనినైనా సరే తేలికగా చూడటం, మనస్సును ఎల్లవేళలా తేలికగా ఉంచుకోవడం, ప్రశాంత జీవనం కొనసాగించడం, ఇలాంటివన్నీ సత్వగుణ సమృద్ధికి నిదర్శనాలు.

ఇలా కాకుండా శరీరమంతా కపటంతో కూడి ఉండటం, మనసులో చంచలత్వం మొదలగునవి రజోగుణానికి నిదర్శనాలు. భుజించకూడని పదార్థాలు భుజించడం, ఇతరులను నిందించడం, ఒకరిపై మరొకరికి చాడీలుచెప్పడం, జూదం, మద్యపానం వంటి దురలవాట్లు కలిగి ఉండడం, దుష్టులతో స్నేహం చేయడం, వివాదాలకు కాలుదువ్వడం లాంటివన్నీ తమోగుణానికి నిదర్శనాలు.

ఈ గుణత్రయములు దీపాల వంటివి. వత్తి, నూనె, అగ్ని (మంట) ఇవి మూడు పరస్పర విరుద్ధాలే అయినా దీపం ప్రకాశిస్తుంది. నూనెకు వత్తితో, అగ్నితో వైరుధ్యమే. అలాగే అగ్నికి వత్తికి మిగతా రెండు శత్రువులే. అయినా కలిసి ఉంటున్నాయి. వెలుగుతున్నాయి. వస్తువులను ప్రదర్శిస్తున్నాయి. ఇదేవిధంగా త్రిగుణాల కలయిక ప్రకృతి సిద్ధమే. శ్రీదేవి భాగవత పురాణం ప్రతి వస్తువులో గుణత్రయం ఉండి తీరుతుందని వివరిస్తుంది.

**"ఏభిర్విహీనం వస్తు నైవాత్ర కుత్రచిత్**
**వస్తుమాత్రంతు యద్దృశ్యం సంసారం త్రిగుణం హితత"**

నిర్గుణమైన వస్తువు సృష్టిలో కనపడదు. భూతకాలంలో లేదు. భవిష్యత్ కాలంలో ఉండదు. కంటికి కనిపించేది ఏది నిర్గుణం కాదు. పరమాత్మ ఒక్కడే నిర్గుణుడు. అతడు కంటికి కనబడడు. అహంకారం, మహత్తత్వం, శబ్దాదులు, గుణాలు, కార్యకారణ రూపంలో అహర్నిశం సంసారం (ప్రపంచం) సాగుతూ ఉంటుంది. అహంకారం త్రిగుణాత్మకమే. కంటికి కనిపించని నిర్గుణం గుణత్రయాలకు అతీతంగా ఉంటుంది.

**"అనాది నిధనౌవిద్ధి సదా ప్రకృతి పూరుషౌ**
**విశ్వాసే నాభిగమ్యౌ తౌనా విశ్వాసేనకర్హచిత్"**

సర్వ ప్రాణికోటిలోనూ కనిపించే చైతన్యం శక్తి స్వరూపమే. ఆ శక్తి తేజోస్వరూపం. ఆ తేజస్సు త్రిగుణ త్రయాతీతం. సగుణమైన చేతస్సు నిర్గుణాన్ని తెలుసుకోలేదు. చేతస్సు అహంకార సముద్భూతం. అది తనంతట తాను నిరహంకారం కాజాలదు. ఈ గుణ సంబంధ విచ్ఛేదం జరగనంత వరకు పరమాత్మ దర్శనం కాజాలదు. చిత్తాన్ని నిరహంకారం చేసినప్పుడు మాత్రమే దర్శనం సంభవిస్తుంది. లోకంలో సత్వగుణ స్వభావం కలవారు అధికంగా ఉంటే లోకమంతటా శాంతి వ్యాప్తి చెందుతుంది. మానవులు దేవతల వలె శాంతస్వభావులై ప్రవర్తిస్తారు. అన్యోన్య సహకారంతో అభివృద్ధి సాధ్యమవుతుంది. అప్పుడే **"లోకాస్సమస్తాస్సుఖినోభవంతు"** అనే నానుడి సత్యమౌతుంది.

కావున మానవులు త్రిగుణాలలో సత్వ గుణాన్ని పెంపొందించుకోవాలి. రజోగుణాన్ని నియంత్రించాలి. తమోగుణాన్ని అంతమొందించాలని దేవీ భాగవత పురాణం తెలియజేస్తుంది. పృథివీ వికారమైన దారువు కంటే ధూమం విశిష్టమైనది. ధూమం కంటే యజ్ఞసాధకమైన అగ్ని విశిష్టమైనది. అదే విధంగా తమోగుణము కన్నా రజోగుణము, రజోగుణము కన్నా సత్వగుణము ఉత్తమమైనది. ముముక్షువులు, సాధకులు ఈ సత్వగుణం చేతనే పరమాత్ముణ్ణి దర్శిస్తారు. కొంతమంది రాజస, తామస గుణాలను వాంఛించి జన్మరాహిత్యంతో అనేక జన్మలను పొందుతూ ఉంటారు.

మోక్షాన్ని కోరినవారు మాత్రం రజోతమో గుణాలను వదిలిపెట్టి సత్వగుణ స్వభావులై శాంతముతో పరమాత్మను దర్శించి, మోక్షాన్ని పొందుతారు. కొందరు మాత్రం రాజస తామస గుణాలు కలవారై సత్వగుణం పొందలేక లౌకిక సంపదలను పొందగోరి రాజులను ధనవంతులను ఆరాధిస్తారు . మోక్షప్రదాత అయినటువంటి భగవంతుడిని సేవించరు. వేదాలు, యజ్ఞాలు,జ్ఞానాలు, యోగాలు, క్రియలు అన్ని పరమాత్ముని స్వరూపాలే అని సత్వగుణ సంపన్నులు తెలుసుకుంటారు.

సత్వరజస్తమో గుణములు అనే త్రిగుణాలకు అతీతుడైన భగవంతుడు వ్యక్తావ్యక్త స్వరూపుడై, త్రిగుణాత్మకమైన నిజ మాయ వలన విశ్వమంతటినీ తానే సృష్టించి, సత్వరజస్తమో గుణాలను అంగీకరించి, గుణ సహితునివలె తన మాయ చేత ప్రవర్తించడి, గుణములలో ప్రవేశించి, విజ్ఞాన విశేషంతో విరాజిల్లుతాడు. ఒకే అగ్ని అనేక రూపాలుగా కనిపించినట్లు విశ్వ మయుడైన పరమాత్ముడు తాను సృజించిన ప్రాణుల యందు అంతర్యామియై ప్రకాశిస్తూ ఉంటాడు.

మనసు వంటి సూక్ష్మేంద్రియాలతో కూడినవాడై గుణాత్మకాలైన భావాల ద్వారా తన చేత సృష్టింపబడిన ప్రాణులలో చిక్కకుండా ఆయా గుణాలను అనుభవిస్తూ ఉంటాడు. లోకాలను సృష్టించిన ఆ పరమాత్ముడే లీలావతారుడై ఈ లోకములో జన్మించి, లోక రక్షణ చేస్తూ ఉంటాడు.

కావున మానవుడు పవిత్రమైన ఈ జన్మలోనే రజస్తమో గుణాలను జయించి, సత్వ సంపన్నుడై మోక్షాన్ని పొందవలెనని శ్రీదేవీభాగవతపురాణం హితోపదేశం చేస్తుంది.

## ఆధార గ్రంథాలు

1. శ్రీ దేవీ భాగవతము (తెలుగు వచనం – యథామూలం) ప్రకాశకులు వి. జి. యస్. పబ్లిషర్స్ 1998
2. పోతన భాగవతము సంపాదకులు డాక్టర్ జంధ్యాల పాపయ్యశాస్త్రి ప్రచురణ తిరుమల తిరుపతి దేవస్థానములు 1987

# సత్త్వగుణాధిక్యతచే శాంతియుత నవసమాజ స్థాపన

**డా. యస్.బేబీరమణి,**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
సదాశివపేట.

**త్రిగుణముల పరిచయం:** ప్రతి మానవుని మనస్సు త్రిగుణములతో కూడియున్నది. అవి సత్త్వము, రజము, తమము. మానవుని జీవితాన్ని, నడతను శాసించునవి ఈ మూడు గుణములే.

**పతంజలి యోగసూత్రములు-సాధనపాదము 10 సూత్రం**

**"విశేషా విశేష లింగ మాత్రాలింగాని గుణ పర్వాణి "**

ఒక వ్యక్తి ప్రవర్తనకు, స్థితిగతులకు అతని గుణములే కారణములవుతున్నాయి. అజ్ఞానము కలవాడిని మూర్ఖుడని, అహంకారము కలవాడిని గర్వము కలిగినవాడని, జ్ఞానము కలిగినవాడిని జ్ఞాని లేదా మహర్షి అని విభజించి గుర్తిస్తాము. ఈ విభజనకి కారణం వారిని ఆవరించి ఉన్న సత్త్వరజస్తమో గుణములే.

ఈ మూడింటిలో ఆనంద జీవనమునకు సోపానముల నేర్పరచి స్వర్గలోకమును భూమిపై నిలుపునది సత్త్వ గుణాధిక్యత మాత్రమే. రజోగుణము అధికంగా కలిగియున్న వ్యక్తి జీవనం నరకప్రాయం. తమోగుణము అధికమైనచో ఆ మానవుడు మృతప్రాయుడే. ప్రశాంతమైన మనస్సును కలిగించునట్టి సత్త్వగుణముతో బ్రహ్మానందము కలుగునని భగవద్గీత బోధించుచున్నది.

**శ్రీమద్భగవద్గీత: ఆరవ అధ్యాయము-ఆత్మసంయమయోగము**

**"ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్**
**ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతకల్మషమ్" 27**

ప్రశాంతమైన మనస్సు కలవాడును, పాపరహితుడు, రజోగుణము శాంతమైనవాడును, అనగా ప్రాపంచిక కార్యములయందు ఆసక్తి తొలగినవాడును, సచ్చిదానంద ఘనపరమాత్మయందు ఏకీభావమును పొందినవాడును అగు యోగి బ్రహ్మానందమును పొందును.

శ్రీకృష్ణుడు అర్జునునితో త్రిగుణములకు లోబడడం వల్లనే ప్రాణులు నన్ను తెలుసుకొనలేకపోవుచున్నారని పలికినాడు.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

శ్రీమద్భగవద్గీత: ఏడవ అధ్యాయము-జ్ఞాన, విజ్ఞానయోగము

"త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ !
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్" !! - 13

ఈ జగత్తు అనగా ప్రాణిసముదాయము అంతయును గుణములయొక్క కార్యరూపములైన సాత్త్విక, రాజస, తామసములు అను త్రివిధ భావములచే మోహితమగుచున్నది. కనుక, త్రిగుణములకు అతీతుడను శాశ్వతుడను ఐన నన్ను ఆ ప్రాణులు తెలిసికొనలేకున్నవి.

కనుక మొదట రజస్తమోగుణములను ప్రయత్నపూర్వకముగా విడిచి సత్త్వగుణమును పెంపొందించుకొనవలెను. పిదప ఆ సత్త్వగుణమును కూడా వదలినప్పుడు మాత్రమే త్రిగుణాతీతుడైన పరమాత్మను తెలుసుకొనగలము.

వేమన మోక్షమార్గమగు తత్త్వమును తెలిసికొనవలెనన్న రజస్తమోగుణములను విడిచిపెట్టవలయునని తెలిపినాడు.

"కర్మగుణములన్ని కడబెట్టి నడువమి
దత్త్వమెట్లు తన్ను దగులుకొనును?
నూనెలేక దివ్వె నూవుల వెల్గునా?
విశ్వదాభిరామ వినురవేమ" !

కర్మములను, రజస్తమోగుణములను విడిచిపెడితేనేగాని మానవుడు తత్త్వమును తెలిసికొనలేడు. దీపము నూనెతో వెలుగునుగానీ నూనెకు మూలమైన నువ్వులతో వెలుగదు కదా!

కనుక ఆనందమయమైన జీవనమును సాగించుటకు మరియు మోక్షసాధనకు మానవుడు రజోగుణము, తమోగుణములను వదలి సత్త్వగుణమును పెంపొందించుకొనవలెను. ఇట్టి సత్త్వగుణమును అలవరచుకొనుటకు మన జీవనశైలిని మార్చుకొనవలసిన అవసరమున్నది. ముందుగా శారీరకారోగ్యము వయస్సుతో సంబంధము లేకుండా ఆరోగ్యముగా ఉండవలెను. శారీరకారోగ్యముతో మానసికారోగ్యము కలుగును. కానీ నేడు శారీరక, మానసిక ఆరోగ్యములు రెండూలేక రజస్తమోగుణములు స్వైరవిహారం చేయుటలో ఈ క్రింది అంశాలు ప్రాధాన్యత వహించుచున్నవి.

**సాత్త్వికాహారమును స్వీకరించకపోవడం:** ఆహారము మూడు విధములు. సాత్త్వికాహారం, రాజసాహారం, తామసాహారం. సాత్త్వికాహారమనగా పండ్లు, ఉప్పు, కారములు మితముగాగల ఆహారపదార్థములు. రాజసాహారమనగా అధికమగు ఉప్పు, కారములు కలిగినట్టివి. తామసాహారమనగా మాంసాహారము, మసాలా దినుసులతో కూడిన ఆహారము. మనము స్వీకరించు ఆహారమునను సరించి మన గుణములు రూపొందును. కనుక సత్త్వగుణము పెంపొందుటకై సాత్త్వికాహారమును మాత్రమే గ్రహించవలెను.

మునులు, తపస్సును ఆచరించువారు ఈ కారణముచేతనే కేవలము కందమూలాదులను మాత్రమే గ్రహించి తపమును ఆచరించినారు.

**శ్రీమద్రామాయణము-అరణ్యకాండము-1వ సర్గ-7శ్లో.**

**"ఫలమూలాశనైర్దాన్తైశ్చీర కృష్ణాజినామ్బరైః,**

**సూర్యవైశ్వానరాభైశ్చ పురాణైర్మునిభిర్యుతమ్".**

ఆ ఆశ్రమమండలములో, ఫలమూలములను ఆహారముగా తీసికొనువారు, ఇంద్రియ నిగ్రహవంతులు, నారచీరలను, కృష్ణాజినములను ధరించినవారు, సూర్యాగ్నులవంటి తేజస్సు కలవారు అయిన అతివృద్ధులయిన మునులు నివసించుచుండిరి.

వారు ఫలమూలములను ఆహారముగా గ్రహించుటచేత ఇంద్రియనిగ్రహవంతులు, తేజస్సు కలిగియున్నారని మనము గ్రహించవచ్చును. కానీ నేడు మన జీవనశైలిలో వచ్చిన మార్పులవల్ల ఆహార ప్రాధాన్యతలు, విలువలు మారిపోయి ఆరోగ్యంపైనా, గుణాలపైనా అవి దుష్ప్రభావం చూపుతున్నాయి.

**శారీరకశ్రమ లేకపోవడం:** సూర్యకిరణముల క్రింద కష్టించి పనిచేసేవారి సంఖ్య తగ్గిపోయింది. పంఖాలక్రింద, శీతలయంత్రాల క్రింద శరీరకష్టం లేకుండా సునాయాసంగా పనిచేస్తున్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు నడకను దూరం చేశాయి. విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాలతో జీవిస్తున్నాము. ఇట్టి స్థితులతో కూడిన వ్యవస్థ భౌతిక శరీరంపై పనిచేస్తూ ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుంది.

**విశ్రాంతిలేని జీవనవిధానం:** ప్రాథమిక చదువుల నుండి పోటీ తత్త్వంతో కూడిన చదువులు, ఉద్యోగ రంగంలో తీవ్రపోటీతత్వం, ఉద్యోగాలకు వలస, ఈ విధంగా విశ్రాంతిలేక మానసిక వైకల్యాలకు లోనవుతున్నాడు.

**ఉద్వేగాలు, ఉద్రేకాల నడవడిక:** కొంతమందిలో అవయవసౌష్ఠవం ఉన్నప్పటికీ, ఉద్వేగాలు, ఉద్రేకాలు ఉండడం వలన మానసికాందోళనలతో సతమతమవుతూ ఒత్తిడికి గురియై సతమతమవుతున్నాడు. శరీర కర్తవ్యములకు సంబంధించిన అవయవాల మధ్య సామరస్యం, పొందిక, అమరిక, సమత్వం యొక్క ఆవశ్యకతను మనం గుర్తించడంలేదు. శరీరాన్ని సుఖపెడుతున్నాము. ఉపయోగించుకుంటున్నాము. నిర్లక్ష్యం చేస్తున్నాము. కనుక శరీరం బలహీనమై, క్షీణించి, రోగాలకు గురియై, అశాంతి, రుగ్మతలకు నిలయమై, మధ్యలోనే అంతమైపోతుంది.

**కాలుష్య వాతావరణం:** కార్లు, బస్సులు మొదలైన వాహనాలనుండి వెలువడే వాయువులు వాతావరణాన్ని కాలుష్యానికి గురిచేస్తున్నాయి. శబ్దకాలుష్యం పెరిగి, ఆరోగ్యం క్రమంగా క్షీణించి నశిస్తుంది.

**రసాయనిక ఎరువులు:** రసాయనిక ఎరువులతో పండించిన పంటలు భుజించడం వలన శరీరం సహజత్వము, దృఢత్వం, సమస్థితిని కోల్పోతుంది.

**నీతినియమాల లోటు:** మంచితనాన్ని, నియమాలను మరచిపోయి విశృంఖలంగా జీవించడం, స్వార్థపరత్వ ప్రాధాన్యత మొదలైనవి శారీరక, మానసిక ఆరోగ్యాలను ప్రభావితం చేస్తున్నాయి.

**యోగజీవన ఆవశ్యకత:** కనుక మన నిత్యజీవనంలో ఇన్ని విధాలైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని విజయం సాధించాలంటే యోగజీవనాన్ని అనుసరించవలెను. శరీరంలోని ప్రతిభాగముపై చికిత్స మరియు పునర్నిర్మాణం యోగంవలన మాత్రమే జరుగుతుంది.

దీర్ఘవ్యాధులు కూడా యోగాగ్నిలో దగ్ధమవుతాయి. దానివల్ల సత్త్వగుణం అధికమై శరీరంలో ఉద్భవించే తేజోమయమైన, ప్రకాశవంతమైన కిరణములతో శరీరంలో ఎన్నో మార్పులు, కూర్పులు, చేర్పులు కలిగి, దివ్య శరీరంగా, యోగశరీరంగా పునర్నిర్మాణమవుతుంది. దివ్య సజీవ చైతన్యం శరీరంలోనికి ప్రవేశించి శరీరాన్ని చైతన్య పరిపూర్ణంగా తీర్చిదిద్దుతుంది. కావున యోగము వలన ఆరోగ్యం, ఆయుర్దాయం పెరిగి భౌతిక, మానసిక, ఆధ్యాత్మికాభివృద్ధి, వికాసం జరుగుతుంది.

ఈ విధంగా మన జీవనశైలిని మార్పుచేసుకొని, యోగజీవితాన్ని అవలంభించడం ద్వారా సత్త్వగుణమును పెంపొందించుకొని ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన నవసమాజాన్ని నిర్మించుకొనవచ్చును.

**ఆధారగ్రంథాలు**

1. గీతామకరందము– శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి "స్వాములవారు ప్రకాశకులు – శ్రీ శుక బ్రహ్మ క్రమము శ్రీ కాళహస్తి – 2012,
2. శ్రీ మద్వాల్మకి మహర్షి ప్రణీత శ్రీ మద్రామాయాణము –అరణ్యకాండము ఆవార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుని చాలానందినీ వ్యాఖ్యా ప్రచురణ : ఆర్ష విజ్ఞాన ట్రస్టు హైదరాబాదు – 1993
3 పతంజలి యోగ సూత్రములు శ్రీ వివేకానంద స్వామి శ్రీ రామకృష్ణ మఠం – మైలాపూర్, మద్రాసు – 600004 2003
4. హిమాలయ యోగుల సాధనలు భారత్ జ్యోతి యోగశ్రీ ఆచార్య డా.సి. యస్ 'రాయుడు శ్రీకృష్ణ యోగాశ్రమము 28–3–393,శారదా నగర్, 11 మెయిన్, అనంతపురం–51500/,2007
5. వేమన పద్య రత్నములు కి. శ్రీ బ్రహ్మశ్రీ నేదునూరి గంగాధరం రోహిణి పబ్లికేషన్స 28–24–27, జండబెట్టువీధి 02, అరండలేపేట, విజయవాడ – 2 –2014

# మహాభారత ఉద్యోగపర్వంలో కనిపించే సత్త్వగుణము

**డా॥ ఏ. వెంకటప్రసాదు,**
సహ ఆచార్యులు,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,
వనపర్తి.

మనిషి జీవితంలో సంభవించే భావోద్వేగాలకు అనుగుణంగానే ప్రవర్తిస్తూ వుంటాడు. తనకు సంతోషకరమైన లాభకరమైన పనులు జరిగితే మనసు ఆనందముతో ఉరకలేస్తూ వుంటుంది. ఆ సంతోషాలను తన కుటుంబముతో, బంధుమిత్రులతో పంచుకుంటాడు. అదే ఏ మాత్రము కష్టము వచ్చినా, నష్టము కలిగినా అతని మనసు చింతా క్రాంతమవుతుంది. అపుడు ప్రవర్తించే తీరు వేరే విధంగా ఉంటుంది. కొందరు మనుషులు తమ జీవిత చరమాంకములో భగవత్ తత్త్వాన్ని గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తూ సమాజానికి అందించే ప్రయత్నం చేస్తారు. మనుషుల ప్రవర్తనను బట్టి వారి గుణాలు తెలుసుకోవచ్చు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి త్రిగుణాల గురించి చెప్తూ

**"సత్త్వ రజస్తమ ఇతి గుణా ప్రకృతి సంభవా:!**
**నిబధ్నంతి మహాబాహో దేహ దేహన మవ్యయమ్!"**

అంటాడు. అంటే సత్త్వ, రజో, తమో గుణములు ప్రకృతి వల్ల ఈ జీవాత్మను, దేహాన్ని బంధించడం వల్ల మనిషి ఈ త్రిగుణాలకు బందీ అవుతున్నాడు. మనిషిని ఆశ్రయించిన ఈ మూడు గుణాలకు 'మనస్సే' ప్రధానకారణము, ఆధారభూతము కూడ. ఈ త్రిగుణాలు కూడ పూర్వజన్మల కర్మల వల్లనే మనుషుల ప్రవర్తనకు కారణభూతమవుతాయి. ఏ మనిషి జీవితము ఈ మూడు గుణాలకు అతీతంగా సాగదు.

**సత్త్వగుణము:** ఈ సత్త్వగుణము నిర్మలమైనది, ఆరోగ్యవంతమైనది. సత్త్వగుణము కలవారు జ్ఞానమునందు, సుఖమునందు అనురాగం కలిగి ఉంటారు. దీని వల్ల మనుషులను ఆకర్షించగలుగుతారు. వీరి మనసులో ఏ రకమైన కల్మషము ఉండదు. భగవత్ తత్త్వానికి, మోక్షసాధనకు ఆరాటపడుతుంటారు. తన, పర అనే భేదాలు లేకుండా స్వార్థరహితంగా ఇతరులకు సహాయం చేస్తుంటారు.

**రజోగుణము:** ఈ రజోగుణము కలిగినవారు, రజోగుణమున్నపుడు ఉద్రేకంగా వ్యవహరిస్తారు. ప్రేమ, అభిమానము, ఆశలతో ఎక్కువ ఉంటారు. అహంకారపు భావాలతో, ఆశాపాశాలతో, మోహావేశాలతో
ఉంటారు. మనస్సులో శాంతి లేకుండా ఉంటారు. ఆశల సాధనకు ఎలాంటి కర్మలనైనా చేయడానికి వెనుకాడరు.

**తమోగుణము:** ఈ తమోగుణ లక్షణము బద్ధకము, అలసత్వము. ఈ లక్షణము కలవారు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే మూర్ఖత్వంతో ఉంటారు. వీరు చెప్పుడు మాటలు వింటూ మనసును గందరగోళం చేసుకుంటారు. ప్రజలను మోహింపచేస్తూ, సోమరితనంతో, అతినిద్ర, భ్రమలతో సతమతమవుతుంటారు.

ఈ గుణము చాలా ప్రమాదకరమైనది. దీని వల్ల మంచి చెడుగాను, చెడు మంచిగాను వీరికి కనిపిస్తుంది. వీరు తొందరగా వ్యసనపరులవుతారు. ఆధ్యాత్మిక చింతనకాని, ప్రాపంచిక విషయాలు కాని వీరి చెవికెక్కవు. వీరు పాడవడమే కాక ఇతరులను కూడ పాడు చేస్తారు. అజ్ఞానంతో వ్యవహరిస్తూ తర్వాత చింతిస్తారు.

ఈ మూడు గుణాలు ప్రతి జీవిలో మిళితమై ఉంటాయి. ప్రధానంగా మనుషులలో మరీ ఎక్కువగా వుంటాయి. దీనికి కారణము మనస్సు నియంత్రణ లేకపోవడమే.

రామాయణంలో చూస్తే మంథర కైకేయికి సేవకురాలిగా వుంటూ, కైకేయికి దుర్బోధ జేసింది. మంథరది తమోగుణము. కైకేయిది రజోగుణము. పాండవులు సత్త్వగుణసంపన్నులు. దుర్యోధనుడు మిగిలిన కౌరవులందరూ తమోగుణసంపన్నులు. కాబట్టి వీరు ఎప్పుడూ పాండవుల వినాశనానికి పన్నాగాలు పన్నుతుండేవారు. ధృతరాష్ట్రుడు రజోగుణముతో కౌరవుల క్షేమాన్ని లోలోపల కాంక్షిస్తూ పైకి మాత్రం నటిస్తుండేవాడు. సర్వకార్యాలు ఈ త్రిగుణాల వల్లనే సంభవిస్తుంటాయని తెలుసుకొని తనకు ఎదురవుతున్న సమస్యలకు, సుఖదు:ఖాలకు బాధపకుండా ఉంటాడో అట్టివాడే త్రిగుణాతీతుడు.

త్రిగుణాలలోని సత్త్వగుణము మహాభారతములోని ఉద్యోగపర్వము తృతీయాశ్వాసములో పాండవులలో కనిపిస్తుంది.

తిక్కన గారు మహాభారతములోని విరాటపర్వము నుండి మొదలుకొని స్వర్గారోహణముదాకా గల 15 పర్వాలను తెలుగులోకి అనువదించాడు. తిక్కన హరిహరనాథ తత్త్వాన్ని ప్రతిపాదించి, తను రాసిన భారత భాగాన్ని హరిహరనాథునికి అంకితము చేసాడు. పాండవులు ఆరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తిచేసిన తర్వాత, కొంతకాలం 'ఉపప్లావ్యం'లో ఉన్నారు. పాండవులు ఒప్పందం ప్రకారం, రాజ్యభాగం తిరిగి ఇమ్మని, కౌరవుల వద్దకు ద్రుపదుడు తన పురోహితుడిని రాయబారిగా పంపాడు. ఇతడు పాండవులకు కొంత రాజ్యం ఇవ్వండని కౌరవులకు చెప్పాడు. ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి రాయబారిగా పాండవుల వద్దకు పంపాడు. సంజయుడు తీయగా మాట్లాడి, పాండవులకు ఇచ్చేది ఏమి లేదని తనమాటల్లో వెల్లడించాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడిని కౌరవ సభకు రాయబారిగా పంపాలని నిర్ణయించాడు. తర్వాత ధర్మరాజు తన సోదరులను పిలిచి వారితో మనం కృష్ణుడి దగ్గరకు వెళ్లి ఆయనను కౌరవసభకు రాయబారిగా వెళ్లమని ప్రార్తిస్తే మంచిది అంటాడు. చుట్టాలతో, ఆప్తులతో, గురువులతో యుద్ధం జరగకుండా సంతోషము కలుగుతుంది అని చెప్తాడు. అలా చెప్పటం వల్ల అతని సత్త్వగుణము మనకు కనిపిస్తుంది. తర్వాత శ్రీకృష్ణుని నివాస మందిరానికి తనవారందరితో కలసి ధర్మరాజు వెళ్తాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజును గౌరవించాక, ధర్మరాజు శ్రీకృష్ణునితో ఇలా మాట్లాడతాడు. " ఓ మహానుభావ ! మా ఆపదలు పోగొట్టి, మేలును కల్గించడానికి, పాండురాజు, మాకు ఈ జన్మలో నిన్ను చూపించి పోయాడు. నీ స్నేహితుల కార్యాన్ని చక్కపెట్టడానికి ఇదే తగిన సమయము. నీ కారణంగా దుర్యోధనునితో యుద్ధం లేకుండా మా రాజ్యభాగాన్ని మేము అనుభవిస్తాము. మేము నీకు నీ కుమారుల వంటివారము. మాకు పాపాలు రాకుండా చూసి రక్షించు" అని ప్రార్థించాడు. ఇలా యుద్ధం జరకూడదు అని అనుకోవటము ధర్మరాజు సత్త్వగుణాన్ని తెలియజేస్తుంది.

అపుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో నీ అభిప్రాయం ఏమిటో చెప్పు నీవు చెప్పినట్లే చేస్తాను అంటాడు. అంతట ధర్మరాజు శ్రీకృష్ణుడితో హస్తినాపురానికి వెళ్ళమని అక్కడ కౌరవులతో మాట్లాడి సంధి కుదర్చమని కోరతాడు.

కృష్ణా, మా పెదతండ్రి మాకు రాజ్యభాగం ఇవ్వకుండా, మంచి మాటలతో మా కోపాన్ని పోగొట్టాలని చూస్తున్నాడు.

పుత్రవ్యామోహం వల్ల, అతని కొడుకు చెడునడతను మాన్పించలేకపోవటం వల్లే మాకీఆపదవచ్చింది. మాతల్లి, బంధువులు సంతోషించేటట్లుగా దుర్యోధనుడు మొదలగువారిని శాంతింపజేసి ప్రేమతో మేము ఒకటిగా బ్రతకలేకపోవడం మాకు తగదు. ఇక్కడ చుట్టాలు, నీవు అందరూ వింటుండగా చెప్తున్నాను మాకు అయిదు ఊళ్ళు ఇచ్చినా చాలు. దీనిలో అసత్యమేమిలేదు. కాని ఆ మాత్రము ఇవ్వటానికైనా దుర్యోధనుడు అంగీకరిస్తాడో లేదో తెలియదు. అంగీకరించలేక పోతే యుద్ధం జరుగుతుంది. దానిని నేను సహించలేను. నేను ఈ అయిదు ఊళ్ళను కేవలం మావెంట ఉన్న బంధువులకు కూడు గుడ్డలకు లోటురాకుండా ఉండడానికే తప్ప సంపదలకోసం కాదని అంటాడు.

మేము కలసి ఉంటే మా ఇద్దరికీ ఆనందము కలుగుతుంది. ఎవరినైనా చంపాలనుకోవడం ఎందుకు? దానికి మరోమార్గంలేదా? ఎదుటి పక్షములో బంధుమిత్రులు ఉన్నారు. వారినందరిని సంపదకోసం చంపి, నిందను పాపాన్ని పొందటం నేను సహింపలేను. క్షత్రియ ధర్మం చాలా కష్టమైనది. క్షత్రియులకు శస్త్రజీవనమే సరియైనప్పటికి వంశనాశనము జరుగుతుంది కాబట్టి అది నాకిష్టము లేదంటాడు. యుద్ధము సంపదను కల్గిస్తుంది ప్రాణాలను తీస్తుంది. చాలామంది ఒకరి చేతిలో ఓడిపోవడము, వీరులు అల్పుల చేతిలో మరణించడం జరుగవచ్చు. ఇక యుద్ధంలో విజయము లభిస్తుందనికాని, పరాజయము కల్గుతుందని కాని చెప్పలేము. యుద్ధంలో ఓడిపోవడం మరణము కంటే కష్టము. యుద్ధము జరుగకుండా వేరే ఇతర మార్గాలద్వారా శత్రువులను జయించే నేర్పుగలవాడు గుండెపై చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతాడు.

పగ ఉంటే పాము ఇంటిలో ఉన్నట్లే. కాబట్టి చిరకాలంగా విరోధం తగినదికాదు. పగను అణచటం మంచిది. పగతో పగ అణగిపోదు. పగవున్నపుడు ఎదిరించకుండా ఉండడము, జవాబు చెప్పకుండా ఉండడమూ అసాధ్యమే. మరి పగ పూర్తిగా తీర్చుకోవాలంటే హింస తప్పదు. ఏవిధంగా చూసినా పగ మంచిది కాదు. కాబట్టి కృష్ణా! యుద్ధం జరుగని పద్ధతిలో సంపదను కోరుతున్నాను. ధనములన్నీ పోకుండా, కులనాశనము కాకుండా, మరే ఇతర పద్ధతులనోనైనా సరే మన పని నెరవేరటం మంచిది అని ధర్మరాజు అంటాడు. ఇంకా కృష్ణా! మామీద నీకు ప్రేమ ఎక్కువ. కాబట్టి మామీద పక్షపాతాన్ని వదలి ధర్మముతో ఇరు పక్షాలవారికి మేలు కలిగే విధంగా విదురుడు మొదలగు పెద్దలు అందరూ మెచ్చుకొనే విధంగా ఔచిత్యముతో, నేర్పుగా, కాఠిన్యంగా రాజులందరితో మాట్లాడు. ఒకవేళ దుర్యోధనుడు అన్యాయంగా కోపంగా కఠినమైన మాటలు మాట్లాడినా ఓర్పుతో ఉండు. గౌరవము అధికారము గల పెద్దవారి మాట వినకపోవడం అనే తప్పు ఆ దుర్యోధనుడి పైనే ఉండనీ. మనం ఆ ధృతరాష్ట్రుని మాట చెల్లనిచ్చినట్లయితే ప్రజలంతా మనని మెచ్చుకుంటారు. ఒకవేళ ఆ ధృతరాష్ట్రుడు తన కొడుకును వెనుక వేసుకుంటూ మా వినయాన్ని లక్ష్యపెట్టకపోయినా, మరి ఏ విషయాన్ని సరిగా

చెప్పకపోయినా, అవినీతి చేసినా, సంధి జరగదని భావించి తొందరపడి తెగించి రావద్దు. తెంపు చేసేటపువడు లోకులు మెచ్చుకునే విధంగా, ధర్మం స్పష్టమయ్యేవిధంగా, మాట్లాడి మామనస్సులను నిశ్చితంగా అయ్యేలా చెయ్యి. ఇలా కష్టాలతో బాధపడే మా మనస్సుల నొప్పిని పోగొట్టే వైద్యుడవు నీవు. ఇన్ని మాటలు ఎందుకు? నీవు ఎలా సంధి నడపుతావో అదే చేయి అదే నాకు ఇష్టము. నీవు ఆ దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళడం మంచిది కాదని నాకు అనిపిస్తుంది. అతను అతని మంత్రులు సోదరులు, మిత్రులు అంతా వక్రబుద్దులు, వినయములేనివారు, క్రూర కర్ములు. కాబట్టి అటువంటి నీచుని దగ్గరికి నిన్ను నేను పంపలేను. నీకు కష్టము కలిగించే పరిస్థితి కలిగి తద్వారా వచ్చే దేవపదవియైనా నాకు అక్కరలేదు అంటాడు.

అలాగే తనమాటలు కనుక నచ్చినట్లయితే రాయబారిగా వెళ్ళి కౌరవ పాండవులకు కష్టము కలుగకుండా, ఇద్దరు కలసిమెలసి వుండేలా చూసి కావలసిన విధంగా సంధి చేయమని ధర్మరాజు శ్రీకృష్ణున్ని కోరుతూ తనను ఒంటరిగా వెళ్ళవద్దని కోరతాడు. అపుడు శ్రీకృష్ణుడు ధర్మరాజు మాటలు విని ఇలా అంటాడు. ధర్మరాజా! దుర్యోధనుడు ఒక్కడే కాదు. ధృతరాష్ట్రుడు కూడ అటువంటివాడే. నా మాట నిజము. నీ అభిప్రాయము నాకు తెలసింది. నాకు నిజంగా కోపం వస్తే, అక్కడే కనుక యుద్ధంలాంటిది జరిగితే నన్ను ఎదిరించగల వీరుడు ఒక్కడులేడు. నన్ను పంపించు. నీవు ఎలాంటి సంకోచాలుకాని, భయాన్ని కాని కలిగి వుండకు. నేను వెళ్ళడం, ఏవిధంగానైనా మంచిదే, ధనప్రాప్తి అవుతుంది లేదా మనకు పాపము రాకుండే ఉండే మాటలయినా జరుగుతాయి అని అంటాడు.

అంతట శ్రీకృష్ణుని మాటలు విన్న ధర్మరాజు తిరిగి శ్రీకృష్ణునితో "మంచిది కృష్ణా ! నీవు వెళ్ళి మేము, కౌరవులు కలసి ఉండేలా సంధి చేయి. అదే మనకు మంచిది. కృష్ణా! నీకు మేము తెలుసు. ఆ కౌరవులు తెలుసు. ఏది మంచో తెలుసు. ఎలా ప్రయోజనం సిద్ధిస్తుందో తెలుసు. ఎవరితో ఏఏ సందర్భాలలో ఎలా మాట్లాడాలో తెలుసు. నీకు ఈ విషయాలన్నీ చెప్పడానికి నేను ఎంత వాడిని? నీవు కౌరవుల దగ్గరికి వెళ్ళి మాకు మా చుట్టాలతో, ఆప్తులతో, గురువులతో యుద్ధం జరగకుండా శాంతిని చేకూర్చు అని ధర్మరాజు తన సత్త్వగుణాన్ని ప్రదర్శించి పాండవులు మరియు కౌరవుల మధ్య యుద్ధం జరగకుండా సంధి చేయమని శ్రీకృష్ణుని వేడుకుంటాడు.

అపుడు శ్రీకృష్ణుడు "ధర్మరాజా! సంజయుని మాటలు, నీమాటలు విన్నాను. నీకు కేవలం ధర్మమే తప్ప ఇంకొక లక్ష్యమే లేదు. ఆ కౌరవులకు నిరంతరము వైరమే తప్ప వేరొక ధోరణి కానరాదు. వారు తమవైపు మహాబలవంతులయిన భీష్మ, ద్రోణులున్నారని అహంకారంతో విర్రవీగుతున్నారు. అనాయాసంగా వారు చేజిక్కించుకున్న సామ్రాజ్యాన్ని వారి తిరిగి నీకు అర్పించగలరని భావిస్తున్నావా? అది ఎన్నటికి జరుగదు. మిమ్ములను రకరకాలుగా ఆయా సందర్భాలలో ఎన్నో రకాలుగా పరాభవించి మిమ్ములను మనోవేదనకు గురిచేసారు. నిండుసభలో మీకు ఆ కౌరవులకు చేసిన అన్యాయాన్ని అనాడు సభికులే కాక, లోకమంతా కూడా ఆ ధృతరాష్ట్రుని నిర్ణయాన్ని ఛీఛీ అని నిందించారు. మీరు మారు మాట్లాడకుండా అరణ్యవాసానికి వెళ్తుంటే అందరు నిశ్చేష్టితులై దుర్భర వేదనతో దు:ఖించారు. అలాంటి క్రూరులను సంహరించవలసిందే కాని నీవు ఎందువల్లనో వారు వధించదగినవారు కాదనిభావిస్తున్నావు.

అయినా సరే సంధి విషయములో ఆ కౌరవులతో సామరస్యం కోసమే ప్రయత్నం చేయగలను. ఒకవేళ సంధి సాధ్యపడని పక్షంలో కౌరవుల వైపువారి ఉత్సాహావేశాలు, శక్తిసామర్థ్యాలు, తారతమ్యాలు తెలుసుకుని మీకు తెలుపగలను. అచిరకాలంలోనే తప్పక దారుణ సంగ్రామం చెలరేగగలదు. మీరు నిరుత్సాహపడకుండా ఇక్కడికి చేరుకున్న రాజులందరిని రణోత్సవం కోసం ప్రోత్సహింతువుగాక!" అని అంటాడు.

అంతట భీముడు, కృష్ణా! భీకర సమరం చెలరేగగలదని మాటిమాటికి మమ్మల్ని భయపెట్టవద్దు. ఆ దుష్టబుద్ధి దుర్యోధనుడు ఏ తీరులో నయినా శాంతించే పద్ధతిలోనే సంధి వ్యవహారం చక్కబెట్టవలసిందిగా వేడుకుంటాడు. అర్జునుడు అ మూర్ఖుల నేరీతిగా నయిన శాంతింపజేసి, రాజ్యభాగ మీయవలసినదని ప్రోత్సహించి యుద్ధప్రమాదం నివారించమని, ఇది మా ఉభయులకేగాక లోకులందరికి శ్రేయస్కరమైన పద్ధతని అంటాడు. నకులుడు "నీవంటి రాజనీతి కోవిదుడు సంధికోసం ప్రసంగిస్తున్నపుడు ఆదరించకపోయిన యెడల ఆపదలపాలై నశించిపోగలమని దుర్యోధనాదులు అలజడిపడి సంచలించరా? వేయేల, నీవచ్చుటికి పోయినంతలోనే మన కోరిక నెరవేరగలదు" అని అంటాడు.

సహదేవుడు ఆ సందర్భంలో నీవు ఏమాత్రము చలించక వారన్నది కాదనక, ఔనౌనని ఊకొట్టవలెను సుమా! అంటూ పాండుపుత్రులంతా ఆ సందర్భంలో తమ అన్నగారిని అనుసరించి సత్త్వగుణమునే ప్రదర్శించారు. ఇలా మహాభారతము ఉద్యోగపర్వములోని తృతీయాశ్వాసములో (పాండుపుత్రుల) ధర్మరాజుయొక్క సత్త్వగుణము కనిపిస్తుంది.

## ఆధార గ్రంథం

1. మహాభారతం (విరాట, ఉద్యోగ పర్వములు) మూడవ సంపుటము – పిలకా గణపతి శాస్త్రి నవరత్న బుక్ హౌస్, విజయవాడ. మే, 2004.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# సత్త్వగుణ సాధనలో సద్గురువు ఆవశ్యకత

**డా. యస్. రమాదేవి**
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
నయాపూల్, హైదరాబాద్.

మనిషి సంఘజీవి. సంఘం నిరామయంగా ఉండాలంటే అది మంచి వ్యక్తుల కారణంగానే సాధ్యమవుతుంది. తన యొక్క ఉనికి, అస్తిత్వం సంఘం యొక్క ఉనికి అస్తిత్వానికి కారణం అన్న సత్యాన్ని గుర్తెరిగి వ్యక్తులు ప్రవర్తిస్తే అప్పుడు ఆ సమాజం సమాజంలాగా ఉండగలదు. లేకపోతే సమాజం "సమజం" అవ్వగలదు. అందుకుగాను దోహదపడేది ఈ త్రిగుణాల గురించిన అవగాహన. ఈ త్రిగుణాలపై ధ్యానం ఉంచి, అందరికి ఆరోగ్యకరమైన ఆమోద యోగ్యమైన వాతావరణం నెలకొల్పాలంటే సత్వగుణాన్ని పెంపొందించుకుని, రజోగుణాన్ని అధీనంలో పెట్టి, తమోగుణాన్ని అధిగమించగలిగితేనే సాధ్యపడుతుంది. బుద్ధిజీవులమైన మానవులలో అటువంటి ఎరుకను కలిగించగలవాడు గురువు. అందుకే అవతార పురుషులయిన రాముడికి, కృష్ణుడికి కూడా వెన్నుదన్నుగా వశిష్ఠ విశ్వామిత్ర,సాందీపుడు మొదలైన గురువులు అవసరమయ్యారు. **"ఆచార్యవాన్ పురుషో వేద"** అని ఉపనిషత్తు. స్వయం తీర్ణ పరాన్ తారయతి అని నానుడి. తను తరించువాడు ఇతరులనెట్లా తరింపచేయగలడు. అటువంటి తీర్థంకరులయిన ఆచార్యత్వం కలిగిన గురువుల యొక్క ఆవశ్యకతను చూపడానికి, మనిషి ఒక మంచి వ్యక్తిగా ఎదిగి సమిష్టి నిర్మాణాకి దోహదపడేవిధంగా తీర్చిదిద్దబడడంలో సరైన గురువు పోషించినపాత్ర, ప్రత్యేకించి వాల్మీకి రామాయణంలో, విశ్వామిత్ర ఋషి గురించి, వశిష్ఠుడి ప్రేరేపణతో ఈర్ష్య, అసూయ, అహంకారం, అభిమానం, దర్పం వంటి ప్రతికూల భావాలు కలిగిన ఒక సామాన్య మానవుడు తన బలహీనతలను అధిగమించి బుద్ధి జీవిగా పరిణతి పొంది, అత్యంత ఔన్నత్యాన్ని ఉదాత్తతను పొందగలిగి , తనంతటి లోకబంధువయిన నాథుడిని ప్రజారంజకుడైన నాయకుడిని రాముడిని తీర్చిదిద్దిన విషయం గురించిన ప్రస్తావన, నా ఈ వ్యాసంలో ప్రధానంగా తీసుకోవడం జరిగింది.

**"రామో విగ్రహవాన్ ధర్మః"** అన్న మాట మనందరం విన్నమాట. రాక్షసుడైన మారీచుడికే తెలిసిన మాట. మరి అటువంటి ధర్మమూర్తి రాముడి ధర్మం వెనక ఉన్న గురుకృప, గురుబలం, గురుశక్తికి కారణమైన విశ్వామిత్రుడి గురించి బ్రహ్మర్షి వశిష్ఠుడు అన్న మాట చాలా కొద్ది సార్లే వినపడే మాట. **"ఏష విగ్రహవాన్ ధర్మ ఏష వీర్యవతాం వర్ణ, ఏష బుద్ధ్యాధికో లోకే తపసశ్చ పరాయణమ్"** అంటాడు వశిష్ఠుడు విశ్వామిత్రుడి గురించి, పసివాడైన రాముణ్ణి రాక్షసులతో పోరాడడాకి అడవికి పంపలేనన్న తండ్రి దశరథుడికి నచ్చచెపుతూ. అవతార పురుషులయిన రాముడు, కృష్ణుడు కూడ గురువుల కారణంగానే జీవితంలో ఉద్ధతిని పొందగలిగారు. అన్యాపదేశంగా ఇది మనందరికీ ఒక పాఠం.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

సమసమాజ నిర్మాణానికి గురువు యొక్క అవసరం అమోఘం, అసామాన్యం అత్యంత కీలకం. **"గురువు లేక, యెటువంటి గుణికి తెలియగ బోదు, సద్గురువు లేక యెటువంటి గుణికి తెలియగబోదు"** అంటాడు త్యాగయ్య. మూర్తీభవించిన ధర్మంగా నిలవడానికి రాముడి వెన్నుదన్నుగా నిలబడిన గురుమూర్తి విశ్వామిత్రుడు, మహా పరాక్రమశాలి, అమేయమైన ధీశాలి, అనేక శస్త్రాస్త్ర కోవిదుడు, అమోఘమైన అస్త్రాలను
శస్త్రాలను సృజింపగల సమర్థత నేర్పు కలిగిన వాడు, ధర్మవేత్త. గాయత్రీ మంత్ర ద్రష్ట. మానవుల బుద్ధి ప్రచోదనం చేయగల మంత్రాన్ని సృష్టించి ఉన్నత పథానికి అవకాశం కల్పించిన విశ్వామిత్రుడు బుద్ధికుశలుడే గాకుండా అమిత కారుణ్య మూర్తి కూడా.

ఆయన పేరే చెబుతుంది ఆయన విశ్వానికంతటికీ మిత్రుడు. ధర్మమార్గంలో నడుస్తున్న జనాలను పట్టి పీడిస్తున్న అధర్మపరులైన దానవులను, రాక్షసులను సంహరించి విశ్వానికి మేలు చేయాలన్న సంకల్పంతో అందుకు సర్వసమర్థుడైన సచ్చిష్యుణ్ణి రాముణ్ణి స్వయంగా వెతుక్కుంటూ వచ్చి వెంట తీసుకొని వెళ్ళి తల్లిదండ్రుల ప్రేమ, అనురాగం చూపించి, అన్నివిధాల ఆదరించి, బల, అతిబలవిద్యలను నేర్పి ఆకలిదప్పులను, నిద్రను జయించగలిగిన నిగ్రహాన్ని అనుగ్రహించి, సమస్త అస్త్రవిద్యలను శస్త్రవిద్యలను కరతలామలకం చేసి ఆయన్ను అనన్యసామాన్యంగా తీర్చిదిద్ది లోకకల్యాణానికి శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి. అయితే ఇదంతా జరగక ముందు ఆయన రాజసిక తామసిక శక్తి అధీనంలో ఉన్న ఒక సామాన్య రాజు. ఇంద్రియాలకు వశుడు. పరాశరుడు, వ్యాసుడు వంటి మహనీయులకు పితృ పితామహ స్థానంలో ఉన్న, సూర్య వంశీయుల కులగురువైన వశిష్ఠుడికి, బ్రహ్మవిద్యా ప్రతిస్పర్థి. అతను ఒకసారి తన వేయిమంది సైన్యంతో బ్రహ్మర్షి వశిష్ఠుని ఆశ్రమానికి వస్తాడు. ఒక సామాన్య ఋషి అయి ఉండి అంత పెద్ద సైన్యానికి మృష్టాన్న భోజనం పెట్టగలిగిన వశిష్ఠుడి సమర్థత ఆయన్ను ఆశ్చర్యపరుస్తుంది. అందుకు కారణం వశిష్ఠుడి ఆశ్రమంలో ఉన్న కామధేనువు సంతానం అయిన శబలగోవు బలం అని తెలుసుకుని ఆ గోవును తనకిమ్మని అడుగుతాడు. రాజునన్న దురహంకారంతో ఆ శబలకు మారుగా ఒకలక్ష గోవులను ఇస్తాను, అయినా రత్నాలన్నీ రాజుకే చెందుతాయని ఈ గోరత్నం పై అధికారం నాదేనని చెప్పి ఒప్పించాలని చూస్తాడు. ఎన్నో విలువైనవన్నీ ఇస్తాను అన్నివిధాలుగా ప్రలోభపెట్టినా లొంగక, ఆ ఆవు నా ప్రాణం, నా సర్వస్వం కాబట్టి నేనివ్వలేనన్న వశిష్ఠుడి మాట లెక్క చేయకుండా బలవంతంగా ఆ గోవును తరలిస్తుంటే, బ్రహ్మర్షి వశిష్ఠుడు నిస్సహాయంగా నిలిచిపోతాడు. తన దురవస్థకు దు:ఖిస్తూ ఆ ఆవు వశిష్ఠుడితో నిరపరాధిని అయిన నన్ను ఈయనకు వదిలివేసి ఎట్లా చూస్తూ ఊరుకున్నావని నిలదీస్తుంది. ఆ మాటకు ఖిన్నుడైన వశిష్ఠుడు తన అశక్తతను తెలియచేసి, ఆ గోవుతో "అతను ఈ దేశాకి రాజు. నేనతనిని ఏమనగలను, అతన్ని నేను ఏవిధంగానూ నిలువరించలేను, నిన్ను రక్షించలేను, నిన్ను నీవు రక్షించుకోవలసిందే" అని చెప్పి "బలగర్వంతో మత్తుడైన రాజు" నిన్ను తరలిస్తున్నాడు అంటూ తన బాధ తెలుపుకుంటాడు– **"ఏష త్వాం నయతే రాజా బలాన్మత్తో మహాబల్లబీ నహి తుల్యం బలం మహ్యం రాజా త్వద్య విశేషత:, బలీ రాజా క్షత్రియశ్చ పృథివ్యా పతిరేవ చ." (వాల్మీకి రామాయణం .బాలకాండ. 54. 10)**

బ్రహ్మర్షి మాటలకు ఆశ్చర్యపడిన శబల అంటుందికదా, ఓ బ్రహ్మర్షీ, నీ బ్రహ్మ బలం కన్నా క్షత్రియ బలం గొప్పది కాదు, నువ్వొక్కసారి నీ తేజస్సును కలిగిన నన్ను నియోగించు, అతడి దర్పాన్ని అణచివేస్తాను అని.

**"న బలం క్షత్రియస్యాహు: బ్రాహ్మణో బలవత్తర:, బ్రహ్మ బలం దివ్యం క్షత్రాత్తు బలవత్తరమ్. నియుంక్ష్వ మాం మహాభాగ త్వద్ బ్రహ్మ బల సంభృతామ్, తస్య దర్పబలం యత్తత్ నాశయామి దురాత్మన్ష" (వా. రా. బాలకాండ. 54. 15)** అప్పుడు ఆ శబల కోరిక మేరకు విశ్వామిత్ర సైన్యాన్ని అణచివేసే సైన్యాన్ని సృష్టించము వశిష్ఠుడు ఆ శబలకే ఆజ్ఞ చేస్తాడు. అంతే. ఆ శబల అంబా అన్న ఒక్క అరుపుతో వేల మంది సైన్యం పుట్టుకొచ్చి విశ్వామిత్ర సైన్యాన్ని క్షణంలో నాశనం చేసేస్తుంది. విశ్వామిత్రుడు, తన కోరిక తీరకపోగా జరిగిన అవమానాన్ని తట్టుకోలేక, శబలనెట్లయినా తోలుకుపోవాలన్న తమకం విజృంభిచడంతో, వశిష్ఠుడిపై పగ తీర్చుకోడానికి
కండబలం సరిపోదు అని తెలుసుకుని తపస్సుతో గెలవాలన్న ఆలోచనతో ఉత్తరదిశగా ప్రయాణించి, హిమాలయ పర్వత శ్రేణులదగ్గర తపస్సు మొదలు పెడతాడు. తీవ్ర తప:ప్రభావం వలన ప్రత్యక్షమై వచ్చిన దేవతలిచ్చిన వరాల అనుగ్రహంతో విద్యలన్నీ పట్టుబడతాయి కానీ సరైన అవగాహన లేక పోవడంతో అతనిలో అహంకారం దర్పం ఇంకొంచెం పెరుగుతాయే తప్ప తగ్గలేదు. **"ప్రాప్యచాస్త్రాణి రాజర్షి విశ్వామిత్రో మహాబల:, దర్పేణ మహతా యుక్తో దర్పపూరో: అభవత్ తదా" (వా.రా. బాలకాండ 55. 19.)** తన బలంతో వశిష్ఠుడు తన చేతిలో హతుడైనట్లే అని ఊహించుకుంటాడు. అంత కష్టపడి తపస్సు చేసీ , గర్వంతో కళ్ళు మూసుకుపోయి పగ ప్రతీకారాలకు వశుడై, వశిష్ఠుణ్ణి నాశనం చేయాలన్న తీవ్ర కోరికతో ఆయన ఆశ్రమాన్ని నిర్దాక్షిణ్యంగా తగలబెడతాడు. ఒక్క నిమిషంలో వశిష్ఠుడు ఎంతో ప్రాణప్రదంగా చూసుకుంటున్న అంత గొప్ప ఆశ్రమ వాతావరణం కాస్తా భయంకరంగా నిస్సారంగా మిగులుతుంది. దాంతో కోపించిన వశిష్ఠుడు, **"క్వచ క్షత్రియ బలం క్వచ బ్రహ్మబలం మహత్, పశ్య బ్రహ్మబలం దివ్యం మమ క్షత్రియ పాంసన" (వా.రా.బాలకాండ 56. 4)** అంటూ తన బ్రహ్మబలం గురించి బాహాటంగా చెప్పి మరీ బ్రహ్మదండంతో విశ్వామిత్రుడు ఆర్జించిన అర్థంలేని వినయం, నేర్పు విద్యలన్నిటినీ మట్టి కరిపిస్తాడు. వశిష్ఠుడి బ్రహ్మబలం ముందు వేల సంవత్సరాల శ్రమతో విశ్వామిత్రుడార్జించిన విద్యలన్నీ ఒక్క క్షణంలో నిష్ఫలమవుతాయి. తన వివేకరాహిత్యం కారణంగా తనకా దుస్థితి కలిగిందని తెలుసుకుంటాడు. ఛీ! నా ఈ క్షత్రియ బలం కూడా ఒక బలమేనా అని తను తనే ఛీత్కరించుకుంటాడు. **"ధిగ్బలం క్షత్రియ బలం బ్రహ్మ తేజోబలం బలమ్, ఏకేన బ్రహ్మ దండేన సర్వాస్త్రాణి హతాని మే" (వా.రా. బాలకాండ. 57.24)** అయినా బుద్ధిరాకపోగా అతనికిది మరింత కోపాన్ని అహంభావాన్ని కలిగిస్తుంది. ఆ అవమానం, సిగ్గు భరించలేక క్షత్రియ బలాన్ని ధిక్కరించిన బ్రహ్మబలం పొందాలని తిరిగి తపస్సులో కూచుంటాడు. ఇంద్రియజయం లేకపోయిన తర్వాత ఎంత గొప్ప విద్యలు కూడా నిరర్థకం అని తెలుసుకుని తిరిగి కొన్నివేల సంవత్సరాల తపస్సులో కాలం గడుపుతాడు. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై ఆయనకు రాజర్షిత్వాన్ని ప్రసాదిస్తాడు. ఆ తపోఫలం కూడా తనకు బ్రహ్మర్షిత్వం తెచ్చిపెట్టలేదని తెలుసుకుంటాడు. కానీ అహం అణగక వశిష్ఠుడు కాదన్న త్రిశంకుకు స్వర్గం సృష్టించి ఇవ్వగలనన్న దర్పంతో మొదలుపెట్టిన పని సాకారం కాకపోవడంతో అటు త్రిశంకుణ్ణి మధ్యలో వదిలివేయలేక, అతనికై స్వర్గం కాని స్వర్గం సృష్టించడంలో కొంత తపశ్శక్తి కరిగిపోగా, అణగని అహంకారంతో దక్షిణ దిశగా ప్రయాణం చేసి అక్కడ తీవ్ర తపస్సు చేస్తాడు. అక్కడ ఇంకొకసారి శునశ్శేపుడికి సహాయం చేసిన కారణంగా కూడబెట్టుకున్న తపోఫలం కరిగిపోగా పశ్చిమదిశగా ప్రయాణించి తపస్సు కొనసాగిస్తాడు.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** **సంపుటి -27 : సంచిక - 6 (2)** **హైదరాబాద్** **ఏప్రిల్ - 2024**

అదీ బ్రహ్మత్వానికి సరిపోదని తెలిసి తిరిగి తపస్సులో కూచున్న విశ్వామిత్రుడికి మరొక విఘ్నం మేనక రూపంలో ప్రత్యక్షమవుతుంది. ఒక పది సంవత్సరాలు ఆమె సాంగత్యంలో కుటుంబసౌఖ్యంలో గడిచిపోయాక తన బలహీనత తెలుసుకుని తన తెలివిహీనతకు దు:ఖించి ఇంద్రియాలను జయించలేకపోయినందుకు సిగ్గుపడి, అమిత నిష్ఠతో మళ్ళకసారి ఉత్తర పర్వతాలను చేరి తపస్సు చేసి మహర్షిత్వం పొందుతాడు. అది కూడా బ్రహ్మపదం తెచ్చిపెట్టలేదని తెలుసుకుని తూర్పు దిక్కున చేరి మహోగ్రతపం చేసి లోకాలన్నిటినీ గడగడలాడిస్తాడు. తపోభంగం కలిగించడానికి ఇంద్రుడు పంపిన రంభను కోపంలో శపిస్తాడు, అట్లా కేవలం తన క్రోధం కారణంగా ఆర్జించిన తపస్సు క్షీణిస్తుంది. **"ఇంద్రియై: అజితై: న లేభే శాంతిమాత్మన:".** ఇంద్రియ లౌల్యం తెచ్చిపెట్టిన అశాంతితో తన అరిషడ్వర్గాలనే తను జయింపకపోవడంవలన తపస్సు సిద్ధించలేదు, ఎన్ని దిక్కులకు తిరిగినా లాభం లేదనీ, అంతర్ముఖుడై తనంతట తను తన బలహీనతలను తెలుసుకుని, తిరిగి ఎప్పుడూ అరిషడ్వర్గాల దాడికి అవకాశమీయనని గట్టిగా నిర్ణయించుకుని 'ఆలోచనాశీలినై ఇంద్రియ జయం సమకూర్చుకుంటాను', **"నై వ క్రోధం గమిష్యామి, అహం విశోషయిష్యామి ఆత్మానం విజితేంద్రియ:" (వా.రా. బాలకాండ. 65. 17-18)** అని ప్రతిజ్ఞ చేసుకుని తన శక్తిని కేంద్రీకరించి తూర్పు దిక్కుచేరి తపస్సుచేయడానికి సంసిద్ధుడవుతాడు. తిండి నిద్ర మాని ఊపిరి స్థంభింపచేసి శరీరాన్ని శుష్కింపచేసి లోకంలో కనివిని ఎరగని విధంగా తీవ్ర తపస్సు చేస్తాడు. ఎన్నో విఘ్నాలను తట్టుకుని వేయి సంవత్సరాల తపస్సు చేసిన తర్వాత కామక్రోధ జయం పొందిన కారణంగా తృప్తిపడి వ్రతసమాప్తికోసం భోజనం చేద్దామని సంకల్పించిన సమయంలో పరీక్షిద్దామని ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి భిక్ష కోరతాడు. మౌనవ్రతంలో ఉన్న విశ్వామిత్రుడు మాట మాట్లాడకుండా ఆ సిద్ధాన్నాన్ని ఇంద్రుడికి ఇచ్చివేసి తను నిరాహారియై ఉంటాడు. తిరిగి వేయి సంవత్సరాల తపస్సు చేసుకున్న తర్వాత, ఆయన తలనుండి అగ్ని పెల్లుబుకుతుంది. ఆ అగ్నికి లోకాలన్నీ తగలబడి పోవడం చూసి దేవతలందరూ బ్రహ్మదేవుడితో మొరపెట్టుకోగా, ఆ దేవతలనందరినీ వెంట పెట్టుకుని బ్రహ్మ విశ్వామిత్రుడి దగ్గరకు వచ్చి బ్రహ్మర్షీ అని సంబోధించి దీర్ఘాయువును ప్రసాదించి తపస్సు చాలించమంటాడు. సంతోషించిన విశ్వామిత్రుడు తనకు బ్రహ్మర్షిత్వంతో పాటుగా ఓంకారాన్ని వషట్కారాన్ని కూడా ప్రసాదించి యజ్ఞకర్తగా అధికారాన్ని అర్హతని అర్థించి, వశిష్ఠుడు కూడా తనను బ్రహ్మర్షిగా ఆమోదించేట్లు అనుగ్రహించమని కోరుకుంటాడు. దేవతల అనుగ్రహం కారణంగా వశిష్ఠుడు కూడ ప్రసన్నుడయి విశ్వామిత్రుడిని అభినందించి అతనితో సఖ్యం చేస్తాడు. **"సఖ్యం చకార బ్రహ్మర్షి: ఏవమస్త్వితి చాబ్రవీత్. బ్రహ్మర్షిత్వం న సందేహ: సర్వం సంపత్స్యతే తవ." (వా.రా. బాలకాండ. 65. 25)** నిజానికి విశ్వామిత్రుడికి స్పర్థ కల్పించి ఆయన బ్రహ్మత్వం పొందేవరకు అతన్ని రెచ్చగొట్టి మరీ అవిశ్రాంతంగా తపస్సు చేయడానికి ప్రోత్సహించిన వశిష్ఠుడు అభినందనీయుడు. వశిష్ఠుని నిర్దాక్షిణ్యం వెనక ఉన్న కారణం విశ్వామిత్రుడిని బ్రహ్మర్షిగా చూడవలెనన్న కోరిక. భావితరాలకు విద్యనందించే సద్గురువును సంసిద్ధుణ్ని చేయాలన్న సంకల్పం, సమస్త వేదాలు వేదాంగాలు, వేదాంతం, ఇట్లా ఒకటేమిటి పధ్నాలుగు విద్యలూ కరతలామలకం చేసాడు ఆ బ్రహ్మర్షి శిష్యుడికి. ఆయనకే కాదు, ఆయన శిక్షణలో రామలక్ష్మణ భరతశత్రుఘ్నులందరూ సర్వవిద్యా పారంగతులవుతారు.

**"సర్వే వేదవిద: శూరా:, సర్వే లోకహితే రతా:, సర్వే జ్ఞానోపసంపన్నా: సర్వే సముదితా గుణై:"** అని పేరు పొందారు అన్నదమ్ములందరూ.

ఆ ప్రోత్సాహంతోనే విశ్వామిత్రుడు అభ్యుదయము నిశ్శ్రేయసము అయిన ద్వివిధ ధర్మం తెలుసుకుని, పాటించి, **"ఏష విగ్రహవాన్ తప:, ఏష విగ్రహవాన్ ధర్మ"** అనీ, మునిశ్రేష్ఠుడనీ, ధర్మతత్పరుడనీ కీర్తించబడి, తనకూ లోకానికీ కూడ తన ధర్మపరాయణత్వంతో మేలుచేసి కల్యాణ కారకమవుతాడు విశ్వామిత్రుడు . అమోఘమైన తపస్సు కారణంగానే అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకోగలిగిన ఇంద్రియ నిగ్రహం అలవడుతుందని స్వయంగా నేర్చి కామక్రోధాలను జయించటం మహా కష్టం అని తెలివి తెచ్చుకుని అవి జయించినవాడే బ్రహ్మజ్ఞాని అని నిరూపించిన బ్రహ్మర్షి విశ్వామిత్రుడు, బ్రహ్మ జ్ఞానం పొందడం అంత సులభం కాదు అనీ, నలుగురికీ మంచి చేసే కండబలం విద్యాబలం, బ్రహ్మ బలం తెలుసుకున్న తర్వాతనే విలువలు సంతరించుకుంటాయని తెలుసుకుని, వ్యక్తిగా కాక నలుగురి క్షేమం కోరుకుంటూ, సమిష్టిగా ఎదగడంలోనే గొప్పతనం ఉందని, బ్రహ్మర్షిత్వం అంటే అదేనని తెలుసుకుని, అసాధారణమైన కృషితో అహం, మమలను జయించి తను ఆర్జించిన తపస్సును లోకహితం కోసం ధారపోసి, ధర్మానికి ప్రతీకగా నిలిచినందునే బ్రహ్మర్షి విశ్వామిత్రుడు రాముణ్ణి శిష్యుడిగా చేసుకుని తన విద్యలన్నీ ధారపోసి లోకకల్యాణంకోసం, అంతే ధర్మ సంవర్ధిని, దనుజసంమర్దిని అయిన సీతను రాముడి సహధర్మచారిణిగా చేసి, ఆయన్ను తనంతటి ధర్మమూర్తిగా తీర్చిదిద్దగలిగి ఆచార్యత్వం యొక్క మహత్వాన్ని లోకానికి చాటగలిగాడు. ఆ ఆచార్యత్వం పొందటానికి అవసరమైన సత్వగుణాన్ని కొన్నివేల సంవత్సరాల తపస్సుతో సాధించుకున్నాడు. అటువంటి సత్వగుణ సంపన్నులైన సద్గురువులే ఈనాటి అవసరం. నిర్మలమైన, సాత్వికమైన, స్వచ్ఛమైన, ప్రసన్నమైన గురువు సాన్నిధ్యంలో నేర్చుకున్న సమస్త అస్త్రవిద్య శస్త్ర విద్యలు తనకోసం కాక సమాజ స్వస్థతకు సమసమాజ స్థాపనకు సర్వప్రాణుల పరిరక్షణకోసం వినియోగం చేయడమెట్లాగో రాముడికి నేర్పిన మహోన్నత వ్యక్తిత్వం విశ్వామిత్రుడిది. రాజర్షిగా మిగిలిపోకుండా, తామస, రాజస గుణాల నధిగమించి, సత్వగుణసంపన్నుడై సర్వ మానవాళికి ఆదర్శమై నిలిచి, సతతం లోకకల్యాణంకోసం పాటుపడే విధంగా ఒక సచ్ఛిష్యుణ్ణి ,తనంతటి శిష్యుణ్ణి, ఒక సత్పురుషుణ్ణి, ఒక ఆదర్శ ప్రజాప్రతిధిని, ఒక మహోన్నతవ్యక్తిని రాముని తీర్చిదిద్దిన విశ్వామిత్రుడి పాత్ర అమోఘం. వాల్మీకి రామాయణంలో గురువు విశ్వామిత్రుడి పాత్రయొక్క చిత్రీకరణం అసామాన్యం. ప్రతి ప్రాణిలోను ఉంటాయి అని మనం చెప్పుకుంటున్న ఈ మూడు సత్వరజస్తమో గుణాలు ఒక్కొక్క ప్రాణిలో ఒక్కో గుణం ప్రధానంగా ఉంటూ ఉంటాయి. మిగతా రెండు గుణాలను అణచిపెట్టి ఉంటాయి. అయితే ఈ ప్రమాదాన్ని గమనించిన మనిషి జాగ్రత్తపడి ఎక్కువగా ఉండి తనను అధోగతికి తోస్తున్న తమస్సును తొక్కిపెట్టి ప్రయత్నపూర్వకంగా రజస్సును అందుకుంటాడు. అట్లాగే రజస్సును అధిగమించి సత్వాన్ని పొందడానికి అహరహం శ్రమించి ఒక జీవితకాలం సాధన చేస్తాడు. బలవంతంగా అణచిపెట్టడం కాకుండ ,తనను బంధిస్తున్న తమస్సును రజస్సును సత్వబలంతో జయిస్తాడు. కనపడీ కనపడకుండా తనలోపల దాగి ఉన్న చెడుపై వెలుగును ప్రసరింపచేసి, జ్ఞానంతో కడిగేస్తాడు. వివేకమనే కత్తి ఝళిపించి అహంకారం మమకారం మొదలైన ప్రతికూల ధోరణులను ఖండిస్తాడు. మనిషిగా పుట్టినందుకు సాఫల్యత పొందడానికి ఇది మొదటి మెట్టు.

వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తి ప్రాధాన్యత మాత్రమే రాజ్యమేలుతున్న ప్రస్తుత సమాజంలో సమష్టి భావన దూరమవుతున్నది. విశ్వమంతా అహంతో నిండిపోతున్నది. కుటుంబ బాంధవ్యాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. అన్ని రంగాలలో, అన్ని క్షేత్రాలలో జరుగుతున్న ఇంత అరాచకం, అన్యాయం, అక్రమం, అధర్మం, విధ్వంసం ఈ మితిమీరిన తామసిక రాజసిక ప్రవృత్తులు కల మనుషుల మూలాన్నే. అందుకే త్రిగుణాత్మకమైన, అందునా తమస్సు అధికంగా ఉన్న మన మనోవృత్తులను అదుపుచేసుకుని, రజస్సులోకి ఎదిగి, క్రమంగా ఆ లక్షణాన్ని కూడా అధిగమించి, ప్రేయస్సు కోసం కాకుండ నలుగురి శ్రేయస్సుకు దోహదకారి అయిన సత్వగుణాన్ని అందుకోగలిగితే సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. ఏకాదశ ఇంద్రియ జయంతో సాధ్యం చేసుకోవలసిన స్వస్థత భద్రత ప్రభుతకు ప్రధాన కారణం సత్వసంశుద్ధి. అది మన గురువుల చేతుల్లోనే ఉంది. వశిష్ఠుడు ఇచ్చిన ప్రేరేపణతో, అతను కలిగించిన స్పర్థతో **"స్పర్థయా వర్థతే విద్యా"** అని కదా నానుడి విశ్వామిత్రుడు ఆత్మబలం బ్రహ్మబలం సంపాదిస్తే, విశ్వామిత్రుడి ఇచ్చిన చేయూతతో విద్యల పరమార్థం తెలుసుకుని ఆ విద్యలకు సార్థకత కలిగించి రాముడు ఆదర్శ పాలకుడుగా నిలిచి సామాన్య ప్రజల మన్ననలు పొంది, శాశ్వతంగా ప్రజల నాయకుడిగా నిలిచిపోయాడు. దానికి కారణం విశ్వామిత్రుడి వంటి గురువులు.

వ్యాసుడు భగవానుడి మాటగా చెప్తున్నాడు-గుణత్రయ విభాగయోగంలో **"సత్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ । ప్రమాద మోహౌ తమసో భవతో అజ్ఞానమేవ చ ॥"** అని. బహుశా వాల్మీకి మహర్షి చిత్రించిన పాత్రల పరిశీలనమే ఈ వాక్కులకు ప్రేరణ ఏమో!

## ఉపయుక్త గ్రంథ సూచి


1. శ్రీమద్ రామాయణం. వాల్మీకి. గీతాప్రెస్, గోరఖ్ పూర్ , 2010
2. అధ్యాత్మ రామాయణం. వ్యాసమహర్షి. గీతాప్రెస్, గోరఖ్ పూర్ ,2010
3. రామాయణ కల్పవృక్షం, విశ్వనాథ సత్యనారాయణ. పావని సేవా సమితి, 2015
4. రామాయణ సర్వస్వము" వ్యాససంపుటి 1985. సంపాదకులు దివాకర్ల వేంకటావధాని, పుల్లెల శ్రీరామచంద్రుడు, చి.వెం. సుబ్రహ్మణ్యం. సంస్కృత భాషా ప్రచార సమితి.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# ధర్మరాజు త్రిగుణములు

**డా. రాపోలు శ్రీనివాస్,**
అసోసియేట్ ప్రొఫెసర్,
తారా ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర),
సంగారెడ్డి,

సత్వ–రజో–తమో గుణములు సృష్టిలో ప్రతి జీవిలోను, పదార్థంలోనూ మిళితమై ఉంటాయి. ఒక్కో జీవి నిర్మాణాన్ని బట్టి ఈ గుణాలు వేర్వేరు పాళ్ళల్లో ఉంటాయి. పరిస్థితులను బట్టి ఒకోసారి సత్త్వగుణమూ మరోసారి రజోగుణమూ ఇంకోసారి తమో గుణమూ ఆధిక్యంలో ఉంటాయి. శరీర, పరిసర పరిస్థితులను అనుసరించి ఈ త్రిగుణాలలో ఏదో ఒక గుణము వృద్ధి చెందుతూ ఉంటుంది. రజస్తమోగుణాలను అణచి సత్త్వగుణము వృద్ధిచెందుతుంది. అదే విధంగా సత్త్వ తమోగుణాలను అణచి రజోగుణము, సత్త్వరజోగుణాలను అణచి తమోగుణము వృద్ధి చెందుతుంది. సత్త్వ గుణము నుండి జ్ఞానము పెంపొందుతుంది. రజో గుణము నుండి లోభము, తమో గుణం నుండి బుద్ధిహీనత, మోహము, అజ్ఞానము ఉత్పన్నమగును. అనగా సత్త్వగుణమంటే జ్ఞానశీలతగాను, రజోగుణాన్ని క్రియాశీలతగాను, తమోగుణాన్ని స్థితిశీలతగాను చెప్పవచ్చు.

**తమో గుణము:** నిస్తేజం, సోమరితనం, బుద్ధిహీనత, మోహం వృద్ధినొందగా తమో గుణము వ్యక్తమవుతుంది. విషయాసక్తుల మీద కాంక్ష బలపడి, ఇంద్రియములను ఆశ్రయిస్తే అది తమోగుణము అవుతుంది. 'శరీరమే నేను' అనుకొనుట తమోగుణ లక్షణము. అంటే **'ఒక పనిని ఆచరించక, ఒక వస్తువును పొందక నేనుండలేను'** అనే మోహముతో జీవిస్తూ ఉంటాడు. ఉదాహరణకు తనకు ఇష్టమైన బజ్జీలు తింటే ఆరోగ్యానికి హాని కలుగుతుందని చెప్పినా బజ్జీల బండి కనబడితే ఆగకుండా ఉన్నట్లయితే అప్పుడు తమోగుణ పరిధిలో ఉన్నట్లు. చెప్పుడు మాటలు వింటూ, మనసును గందరగోళం చేసుకొంటారు. ఈ గుణం ప్రమాదకరమైంది. దీనివల్ల మంచి చెడుగాను, చెడు మంచిగాను తోస్తూంటుంది. తొందరగా వ్యసనపరుడవుతాడు. ఆధ్యాత్మిక చింతన కాని, ప్రాపంచిక విషయాలుకాని చెవికి ఎక్కవు. వీరు చెడిపోవడమేకాక, ఇతరులను కూడా పాడు చేస్తారు. అజ్ఞానంతో వ్యవహరిస్తూ తర్వాత చింతిస్తుంటారు. తినడానికి బాగా ముందు వండినవి, రుచిలేనివి, చెడు వాసన కలిగి కుళ్ళినట్టివి, వేరొకరు తిని వదిలినవి, నిషిద్ధ పదార్థాలు తమోగుణం ఎక్కువగా ఉన్నవారికి ఇష్టం.

**రజో గుణము:** లోభము, అణచలేని కోరిక, పనుల ప్రయత్నము, క్రియాశీలత్వము అధికమైనపుడు రజోగుణము వృద్ధినొందును. విషయము మీద కాంక్ష ఉండి, అది మనస్సును ఆశ్రయిస్తే అది రజోగుణము అని చెప్పవచ్చు. **'మనస్సు నేను'** అనుట రజోగుణ లక్షణము. రజోగుణముతో వ్యవహరించే వాడు మనో పరిధిలో ఉంటాడు. **'నా సుఖమే నాకు ప్రధానం, ఎదుటివాడు ఏమైపోయినా నాకు సంబంధం లేదు'** అంటాడు.

స్వార్థపూరితమైన అహంకారముతో వ్యవహరిస్తూ ఉంటాడు. ఉదాహరణకు 'బస్సులో కొద్దిగా నువ్వు సర్దుకో, అతను చాలాసేపటి నుండి నుంచొని ఉన్నాడు, ఇబ్బంది పడుతున్నాడు' అని ఎవరైనా అంటే, రజోగుణములో ఉన్నవాడు "నేను సర్దుకోను. నేను సర్దుకుంటే నాకు ఇబ్బంది" అంటాడు. ఈ గుణంతో ఉన్నప్పుడు ఉద్రేకంగా వ్యవహరిస్తారు. ఎక్కువగా ప్రేమ-అభిమానం-ఆశలతో ఉంటారు. అహంకారపు ఛాయలతో ఆశాపాశం, మోహావేశులై ఉంటారు. మనస్సునందు ఆశలు ఏర్పడి, వాటి సాధనకు ఎటువంటి కర్మలనైనా చేయాలని ఆసక్తి కలిగి ఉంటారు. చేదు, పులుపు, ఉప్పు, కారం రుచులు, మిక్కిలి వేడిగా ఉన్నట్టివి, ఎండినవి, మంట కలిగించునట్టి ఆహారములు రజోగుణము ఎక్కువగా ఉన్నవారికి ఇష్టము. అవి దు:ఖము, చింత, రోగములు కలిగించును. ధర్మాధర్మాలను, చేయదగనిది, చేయవలసిన దానిని సరిగా తెలుసుకోలేని బుద్ధిని రాజసబుద్ధి అంటారు. ఇంద్రియార్థములు ఇంద్రియములతో కలియుట వలన కలుగు సుఖము మొదట అమృతముతో సమానముగాను, చివరికి విషమువలె ఉంటాయి. అట్టి సుఖము రజోగుణముతో కూడినదని భావింపబడుతుంది.

**సత్వ గుణము:** ఎప్పుడు మనిషి చేసే పనులన్నీ జ్ఞానంతో తేజోవంతమై ఉంటాయో అప్పుడు సత్వగుణము వృద్ధినొంది ఉన్నట్లుగా చెప్పబడింది. ఈ గుణం నిర్మలమైనది, ఆరోగ్యవంతమైనది. సత్వగుణోపేతులు జ్ఞానము నందు, సుఖమునందు అనురాగం కలిగి ఉంటారు. దీనివల్ల మనుషులను ఆకర్షించ గలుగుతున్నారు. మనసులో ఏ రకమైన కల్మషం ఉండదు. భగవతత్త్వానికి, మోక్ష సాధనకు ఆరాటపడుతుంటారు. తన-పర అనే తేడా లేకుండానే పరులకు సహాయం అందిస్తారు. స్వార్థ రహితులు. ఆయువు, బుద్ధి, బలము, ఆరోగ్యము, సుఖము, ప్రీతిని వృద్ధిపరుచునట్టి రసవంతరములు, పుష్టికరము, దృఢము, మన్న ప్రీతిని కలిగించు ఆహారములు సత్వగుణ మధికముగా ఉన్నవారికి ఇష్టమైనవి. చేయవలసినది, చేయరానిది, చేయుట, చేయలేకపోవుట, భయము, నిర్భయము, బంధ మోక్షాన్ని తెలుసుకొనేది సాత్విక బుద్ధి. విషయము మీద కాంక్ష లేకుండా, 'బుద్ధిని నేను' అని అంటే అది సత్వ గుణము అనబడుతుంది. సత్వగుణముతో వ్యవహరించే వాడు బుద్ధి పరిధిలో ఉంటాడు. సత్వగుణముతో జీవించే వాడిలో త్యాగబుద్ధి ఉంటుంది. మంచి లక్షణాలను ఎన్నింటిని పేర్కొంటామో అవన్నీ సత్వగుణము క్రిందకే వస్తాయి. సహనం, శాంతం, ఓర్పు, దయ సానుభూతి, సహాయం, సేవ, సత్యం, ధర్మం, అహింస, ప్రేమ మొదలగు లక్షణాలన్నీ సత్వగుణమునకు సంబంధించినవే.

తమో, రజోగుణములను ఆశ్రయించి ప్రవర్తించినచో ఆచరణలో ప్రత్యేకత లేక విశేషత ఉంటుంది. వీరు **'నాకు ఇదే కావాలి, ఫలానా సమయమునకు కావాలి, నాకు ఇలా ఉంటేనే సుఖముగా ఉంటాను'** అని ప్రత్యేకతలతో కూడిన జీవితమును కోరుకుంటారు. ప్రత్యేకత లేక విశేషతయే బలహీనత. ఆయా విషయములలో ప్రత్యేకత దేనివలన కలుగుచున్నదో గుర్తించి, దానికి వ్యతిరేకమైన ఆచరణ చేయుట ద్వారా దానిని సామాన్యము చేసిప్పుడు దానిని వెంటనే అధిగమించ గలుగుతాము. గుణములను మార్పు చేసికొనుట అంటే ఇదే. గుణములను మార్పు చేసికొని వాటిని అధిగమించుట అనునది నిత్యము, జీవిత పర్యంతము జరుగవలసిన నిరంతర ధ్యానము.

ఈ విధమైన సాధన చేయుచున్న వారికి సృష్టిలోని ప్రతి జీవి సహాయకారియే అవుతుంది. ఎదుటివారి గుణములతో కూడిన ప్రవర్తన తనలోని లోపములను సరిదిద్దుకొనుటకు, సత్త్వ గుణమును అభివృద్ధి పరచుకొనుటకు సహాయకారి అవుతాయి.

**ధర్మరాజులో త్రిగుణాలు:** పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తిచేసిన తరువాత తమ రాజ్యం తిరిగి పొందడానికి ద్రుపదుడు తన పురోహితుని కౌరవసభకు పంపాడు. దానికి సమాధానంగా ధృతరాష్ట్రుడు సంజయుని రాయబారిగా పంపాడు. సంజయుడు పాండవులు శాంతికాముకులని, యుద్ధం చేసి తన బంధువులను, స్నేహితులను వధించి ఫలితంగా లభించిన రక్తపుకూడు భుజింపవలసిన అవసరం లేదని తీయగా మాట్లాడి వెళ్తాడు. అప్పుడు ధర్మరాజు తన సోదరులు, ద్రౌపది, పరిజనంతో వచ్చి శ్రీకృష్ణుని కౌరవ సభకు రాయబారిగా వెళ్ళమని ప్రార్థిస్తాడు. ఈ సందర్భంలో ధర్మరాజు పలుకులలో త్రిగుణాలు వ్యక్తమవుతున్నాయి.

"మహానుభావా! మాకు కష్టాలను తొలగించి, శుభాలను కలిగించడానికి మా తండ్రి పాండురాజు మాకు దిక్కుగా నిన్ను చూపి వెళ్ళాడు. ఈ కార్యం చక్కబెట్టినట్లయితే దుర్యోధనునితో యుద్ధం చేయవలసిన అవసరం లేకుండా మా రాజ్యభాగాన్ని మేము పొందగలం. నీ కుమారులుగా మమ్ము భావించి మాకు పాపములు కలుగకుండా కాపాడుము. మా పెదతండ్రి ధృతరాష్ట్రుడు పుత్రునిపైగల దురభిమానం వల్ల దుర్యోధనుని స్వభావం తెలిసికూడా అతనిని వారించలేకుండా ఉన్నాడు. మా తల్లి, బంధువులు అందరూ సంతోషించేటట్లు యుద్ధం జరగకుండా రాజ్యభాగం మేము పొందలేకపోవడం మా పౌరుష లక్షణం కాదు.

నిన్న బంధువులు, నీవు అందరు ఆశ్చర్యపడునట్లు మా ఐదుగురికి ఐదూళ్ళు ఇచ్చినా చాలునని సంజయుని కోరాను. నన్ను నమ్ముకొని ఆశ్రయించిన వారికి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ కల్పించవలసిన బాధ్యత నాపై ఉంది. అందుకే ఐదూళ్ళు అడిగాను. కాని దుర్యోధనుడు దానికి కూడా ఒప్పుకోడేమో. కౌరవపక్షంలో మిత్రులు, బంధువులు, కావలసినవారు ఎందరో ఉన్నారు. రాజ్యం కోసం వారిని చంపి పాపం మూటకట్టుకోలేను. క్షత్రధర్మం ఇంత కష్టంగా ఉన్నప్పటికిని అన్య ధర్మం ఆచరింపదగదు. అయినను రాజ్యం కోసం వంశనాశనం నాకు సమ్మతంకాదు. యుద్ధం వల్ల సంపదలు ప్రాప్తిస్తాయి, ప్రాణహాని జరుగుతుంది. విజయం వరిస్తుందనే నమ్మకం లేదు. అపజయం కలిగితే అది మరణం కంటే ఎక్కువగా బాధిస్తుంది. కాబట్టి ఎవరైతే ఉపాయంతో యుద్ధం లేకుండా సమస్యను పరిష్కరించుకోగలడో అతడే నిశ్చింతగా ఉండగలడు. పగవల్ల ప్రశాంతంగా జీవించలేము. పగవల్ల ఎంతటి అరాచకానికైనా పాల్పడతారు. కావున శాంతిని మాత్రమే మేము కోరుకుంటున్నాము. యుద్ధం జరగకుండా మా రాజ్యసంపదను మాకు ఇప్పించుము.

కృష్ణా! మా విషయంలో పక్షపాతం చూపకుండా, ధర్మం, నీతికి కట్టుబడి ఇరుపక్షాలకు మేలు కలిగించు. సభలోని పెద్దలు సంతోషించునట్లుగా సందర్భానికి తగినట్లుగా మాట్లాడి కార్యం చక్కబెట్టు. దుర్యోధనుడు పరుషంగా పలికినా సహించి, పెద్దలు చెప్పినను వినడంలేదనే నింద అతనిపైనే ఉండనివ్వు. మేము పెద్దల మాటకు అనుగుణంగా ప్రవర్తించినచో జనులు ఈ విషయం గ్రహిస్తారు. అయినను ధృతరాష్ట్రుడు అవినీతికి

పాల్పడినచో పాండవులు ధర్మానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించమని" శ్రీకృష్ణుని ధర్మరాజు ప్రార్థిస్తాడు.

**సత్వగుణం:** పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలు అనుభవించిన తరువాత కూడా తమ రాజ్యభాగం తమకు ఇవ్వకుండా ప్రవర్తించడంపై ఆగ్రహం చెందకుండా శాంతియుతంగా వ్యవహరించడం సత్త్వగుణ లక్షణం. శ్రీకృష్ణుని పితృసమానునిగా, దైవంగా భావించడం ధర్మజుని వినయాన్ని, వినమ్రతను, అణకువను సూచిస్తున్నాయి. యుద్ధం చేసి రాజ్యాన్ని పొందగల శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికిని యుద్ధం జరగకుండా రాజ్యభాగం పొందడానికి ప్రయత్నించడం ధర్మజుని శాంతికాముకతను తెలియజేస్తుంది. యుద్ధం, రాజ్యసంపద రెండు విరుద్ధమైనవి. యుద్ధం లేకుండా రాజ్యం పొందడం అసంభవం. అయినా పగవల్ల కీడేగానీ, మేలు జరగదనీ, శాంతి నశిస్తుందని, హింసకు పాల్పడవలసి వస్తుందని గ్రహించిన విజ్ఞుడు ధర్మరాజు.

కౌరవసభలో తమ పెదతండ్రి ధృతరాష్ట్రుడు మితిమీరిన పుత్రవాత్సల్యంతో దుర్యోధనునికి అడ్డు చెప్పకపోవచ్చునని దూరదృష్టితో గ్రహిస్తాడు. దుర్యోధనుడు పెద్దల ముందు అనుచితంగా ప్రవర్తించినా తొందరపడకూడదని, ధర్మం తప్పి వ్యవవహరిస్తున్నాడనే నింద అతనిపైనే ఉండనివ్వమని, తాము మాత్రం ధర్మానికి కట్టుబడి ఉన్నట్లుగా సభలోని పెద్దలు గ్రహించునట్లు చేయుమని శ్రీకృష్ణునితో పలకడంలో ధర్మం పట్ల ధర్మరాజుకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. తమపట్ల పక్షపాతంతో వ్యవహరించకూడదని, ఇరుపక్షాలకు మేలును, హితాన్ని కలిగించమని కృష్ణుని కోరడం వల్ల ధర్మజుని నిజాయితీ, సమభావం వ్యక్తమవుతున్నాయి. ఇలా శాంతి, ధర్మం, న్యాయం, సమభావం, నిజాయితీ, అహింస వంటి సత్వగుణాలు అధికంగా ధర్మరాజులో వ్యక్తమవుతున్నాయి.

**రజోగుణం:** రాజ్యాన్ని పొందడం, రాజసుఖాలు, భోగాలు అనుభవించడం, కీర్తిప్రతిష్టలు, సంపదలు పొందాలనుకోవడం రజోగుణ లక్షణం. పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలు అనుభవించిన తరువాత తమ రాజ్యభాగాన్ని పొందడానికి ప్రయత్నించడం, ద్రుపద పురోహితునితోనూ, శ్రీకృష్ణునితో రాయభారం జరపడం రజోగుణం అవుతుంది. ధర్మరాజు సంజయునితో తమకు ఐదూళ్ళిచ్చినను చాలునని అంటాడు. తనను ఆశ్రయించిన వారిని పోషించడానికి ఐదూళ్ళు ఇవ్వమని కోరడంలో కీర్తికాంక్ష వ్యక్తమవుతుంది. క్షత్రధర్మం కష్టమైనప్పటికిని అన్య ధర్మం ఆచరించడం తగదని, క్షత్రియునిగా తనను ఆశ్రయించిన వారికి కనీసావసరాలు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తాడు. అందుకోసం రాజ్యభాగాన్ని కోరడం రజోగుణం అవుతుంది. ఈ రజోగుణం వల్లనే కురుక్షేత్ర యుద్ధం సంభవిస్తుంది. కౌరవసభలో పాండవులు పెద్దల నిర్ణయాలకు అనుగుణంగా ప్రవర్తస్తున్నారని, దుర్యోధనుడు పెద్దలమాట వినడం లేదనే నింద అతనిపైనే వేయాలని శ్రీకృష్ణుని కోరడంలో ధర్మరాజు స్వార్థం, కీర్తికాంక్ష సూచిస్తుంది. ఈ విధంగా ధర్మరాజులో స్వార్థం, రాజ్యకాంక్ష, కీర్తికాంక్ష మొదలగునవి రజోగుణాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

**తమో గుణం:** పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలు అనుభవించడానికి, రాజ్యం కోల్పోవడానికి ప్రధానకారణం ధర్మజుని జూదం. వ్యసనపరుడైన ధర్మజుడు విచక్షణను కోల్పోయి ప్రవర్తిస్తాడు. జూద వ్యసనం వల్లనే ధర్మజుడు తన రాజ్యాన్ని, సోదరులను, చివరికి తమ భార్య అయిన ద్రౌపదిని కూడా ఫణంగా పెట్టి ఓడిపోతాడు. తను చేస్తున్నపని ఉచితమైనదా, కాదా అనే ఆలోచన లేకుండా ప్రవర్తిస్తాడు. ఈ విధంగా వ్యసనపరుడై అజ్ఞానిగా

ప్రవర్తించడం తమోగుణ లక్షణం.

ధర్మరాజులో సత్త్వ, రజో, తమో గుణాలు ఉన్నప్పటికిని సత్త్వగుణం అధికంగానూ, రజో గుణం తక్కువగానూ, తమోగుణం మరికొంత తక్కువగానూ ఉండడం వల్ల సత్త్వగుణ సంపన్నుడు అయినాడు. ఈ విధంగా త్రిగుణాత్మకమైన మానవులు తమలో ఉన్న గుణాల పట్ల అవగాహనతో గుణాల మర్పిడితో తమో గుణాన్ని తగ్గించుకుంటూ, సత్వగుణాన్ని పెంపొందించుకుంటూ ఉన్నట్లయితే లోక కల్యాణం జరుగుతుంది.

## ఆధార గ్రంథాలు

1. స్వామి నిర్వికల్పానంద, శ్రీమద్భగవద్గీత, గుణత్రయవిభాగ యోగం, పదచ్ఛేద టీకా తాత్పర్యసహితం, ప్రచురణ: రామకృష్ణమఠం, దోమలగూడ, హైదరాబాదు-500 029.
2. అంతర్జాల వ్యాసాలు: మూడు గుణాలు, స్వామి శివానంద.

# త్రిగుణాలలో సత్వగుణ వైశిష్ట్యము

**డా. ఎన్.మల్లికార్జున,**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
చంచల్‌గూడ, హైదరాబాదు.

రజోగుణం, తమో గుణం సత్వ గుణం అనే మూడు గుణములు హిందూ ధర్మ శాస్త్రములో ప్రధాన గుణములుగా పేర్కొనబడినవి. రజోగుణం వల్ల కోరికలు, ప్రాపంచిక అభ్యున్నతి కోసం తృష్ణ జనిస్తాయి. తమోగుణం వల్ల అజాగ్రత్త, అవివేకం, మరపు, పరాకు మొదలైనవి కలుగుతాయి. సత్వగుణం మిగతా రెండింటికంటే పవిత్రమైనది, క్షేమదాయకమైనది. ఈ గుణంతో చేసిన పనులు పవిత్రమైన ఫలితాలను ఇస్తాయి. సత్వగుణ ప్రధానంగా జీవించి మరణించినవారు జ్ఞానులై పవిత్ర లోకాలను చేరుకుంటారు. భగవద్గీత ప్రకారం, రజోగుణం వల్ల మోహం, తమోగుణం వల్ల అజాగ్రత్త, అవివేకం, మరపు, పరాకు మొదలైనవి, సత్త్వగుణం వల్ల జ్ఞానం కలుగుతాయి. సత్వ గుణం కలిగిన వారు పై లోకాలకు వెళుతున్నారు. రజోగుణం కలిగిన వారు మానవ లోకంలో జన్మిస్తున్నారు. తమోగుణ ప్రవృత్తి గలవారు అథోలోకాలను వెళుతున్నారు.

మన కావ్యాలు, ప్రబంధాలు అన్ని అంతర్లీనంగా ఈ గుణాల విశిష్టతను తెలుపడానికే ప్రాధాన్యతనిచ్చినవి. అందులో మన తెలుగు సాహిత్యములో ముక్కు తిమ్మన రచించిన పారిజాతాపహరణం ప్రబంధం మరియు ముత్తరాజు సుబ్బారావు రచించిన శ్రీకృష్ణ తులాభారం నాటకాలలోని ఇతివృత్తాలలోని కథాంశాన్ని తీసికొని అందులో రుక్మిణి–సత్యభామల మనః ప్రవృత్తులను పరిశీలిస్తే రజోగుణ, తమోగుణ, సత్వగుణములలో సత్వగుణ వైశిష్ట్యం మనకు అర్థమవుతుంది.

భాగవతములో పారిజాతాపహరణము అనే ఘట్టము ఉన్నది కానీ శ్రీకృష్ణ తులాభారం అనేది కాన రాదు. శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానకవి నంది తిమ్మన పారిజాతాపహరణం ఘట్టాన్ని ప్రబంధంగా మలచినాడు. దాని ఆధారంగా అనేక కథలు అల్లుకొనిపోయి శ్రీకృష్ణ తులాభారం వెలసినది. దానిని ముత్తరాజు సుబ్బారావు శ్రీకృష్ణ తులాభారం అనే నాటకాన్ని రచించాడు. ఈ రెండు రచనలు తీసికొని రుక్మిణి సత్యభామల మధ్య వారివారి గుణముల వల్ల ఎటువంటి ఫలితములు పొందినారో చూస్తే ఆయా గుణముల విశిష్టత తెలుస్తుంది.

శ్రీకృష్ణుడు అష్ట భార్యలైన రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద, భద్ర, సుదంత, కాళింది, లక్షణ అనే ఎనిమిది మందిని సమానముగా ఏ ఏ సమయాలలో ఏమేమి కావలెనో చూసుకుంటూ

ఉండినా అందులో రుక్మిణి సత్యభామలను కొంత అధికముగా చూసెడి వాడు. దానికి కారణం మహావిష్ణువే శ్రీకృష్ణుడు, అయన భార్యలైన శ్రీదేవి, భూదేవులు రుక్మిణి సత్యభామలుగా జన్మించారు. వారు ఇరువురు కారణ జన్ములు.

ఐతే సత్యభామ మాత్రం తన వంశము, రూపము, సౌభాగ్యం, లందు అధికురాలనని, పైగా భర్తయైన కృష్ణుని ప్రేమ తనకే అధికమని, అధికంగా ఉండాలని భావించిన స్త్రీ. ఐశ్వర్యవంతుల ఇంట పుట్టానన్న గర్వం ఒకెత్తు. ఆరాధించిన వాణ్ని చేపట్టానన్న ఆనందం మరోఎత్తు. తన పెనిమిటి అష్టభార్యలలో ఇష్టసఖిని తానేనని అహంకారియై ప్రవర్తించేది. భర్తను అపరిమితంగా ప్రేమిస్తూ, భర్త నుండి అంతే విపరీతమైన ప్రేమను పొందుతూ, అతనితో చనవులు నెరపుతూ, అవసరమైనప్పుడు అలుగుతూ, కోర్కెలు తీర్చుకుంటూ, అప్పుడప్పుడూ నిష్ఠురాలాడుతూ, భర్త తన కొక్కతికే అనురక్తుడుగా వుండాలని కోరుకుంటూ, అలానే వున్నాడని నమ్మే ఒక ప్రణయమూర్తి, స్వాధీనపతికయైన నాయిక గాను, సరస శృంగారాభిమానవతిగాను, విభునికి తనపైనున్న ప్రేమకారణంగా గర్వం మూర్తీభవించిన దానిగాను సత్యభామ పాత్రను చిత్రీకరించారు.

రుక్మిణి పతి భక్తి పరమార్థంగా, పతి అనుమతి లేనిదే బయటకు కూడా రానటువంటి ఉత్తమ ఇల్లాలుగా, తులసి దళం చేత్తో పట్టుకుని, పాదసేవలూ, పూజలు చేసే పరమసాధ్వి రుక్మిణి. వారు ఇరువురు కారణ జన్ములు. పారిజాతాపహరణం మరియు శ్రీకృష్ణ తులాభారం రెండు రచనలలోని ఇరువురి మనః ప్రవృత్తులు చూస్తే రుక్మిణి సత్వగుణ సంపన్నురాలు, సత్యభామ రజోగుణ సంపన్నురాలు.

శ్రీకృష్ణుడు రుక్మిణి మందిరములో పాచికలాడుతున్న సందర్భములో నారదుడు అచటికి ఒక పారిజాత పుష్పమునను తీసికొని వచ్చి శ్రీకృష్ణునికి ఇచ్చి నీకు ఇష్టమైన భార్యకు ఇమ్మని చెప్పగా కృష్ణుడు రుక్మిణి మందిరములో ఉండడం వాళ్ళ ఆమెకు ఇవ్వడమే సమంజసమని భావించి రుక్మిణికి ఇచ్చాడు, అప్పుడు నారదుడు సత్య భామ గురించి మాట్లాడిన మాటలు చెలికత్తె ద్వారా తెలిసి కోపగించుకొని అలుక వహించింది. సత్యభామ మనస్తత్వం తెలిసిన కృష్ణుడు వ్యాకులముతో ఆమె మందిరానికి వెళ్లి అక్కడి పరిస్థితి చూసి ఆమె కోపగృహములో ఉన్నదని గ్రహించి ఆమెను అనునయించబోయి ఆ క్రమములో పాద తాడనమునకు గురియైనా ఓర్పు వహించి, ఒక్క పారిజాతమునకే ఇంతటి అలుక వహించుటెందుకు, పారిజాత వృక్షమునే పెరటి చెట్టుగా నాటింతునని మాట ఇచ్చి అలుక దీర్చి. ఆమెకు ఇచ్చిన మాట ప్రకారం సత్యతోకూడి దేవలోకమునకు వెళ్లి దేవేంద్రునితో యుద్ధము చేయవలసి వచ్చినా, సత్య మాట మేరకు యుద్ధము చేసి, ఆదిదేవత చొరవతో యుద్ధం ముగించి పారిజాత వృక్షమును తీసికొని వచ్చి సత్యభామ ఇంటిలో నాటించినాడు. ఐనా. సత్యభామ మనస్సు ప్రకోపం తగ్గలేదు. రుక్మిణి పుట్టిన రోజుకు కూడా కృష్ణుడు ఆమె మందిరమునకు వెళ్లనీయకుండా చేయుటకు, పతిని తన స్వంతం చేసికొనుటకు పుణ్యక వ్రతము తలపెట్టి అందులో భాగంగా కృష్ణుని నారదునికి దానము చేసి కృష్ణునితో సరియైన ధన ధాన్యములతో తూచాలని చూసి వీలుకాక నిస్సహాయురాలైనది. అంతట నారదుడు కృష్ణుని వీధిలో అమ్ముతుండుటచూచి కాళింది మొదలగు భార్యలు రుక్మిణికి తెలియబరచినారు. రుక్మిణి అవన్నియు స్వామివారి లీలా వినోదములని, అది తెలిసికొన ఎవ్వరి తరమని సహనంతో ఉన్నది. వారందరు సత్యభామను నిలదీయాలని

పిలిచినా స్వామి ఆజ్ఞ లేనిదే బయటకు పోకూడదని నిగ్రహముతో ఉండినది. కృష్ణుని ధన ధాన్యములతో తూచలేమని కేవలం భక్తితో మాత్రమే తూచగలమని జ్ఞానము తెలిసి కొని, అటువంటి భక్తురాలు ఉన్నారా అని అన్నపుడు నారదుని వల్ల రుక్మిణి ఉన్నదని తెలిసికొని కృష్ణుని అనుమతి ఉన్నదని తెలిసి అప్పుడుగాని రుక్మిణి ఇంటినుండి బయటకు బయలుదేరలేదు. అప్పుడు కూడా కృష్ణుని తూచుటకుతులసి దళమును తీసికొని బయలుదేరి వెళ్లి తులసి దళముతో భక్తితో కృష్ణుని తూచి స్వామిని గ్రహించింది. అప్పుడు సత్యభామకు జ్ఞానోదయమైనది.

ఈ మొత్తం కథా విధానములో సత్యభామ రుక్మిణిల ప్రవృత్తులను పరిశీలిస్తే సత్యభామ రజోగుణమునకు, రుక్మిణి సత్వగుణమునకు ప్రతీకలుగా రచయితలు చిత్రించినారు. సత్యభామకు శ్రీకృష్ణునిపై మోహం, ఇతరులకంటే తానె గొప్ప అనే ఆభిజాత్యము, ఇతరులు తనగురించి ఏమి మాట్లాడినా సహించలేని కోపము అన్నియు కవి రజోగుణ చిత్రణలే. రుక్మిణి మందిరములో జరిగిన సంఘటన చెలికత్తె ద్వారా తెలిసికొన్న సత్యభామ సత్యభామ ప్రవర్తించిన విధానముచూస్తే

**"అనవిని వేటుపడ్డ యురగాంగనయంవలె నేయివోయ భ**
**గ్గన దరికొన్న హుతాశన కీల యనంగ లేచి**
**హెచ్చిన కనుదోయి కెంపుతన చెక్కిలి కుంకుమ పత్రభంగ సం**
**జనిత నవీన కాంతి వెదజల్లగ గద్గద ఖిన్న కంఠయై"**

దెబ్బతిన్న పాము లాగ, నేయి పోయగానే భగ్గుమనే మంటవలె లేచి, కనులు ఎఱ్ఱబడడంతో ఆ కుంకుమ కాంతి చెక్కిలి మీద పడి కొత్త కాంతి వెదజల్లగా వణుకుతున్న కంఠంతో పలికినది. అంతే కాదు ఆ కోపములో ఆమె భర్త అనికూడా ఎంచకుండా ఎలా మాట్లాడిన దంటే

**"ఏమేమీ కలహాసనుండచటికై యేతెంచి యిట్లాడెనా?**
**ఆ మాటల్చెవియొగ్గి తా వినియెనా ఆ గోపికా వల్లభుం**
**డేమేమాడెను రుక్మిణీ సతియు, నీ వింకేటికిన్ దాచెదే?**
**నీ మోమాటలు మాని నీరజముఖీ, నిక్కంబెరింగింపవే"**

అన్నది. ఆ కలహాసనుడు అచటికి వచ్చి అలా పలికినా ఆ గోపికా వల్లభుడు చెవి యొగ్గి విన్నాడా! అని గోపికా వల్లభుడు అని మాట్లాడినది. అలా ప్రవర్తించినా శ్రీకృష్ణుడు ఆమెను అనునయించడములో భవదీయ దాసునిగా సంభోదించుకొని అలుక దీర్చినాడు. అలా ఐనా ఆమెకు తాత్కాలిగంగా కోపం తగ్గినదే గాని ఆమెకు సహనం, జ్ఞానోదయం కాలేదు. ఇందుకు ఆమెలోని రజోగుణ ప్రవృత్తియే కారణం.

మొదటినుండి ఓర్పు, సహనం, భక్తి భావంతో ఉన్న రుక్మిణి ఎటువంటి కోపతాప వికారములకు లోను కాకుండా పతియే దైవముగా భావిస్తూ భక్తిభావంతో ఉండి, సపత్నులతో ప్రేమగా ఉంటూ సత్యభామ ఎంత అహంకారంగా ప్రవర్తించినా తిరిగి ఆమె పట్ల ఎటువంటి కోపతాపాలకు లోనుగాకుండా సహనం వహించినది. శ్రీకృష్ణుని తులాభారములో తగిన ధన ధాన్యములతో తులతూచి తిరిగి తీసికొనలేని పరిస్థితిలో సత్యభామ

ఉన్నప్పుడు ఇతర సపత్నులు కోపంగా మాట్లాడిన రుక్మిణి సహనం వహించింది. అట్టి పరిస్థిలో కూడా ఆమె పతియైన కృష్ణుని అనుమతి లేనిదే మందిరం దాటలేదు.

చివరకు కృష్ణుని అనుమతి యైనది అని తెలిసి అప్పుడు తన ఇంటిలోని తులసి కోట లోని తులసి మాతకు నమస్కరించి ఆ తులసి కొమ్మను తీసికొని వెళ్లి కృష్ణుని నమస్కరించి భక్తి భావంతో శ్రీకృష్ణుని తులా తూచినది. ఆమె భక్తి భావమునకు కృష్ణుడు తులసి కన్నా తేలికైనాడు. ఇదంతా కనులారా చూచిన సత్యభామకు అప్పుడుగాని రుక్మిణి తత్వము తెలియలేదు. అప్పుడు ఆమె గొప్ప తనాన్ని గ్రహించినది. ఇతరులకు సాధ్యము కానీ పని రుక్మిణికి సాధ్యమగుటకు కారణం ఆమెలోని సత్వగుణమే కారణము. కాబట్టి రజోగుణము కన్నా సత్వగుణమే మిన్నయైనదని తెలిసి కొంటె లోకులకు మంచిది.

**ఆధార గ్రంథాలు**

1. శ్రీకృష్ణతులాభారం (నాటిక) .ముత్తరాజు సుబ్బారావు-1958
2. పారిజాతపహరణం (ప్రబంధం) నంది తిమ్మన-1968

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# మహాభారత కథా సంబంధి నవలల్లో త్రిగుణాలు

**డా. జాడ సీతాపతి రావు,**
సహాయకాచార్యులు,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,
నూజివీడు ప్రాంగణం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**వ్యాస సంగ్రహం:**

భారతంలో లేనిది ప్రపంచంలో లేదు అనేది ఆర్యోక్తి. భారతం ప్రపంచ చరిత్రకు దీటైనది. పైగా ఆలోచనాత్మకం. ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంగాను, ఆధ్యాత్ములు ఆధ్యాత్మ గ్రంథంగాను, నీతి శాస్త్రజ్ఞులకు నీతిశాస్త్రంగాను, ఇతిహాసకులకు ఇతిహాసంగా..ఇలా ప్రాచుర్యం పొందింది వ్యాస భారతం. దీన్ని మనస్తత్త్వ కోణాలనుంచి, చారిత్రక అవసరాల ఆధారంగా, గుణాల ఆధారంగా చూసే నేపథ్యం ఈ వ్యాస పరిధి.

కీలక పాత్రగా, అవమానల్ని పొందినా, ధీరత్వాన్ని చూపిన యాజ్ఞసేనిగా, విభిన్న తత్త్వాలను, గుణాలను కలిగిన మేటిగా "ద్రౌపది" దర్శనమిస్తోంది. "మాధవి" పాత్ర ప్రాచీన ఆధునిక స్త్రీ కోణాలలో విభిన్నత కలిగిన వ్యక్తిత్వం. ఆమెకు సమాజంలో కలిగిన వేదనలు, వాటి పర్యవసానంగా తీసుకున్న తీర్పు విలక్షణం.

యయాతి తర్వాతి తరానికి ఎలాంటి సందేశాన్ని ఇచ్చాడు. అతడి జీవితంలో నేర్చుకున్న గుణపాఠాలకు అతడు ఎంతవరకు బాధ్యుడు తెల్పుతూనే వంశకర్త కాగల కొడుకును సమాజానికి అందించడానికి పరోక్షంగా శర్మిష్ఠ సహకారం సాగిన వైనాన్ని ఈ నవల చెబుతోంది.

పర్వ ఆధునిక భారత అవగాహనకు సంకేతం. వికర్ణ ధర్మస్థితికి కట్టుబడిన వ్యక్తిత్వం. వెరసి వాళ్ళ జీవితాల్లో ఉన్న గుణాల సమాహారం ఈ వ్యాసాంశాలు.

**ఉపోద్ఘాతం:**

మహాభారతాన్ని ఆధారంగా చేసుకొని మొత్తం 24 నవలలు తెలుగులోను, తెలుగులో అనువాద రూపంగాను వచ్చాయి. కేవలం 8 నవలలకే ఈ వ్యాసం పరిమితం. వ్యాసభారతం నుంచి నేటికి వరకు కాలానుగుణ, చారిత్రక, రాజకీయాది మార్పులకు ఎలా లోనయ్యిందో చెప్పే ప్రయత్నంలో భాగంగా ఈ నవలా దృష్టికోణాలు సాగాయి. నాలాయినిగా జన్మించి తన కోరికలను తీర్చుకునే నేపథ్యం ద్రౌపది పాత్రలో చూడొచ్చు. ఒక స్త్రీగా భర్తతో కామసుఖాలు తీర్చుకోవాలనే కోరికతో ఉన్న ధర్మబద్ధమైన జీవనం అంతర్లయ. ఈ నేపథ్యాలతో వచ్చిన ద్రౌపది ఆధారంగా తెలుగులోకి వచ్చిన నవలలు ద్రౌపది–పేరుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కోడూరి ప్రభాకర రెడ్డి, కె. రామలక్ష్మి గార్లు రాశారు. సౌశీల్య ద్రౌపది పేరుతో మురళీకృష్ణగారు, యాజ్ఞసేని పేరుతో ప్రతిభారాయ్(మూలం) జయశ్రీ మోహన్ రాజ్ (అనువాదం)గా వచ్చాయి. ఇందులో ద్రౌపది అంతరంగం ప్రధానం.

**ద్రౌపది నవలల్లో త్రిగుణాలు:**

ద్రౌపదికి ముందటి జన్మ నాలాయిని. నాలాయినిగా ఉన్నపుడు ముద్గలుడు అనే మునిని వివాహం చేసుకొని సత్త్వగుణ సంపన్నురాలుగా కనిపిస్తుంది. కృష్టురోగంతో ఉన్న తన భర్త కోరిక కోరుకోమనగా 'అందమైన వ్యక్తిగా తనతో శారీరక సంభోగ తృప్తిని కలిగించమని' కోరింది. ఆ ప్రయత్నంలో భాగంగా తన తపోశక్తిని ధారపోసి నాలాయనితో సుఖిస్తాడు. ఆమె ఇంకా తృప్తి పొందలేదని శివుడికోసం తపస్సు చేయమని చెప్పి వెళ్ళిపోతాడు. పంచాగ్నులలో తపస్సు చేసి 5మార్లు పతి అని కోరుతున్నదట. అలా కాముకవతిగా కనిపించినా ధర్మపతిగానే మిగలడం గమనించాలి. ఆమె యజ్ఞగుండం నుంచి పుట్టడం వల్ల యాజ్ఞసేని.

ద్రుపద రాజుకు కుమార్తె అవడం వల్ల ద్రౌపది. పాంచాల దేశ పుత్రి కాబట్టి పాంచాలిగా పేరు పొందింది. యాజ్ఞసేని నవలలో ఆమె అగ్ని నుంచి పుట్టడం అని చెప్పడం రజో గుణవతిగా క్రోధమూర్తిగా చెప్పడం ఒక ఎత్తు అయితే యాజ్ఞసేని శాస్త్ర చర్చలో పాల్గొనడం మరో అంశం. అదీ వేదవ్యాసుడితో. ఆ సమయంలో **"మహాశయా, సృష్టిలో శాస్త్రాల్ని, జ్ఞానాన్ని పొందదానికి జీవితకాలం చాలదంటే ఏం చేయాలి?"(యాజ్ఞసేని, పుట: 20)** అని అడిగింది. జ్ఞానతృష్ణ ఆనందాన్ని ఇస్తుందని, గ్రంథాల అధ్యనంతో పాటు జీవితాలను అధ్యయనం చేయాలని (యాజ్ఞసేని, పుట: 21) వ్యాసుడు చెప్పినట్లు ప్రతిభారాయ్ వర్ణించారు. ఈ జ్ఞాన తృష్ణ సులభా వృత్తాంతంలో కనిపిస్తుంది. మహాభారతంలో 320 అధ్యాయంలో ధర్మ ప్రధానంగా మిథిలా నగరాన్ని ధర్మధ్వజుడు పాలిస్తున్నాడు. అతడు సన్యాస జీవితాన్ని గడుపుతున్నాడు. ఒకరోజు సులభ సుందర రూపంలో వచ్చి, అతణ్ణి పరీక్షించదలచింది. ఆమెకు తగిన ఆతిథ్యాన్నిచ్చాడు. ఎందుకు వచ్చావని అడిగాడు. **'భిక్షువు నగరంలోని శూన్యగృహంలో రాత్రి గడిపినట్లే నేను నీ శూన్య శరీరంలో ఒకరోజు నిద్రించి రేపు ఉదయం వెళ్లిపోతాను'** అంటుంది. అతడికి మాట రాలేదు. తానే స్వయంగా వచ్చి తెలుసుకోవాలనే తత్త్వం కలిగిన పాత్ర సులభ. ఇవన్నీ ఆధ్యాత్మకతతో కూడిన తత్త్వాలు. భౌతిక దృష్టితో చూస్తే తమోగుణ సదృశాలుగానే కనబడతాయి. యాజ్ఞసేని అరణ్యవాసంలో ఉన్నపుడు శ్రియ అనే కొండజాతి స్త్రీ ఇంట్లో వాడి చిన్నపిల్లలకు తన స్థన్యాన్నిచ్చింది. ఆర్య, అనార్య భేదాలు ఉండకూడదు అనే స్థితి ద్రౌపదిది. ఇలా ఆకలితో ఉన్న ఉన్న పిల్లలకు ఆకలితీర్చడం ఆమెలో ఉన్న మాతృగుణం, సత్త్వగుణం. ఇదే స్త్రీ హృదయం. దాన్ని అర్థం చేసుకోవాలని చెప్పడం ఈ నవలలోని ప్రత్యేకత. సౌశీల్య ద్రౌపదిలో కస్తూరి మురళీకృష్ణ గారు పెట్టిన పేరులోనే సాత్త్విక గుణ సౌందర్యాన్ని చూపడం విశేషం. ఇది చిన్న పుస్తకం కాబట్టి నవలిక అనొచ్చు.

**మాధవి నవలలో త్రిగుణాల తత్త్వం:**

మాధవి యయాతి మొదటి భార్య కుమార్తె. ఈమె గురించి సంస్కృతంలో 114 అధ్యాయం నుంచి 119 అధ్యాయం వరకు ఉంది. యయాతి తన కూతురును ఒక వస్తువుగా భావించి దానం చేయడం ప్రధానం. ఒక స్త్రీకి హృదయం ఉంటుంది. మనసు ఉంటుంది. దాన్ని ఎందుకు గమనించరు అనే ప్రశ్న అంతర్లయగా సాగే గుణం ఈ నవల ప్రత్యేకత. ముగ్గురు రాజుల దగ్గర, ఒక ఋషి దగ్గర ఉండి, నలుగురు పిల్లల్ని కని గాలవుడి ద్వారా తిరిగి యయాతి దగ్గరకు రావలసి వస్తుంది. యయాతి విషయం తెలుసుకొని బాధపడి, ఆమెకు స్వయంవరం

ఏర్పాట్లు చేస్తాడు.

తన జీవిత గాథను సభా ముఖంగా చెబుతుంది. కానీ అక్కడ రాజకుమారులకు ముగ్గురు రాజుల దగ్గర రాజనీతిని, ముని దగ్గర తాత్త్వికతను నేర్చుకున్న గుణవతి అని వాళ్ళు భావించడం కొసమెరుపు. ఇంతవరకు తన మనసు ప్రమేయం ఏమాత్రం లేని మాధవి తండ్రి దగ్గర స్వయం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా అని అడుగుతుంది. నీ ఇష్టం వచ్చినట్లు నిర్ణయం తీసుకోవచ్చని యయాతి చెప్తాడు. అపుడు ఆ వరమాలను పారేసి తపస్సుకోసం అడవులకు వెళ్లిపోవడం మాధవి నవలలో అంతిమ సన్నివేశం. పదార్థం నుంచి పరార్థం వరకు సాగిన ప్రస్థానం మాధవి జీవితం. సత్త్వ, రజో, తమో గుణాతీతంగా మోక్షగామిగా తపస్సును వరించడం అంతిమ తీర్పు.

**యయాతి నవల: త్రిగుణ తత్త్వం:**

యయాతి నహుషుడు కొడుకు. శర్మిష్ఠను ప్రేమించి, దేవయానిని పెళ్లి చేసుకోవలసి వస్తుంది. మూలమైన ధర్మాన్ని ఆచరించకపోతే భోగేచ్ఛ విచ్చలవిడిగా పెరుగుతుంది. అందుకే వ్యాసుల వారు చేతులు ఎత్తి ధర్మాన్ని వదిలేయవద్దని అందరికి చెబుతున్నారు.

**"నజాతు కామ్ణ కామానాముపభోగేన శామ్యతి**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే"**
**(శ్రీమోక్ష మహాపురాణం: చతుస్త్రింశోధ్యాయ్ణ. 10శ్లో.)**

అని చెప్పడం గమనించాలి.

నహుషుడు మోహంతో ఇంద్రుడి భార్య శచీదేవిని తన భార్యగా కావాలనుకుంటాడు. అదే అతడిని కొండచిలువగా మారడానికి నాంది. తమోగుణ తీవ్రత అంకుర దశ ఇది. ఇలాంటిది తన కొడుకుమీద పడకూడని యయాతి తల్లి జాగ్రత్తలు చాలా తీసుకుంటుంది. అయినా మగవాడి బుద్ధిని మార్చగల శక్తి స్త్రీకి ఉంది. ఆ స్త్రీ శర్మిష్ఠ.

దేవయాని లేని సమయంలో శర్మిష్ఠ తనకు కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకునే పద్ధతిలో భాగంగా ముల్లును ముల్లుతోనే తియ్యాలనుకుని యయాతికి దగ్గరవ్వడం, ముగ్గురు పిల్లల్ని కనడం సంభవిస్తుంది. అందులో చివరివాడైన పూరుడు తండ్రి కోరికను గౌరవంగా మన్నించి తర్వాత వారికి ఆదర్శ చక్రవర్తి వంశకర్త కాగలవాడుగా కీర్తిని పొందుతాడు. ధర్మబద్ధమైన గుణాలు ఎప్పుడూ విజయాన్ని సాధిస్తాయి. ఈ సాధనలో ఆలస్యం ఉండొచ్చు. కానీ అంతిమ విజయం ధర్మంతో కూడిన కోరికకే అని విషయాన్ని సూచిస్తుంది. ఇలా కాముకులైన తమోగుణ భరితులైన వారి నుంచి సత్త్వగుణ సంపదలతో వెలుగొందే కొడుకు పుట్టడం సమాజ ఆదర్శానికి ప్రతీకగా చూపడం యయాతి నవలా విశేషాలు.

**పర్వ నవల త్రిగుణాన్వితం:**

వ్యాస భారతాన్ని అధ్యాయనం చేసి కురుక్షేత్ర యుద్ధం జరిగిన ప్రదేశాలను, అక్కడున్న ప్రజా జీవితాలను అధ్యయనం చేసి, 1971 నుంచి అవగాహన పెంచుకొని 2-10-1975 నుంచి 17-12-1976 వరకు 14

నెలల కాలాన్ని వెచ్చించి రాసిన నవల పర్వ. దీన్ని కన్నడంలో యస్. యల్. భైరప్ప రాశారు. తెలుగులోకి లక్ష్మీనారాయణ గంగిశెట్టి తెలుగులోకి అనువదించారు. ఈ నవలలో హేతువాదం, చారిత్రక దృష్టి ఉన్నా ఇవి త్రిగుణాల కలయికగా కూడా చూడొచ్చు. మద్ర దేశపు (ప్రస్తుతం సియాల్కోటు పాకిస్తాను లోని పంజాబు ప్రాంతం) రాజు శల్యుడు. నకుల, సహదేవుల మేనమామ. అతడి మనుమరాలు హిరణ్యవతి. వీరిద్దరి సంభాషణతో ఈ నవలలోని కథ మొదలౌతుంది. ఇదే కథకు అంత: సూత్రం. అది యుద్ధంగా మారడం, పాతకాలం నాటి ఆచారాలు మరిచి, కొత్త ఆచారాలు ఏర్పాటు చేసుకొని, పాతవాటిని ప్రశ్నించే స్థితి కనిపిస్తుంది.

'భూమి, స్త్రీ... ఒకసారి అనుభవంలోకి వస్తే ఎవరు వదలిపెడతారు?' అనే ప్రశ్నే కురుక్షేత్ర యుద్ధానికి ఒక కారణం. ఒకప్పటి ఆచారాలు తర్వాతి కాలానికి గ్రహచారాలుగా మారడాన్ని ఈ నవలలో నిశితంగా విమర్శించారు. హిడింబికి రచయిత సాలకటంకటి అని పేరు పెట్టాడు. వ్యాసుడు పెట్టిన పేరు కమలపాలిక. తనంతట తానుగా ఎలాంటి జంకూ లేకుండా తన మనసులో మాటను భీముడికి చెప్పడం ఆమె నిష్కల్మషత్వానికి ప్రతీక. ఈమెను భీముడు వివాహం చేసుకునే సందర్భంలో ఎవరికి ఈమెపట్ల ఆకర్షణ కలగలేదు. కానీ ద్రౌపది పట్ల భిన్నం. ద్రౌపదిని పిలిచి ఐదుగుర్ని పెళ్లి చేసుకోవడం నీకు ఇష్టమేనా? అని ద్రుపదుడు అడిగినపుడు **"ఇందులో నా ప్రమేయం ఏమీలేదు. నీ రాజ్యంలో ముప్పాతిక భాగం కంటే ఎక్కువమంది ప్రజల్లో ఈ పద్ధతి ఉంది"(పర్వ, పుట: 174)** అని చెప్పడం నేటి ఆధునిక సమాజంలో ఇప్పటికి కూడా హిమాలయ పర్వత సానువుల్లో ఈ ఆచారం ఆ ప్రాంత ప్రజలకు ఉండడాన్ని పరిశీలించి చెప్పడం ప్రత్యేకాంశం. **"లక్షణమైన ఆడది మగాడి కంట్లో పడకుండా అంత:పుర గోడల్లోపల అణిగి కూర్చుని ఉంటుందా? ఆడది వద్దంటే అంతటితో ఊరకుండి పోరాదా మగవాడు? కృష్ణుడొక్కడికే మనస్సు స్వాధీనంలో ఉన్నట్లుంది" (పర్వ, పుట:209)** అనడంలో మగవాడి బుద్ధిని సత్త్వగుణ ప్రధానంగా ఉన్నపుడు అనవసరమైన రచ్చలు జరిగే అవకాశం లేదు అనే విషయాన్ని సూచిస్తున్నారు.

పర్వలో చివరి ఘట్టం వాన పడడం. అడవి చాలా వరకు కాలిపోతుంది. అపుడు హిరణ్య సూక్తం గట్టిగా చదవడం **"ఇదం వః పరఃన్యా స్వరాజీ హృదో అస్త్వంతరమ్ తజ్జుజోషత్..."** ద్వారా మరింత పెద్దగా వర్షం కురుస్తుంది. యుద్ధంలో చాలా మంది చనిపోయారు. భీముడు ఘటోత్కచుడి కొడుకు బర్బరకుడి కోసం అడవికి వెళ్ళాడు. అడవిలో కార్చిచ్చు పుట్టింది. ఎందరో పిల్లలు కాలి బూడిదై పోయారు. యుద్ధం రజో గుణం. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ సైనిక చర్య ఫలితాలను ప్రత్యక్షంగా వార్తల్లో చూస్తున్నాం. రజోగుణం వల్ల అనవసరంగా ఎక్కువగా కోల్పోవలసి వస్తుంది. అందుకే **'యుద్ధం వద్దు చర్చలు ముద్దు'** అని భారత దేశ సిద్ధాంతాన్ని పెద్దలు చెబుతున్నా వినని పాశ్చాత్య దేశాల దురహంకార ఫలాన్ని అందరూ అనుభవించాల్సి వస్తోంది.

**వికర్ణ నవలలో త్రిగుణ స్వరూపాలు:**

వికర్ణ నవలను డా.చింతకింది శ్రీనివాసరావు రాశారు. ద్రౌపది మానభంగ సమయంలో ద్రౌపది వేసిన ప్రశ్నకు ముందు సమాధానం చెప్పండి అని ధైర్యంగా సభలో నిల్చిన వ్యక్తి వికర్ణుడు, కౌరవులలో సాధువర్తనుడు.

ఇలా ప్రశ్నించినందుకు దుర్యోధనుడు అతడిని రాజ్యంనుంచి వెలివేసినట్లుగా రచయిత కల్పించాడు. యుద్ధ సందర్భంలో అతడిని ప్రత్యేకంగా తీసుకువచ్చి, యుద్ధం చేయమని కోరడం కొసమెరుపు. అన్నగారి మాటను కాదనలేక, కౌరవ పక్షంలో యుద్ధానికి సిద్ధమయ్యాడు.

వికర్ణుడు ధర్మపక్షపాతి. యుద్ధారంభంలోనే గాంధారి **'యతో ధర్మః తతోజయః'** అనే ఆశీర్వచనం చేసింది. ఈ నియమానికి కట్టుబడ్డవాడు, వికర్ణుడు. ధర్మపక్షపాతి కావడం వల్ల వికర్ణుడినుంచి ఎలాంటి సమస్యలు పుట్టవని కృష్ణుడి మాట. అయినా కర్ణుడికి రక్షక కవచంగా దుర్యోధనుడు వికర్ణుడిని నియమించాడు. అపుడు అతడి ధాటిని తట్టుకోలేకపోయింది, పాండవ సేన. అతడి దగ్గర అతీంద్రియ శక్తులు ఏవో ఉన్నాయని నమ్మారు పాండవులు. అదే విషయాన్ని కృష్ణుడిని అడిగారు. పైగా కౌరవుల్ని నాశనం చేస్తానని భీముడి ప్రతిజ్ఞ వికర్ణుడి విషయంలో ఉండకూడదని ద్రౌపది కోరిక. అతడిని పుత్ర సమానంగా భావించింది. వికర్ణుడి విషయంలో గతంలో తాను అడిగిన ఒక ప్రమాణాన్ని ఇప్పుడైనా చేయాలని భీముణ్ణి కోరింది. అతడిని చంపే పరిస్థితి వచ్చినా చంపవద్దని ఆమె కోరిక.

'జై శివా... జైజై శివా' అంటూ శివాలెత్తి పోతూ యుద్ధభూమిలో వీర విహారం చేస్తున్న వికర్ణుడిని చూసి అర్జునుడు విస్తుపోతూ, సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నాడు. కృష్ణుడు "సమరానికి వచ్చావా? లేకా వికర్ణుడిని పొగడడానికి వచ్చావా?"(వికర్ణుడు, పుట: 150) అనేంత వరకు పొగుడుతూనే ఉన్నాడు అర్జునుడు. శాపావశానంలో రణభూమిలో కుంగి పోవాల్సిన కర్ణుడికి ఏదో వేద విహితమైన శక్తి కాపాడుతున్నట్లు అర్జునుడికి ఆ సమయంలో అనిపించింది.

చివరకు వికర్ణుడి అడ్డు తొలగించాలి అని కృష్ణుడు చెప్పాడు. ద్రౌపది చంపవద్దని అడిగింది కదా అని భీముడు ఎదురు ప్రశ్న వేశాడు. రేపు నువ్వే వికర్ణుడితో కయ్యానికి వెళ్ళమని కృష్ణుడి ఆదేశం. భీమ, వికర్ణుల యుద్ధం భీకరంగా సాగింది. అన్నిటికీ మించి , యుద్ధనీతి సూత్రాల్ని అనుసరిస్తున్న వైనం భీముణ్ణి విస్మయానికి గురిచేసింది. వికర్ణా! నీ అంత ధర్మాత్ముడు లేదు. ఉత్తమ వీరుడి లక్షణాలు నీలో ఉన్నాయి. నీలాంటి మంచి మనిషి కౌరవుల పక్షాన యుద్ధం చేయడమే ఘోరం అన్నాడు, (వికర్ణ, పుట:153) భీముడు.

వికర్ణుడు నవ్వుతూ, 'వాయుపుత్రా, నీ వంటున్న మాటల వెనుక నేను ద్రౌపదీమాతకు అవమానం జరిగేవేళ నా ప్రవర్తన మీ పక్షాన పనిచేసినట్లు భావిస్తూ, భ్రమ పడుతున్నావు, నాది ధర్మపక్షం. ఈ రోజూ అలానే పోరాడుతున్నా. నవమోసాలు మోసిన కన్నతల్లి కోర్కె తీర్చడమే కుమారుని ధర్మం. ఇక మాటలు ఆపి ఒకరే విజయుడు కావాలి, మరో దారి లేదు'(వికర్ణ, పుట: 153) అని చెప్పడంలో ఒకవైపు ద్రౌపదిని మాతగా అనడం, గాంధారి ధర్మంగా యుద్ధం చేయమనడానికి అతడు ఇచ్చిన విలువ చాలా ముఖ్యమైనవి. చంపకుండా వదిలేసినా భీముడి వెంట పడి వికర్ణుడు చంపమనడం, విసుగుతో గదను ఆకాశంలోకి విసరిన భీముడి గద ఎక్కడ పడుతుందో అక్కడ వికర్ణుడు తన తలను పెట్టి వీర మరణాన్ని పొందాడు.

వికర్ణ కుమారుడి గురించి భీష్ముల వారి మాటలును గుర్తుచేస్తూ రచయిత **"వికర్ణుడే అసలైన మనిషి. సిసలైన ఋషి. అతడి చరిత్ర అసామాన్యం. ధర్మజ్యోతి. అనుకూల స్థితిగతుల్లో ధర్మవర్తన సాగించడం సులువు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా మంచితనాన్ని వదలక పాటించి, నీతి బాటలో నడిచిన వాడే మనీషి" (వికర్ణ: పుట:159)** అని చెప్పడం ఈ నవలకు భరతవాక్యం.

**సింహావలోకనం:**

వెరసి ప్రతి నవలలో మానవ ధర్మాల్ని ఆధునిక కోణాల్లో చూపే స్థితితో పాటు ప్రాచీన గుణాలైన సత్త్వ, తమో, రజో గుణాల స్థితిని దాటి మానవీయ కోణాలను ఆవిష్కరిస్తూ ధర్మాన్ని రక్షించాలని సూచించడం అన్ని నవలలో సమానం. యుద్ధం మానవ, ప్రపంచ ప్రకృతికి వినాశనకారి. మాట్లాడుకోవడం రానివాడు పోట్లాడుకుంటాడు. పోట్లాడుకోవడం రానివాడు కొట్టుకుంటాడు. కొట్టుకోవడం రానివాడు చంపుకుంటాడు. వీటన్నిటికి మానవుల్లో ఉన్న గుణాలే కారణం. వాటిని సరైన పద్ధతిలో పెట్టుకోగలగితే విశ్వ శ్రేయస్సు కలుగుతుంది. మానవ దేహం త్రిగుణ సంపుటి. అయితే దేనికి ప్రాధాన్యత ఇవ్వాలో ఎక్కడ ఏది ఇలా వాడాలో తెలుసుకొని మనిషిగా పరమాత్మను చేరుకుంటూ మనీషత్వాన్ని నరుడి నుంచి నారాయణత్వాన్ని పొందడమే అంతిమ లక్ష్యం.

## ఆధార గ్రంథాలు

1. అనుపమ నిరంజన(కన్నడ మూలం): 1979: మాధవి: తెలుగు అనువాదం: కళ్యాణి
2. ప్రతిభారాయ్: యాజ్ఞసేని: అనువాదం: జయశ్రీ మోహన్ రాజ్(మూలం: ఒరియా)
3. బైరప్ప, యస్. యల్: పర్వ: 2002: లక్ష్మీనారాయణ గంగిశెట్టి(తెలుగు అనువాదం)
4. మురళీకృష్ణ, కస్తూరి: సౌశీల్య ద్రౌపది: 2010: సాహితీ ప్రచురణలు, విజయవాడ.
5. రామలక్ష్మి, కె.: ద్రౌపది: 2005

# గజేంద్రమోక్ష ఘట్టంలో త్రిగుణాత్మకత

**డా. జి. వెంకటలక్ష్మి,**
సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం,
రంగారెడ్డి జిల్లా.
**డా. గంజి శశిధర్,**
సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్,
రంగారెడ్డి జిల్లా.

**"త్రిభిర్గుణ మయైర్భావైరేభి సర్వమిదం జగత్.**
**మోహితం నాభిజానాతి మామేభ్య పరమవ్యయమ్"**

అని భగవద్గీత, సప్తమాధ్యాయంలో చెప్పినట్లు, ఈ ప్రపంచమంతా త్రిగుణాలచే మోహింపబడి ఉంది. భౌతిక ప్రకృతి ప్రభావములో ఉన్న ప్రతి జీవుడు గుణాలను అనుసరించి, కర్మలను పొంది ఆయా ప్రత్యేక దేహాలను పొందుతాడు. మోహం అనే పాశంతో బంధించేదే గుణం. బంధనం కలవ్యక్తి తనకు తాను బంధవిముక్తి చేసుకోలేడు. బంధరహితుడైన వాడే బంధవిముక్తుని చేయగలడు. చరాచర ప్రకృతిలో ఉన్న ప్రతిమనిషిలోను త్రిగుణాలైన సత్త్వరజస్తమో గుణాలు ఉంటాయి. ఎవ్వరూ దీనికి అతీతులు కాలేరు. రజస్సు, తమస్సుల కంటే మేలైనది సత్త్వగుణం. దీనిలో అత్యంత మేలైనది శుద్ధసత్త్వగుణం. ఈ ప్రకృతి బంధం నుండి అతీతమై బంధవిముక్తి చెంది ముక్తిని పొందాలంటే బంధరహితుడైన భగవంతుని సహాయం తప్పనిసరిగా కావాలి.

కరుణశ్రీ గారన్నట్లు – పసిపాపల పాలబుగ్గల్లా మెత్తమెత్తగా హృదయానికి హత్తుకునే, వెన్నెల్లో ఆడుకునే కన్నెపిల్లల్లాగా ఒయ్యారాలు ఒలక బోసే, చెంగు చెంగున గంతులు వేసే బాలకురంగాల్లా పరుగులు తీసే, మందార మాధుర్యాలు చిందించే, నిర్మల మందాకినీ వీచికలలో పఠితల హృదయాలను ఓలలాడించే పోతన్నగారి భాగవతం అష్టమస్కంధంలోని గజేంద్రమోక్ష ఘట్టం ద్వారా త్రిగుణాలను వ్యక్తపర్చడమే మా ఈ పత్ర ఉద్దేశం.

ద్రవిడ దేశాన్ని పాలించే ఇంద్రద్యుమ్నుడు గొప్ప విష్ణుభక్తుడు. అతడు ఒకనాడు ఏకాగ్రచిత్తంతో విష్ణువు ధ్యానం చేస్తుండగా, అక్కడికి అగస్త్యమహాముని వచ్చాడు. ఇంద్రద్యుమ్నుడు అగస్త్యుడికి గౌరవం ఇవ్వకుండా, కూర్చున్న చోటి నుండి లేవకుండా, మౌనంగా ఉన్నందువల్ల అగస్త్యునికి కోపం వచ్చి లుబ్ధుడా! అజ్ఞానంతో కూడిన ఏనుగుగా పుట్టమని శాపమిచ్చాడు. అలా ఇంద్రద్యుమ్నుడు త్రికూట పర్వత సానువుల్లో ఉన్న ఏనుగుల గుంపుల్లో ఒక గజేంద్రునిగా జన్మించాడు. **"పులులు మొత్తంబులు పొదరిండ్లలో దూఱు ఘోర భల్లూకముల్**

**గుహలు సొచ్చు...”** అనే పద్యంలో అనే పద్యంలో మదపుటేనుగులు రాగానే పులులు, ఎలుగుబంట్లు, అడవిపందులు. జింకలు, అడవిదున్నలు, కోతులు, పాములు ప్రాణభయంతో తలో దిక్కు పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాయి. దీనిలో తమోగుణ లక్షణాలైన క్రౌర్యం, హింస, నాశనం అనే లక్షణాలు కన్పిస్తాయి. **“పల్వలంబుల లేత పచ్చిక మచ్చిక జెలుల కందిచ్చు నచ్చికము లేక....”** అనే పద్యం ద్వారా గజేంద్రునిలో ఉన్న తమో, రజోగుణాల ప్రస్తావన కన్పిస్తుంది. తనను సేవిస్తూ వచ్చిన ఆడ ఏనుగుల సమూహానికి లేత పచ్చికను అందిస్తూ, మదజలంతో తడిచిన తన చెవులతో వాటి చెమటను పోగొడుతూ, క్రీడిస్తూ విహరించడం అనే లక్షణాలు తమో, రజో గుణాలను తెల్పుతున్నాయి.

ఇంద్రియలౌల్యం ఎప్పుడు మొదలవుతుందో అప్పుడే జీవికి తమో, రజో, సత్త్వగుణాలు అంటుకుంటాయి. ఈ గుణాలకు అతీతుడై శుద్ధసత్త్వగుణంలోకి ఎప్పుడు వెళ్తాడో అప్పుడు ముక్తిని పొందుతాడు. దారి తప్పి అడివిలో తిరిగే గజరాజుకు, ఆడ ఏనుగులకు ఒక నిర్మలమైన పద్మాలతో కూడిన సరస్సు కన్పించింది. ఆ సరస్సును అల్లకల్లోలం చేస్తూ అవి నీటిలో ఆడసాగాయి. ఇదంతా చూసిన ఒక మొసలి ఏనుగుని ఒడిసిపట్టుకుంది. ఇవి రెండూ తమో, రజోగుణ సంపన్నలే. దాదాపు వెయ్యి ఏళ్ళు పొరాటం చేశాయి. స్థానబలంచేత మొసలి గజరాజుపై పట్టుని సాధించడం మొదలుపెట్టింది. అప్పుడు గజరాజు ఆలోచించడం మొదలుపెట్టింది. **“నానానేక యూథముల్ వనములోనం బెద్దకాలంబు సన్మానింపన్, దశలక్ష కోటి కరిణీ నాథుండవై యుండి....”** అంటూ తనలోని రజోగుణ లక్షణాన్ని వ్యక్తం చేస్తూ, తనని రక్షించేవాడు భగవంతుడు తప్పితే మరొకరు లేరని నిశ్చయించుకుంది. శాంతస్వరూపుడు, ఇంద్రియకార్యాలు చూసేవాడు, ధర్మం, కామం, ధనం పైన ఆశలు వదిలిన ఉత్తములని కాచేవాడు, స్థూల, సూక్ష్మ స్వరూపునిగా అన్నీ తానే అయిన భగవంతుని మొసలి బారి నుండి కాపాడమని వేడుకుంటాను అనుకుంది. తద్వారా గజరాజు మనస్సు మెల్లగా సత్త్వగుణంలోకి మారడం కన్పిస్తుంది. ఈ సంధి అవస్థలో భగవంతుడు ఉన్నాడా లేడా అనే డోలాయమాన పరిస్థితిలో ఏనుగు ఉంటుంది. చివరగా తన భారం అంతా లోకమే తానై, లోకాతీతునిగా ఉన్న భగవంతునిపై వేసి, **“నీవే తప్ప నిత్఩పరం బెఋగ మన్నింప దగున్ దీనునిన్, రావే యీశ్వర కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా”** అంటూ వేడుకుంటుంది. భగవంతుని ఉనికి స్థిరంగా నమ్మి, వేడుకున్న తర్వాత శ్రీమహావిష్ణువు, లక్ష్మీసమేతుడై వచ్చి, చక్రాయుధం సహాయంతో మొసలి తలను నరికివేస్తాడు. విష్ణువు యొక్క కరస్పర్శ చేత ఏనుగు యొక్క శరీరతాపం, అజ్ఞానం కూడ విష్ణువుతో సారూప్యాన్ని సంపాదించి ప్రకాశించింది. ఇలా గజరాజు సత్త్వగుణంచే భగవంతుని కృపకు పాత్రమైంది.

గజేంద్రమోక్ష ఘట్టంలో ఏనుగు, మొసలి పాత్రల ద్వారా తమో, రజో, సత్త్వగుణాల సమ్మేళనం కన్పిస్తుంది. ఏనుగు పూర్వజన్మ వృత్తాంతం ద్వారా రాజలక్షణాలైన తమో, రజోగుణాలు తర్వాతి జన్మలో సంక్రమించాయి. మహామాయ అనే అంధకారం జ్ఞానాన్ని కప్పేస్తుంది. పంచేంద్రియ ఆడంబరాలు ప్రకోపిస్తే బుద్ధికి స్థానం ఉండదు. నేను, నాది అనే భావన అహంకారాన్ని తెచ్చిపెడ్తుంది. పూర్వకర్మల పుణ్యఫలం ఏదైనా ఉంటే అది మోహపాశాలకు కట్టువడక, ఇంద్రియాలను, బుద్ధిని స్వాధీనం చేసి, భగవంతుని పాదపద్మాలను మనస్సు విడువక,

పట్టుకునేట్లు చేస్తుంది. ప్రపంచంతో సంబంధం లేకుండా, లాభం, నష్టం, మంచి, చెడు అనే ఆలోచన లేకుండా భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించడమే సత్త్వం. యోగమనే అగ్నిలో యోగీంద్రులు తమ పూర్వకర్మలని కాల్చివేసి, ఇతర కార్యాలేవీ ఆలోచించకుండా ఎల్లప్పుడూ భగవంతున్ని ఆరాధించడమే సత్త్వం. మాయ అనే నీడలో నిండుగా వెలుగుతూ, ఆత్మకి ఆధారమై, ఇంద్రియాలను ఆజ్ఞాపిస్తూ, దుఃఖాన్ని తొలగిస్తూ, స్వపర భేదం లేనివాడై దయాసముద్రుడై తనంతట తాను ప్రకాశించేవాడు, నాశనం కానివాడు, ఆధ్యాత్మ యోగం వల్ల మాత్రమే చేరదగినవాడైన భగవంతుని పాదపద్మాలను నిరంతరం తలుస్తూ పూర్వకర్మల పాశాలను తెంచుతూ ముక్తిని ఇవ్వమని ప్రార్థించడమే సత్త్వం. గజేంద్రమోక్షంలో మడుగు మాయచే కప్పబడిన లోకంగా భావిస్తే, జీవునిగా పుట్టిన ఏనుగు మాయా ప్రభావంచే సంసార బంధనం అనే మొసలి చేతికి చిక్కి అల్లాడిపోయింది. పూర్వకర్మల ననుసరించి దాని ఫలితం అనుభవించింది. ఇంద్రియాల స్వాధీనతతో బుద్ధి ప్రకాశవంతంగా మారి, భగవంతున్ని సర్వస్య శరణాగతి కోరే దిశగా జీవున్ని మార్చివేసింది. త్రిగుణాతీతుడైన భగవంతుని పాదపద్మాలను మనస్సులో ఏ సంశయం లేకుండా ఆశ్రయించడం వల్లే జీవికి ముక్తి లభించింది. తమో, రజోగుణాలైన క్రౌర్యం, హింస, ఆలస్యం, పోటీలు, పంతాలు, ఇష్టానిష్టాలు, పట్టింపులు, రాగద్వేషాలు మొదలైనవన్నీ భగవంతుని ఆశ్రయించినవారు జయించి, సత్త్వగుణమైన ఈశ్వరుని వైపుకు మనస్సుని కేంద్రీకరిస్తారు.

## ఆధారగ్రంథాలు

1. పోతన. (2015). పోతన భాగవతము, మూడవసంపుటము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. ప్రసాదరాయ కులపతి. ఆంధ్రభాగవత విమర్శ, వెల్‌కమ్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్, గుంటూరు.
3. హనుమంతరావు, పులిజాల. (1957). ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు.
4. వేంకటరావు, నిడుదవోలు. (1962). పోతన, నేషనల్ బుక్ ట్రస్టు, సికిందరాబాదు.
5. శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాములవారు. (1980). గీతామకరందము, శ్రీ శుకబ్రహ్మాశ్రమము, కాళహస్తి.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# ఆంధ్రమహాభారతం మహర్షులు త్రిగుణాలు

**డా. నల్లపనేని విజయలక్ష్మి,**
తెలుగు ఆధ్యాపకురాలు,
యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కళాశాల,
చీరాల, ఆంధ్రప్రదేశ్.

ఆంధ్రమహాభారతం కౌరవ పాండవుల కథ మాత్రమే కాదు. అది ఒక జ్ఞాన నిధి. కర్మ మార్గానికి, జ్ఞాన మార్గానికి ఈ గ్రంథంలో సమాన ప్రాధాన్యం లభించింది. జ్ఞాన మార్గం ప్రధానంగా మోక్ష సాధనకు మార్గాలను బోధిస్తుంది. మోక్షానికి ముక్తి, కైవల్యము, నిర్వాణము, శ్రేయస్సు, అమృతము, అపవర్గము అనే పేర్లున్నాయి. **"శరీరేంద్రియాభ్యామాత్మనో ముక్తత్వం ముక్తిః"** (శరీరేంద్రియాల నుండి ఆత్మ వెలుపలకు రావడం ముక్తి) అని, **"నాస్తిమృతం మరణ మస్మిన్నిత్యమృతం"** (మరణం దీనియందు లేదు) అని, **"దుఃఖాదీనాం మోక్షణ మవసానం మోక్షః" (దుఃఖాదుల యొక్క వినాశం మోక్షం)** అని, **"ఆత్మానం పాశేభ్యః మోచయతీత మోక్షః మోక్షణే"** (జీవుని పాశముల నుండి విడిపించునది) అని అమరకోశం చెపుతున్నది. ఈ అన్ని అర్థాలలోనూ భారతంలో మోక్ష పదప్రయోగం జరిగింది. మానవుడు ఏ విధంగా ముక్తిని పొందగలడు అనే అంశంపై భారతంలో ఎంతో చర్చ జరిగింది. దేహం గురించి, ఇంద్రియాల గురించి, ఆత్మ, పరమాత్మల గురించి, సత్త్వ, రజ, స్తమో గుణాల గురించి మహర్షుల ప్రబోధాల రూపంలో వివరించబడింది. తత్సంసంధమైన జ్ఞానాన్ని గ్రహించిన తరువాత ఏయే మార్గాల ద్వారా ముక్తికి ప్రయత్నం చేయాలో వివరించబడింది. ఆత్మ స్వరూపాన్ని గుర్తించి, ఆ ఆత్మలోనే పరమాత్మను దర్శించడమెలాగో తెలపబడింది.

భారతంలో మహర్షులు త్రిగుణాల (సత్త్వరజస్తమోగుణాలు) గురించి ఏం చెప్పారో చూద్దాం.

**మార్కండేయుని ప్రబోధం:**

ఆరణ్యపర్వంలో మార్కండేయుడు సత్త్వరజస్తమోగుణాల లక్షణాలను వివరించాడు. ధైర్యం, శాంతి, కరుణ, సంతోషం, తృప్తి అనేవి సత్త్వ గుణ లక్షణాలు. రాగం, లోభం, మాంద్యం, దురభిమానం అనేవి రజోగుణ లక్షణాలు. నిద్ర, ఆలస్యం, దైన్యం, ఓరిమి లేమి అనేవి తమోగుణ లక్షణాలు. సత్త్వగుణ సంపద కలిగిన మహాత్ముడు అహంకార మమకారాలను తొలగించుకొని సర్వసంగ పరిత్యాగం చేసి గొప్ప శాంతిని అనుభవిస్తాడు. పరమపదాన్ని పొందుతాడు. సత్త్వగుణశాలి శూద్రుడైనా వేరొక జన్మలో వైశ్యుడై జన్మించి, క్రమక్రమంగా క్షత్రియ, బ్రాహ్మణ జన్మలెత్తి, సంసారసాగరాన్ని తరిస్తాడు. జన్మరాహిత్యాన్ని పొందుతాడు. (అరణ్య-5-97 నుండి 99) అని ఆయన తెలిపాడు.

**యాజ్ఞవల్క్యుని ప్రబోధం:**

శాంతి పర్వంలో యాజ్ఞవల్క్యుడు ప్రకృతి, పురుషుల స్వభావాలను వివరించే క్రమంలో సత్త్వరజ స్తమోగుణాల లక్షణాలను విపులంగా వివరించాడు. **"ప్రకృతి స్వేచ్ఛగా, క్రీడావిలాసంగా సత్త్వాది గుణాలను, నానా వికృతులను పురుషుడికి కల్పిస్తూ ఉంటుంది. ఒక దీపం నుండి మరొక దీపం వ్యాప్తి చెందినట్లు ఈ ప్రకృతి అనేది గుణ రూపాలను వ్యాప్తి పొందిస్తుంది"** అని ఆయన తెలిపాడు. సత్త్వగుణాలుగా ఆయన సంతోషం, ఆనందంతో పాటు ఆరోగ్యం, క్రోధరాహిత్యం, ఋజుత్వం, ప్రకాశత, సుస్థిరత్వం, అహింస, నిర్మల శ్రద్ధ, వినయం, లజ్జ, సత్యం, శౌచం, సమత, సదాచారం, కార్పణ్యరాహిత్యం మొదలైన వాటిని పేర్కొన్నాడు. కలహించడం, అహంకారం, గర్వం, కామం, క్రోధం, మాత్సర్యం, కారుణ్యహీనత, భోగకాంక్ష, దుఃఖం మొదలైనవి రజోగుణాలని, తేజోరాహిత్యం, మోహం, తిండిపోతుగా ఉండడం, వాదోపవాదాల్లో ప్రీతి, పొరపాటుపడడం, మూర్ఖత్వం, చాడీలు చెప్పడం మొదలైనవి తమోగుణాలని చెప్పాడు. ఈ త్రిగుణాల సహాయంతో కళంక రహితుడైన పురుషుడికి అనేక రూపాలు కల్పించడం ప్రకృతి సహజస్వభావం.(శాంతి-6-95 నుండి 99) అని వివరించాడు.

**వార్ష్ణేయుని ప్రబోధం:**

వార్ష్ణేయుడు గాలిలో ధూళి కలిసినట్లుగా పరిశుద్ధమైన అంతరాత్మలో సత్త్వము, రజస్సు, తమము అనే గుణాలు చేరతాయని చెప్పాడు. పండితుడైనవాడు తన వివేకం వలన వాటికి దూరంగా ఉండి వాటి ప్రభావం తన మీద పడకుండా చూసుకొంటాడు. ఎంత శాంతిని వహించినవాడైనా శరీరం మీద అభిమానం ఉన్నంతకాలం మదన, మద, భయ, క్రోధాది దుర్లక్షణాలను విడిచిపెట్టలేడు. రోగ నివారణ కోసం ఔషధాన్ని సేవించినట్లుగా దేహాభిమానం అనే రోగాన్ని పారద్రోలడానికి సత్యం, శౌచం, నిగ్రహం, శాంతి అనే సద్గుణాలను అలవరచుకోవాలి.

**"లౌకికమైన తెలివితేటలు విజ్ఞానమని, అలౌకికమైన ఆధ్యాత్మమైన తెలివితేటలు జ్ఞానమని విజ్ఞులు అంటారు. ఆ జ్ఞానం కలగడానికి సత్త్వరజస్తమోగుణాలు అడ్డుగా ఉంటాయి. ఆ అడ్డును తొలగించుకోవడానికి ఆ గుణాలలో ఉత్తమమైన సత్త్వగుణాన్ని ప్రయత్నపూర్వకంగా అలవరచుకోవాలి. మనసు సత్త్వగుణంతో నిండినపుడు ఇతర రాజస, తామస లక్షణాలు తొలగిపోతాయి. అది జ్ఞానావిర్భావానికి కారణంగా పరిణమిస్తుంది"** (శాంతి-4- 281 నుండి 290) అని ఆయన వివరించాడు.

**పంచశిఖుని ప్రబోధం:**

పంచశిఖుడు కూడా సంతోషం, ప్రీతి, గొప్ప సుఖం తోడి ఆనందం, నిశ్చలశాంతి అనేవి సత్త్వగుణం వల్ల కలిగే భావాలని చెప్పాడు. ఆయన సంతాపం చెందడం, అవకాశమున్నా సంతోషించకుండా ఉండడం, ఏడ్పు, ఓర్వలేనితనం అనేవి రజోగుణం వల్ల కలిగే భావాలని, ఉపద్రవరూపమైన ఆలోచనలు కలగడం, ఏమరుపాటు, భ్రమపడడం, జడత్వం, సోమరితనం అనేవి తమోగుణం వల్ల కలిగే మనోవికారాలని చెప్పాడు. ఆయా గుణాలు కలిగినపుడు అవి సాత్త్విక, రాజస, తామస సంబంధాలని గుర్తించి ఆయా భావాలను వాటి ఫలితాలైన సుఖ, దుఃఖ, జడత్వాలను విడిచిపెట్టి తనలో తాను ఆనందించే స్థైర్యాన్ని అందుకొనగలిగితే ముక్తి లభిస్తుందని తెలిపాడు.

ISSN 2457-0796 UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

ఆ విధమైన అనాసక్త వైఖరి వైరాగ్యం వల్లనే సాధ్యమవుతుందని ఆయన వివరించాడు. **"సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలను ఆత్మతత్త్వంలో లీనం చేసినట్లయితే అవి తమ ఉనికిని కోల్పోతాయి. నరుడు తన మనసును లౌకికమైన సుఖదుఃఖాల వెంటబడిపోకుండా అంతర్ముఖంగా తిప్పివేసి ఆత్మలో చేర్చగలగాలి. నీటిని చేరిన ఉప్పుగల్లు వలె ఆత్మలో చేర్చబడ్డ మనసు ఆ ఆత్మలోనే కలసిపోయి తన రూపాన్ని కోల్పోతుంది. అప్పుడు కుబుసం విడిచిన పాము ప్రకాశించిన విధంగా కర్మ సంపర్కాన్ని వదిలిన ఆత్మ స్వత్ణ ప్రకాశవంతమైన జ్ఞానంతో ప్రకాశిస్తుంది"** (శాంతి-4-350 నుండి 358) అని ఆయన తెలిపాడు.

**వ్యాసుని ప్రబోధం:**

దేహమొక నగరం. బుద్ధి దానికి ప్రభువు. సకల విషయాల గురించి ఆలోచించే మనసు మంత్రి. శబ్దాది ఐదు గుణాలు పురోహిత వర్గం. శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు పురజనులు. ఈ రాజ్యాన్ని రజస్తమోగుణాలనే దుష్టులు అనుభవిస్తుంటారు. బుద్ధి తనకు వివేకం చాలనపుడు మనసుతో విభేదించడం వల్ల రజస్తమోగుణాల ప్రభావానికి లోనై నశిస్తుంది. అలాకాకుండా మనసుతో ఏకమై కర్తవ్యాన్ని గ్రహించి ప్రవర్తిస్తే రజస్తమోగుణాల ప్రభావం నశిస్తుంది. అపుడు అక్షయమైన ఆనందం కలుగుతుంది. (శాంతి-5-200) అని వ్యాసుడు తెలిపాడు.

ఆత్మప్రాప్తిని కోరేవాడు అన్ని సంకల్పాలు విడిచిపెట్టి మనసును సత్త్వగుణంతో సంసక్తం చేయాలి. సత్త్వ గుణంలో నిలబడ్డ మనసు ఆత్మనిగ్రహాన్ని సమకూరుస్తుంది. మోక్షప్రాప్తికై సాధనచేసే సాధకుడికి ఆత్మ నిగ్రహం చాలా ముఖ్యం. గాలి లేనిచోట పెట్టిన దీపం కదలకుండా ప్రకాశించిన విధంగా అంతరాత్మను చాంచల్యం లేకుండా నిగ్రహించుకోవడం వల్ల మాయామాలిన్యం లేనివాడై హిత మితాహారంతో జీవించి శాశ్వతపదమైన మోక్షాన్ని పొందుతాడు. (శాంతి-5-155నుండి 157) అని వివరించాడు.

(ఊ) వైశంపాయనుని ప్రబోధం :

**"సాత్త్వికం, రాజసం, తామసం అని మనోవికారాలు మూడు రకాలు. ఈ మూడింటిలో సాత్త్వికం ఉత్తమం. అది కలవారి యోగక్షేమాలను విష్ణువే చూసుకొంటాడు. వారే ఏకాంతికులు. రాజస, తామస భావాలు గలవారు ఏకాంతికధర్మాన్ని అనుసరించలేరు. వారు హరి దయకు కూడా పాత్రులు కాలేరు. ఏకాంతికధర్మాన్ని అనుష్ఠించే ఉత్తములు సదా విష్ణువు మనసులోనే ఉంటారు. వారికీ హరికీ భేదం లేదు. ఇది వేదం మాట"** (శాంతి-6-505 నుండి 509) అని వైశంపాయనుడు జనమేజయునికి బోధించాడు.

**నారదుని ప్రబోధం:**

నారదుడు కృష్ణునికి వినిపించిన ఉమామహేశ్వర సంవాదంలో కూడా త్రిగుణాల గురించిన వివరణ కనిపిస్తుంది. సౌఖ్యం, సంతృప్తి, వివేకం సత్త్వగుణానికి సంబంధించిన లక్షణాలు. సంతోషం, దు:ఖం మొదలైన ద్వంద్వాలు రజోగుణ ప్రధానాలు. జ్ఞానరాహిత్యం, భీతి, విపరీత జ్ఞానం, సోమరితనం అనేవి తమోగుణానికి సంబంధించిన లక్షణాలు. సత్త్వగుణం ఉద్రేకించినపుడు జీవునిలో ధైర్యమూ, అనుభవ సహితమైన జ్ఞానమూ,

శ్రద్ధ, భ్రాంతిరాహిత్యమూ, కరుణ, సంతోషం అనే గుణాలు వృద్ధి చెందుతాయి. సత్త్వగుణం అణగిపోయినపుడు అవి కూడా అణగిపోతాయి. రజోగుణం వృద్ధి పొందినపుడు జీవునిలో కోపం, లోభం, కామం, అసత్యం, పరులకు కీడు చేసే తలంపు, దుఃఖం మొదలైనవి కలుగుతాయి.రజో గుణం క్షీణిస్తే అవి కూడా క్షీణిస్తాయి. తమోగుణం పెరిగినపుడు జీవునిలో సందేహం, దు:ఖం, మాంద్యం, నిద్ర మొదలైన గుణాలు పెరుగుతాయి. తమోగుణం క్షీణిస్తే అవి కూడా క్షీణిస్తాయి. ఈ మూడు గుణాలలో ఒక్కొక్క గుణం ఒక్కొక్క సారి ఉద్రేకిస్తుంది. అపుడు అది మిగిలిన రెండు గుణాలను అణచివేసి ప్రవర్తిస్తుంది. ఇలా ఈ మూడు గుణాల వృద్ధి, క్షయం సాగుతూ ఉంటాయి. సత్త్వగుణం విజృంభించినపుడు ఆ గుణ కార్యమైన సంతోషం, రజోగుణం వృద్ధి పొందినపుడు దుఃఖం, తమోగుణం చెలరేగినపుడు మోహం కలుగుతాయి. ఇవన్నీ ఆయా గుణాల వల్ల కలుగుతున్నాయని తెలుసుకొని, వాటి పట్ల ఉదాసీనతను పెంచుకొని, తన మనసు ఆయా సుఖదుఃఖాలలో నిమగ్నం కాకుండా జీవుడు జాగ్రత్త వహించాలి. ఈ గుణత్రయమే ధర్మ కార్య నిర్వహణకు, ధన సంపాదనకు, కోరికలు అనుభవించడానికి కారణం. ఇదే జీవుడు దేవ, మనుష్య, పశుపక్ష్యాది జాతులలో జన్మించడానికి కారణం. (అను-5-246 నుండి 250) అని శివుడు చెప్పిన విశేషాలను నారదుడు కృష్ణునికి తెలిపాడు.

ఈ గుణత్రయమే జీవుడు కర్మలకు వశుడవడానికి, దేవ, మనుష్య. పశు పక్ష్యాది జాతులలో జన్మించడానికి కారణమని వశిష్ఠుడు కూడా చెప్పాడు. (శాంతి-6-11 నుండి 13) సత్త్వ రజస్తమో గుణాల లక్షణాలను మార్కండేయుడు, యాజ్ఞవల్క్యుడు, వార్ష్ణేయుడు, పంచశిఖుడు, వ్యాసుడు, వైశంపాయనుడు, నారదుడు, వశిష్ఠుడు మొదలైన వారు వివరించారు. వీరందరి అభిప్రాయాలను క్రోడీకరిస్తే ధైర్యం, శాంతి, కరుణ, సంతోషం, తృప్తి, ఆరోగ్యం, క్రోధరాహిత్యం, ఋజుత్వం, ప్రకాశత, సుస్థిరత్వం, అహింస, నిర్మల శ్రద్ధ, వినయం, లజ్జ, సత్యం, శౌచం, సమత, సదాచారం, కార్పణ్యరాహిత్యం, ప్రీతి, గొప్ప సుఖంతోడి ఆనందం, సౌఖ్యం, వివేకం అనేవి సత్త్వగుణ లక్షణాలుగాను, రాగం, లోభం, మాంద్యం, దురభిమానం, కలహించడం, గర్వం, కామం, క్రోధం, మాత్సర్యం, కారుణ్యహీనత, భోగకాంక్ష, దుఃఖం, అవకాశమున్నా సంతోషించకుండా ఉండడం, సంతాపంచెందడం అనేవి రజోగుణ లక్షణాలు గాను, నిద్ర, ఆలస్యం, దైన్యం, ఓరిమిలేమి, తేజోరహితత్వం, మోహం, తిండిపోతుగా ఉండడం, వాదోపవాదాల్లో ప్రీతి, పొరపాటుపడడం, మూర్ఖత్వం, చాడీలు చెప్పడం, ఉపద్రవరూపమైన ఆలోచనలు కలగడం, భ్రమపడడం, జడత్వం, సోమరితనం, జ్ఞానరాహిత్యం, భీతి, విపరీతజ్ఞానం అనేవి తమోగుణ లక్షణాలుగాను కనిపిస్తాయి. వీటిని గమనించినపుడు మానవునిలో ఉండవలసిన మంచి గుణాలన్నీ సత్త్వగుణ లక్షణాలుగా చెప్పబడ్డాయని తెలుస్తుంది. మనిషిలో అన్నీ సత్త్వగుణాలే ఉన్నపుడు ఇక రాజస, తామస గుణాలకు చోటుండదు. అతడు మనీషిగా మారతాడు. అందుకే వార్ష్ణేయుడు మనసు సత్త్వగుణంతో నిండినపుడు అది జ్ఞానావిర్భావానికి కారణంగా పరిణమిస్తుంది" అని చెప్పాడు. మానవుడు సత్త్వగుణ సంపన్నుడుగా మారడం ఆత్మ, పరమాత్మలకు సంబంధించిన జ్ఞానాన్ని పొంది, విముక్తి సాధించడానికి చేసే ప్రయత్నంలో తొలి మెట్టు మాత్రమేనని మహర్షుల భావన. మనసు సత్త్వగుణంతో సంసక్తం కావడం వల్ల ఆత్మనిగ్రహం సమకూరుతుంది. క్రమంగా మనసును లౌకికమైన సుఖదుఃఖాల నుండి మళ్ళించి

ఆత్మలో లీనం చేయడం వల్ల కర్మ సంపర్కాన్ని వదిలిన ఆత్మ స్వతః ప్రకాశవంతమైన జ్ఞానంతో ప్రకాశిస్తుందని పంచశిఖుని అభిప్రాయం. ఆ విధంగా ఆత్మ జ్ఞానాన్ని, అటు పిమ్మట పరమాత్మతో అద్వైతభావాన్ని పొందవచ్చునని అదే మోక్షమని మహర్షుల బోధల వల్ల తెలుస్తున్నది.

**ఆధార గ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, (ఆరణ్య, శాంతి, ఆనుశాసనిక పర్వములు), తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2. అమరకోశము (గురుబాల ప్రబోధికా సహితము), శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, హైదరాబాద్, 1996.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# ధర్మవ్యాధ బోధలో సత్త్వగుణ శోభ

**డాక్టర్ పఠాన్ ఖాసింఖాన్,**
సహాయాచార్యులు, తెలుగుశాఖ,
ఆధునిక భారతీయ భాషావిభాగము,
అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయము,
అలీఘర్, ఉత్తరప్రదేశ్.

శాంతికై ప్రతి వ్యక్తి ప్రయత్నించటం అత్యావశ్యం. వ్యక్తిశాంతితో విశ్వశాంతి సిద్ధిస్తుంది. అశాంతి విశ్వహానిని కల్గిస్తుంది. బంధితుడైన వ్యక్తి అశాంతికి గురి అవుతాడు. బంధించే ముప్పేట త్రాడు మూడు గుణాల దండు. బంధ ముక్తి పథం ప్రస్తుత పరిశీలనాంశం. మహాభారతంలో ధర్మవ్యాధుడు కౌశికమునికి ధర్మోపదేశం చేస్తూ సత్త్వరజస్తమో గుణబోధ సహితం గావించాడు. ఈ బోధను అవగాహనం చేసికొని ఆచరించిన వ్యక్తికి ఉత్తమశాంతి ప్రాప్తిస్తుంది. తద్వారా విశ్వశాంతి విలసిల్లుతుంది.

ధర్మవ్యాధుడు త్రిగుణాలను నిర్వచిస్తూ – **"తమోగుణము అతినిందితము; సత్త్వము అతిబోధమయంబు, అనయంబును ప్రకాశతతో ఒప్పును. రజోగుణంబు ఉభయగుణమిశ్రితతో పరగును సన్నుత చరితా!"** అని సంగ్రహంగా, సమగ్రంగా తెలియజేసాడు.

సర్వప్రథమంగా చరితను సంస్కరించడం అత్యవసరం. అందుకే ధర్మవ్యాధుడు కౌశికమునిని 'సన్నుతచరితా' అనే సంబోధనం ద్వారా సంతోషంగా సావధానంగా తన బోధను విని సమాచరించే విధంగా సంసిద్ధం చేసాడు.

గుణత్రయ లక్షణాలను వివరిస్తూ ధర్మవ్యాధుడు **"అసుఖాకారత, నిద్ర, దైన్యము, విమోహంబు, అక్షమత్వంబులు, తామసభావంబులు; రాగ, లోభ, జడతా, మానంబులు రాజస వృత్తంబులు; ధైర్యశాంతి, కరుణ, సంతోష, విద్యాదులు సాత్త్విక చేష్టితంబులు;"** అని సమర్థం, సమర్థవంతమైన స్వల్పపదాలతో సంపూర్ణావగావనను కల్గించాడు.

తామస భావాలనటం మూలంగా అవి వ్యక్తుల స్వభావాలని, రాజసవృత్తాలనటం చేత అవివర్తించేవి అని, సాత్త్విక చేష్టితంబులనటం ద్వారా అవి అవశ్యకార్యాలని సముచితపద ప్రయోగాలతో నిర్దేశించాడు. తమోరజస్సత్త్వ క్రమాభివర్ణన అవి ఉత్తరోత్తర శ్రేష్ఠ్యములని ఉద్బోధిస్తుంది.

మనుస్మృతి ద్వాదశాధ్యాయంలో – జ్ఞానం సత్త్వము; అజ్ఞానం తమస్సు; రాగద్వేషాలు రజస్సు; ప్రీతి సంయుక్తం, ప్రశాంతనిభశుద్ధాభం సత్త్వము; దుఃఖసంయుక్తం, అప్రీతికరం, అప్రతిపం రజస్సు; మోహ సంయుక్తం, విషయాత్మకం, అప్రతర్క్యం, అవిజ్ఞేయం తమస్సు; వేదాభ్యాసం, తపస్సు, జ్ఞానం, శౌచం, ఇంద్రియనిగ్రహం, ధర్మక్రియాత్మచింత సాత్త్విక లక్షణాలు; ఆరంభరుచితా, అధైర్యం, అసత్కార్య పరిగ్రహం, అజస్రవిషయోపసేవ రాజస లక్షణాలు; లోభం, స్వప్నం, అధృతి, క్రౌర్యం నాస్తిక్యం, భిన్నవృత్తితా, యాచిష్ణుత, ప్రమాదం తామసలక్షణాలు;

తమస్సు కామాన్ని, రజస్సు అర్థాన్ని, సత్త్వము ధర్మాన్ని లక్షణాలుగా కలిగి ఉంటాయి అని వివరించటం జరిగింది. భగవద్గీత చతుర్దశాధ్యాయంలో – నిర్మలత్వం వలన ప్రకాశం, అనామయం అయిన సత్త్వము సుఖ, జ్ఞాన సంగముల చేత బంధిస్తుంది. రాగాత్మకం, తృష్ణాసంగ సముద్భవం అయిన రజస్సు కర్మసంగంతో బంధిస్తుంది. అజ్ఞానం, మోహనం అయిన తమస్సు ప్రమాద, ఆలస్య, నిద్రలతో బంధిస్తుంది. రజస్సు అధికమైనప్పుడు లోభం, ప్రవృత్తి, కర్మారంభం, అశమం, స్పృహలు; తమస్సు వివృద్ధమైనప్పుడు అప్రకాశం, అప్రవృత్తి, ప్రమాదం, మోహములు; సత్త్వము ప్రవృద్ధమైనప్పుడు ప్రళయం, ఉత్తమలోకాలు పొందుతారు. అని బోధితమయ్యింది.

భగవద్గీత, భాగవతం, దేవీభాగవతం, మనుస్మృతి, సాంఖ్యదర్శనాది గ్రంథములందు బహువిధముల ప్రబోధితములైన త్రిగుణ లక్షణ ప్రభృతి వివరణలను అన్నింటిని ధర్మవ్యాధుడు తన బోధయందు సంగ్రహించాడు. ఎవరు ఎన్ని తామస భావాలు తెలియచెప్పినను వాటిని అన్నింటిని ధర్మవ్యాధుడు 'అతినిందితము' అనే ఏకైక పదములో అంతర్భవింప చేసాడు. కృష్ణుడు లోభాన్ని రాజసవృత్తంగా వచిస్తే, మనుస్మృతి తామసలక్షణంగా పేర్కొన్నది. అందుకే ధర్మవ్యాధుడు రజస్సును ఉభయ గుణమిశ్రితమని నిర్వచించి ఏ చిక్కు లేకుండా చేసాడు. అంతేకాక అన్యులు వచించిన రాజసవృత్తాలన్నింటినీ తన నిర్వచనంలో అంతర్లీనం చేసాడు. అదేవిధంగా ఇతరోక్తములైన సమస్త సాత్త్విక చేష్టితములను 'విద్యాది' శబ్దము నందు అంతర్భూతం గావించాడు. పలువురు గుణత్రయ లక్షణాలను వివిధములుగా విభిన్నములుగా వివరించినప్పటికినీ తామసం మోహాన్ని, రాజసం రాగాన్ని, సాత్త్వికం జ్ఞానాన్ని లక్షణంగా కలిగి ఉండుటను అత్యధిక విద్వాంసులు అంగీకరించినట్లు అవగతమవుతుంది.

ధర్మవ్యాధుడు చరమలక్ష్యాన్ని ఉపదేశిస్తూ – **"అనఘుడు, సాత్త్వికుడు, అయిన మహాత్ముడు నిరూఢమైన బోధతో సర్వమును సమీక్షించి అవి అన్నియు లోకవృత్తములు కావని రోసి, సమస్త సంగ భంగనిరతుడై మమకార వికారాన్ని పరిత్యజిస్తాడు. అహంక్రియచ్యుతితో పూని సంయమప్రకటభావనతో ఉత్తమశాంతిని గైకొంటాడు"** అని కౌశికమునికి అత్యంత కౌశలంగా, క్లుప్తంగా సూక్ష్మంలో మోక్షసాధన సోపానపథం చూపాడు.

మానావమానములందును, మిత్రారులందును తుల్యబుద్ధి కలిగిన, సర్వ కార్యారంభములను పరిత్యజించిన గుణాతీతుడు దేహ సంభవములైన త్రిగుణాలను అతిక్రమించి అవ్యభిచారభక్తియోగంతో పరమాత్మని సేవించి పరమపదాన్ని పొందుతాడనే భగవద్గీత సారాన్ని ధర్మవ్యాధుడు సమీకరించి పద్యదర్పణమునందు ప్రతిబింబింప చేసాడు.

పరపీడనా ప్రభృతులను పరిత్యజించి పాపరహితుడు కావడం అపవర్గ మార్గ ప్రప్రథమ సోపానం. మనిషి క్షణిక సుఖార్థం పాపం చేస్తాడు. సుఖం అంతం అవుతుంది. కాని బ్రతుకు సుఖాంతం కాదు. చేసిన పాపం మాత్రం శాశ్వతంగా వెంటాడుతూనే ఉంటుంది. పాపికి ముక్తి నాస్తి. అందుకే ధర్మవ్యాధుడు అన్నింటి కంటే ఆదిలోనే 'అనఘుడు' కావాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించాడు. త్రింశదధిక శ్లోకాలలో మనుస్మృతి వివరించిన పాపపరంపరా దుష్ఫలిత ప్రభృతులను ధర్మవ్యాధుడు 'అనఘుడు' అనే అనల్పపదంతో అనాయాసంగా

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

తెలియజేసాడు. జ్ఞానం, ధర్మం, ధైర్యం, శాంతి, శౌచం, కరుణ, తపస్సు, సుఖ, సంతోషాది సాత్త్విక లక్షణాలను అలవరచుకొని సాత్త్వికుడు కావటం సహితం ముఖ్యమైన మోక్షసాధనమే. పుణ్యమైన, పవిత్రమైన కార్యాలు నిర్వర్తిస్తూ ఏ ప్రాణికి భయాన్ని కల్గించని ఔదార్యవంతుడై, గుణాతీతుడై, విరక్తుడై మహాత్ముడు అవడము అపవర్గసాధనకు అత్యంతావశ్యకం. మనుస్మృతి యందు దశాధిక శ్లోకాలలో ఉక్తములైన వేదాభ్యాసం, తపం, జ్ఞానం, ఇంద్రియ సంయమనం, అహింస, గురుసేవాది నిశ్శ్రేయ సకరములను ధర్మవ్యాధుడు సాత్త్వికుడు, మహాత్ముడను పదద్వయంతోనే ఉద్బోధించాడు.

కైవల్యకామి నిరూఢమైన బోధతో సర్వాన్ని సమీక్షించి, అవి అన్నీ ఈ లోకంలో ఆచరించతగినవి కావని, ఏవగించుకొని విడిచిపెట్టి, సుఖ, జ్ఞాన, కర్మాది సంగములను భంగం చేయుటయందు నిరతుడై మమకార వికారాన్ని పరిత్యజిస్తాడు. 'నాది' అనే భావనయే మమకారం. నా సుఖం, నా జ్ఞానం, నా కర్మ, నా భార్య, నా పిల్లలు, నా పైకం వంటి 'నా' అనే భావనను పరిత్యజించాలి. 'నేను' అనే భావన అహంక్రియ. నేను జ్ఞానిని, నేను ధనిని, నేను మునిని, నేను వీరుణ్ణి, నేను శూరుణ్ణి మున్నగు విధముల భావించుటయే అహంకారం. ఎంత మహోన్నతుడైనా గాని మాతృగర్భంలో మాత్రం మొట్టమొదట ఒక్క చుక్క మాత్రమే. మరణానంతరం మట్టి లేదా మసి అవక తప్పదు. ఇది తెలిసినవాడు అహంక్రియాచ్యుతుడై పూనుకొని పంచేంద్రియాలను మనస్సును నిగ్రహించి సర్వోత్కృష్టమైన దైవధ్యానంతో ఉత్తమశాంతిని పొందుతాడు.

కాలధర్మం చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు పరమాత్ముని ప్రార్థించటం పరిపాటి. ఆత్మశాంతి ముక్తితోనే ప్రాప్తిస్తుందనేది ప్రస్ఫుటం. అందుకే ధర్మవ్యాధుడు పరమపదానికి పర్యాయంగా ఉత్తమశాంతిని ఉపయోగించాడు. సర్వ సమయములందు, సర్వ స్థలములందు, సర్వ సందర్భములందు సర్వకర్మసాక్షిగా సర్వాంతర్యామిని స్మరిస్తూ కార్యాలు నిర్వర్తించాలి. ధర్మార్థ కామములను లక్షణాలుగా కలిగిన సత్త్వరజస్తమోగుణాలకు అతీతుడై మానవుడు చతుర్విధ పురుషార్థాలలో చరమలక్ష్యమైన మోక్షాన్ని సాధించాలి. ఈ విధంగా మానవులందరు నడువవలసిన అత్యుత్తమ శాంతిపథాన్ని చేరవలసిన పరమపదాన్ని ప్రబోధించిన ధర్మవ్యాధుడు సర్వజగద్ధితుడు సద్ధర్మవిదుడు.

## ఆధార గ్రంథాలు

1. ఎఱ్ఱాప్రెగ్గడ, శ్రీమదాంధ్రమహాభారతము, తిరుపతి, తిరుమల తిరుపతిదేవస్థానములు, 2013.
2. డా. నందుల గోపాలకృష్ణమూర్తి, ఆంధ్రమహాభారతమూ ఔపదేశికప్రతిపత్తి, కాకినాడ, శ్రీప్రతిప్రెస్, 1982
3. పోతన, 1987, భాగవతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
4. డా.అప్పారావు మనోహర,1987, శ్రీ మద్భగవద్గీత– నిత్యజీవితము, నరసింహఇండ్ మార్గ్ నెట్ వర్క్ –ఫర్ డెవలప్ మెంట్ సర్వీసెస్, మద్రాసు.
5. డా. నరసింహాచార్య ఎన్.ఎల్.2000, మనుస్మృతి, గాయత్రీ ప్రచురణలు, హైదరాబాదు.

# రామాయణంలో కౌసల్య పాత్ర త్రిగుణములు

**డాక్టర్ కపిల భారతి**
తెలుగు సహాయచార్యురాలు,
పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాల,
(స్వయం ప్రతిపత్తి),
వడ్డేపల్లి, హనుమకొండ.

**"త్రైగుణ్య విషయ వేదా"** అని గీతాచారుని వాక్యం. వేదాలు త్రిగుణ విషయాలను వివరిస్తాయి. సత్త్వ, రజో, తమో గుణములను త్రిగుణాలంటారు.

వేదాలు ఈ మూడంటికి సంబంధించినవి. జగమంతా కూడా ఈ మూడు గుణములతోనే పెనవేసుకొని ఉంటుంది. వేదం కర్మకాండల కిచ్చినంత ప్రాధాన్యత ఉపాసన జ్ఞానకాండలకు ఇవ్వలేదు. ఫలాసక్తితో కర్మ చేస్తే రజోగుణ ప్రేరణ అవుతుంది. ఫలితమే లేదని కర్మ చేయడం మానేస్తే తామస గుణం అవుతుంది. రజస్తమో గుణాల ప్రేరణకు గురికాకుండా నిష్కామ దృష్టితో కర్మ చేస్తే అది సాత్విక గుణం అవుతుంది.

మానవునికి ప్రధానమైన ఉపకరణాలు మూడు మనసు, బుద్ధి, ఇంద్రియాలు. ఇంద్రియాలు తిరిగి పది రకాలు. జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, ఈ ఇంద్రియాలను అదుపు చేసే శక్తి మనసుకు ఉంటుంది. మనసుని నిర్ధేశించే శక్తి బుద్ధిది. ఈ బుద్ధిని నిర్ణయించేవే త్రిగుణములు. మనం తీసుకున్న ఆహారం ఆరు నెలలకు మనసుగా మారుతుంది. అందుకే మనం ఒకసారి కోపంగ, ఒకసారి చిరాకుగా, ఒకసారి ప్రశాంతంగా, మరోసారి సమదృష్టితో ఉంటూ ఉంటాము. అయితే కేవలం ఆహరమే కాకుండా పూర్వజన్మల కర్మ ఫలితంగా కూడా మన ప్రవర్తన ఉంటుంది. మరణం తర్వాత మన వెంట వచ్చేది కర్మఫలం మాత్రమే.

రామాయణం మన ఆదికావ్యం. ప్రథమ ఇతిహాసమైన రామాయణం సీతారాముల జీవిత ప్రయాణమును తెలుపుతూ మానవుడు ఏ విధంగా జీవించాలో తెలిపే మహోన్నత గ్రంథం. ఇందు రాముని తల్లి కౌసల్య. కౌసల్యలో గల గుణములను విశ్లేషించే చిరు ప్రయత్నమే నా ఈ వ్యాసం.

కౌసల్య గత జన్మలో అతిథి. తన భర్తతో కలిసి చేసిన తపస్సు ఫలితంగా శ్రీ మహావిష్ణువు ఆమె గర్భంలో నివాసం చేసి రాముడిగా జన్మిస్తానని వరం ఇచ్చాడు. దశరథ మహారాజు యాగం చేసినప్పుడు పట్టమహిషిగా మనసున అన్యభావన లేక సత్సంతాన ప్రాప్తి కోసం ఎంతో నియమనిష్టలతో దశరధుని యాగం పరిపూర్తి కావడానికి తన వంతు సహాయ సహకారాలు అందించిన సాత్విక హృదయి. దశరథుడు తనకు ఇచ్చిన పాయసంలో సగభాగం సుమిత్రకు ఇచ్చిన పరమ దాతృత్వ మనస్విని.

రాముడు జన్మించగానే కౌసల్య ఆనందానికి అంతులేదు. రాముని బాల్య చేష్టలను బాగుగా ఆస్వాదించిన పరమ పవిత్రురాలైన మాతృమూర్తి కౌసల్య. కౌసల్య సహజంగానే సాత్విక గుణ సంపన్నురాలు అయినప్పటికి రాముడు వనవాస దీక్షకునిగా అడవులకు వేళ్తాను అన్నప్పుడు మాత్రం తనలోని రజోగుణములను ప్రదర్శించినది.

విశ్వామిత్రుడు రామచంద్రుని తనతో యాగరక్షణార్థం తీసుకుని వేళ్తానంటే, నా కొడుకు చిన్నవాడు నేను పంపలేను కావాలంటే నాసైన్య యుతంగా నేనే వచ్చి యాగ పరిరక్షణ చేస్తానని దశరథుడు అన్నాడు. కానీ కౌసల్య మాత్రం విశ్వామిత్రుని వెంట శ్రీరాముని పంపడానికి మరొక ఆలోచన లేకుండా మనస్ఫూర్తిగా ఆశీర్వదించి పంపించింది. విశ్వామిత్రుల వారు ఎన్ని రోజులు శ్రీరాముని తనతో ఉంచుకుంటారు, తిరిగి మళ్ళీ ఎప్పుడు పంపిస్తారు. అలాంటి ప్రశ్నలు ఏమీ వేయలేదు. ఎందుకంటే విశ్వామిత్రుని పట్ల ఆమెకు గల అపారమైనటువంటి గౌరవం.

శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం అని తెలియగానే ఆమె శ్రీ మహావిష్ణువును ఆరాధించి పేదలకు, బ్రాహ్మణులకు భూరి దానాలను చేసింది. అయితే కైకేయి కోరిక మేరకు శ్రీరాముని పట్టాభిషేకం జరగడం లేదు, వనవాసానికి బయలుదేరుతున్నాడని తెలిసినప్పుడు మాత్రం కౌసల్య, మొదలు నరికి వేసిన చెట్టులాగా కింద పడిపోయి మూర్ఛిల్లింది. తేరుకున్న తర్వాత తన కుమారుడైన శ్రీరామునిపై మోహంతో, కన్న కొడుకు దూరమైపోతున్నాడనే బాధతో, తనలోని రజోగుణాన్ని బయటకు ప్రదర్శించి శ్రీరామునితో! రామా నేను ఏనాడు దశరథ మహారాజుకి పెద్దభార్యగా గౌరవింపబడలేదు. కైకేయిపైన ఉన్న మోహంతో ఆయన నాకు ఇవ్వవలసిన గౌరవం ఇవ్వలేదు. కైకేయి దాసీ జనం ఏ స్థాయిలో ఉన్నారో, రాజు నన్ను ఆ స్థాయిలో ఉంచాడు. కనీసం నీకు పట్టాభిషేకం జరిగితే రాజమాతగా ఆయిన ఆనందం అనుభవించవచ్చునని అనుకున్నాను. కానీ నాకు ఆ మాత్రం ఆనందం కూడా లేకుండా పోయింది. నీవు వెళ్లిపోయిన తర్వాత నేను ఎవరిని చూసుకొని బ్రతకాలి? ఎందుకు బ్రతకాలి? అని ప్రశిస్తూ, ఏ కారణం లేకుండానే నీ తండ్రి నిన్ను అరణ్యవాసానికి పంపించి వేస్తున్నాడు. మరి నేను చేసిన పూజల, వ్రతాల ఫలితాలు ఏమయ్యాయి? అని దైవం పట్ల తనకు గల భావనను తెలియజేసింది. ఇది ఆమెలో ఉన్నటువంటి రజోగుణాన్ని తెలుపుతుంది.

దైవం చేసిన కర్మలను ఫలితాలుగా ఇస్తాడని తెలిపినప్పటికీ తాను తలచిన దైవం తనపట్ల లేడనే బాధను వ్యక్తపరిచింది. దశరథులు నిమిత్తమాత్రుడని తెలిసినా, తన భర్త అయినప్పటికి దశరథుని యొక్క బలహీనతలను బహిర్గతం చేయడం మరియు ఆమె జ్ఞానవంతురాలైన అజ్ఞానం అనే మాయలో పడి తన భర్తను, దైవాన్ని నిందించింది. అప్పుడు రాముడు తల్లికి ధర్మము గురించి, భర్తను సేవించుకోవలసిన విధములు గురించి తెలుపగా తిరిగి తన మాటలను పునర్ పరిశీలన చేసుకుని, తన అభిప్రాయాన్ని మార్చుకుంది. ఇది మరలా ఆమెలోని సాత్విక గుణానికి పరాకాష్ఠ అయితే శ్రీరామునికి వనవాస సమయంలో సకల దేవతలు రక్షణగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీస్సులను అందజేసింది. ఇది ఆమెలోని మాతృమూర్తి తనానికి నిదర్శనం.

కైకేయ దగ్గరనుంచి దశరధుడు మనశ్శాంతి కోసం కౌసల్య గృహానికి వచ్చాడంటే ఆమె ఎంత సాత్విక పరురాలో మనం అర్థం చేసుకోవచ్చు. అలా వచ్చిన దశరథుని ముందు తన మాటలతో బాధపెట్టిన తిరిగి దశరథులు చెప్పిన **"ఋషి శాపం కథ"**ను విని తనను తాను తమాయించుకొని దశరథుడికి పరిచర్యలు చేయడంలో ఆమె సాత్వికతను మనం గుర్తించవచ్చు.

భరతుడు మేనమామ గృహము నుండి వచ్చి కైకేయి దగ్గర నుండి కౌసల్య దగ్గరికి వచ్చినప్పుడు భరతుడిని కూడా నిందాపూర్వక మాటలతో స్వాగతించి ఆ తర్వాత ఆమెలో ఉండే స్త్రీ సహజమైనటువంటి మాతృత్వపు భావనతో శ్రీరామునిపై గల ప్రేమ, అభిమానం వ్యక్తపరుస్తూ భరతుడిని తులనాడడంలో కూడా ఆమె తన రజోగుణాన్ని ప్రదర్శించింది. కానీ భరతుడు మాట్లాడిన తీరుతో తిరిగి వెంటనే భరతుడిని సమాదరించి తనలోని సాత్విక మూర్తిని ప్రదర్శించింది. ఇలా రామయణంలో కౌసల్య పాత్ర మనకు పరమ సాత్వికురాలిగా కనిపిస్తుంది.

## ఆధార గ్రంథాలు

1. శ్రీమాన్ దాశరధి రంగాచార్య 1963 శ్రీమద్రామాయణము, నాల్గవ ముద్రణ, శ్రీరామ బుక్ డిపో, సికింద్రాబాద్
2. శ్రీ పురి గళ్ళ సత్యానంద శర్మ 2015 శ్రీమద్రామాయణము తృతీయ ముద్రణ, ప్రచురణ ఎమెస్కో బుక్స్, హైదరాబాద్ పంపిణీదారులు సాహితీ ప్రచురణలు విజయవాడ
   ఈ పుస్తక సంపాదకులు డాక్టర్ డి చంద్రశేఖర్ రెడ్డి. శ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ గారి ప్రవచన గ్రంథము

# ఎఱ్ఱన అరణ్య పర్వశేషంలో సుశీలుని కథ – త్రిగుణములు

**ఎస్. రజిత**
తెలుగు అధ్యాపకురాలు,
పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
(స్వయంప్రతిపత్తి)
హనుమకొండ.

భారతీయుల యొక్క విజ్ఞాన సర్వస్వం భారతం. వేదవాఙ్మయం యొక్క సారం భారతంలో ఉన్నందు వలన ఇది పంచమవేదం. **"భరత వంశీయుల చరిత్ర భారతం"**. అలాంటి మహాభారతంను తెలుగులోని అనువదించిన ముగ్గురు కవులు త్రిమూర్తుల లాంటి వారు. నన్నయ, తిక్కన మహాభారతంను ముత్యాల హారంగా కూర్చగా, ఈ ఇద్దరు కవులు కూర్చిన భాగాలకు ఎఱ్ఱాప్రగడ అరణ్య పర్వ శేష భాగంతో ఆ ముత్యాల హారానికి మంచి రుపాన్ని ఇచ్చారు. ఎర్రనగారు వ్రాసిన అరణ్య పర్వశేషం నుండి వ్రాసినదే నేను తీసుకున్న అంశం.

'గుణం' అంటే అంతర్ పరిస్థితి. కర్మ అంటే బహిర్ కార్యకలాపం. మన గుణాన్ని బట్టి మన కర్మలు ఉంటాయి. కర్మల వలన గుణాలు మారుతూ ఉంటాయి. అంతర్ పరిస్థితిని బట్టి మనుష్యులు సత్త్వ, రజ, తమో గుణాలను కలిగి ఉంటారు. ఈ సత్త్వ, రజో, తమో గుణాలనే 'త్రిగుణములు' అంటారు.

తమస్సు కంటే, రజస్సు కంటే ఉత్కృష్టమైనది సాత్విక గుణం. సత్త్వగుణం ఉంటే ప్రశాంతంగా ఉంటాం. దైవంవైపు మన ఆలోచన ఉంటుంది. మృదువుగా మాట్లాడుతాం. ఆత్మ భావంతో విశ్రమించడానికి సాత్త్వికగుణమే మనకు అవసరం.

రజోగుణం కామక్రోధాల్ని పెంచుతుంది. అందువల్ల మానవుని అహంకార, మమకారాలు పెరిగి పోతాయి. రజోగుణం ఉంటే మనిషి ప్రశాంతంగా ఉండడు. ఎప్పుడు ఎదో ఆలోచన, ఆందోళన, అసంతృప్తి, అశాంతి, ఎదో చేయాలనే తపన, ప్రాపంచిక విషయాలపై అమితమైన ఆసక్తి ఉంటుంది.

తామసగుణం లోకాన్ని ఆవరించి ఉంది. ఈ గుణం అధికంగా ఉంటే సోమరితనం, నిద్ర, ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడటం, దుర్మార్గపు ఆలోచనలు, తిండి ద్యాస ఉంటాయి.

ధర్మవ్యాధుడు సత్త్వ, రజస్తమో గుణముల గురించి కౌశికునికి చెబుతూ

**"అతినిందితము తమోగుణ। మతి బోధమయంబు సత్త్వ మనయంబు ప్రకా
శత నొప్పుః మభయ గుణము। శ్రత బరగు రజో గుణంబు సన్నుత చరితా!"**

**(96–709)**

పొగడబడిన శీలం కల ఓ కౌశికమునీ! తమోగుణం మిక్కిలి హేయమైనది సత్త్వగుణం జ్ఞానంతో కూడి వెలుగొందేది. ఇక రజోగుణము, తమోగుణసత్త్వ గుణాల రెంటి యొక్క సమ్మేళనం.

అంతే కాక సంతృప్తి లేని రూపం, నిద్దుర మత్తులో ఉండటం, హీనత్వం, మిక్కుటమైన భ్రాంతి, సహనం లేకపోవటం అనేవి తమోగుణాన్ని సూచించే లక్షణాలు. దురాశ, పిసిని గొట్టుతనం, జడత్వం, దురహంకారం రజోగుణాన్ని సూచించే లక్షణాలు. ఆపద దాపురించినప్పటికి చలించని చిత్త వృత్తి, మానసిక సంతృప్తి, జాలి, సంతోషం, తెలివితేటలు మొదలైనవి సత్త్వ గుణాన్ని సూచించే లక్షణాలు ఇది నిజం ఇదంతా నీ మనస్సుతో గ్రహించుము అని చెప్పారు.

ఈ సుశీలుని కథలో తాపసి అయిన సుశీలుడు కొంగ రెట్ట వేయగా ఆగ్రహమైన చూపులతో ఆ పక్షి ప్రాణాలను హరించి వేయడం ఇది సుశీలునిలోని దురహంకారం. ఇది రజోగుణ ప్రభావం. ప్రతి మనిషిలో త్రిగుణంలు ఉంటాయి. అవి సందర్భాన్ని బట్టి బయటకు వస్తూ ఉంటాయి, 'రజోగుణం' అనేది సత్త్వ, తమో గుణాల సమ్మేళనం. అందుకే సుశీలుడు కొంగ ప్రాణాలు కొల్పోవడంతో పశ్చాత్తాపంకు గురి అవుతాడు. ఇది సత్త్వ గుణ లక్షణం.

సత్త్వ గుణానికి ప్రతిక ఇల్లాలు 'బిక్షాం దేహి' అంటూ సుశీలుడు తన ఇంటి ముందు నిలిచిన, ఆకలితో వచ్చిన భర్తకు సమస్త పరిచర్యలు చేసిన తరువాతనే తన వాకిలి వద్ద బిక్ష కొరకు నిలిచి ఉన్న బ్రాహ్మణుని స్మరించింది. భిక్ష పెట్టడానికి వచ్చిన ఇల్లాలిని చూసి కౌశికుడు కోపంతో చాలాసేపు భిక్ష కోసం నీ గుమ్మం దగ్గర వేచి ఉన్నాను. ఇలా గర్వంతో నన్నిలా అవమానించావు అనడం కౌశికుడిలోని తమోగుణం. 'తమోగుణం' లక్షణం సహనం లేకపోవడం. అది కౌశికుడిలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాక నీ భర్తయే గొప్ప వాడని భావిస్తున్నావా! బ్రాహ్మణులు జగత్ పూజ్యులు, దేవేంద్రుడు సహితం బ్రాహ్మణులను భక్తితో ఆరాధిస్తాడు కదా! బ్రాహ్మణులు అవమానించబడితే వారికి కలిగిన కోపం అగ్ని జ్వాలల వలె ఎగసి, ఈ భూ మండలాన్ని అంతా దహించి వేస్తుంది. వారి మహిమ గొప్పది అనడంలో అహంకార పూరితమైన మాటలు సుశీలునిలోని రజోగుణాన్ని మనకు చూపిస్తాయి. దానికి బదులుగా ఆ గృహిణి నా పాలిట నా భర్త మాత్రమే నాకు దేవుడు. త్రికరణ శుద్ధిగా నాభర్త యొక్క మంచిని కోరుతాను. అంతకంటె గొప్ప ధర్మాలు నాకు కన్పించటం లేదు అంటూ చలించని చిత్తవృత్తి, మానసిక సంతృప్తి లాంటి సత్త్వ గుణాలు అన్నీ ఆ పతివ్రతలో మనకు కనిపిస్తాయి.

సుశీలునిలో ఉన్న రజోగుణ లక్షణాలను కూడా ఆ పతివ్రత చెబుతూ నీకోపం వలన ఒక కొంగ చనిపోయింది. మానవుల హృదయాలలో కోపం, మోహం అనే పేర్లుగల శత్రువులు నివసిస్తుంటారు. వాటిని అణచి వేయకపోతే బ్రాహ్మణులకు గొప్పతనం ఎలా ఏర్పడుతుంది. బ్రాహ్మణ గౌరవం ఎలా లభిస్తుందో చెబుతూ ఎప్పుడు ఇతరులను పీడించని వాడు, తల్లి తండ్రులకు గురువులకు మేలు చేసేవాడు, సర్వభూతాల పట్ల సానుభూతిని కలిగి ఉంటాడో, కోరికలను విసర్జించి 'షట్ కర్మ'లను తగినట్లు ఎవరు ఆచరిస్తారో, అట్టి పుణ్యాత్ముడే బ్రాహ్మణుడు. అర్చన, ఇంద్రియ నిగ్రహ వేదాధ్యయనాలే బ్రాహ్మణుడికి గొప్ప ధనాలు అంటూ సత్త్వ గుణ లక్షణాలు బ్రాహ్మణులు

కలిగి ఉండాలని చెబుతుంది. ఆ పతివ్రత ఆదేశం మేరకు మిథిలా నగరానికి చేరుకొన్న కౌశికుడు అక్కడ ధర్మవ్యాదుడు దగ్గరకు వెళ్లిన సమయంలో ధర్మవ్యాదుడు అంగడిలో మాంసాన్ని ముక్కలు చేసి అమ్ముతున్నాడు. తన దగ్గరకు వచ్చిన కౌశికుడిని సాదరంగా ఆహ్వానిస్తూ పతివ్రత చెప్పిన కారణంగా నన్ను చూడవలెనని నాదగ్గరకు వచ్చావు. ఈ విషయాన్ని నా మనస్సు చేత తెలిసికొనగలిగాను, అని సగౌరవంగా ధర్మవ్యాధుడి ఇంటికి వెళ్లి, అచట అతిథి సత్కారాలను పొందిన తరువాత కౌశికుడు ధర్మవ్యాధునితో నీకు ధర్మ మార్గం తెలిసిన 'జీవహింస'ను చేస్తూ బ్రతుకు సాగించటం న్యాయమా! అని ప్రశ్నించిన కౌశికుడితో ఎవరికి అనువైన ధర్మాలు వారు ఆచరించ వలసి ఉన్నది, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు ఎవరి ధర్మం ప్రకారం వారు పని చేయవలసినదే, మాంస విక్రయం మాకు వంశక్రమంగ సంక్రమించిన ఆచారం. అంతేకాక మిథిలా రాజ్య ప్రభువు జనక మహారాజు ఎవరి వంశవృత్తులు వారు నిర్వహించవలెనని శాసించాడు. అందుకే నా స్వధర్మమైన మాంస విక్రయాన్ని వీడ లేకున్నాను. నా అంత నేను జీవహింస చేయను అంటూ సత్త్వగుణ లక్షణమైన మానసిక సంతృప్తి మనసుకు ఇక్కడ కనిపిస్తుంది.

ధర్మ వ్యాధుడు కౌశికునితో సత్త్వగుణాలు కలిగనవారు ఈ జన్మలో శూద్రుడై పుట్టినప్పటికి, మరుజన్మలో వైశ్యుడై పుడతాడు. అట్లే వరుసగా తదుపరి జన్మలో క్షత్రియుడై, బ్రాహ్మణుడై పుడతాడు అప్పుడు జన్మ రాహిత్యాన్ని పొందగలడు అంటూ సత్త్వ గుణం మానవుడు కలిగి ఉండటం వలన జన్మ రాహిత్యాన్ని పొందగలడు అనే సత్యాన్ని తెలియ పరుస్తాడు.

కౌశికుడిలో ఆచరించని శాస్త్ర జ్ఞానం, అహంకారం, మంచివారితో లేని సత్సంగం, నిగ్రహం లేని ఆగ్రహం, బ్రాహ్మణ భావాలను అధిక్షేపించేలా అతని ప్రవర్తన కౌశికుడిలోని తమోగుణంను మనకు చూపిస్తున్నాయి. ఎంత జ్ఞానం ఉన్న మనిషికి 'ఓర్మి' లేకపోవడం వలన రజో, తమో గుణ స్థాయిలు పెరుగుతున్నాయి కాబట్టి మనిషి తాను కూడా జ్ఞానంతో సత్త్వగుణ సంపన్నుడు, అయితే ఈ లోకం అంతా సుఖసంతోషాలతో ఉంటుంది. జ్ఞాన సంపన్నుడు సత్త్వ గుణాన్ని కలిగి ఉండాలని ఎఱ్ఱన గారు ఈ సుశీలుని కథలో వివరించారు.

## ఆధార గ్రంథాలు

1. కవిత్రయ విరచిత శ్రీ మదంధ్రా మమాభారతం, అరణ్య పర్వము రెండవ భాగము – కృతికర్త ఎఱ్ఱా ప్రెగ్గడ ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానం - 2006.

# మహాభారతంలో ధర్మరాజు (యధిష్టిరుడు) సత్త్వగుణము

**డా॥ బూర్గుల స్వరూప,**
తెలుగు సహాయాచార్యులు,
యం.వి.యస్ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వ),
మహబూబ్‌నగర్. తెలంగాణ.

**పరిచయం:**

**"అందరూ సుఖంగా ఉందురుగాక!**
**అందరూ ఆరోగ్యంగా ఉందురుగాక!**
**అందరు శాంతిలో వర్ధిలుదురు గాక!**
**అందరికీ శుభములే కలుగుగాక !**
**అందరు కలిసిమెలిసి జీవింతురు గాక"!**

ఈ భూమిపైన మానవ జాతి జన్మించిననాడే మహాపురుషులు పలికిగిన శాంతి వచనములు, మనషి, మనిషీగా తీర్చిదిద్దిద సర్వ జీవరాశులలో మహోన్నతునిగా నిలుపగలగిన ఈ పవిత్ర వాక్కులు.

సర్వదా అనుసరించదగినవి. అన్ని జాతులు ఒక్కటనీ, మానువులాంతా ఒక్కటేనని వారి రక్తనాళాల్లో ప్రవహిస్తున్న రక్తమంతా ఒక్కటేనని గ్రహించి వారంతా కలిసి మెలిసి సామరస్యంతో జీవించిన నాడే ప్రగతికి పూలబాట వేసుకుంటారు.

గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు,మహ్మద్ ప్రవక్త, మహాత్మాగాంధీ, జవహార్‌లాల్‌నెహ్రూ, ఇందిరాగాంధీ మొదలైన మహనీయులెందరో ఈ శాంతి వాక్యాలను నమ్మి ఆచరించిన వారే. ఇలాంటి వారితో సమానమగు మన మహాభారతంలోని ధర్మరాజు సత్త్వగుణము గురించి తెలుసుకుందాము.

**"ప్రజాధిపోసౌ ప్రథమం యధిష్టిరే**
**సుతేషు తేజస్విషు తేషు పంచసు**
**ప్రభాకరే పంచతపా ఇవోన్నతే**
**ప్రపాత యామస విలోచన ద్వయం"**

ధర్మరాజుకు యధిష్ఠరుడు,స్థితప్రజ్ఞుడు, అజాత శత్రువు, ధర్మనిరతుడు, సత్యవాక్య తత్పరుడు, అహింసా ప్రియుడు, ప్రజారంజకుడు, సార్వభౌముడు, ఉత్తమోత్తమ ధీరనాయకుడు,

తేజోవంతుడగు పాండుపుత్ర పంచకమున ప్రథముడును, ప్రజలకు ప్రభువును అయి పంచాగ్నులలో ఉన్నతుడగు సూర్యానిలాగా ప్రకాశిస్తున్న యుదిష్ఠరుడు సార్థక నామధేయుడు.

యుధి + స్థిరః = యధిష్టిర:

యుద్దమునందు స్థిరత్వము గలవాడని భావము..

**"ధరణీ సురలాదిగ ను**
**ర్వరలో గల సర్వభూత వర్గం బెల్లం**
**బరమోత్సవ మొందెను గుణ**
**శరణ్యుండు ధర్మజున్మ జన్మదినమునన్"**

ధర్మజుని జన్మకు సర్వభూత వర్గము సంతసించినదట, అంటే సమస్తలోకానికి ఆనంద సాగరంలో ఓలలాడాయి. కారణం – ధర్మరాజు పుట్టుక కారణంగా లోకంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరగనున్నాయి.

మహానుభావిత్వంతో వెలుగొందుతున్న ధర్మరాజు లోకరక్షకుడిగా కనిపించడంతో లోకాలన్నీ తేజరిల్లాయి.

ఏ పరిస్థితులలోనైనా నా మనస్సు అధర్మంవైపు పోదు అని తన ధర్మనిరతిని స్వయంగా ఒప్పుకున్నాడు. మహాభారతేతిహాస నిర్మాత అయిన వేదవాస్యుడే.

**"ధర్మతత్త్వజ్ఞుడీ ధర్మతనూజుండు**
**ధర్మమార్గంబేల తప్పు బలుకు"**

అని ధర్మజుడు ధర్మపరుడని చాటి చెప్పాడు.

**"సజ్జన స్తవనీయ సౌజన్యములును**
**ధర్మసంచిత బహుధన ధాన్యములును**
**గలుగు నక్షీణపుణ్య దోహలుండు ధర్మ**
**నూనుండున్న దేశంబున మానవులకు"**

ధర్మరాజు నివసించే దేశం సుభిక్షంగా ఉండి, దానిలోని ప్రజలు వ్యాధి పీడిత రహితులుగా ఉంటారు. గోధనం సమృద్ధిగా ఉంటుందట. అంతేకాదు, అతని రక్తము నేలపై పడితే ఆ నేల కరువు కాటకాలతో కటకటలాడుతుందట. అంతటి ధర్మపురుషుడు, ధర్మమే రూపుదాల్చినవాడు యదిష్టిరుడు.

కేవలం రాజ్యకాంక్షతో సకల ప్రాణి నష్టానికి ఇష్టంలేని అజాత శత్రువు శ్రీకృష్ణుని రాయబారానికి పంపదలిచి

**"పగయడంగించు టెంతయు శుభంబది లెస్సయడంగునే పగం**
**బగవగగొన్న మార్కొనక పల్కక యుండగ వచ్చునే కడుం**
**దెగమొదలెత్తిపోవ బగం దీర్పంగ వచ్చినంగ్రౌర్యమొందునే**
**మిగతి దలంచినం బగకుమేలిమిలేమి ధ్రువంబుకేశవా"!**

అని శాంతికోరి సంధిచేసి రమ్మని ప్రార్థించాడు. పగవల్ల కలిగే అరిష్టాలను తెలిపి దానిని అణచడమే శుభమని చెప్పిన పాండవాగ్రజుడు ధర్మస్వరూపుడే కాక పరమ శాంతమూర్తి కూడా.

**యుద్ధవిముఖత శాంతిప్రియత్వము:**

యుద్ధం జరిగితే రాజ్యం రావచ్చు, లేదా ప్రాణహాని జరగవచ్చు, మహావీరులైనా సామాన్యుడి చేతిలో ఓడిపోవచ్చు.

యుద్ధంలో జయాపజయాలు అనిశ్చయము. పరాజయం మరణం కంటే బాధాకరం. యుద్ధం లేకుండా శత్రువులను ఉపాయంతో జయింపగలవాడు హాయిగా నిద్రపోతాడు. పగ ఉంటే పాముఉన్న ఇంట్లో ఉన్నట్లు ఆందోళనగా ఉంటుంది, దీర్ఘవైరము తగదు. పగ తగ్గించుకోవడం మంచిది. పగ తీర్చుకోవాలంటే క్రూరత్వం కలుగుతుంది. శత్రుత్వం వల్ల మేలు లేదు. కాబట్టి శాంతిని సాధించాలంటారు.

మాకు రాజ్యం కావాలని యుద్ధం జరగకూడదని కోరిక ఉంది. సంపదలు వంశం నశించకుండా ఉ పాయంతో నా సమస్య తీరాలని శ్రీకృష్ణుని రాయబారిగా పంపుచూ సభలో దుర్యోధనుడు న్యాయంగా ప్రవర్తించకుండా, పౌరుషంగా మాట్లాడినా నీవు సహించి ఊరుకో, దుర్యోధనుడు పెద్దవారి మాటలను వినకపోగా మనము పెద్దల మాటను గౌరవించి నడుచుకుంటే ప్రజలు మనల్ని మెచ్చుకుంటారు.

దృతరాష్ట్రుడు కుమారుని మీద ప్రేమతో మన వినయాన్ని కాదని ఏ నిర్ణయాన్ని చెప్పకపోతే సంధి కుదరదని తెగతెంపు చేయడానికి తొందరపడవద్దు అని శ్రీకృష్ణుడితో ధర్మరాజు మాట్లాడుతూ ఇన్ని కష్టాలు పడుతున్న మా బాధలు తీర్చడానికి నీవే తగిన వైద్యుడివంటూ ఇన్ని మాటలు ఎందుకు నీవు నడపాలన్న తీరు ఏదయినా నాకు ఇష్టమే.

దుర్యోధనాదులు వక్రబుద్దులు, క్రూరులు, వారి దగ్గరకు నిన్ను పంపలేను. నీవు కష్టపడడం వల్ల లభించే ఇంద్ర పదవిని నేను అంగీకరించలేదు. నా ఉద్దేశం బాగుందని నీకు అనిపిస్తే హస్తినాపురానికి వెళ్లి కౌరవులు,పాండవులైన మేము కలిసి ఉండేటట్లు సంధి జరిపించు. ఇది మనకు మంచిది. ధర్మరాజు శాంతి ప్రియత్వాన్ని వెల్లడిస్తూ శ్రీకృష్ణుడు సంధి వాక్యాలను వెల్లడించాడు.

**సమత్వభావం:**

మనస్సులో తమ పట్ల పక్షపాతం విడిచి నీతి ధర్మాలను అనుసరించమన్నారు. ఇరు పక్షాలకు మంచి జరిగేటట్లు విదురుని వంటి పెద్దలకు నచ్చేటట్లు నేర్పుతో కఠినత్వంతో అందరికి తెలిసేలా స్పష్టంగా మాట్లాడాలని సూచిస్తూ ధర్మరాజు తన సత్వగుణాన్ని నిరూపించుకున్నారు.

**ముగింపు:**

**"ధర్మో వివర్ధతి యుధిష్టిర కీర్తనేన"**

జాతుల మధ్య, దేశాల మధ్య శాంతి సహజీవనాన్ని పెంపొందింపజేసి, విశ్వ మానవ కళ్యాణాన్ని ప్రతిపాదించడమే మన ఆదర్శం. మనం కూడా మన చుట్టూ ఉన్న వ్యక్తుల్లో సమాజంలో కనపడుతున్న వైరుధ్యాలను రూపుమాపి శాంతి సౌఖ్యాలను పెంపొందించి, సుఖమయ జీవితాలను ప్రసాదించడానికి నడుంకట్టి ముందుకు సాగాలని నా అభిప్రాయం.

**"శుభంభూయాత్"**

**ఉపయుక్త గ్రంథాలు**

1. శ్రీ మదాంధ్ర మహాభారతము ఉద్యోగపర్వము తిక్కన సోమయాజి సంపుటమ్ -7 తిరుమల తిరుపతి దేవస్థానములు. తిరుపతి, 2014 సంవత్సరమ్
2. తెలుగు సాహిత్య సమీక్ష ఆచార్య జి నాగయ్య నవోదయ బుక్ హౌస్ కాచిగూడ , 1.06.1983 నవ్య పరిశోదక ప్రచురణలు తిరుపతి

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# త్రిగుణములు – 'రామప్ప రభస' పాత్రల పరిశీలన

**డా॥ బి. భవాని,**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, మేడ్చల్, మల్కాజ్‌గిరి,
తెలంగాణ .

**తెలుగు సాహిత్యం స్త్రీవాదం:**

**ఉపోద్ఘాతము:**

సత్త్వ, రజో, తమో గుణములు అనే మూడు గుణములతో మనుష్యులు ప్రవర్తిస్తూ ఉంటారు. గుణము అంటే బంధింపదేది అనుకుంటే ప్రకృతి చేత బంధింపబడిన ఈ శరీరము గణముల చేత బంధింపపడి ప్రవర్తిస్తూ ఉంటుంది. పంచమవేదముగా కీర్తింపబడిన మహాభారతంలో కూడా గణముల ప్రస్తావన మనకు కనిపిస్తుంది. త్రిగుణాత్మకమైన ఈ గుణములలో ఏదో ఒక గుణం అధికంగా ఉంటుంది. వాటి వలన మంచి వారిగా, చెడ్డవారిగా అజ్ఞానులుగా వెలుగుతున్నారు. శరీరము, మనస్సు, బుద్ధి, ఇంద్రియములు చేసే పనుల వలన వారి గుణములు ద్యోతకమవుతాయి. త్రికరణ శుద్ధిగా, ప్రశాంతంగా, దైవోపాసన ధర్మాచరణతో జీవితాన్ని గడిపేవారిని సత్త్వగుణ సంపన్నులుగా, క్రోధం, చిరాకు,స్వార్ధంతో డిపేవారిని రజోగుణ సంపన్నులుగా, విపరీత కామవాంఛతో సోమరితనంతో, మత్తు మద్యాలకు బానిసలుగా గడిపేవారిని తమోగుణ సంపన్నులుగా కీర్తింపబడుతున్నారు. మనిషి రజో, తపో గుణాలను తగ్గించుకుంటూ సత్త్వ గుణాన్ని అలవరచుకోవాలి. స్వార్ధము, అవినీతి, సోమరితనము, హింసలతో నేటి సమాజములో మానవతా విలువలు దిగజారిపోతున్నాయి. ఈ సమయములో సమాజము ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా పురోగతి సాధించాలంటే సత్త్వగుణం కలిగిన మానవుల మనుగడ ఎంతో అవసరము. వట్టికోట ఆళ్వారుస్వామిచే రచింపబడిన 'రామప్ప రభస' అనే రచనలో పాత్రల త్రిగుణములను పరిశీలించడం నా వ్యాస లక్ష్యం.

**విషయ వివరణ:**

ఆత్మాశ్రయ ధోరణిలో సాగిన సంఘటనల సమాహారమే 'రామప్ప రభస'. తొలితరం తెలంగాణ ఉద్యమ రచియత వట్టికోట రచించిన కథనాలు మనకు ఇందులో కనిపిస్తాయి. ఈ రచన తెలంగాణ సామాజిక, రాజకీయ ఉద్యమాల చిత్రణకు అద్దం పడుతుంది. రామప్ప ప్రధాన పాత్ర. ఈ పాత్రలో మనకు రచయిత

వ్యక్తిత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని ఆ వ్యక్తి ఎదిగిన నేపథ్యం నుంచే అంచనా వేయవలసి ఉంటుంది. రాజకీయ ప్రాంతం, కుటుంబం, సమాజం, పరిసరాలు వ్యక్తి వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో కార్యకలాపాల విధానాన్ని ఎన్నుకోవడంలో ప్రాధాన్యం వహిస్తాయి.ఆ దర్వాలను, విలువలను, లక్ష్యాలను నిర్ణయిస్తాయి" రామప్ప వ్యక్తిత్వమే రచయిత వ్యక్తిత్వం భావప్రకటనకు ముఖ్యమైన సాధనము భాష. ఈ రచనలో పాత్రల భాష తెలంగాణ యాసతో కూడి ఉంటుంది.

మంచి గుణాలు కలిగిన వ్యక్తులతో సమాజం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుంది. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సర్వతోముఖాన్ని సాధించడానికి ఉన్నతమైన ఆలోచనలతో కూడిన గుణాలు కలిగిన మనుష్యుల వల్లనే సాధ్యపడుతుంది. మంచి గుణాలు మనిషిని మనీషిగా మంచి వ్యక్తిత్వం కలిగినవారిగా మారుస్తాయి.

'రామప్ప రభస' లోని కథనాలన్నీ రామప్ప పాత్ర చుట్టూనే తిరుగుతాయి. నలుగురికి ఉపయోగపడే పనులు చేయడం ఉత్తమ గుణం కలిగిన మనుష్యుల లక్షణం. మొదటి కథనంలో ఫలితాలు వెలువడిన వార్తాపత్రికలను విద్యార్థుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని దుకాణదారుడు ఎక్కువ ధరకు అమ్ముతాడు. అతడి దగ్గరున్న పత్రికలను అన్నిటిని కొనేసి అందరికి సామాన్య ధరకే అమ్మేస్తాడు రామప్ప. అంతేకాక పత్రిక కొనలేని విద్యార్థుల స్థితిగతులను ఊహించి వారి గురించి ఒక పత్రికను కారుబోర్డుకి పెడతాడు. ఏ పనైనా నిస్వార్థంగా చేయడం సత్త్వగుణం కలిగిన వారి వల్లనే సాధ్యపడుతుంది. దానిని రామప్ప చేసి చూపించాడు. అవసరాన్ని బట్టి పత్రికల ధరను పంచాలనుకోవడం స్వార్థం. అది రాజసగుణం.

రెండవ కథనంలో రామప్ప ఆనాటి విద్యావిధానం గురించి, పిల్లల పెంపకం, క్రమశిక్షణ గురించి నిర్మోహమాటంగా నిర్భీతిగా తన అభిప్రాయాన్ని చెపుతాడు. తన ఉపన్యాసంతో చైతన్యవంతులను చేయడం, ఆలోచనా శక్తిని పెంచడం సత్త్వగుణవంతులు అలవాటు. రామప్ప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడే ఉపన్యాసంలో ఇది మనకు కనిపిస్తుంది. అలాగే అతినిద్ర తమోగుణ లక్షణం. ఉపన్యాసం జరుగుతున్నంతసేపూ ప్రిన్సిపాల్ నిద్రపోతూనే ఉంటాడు.

మూడు మరియు నాలుగవ కథనంలో విద్యార్థుల క్రమశిక్షణ గురించి తీసుకోవలసిన చర్యల గురించి ఒక సభ జరగుతుంది. అందులో ఒక ప్రొఫెసర్, ఇద్దరు రాజకీయ నాయకులు, పౌరుడు చివరలో రామప్ప మాట్లాడుతారు. ప్రొఫెసర్ మొదలైనవారు మాట్లాడినవి విమర్శనాత్మకంగా ఆలోచించి, ఎవరికి ఏది ఆచరణాత్మకమో దానిని పాటించమని రామప్ప ఉపన్యసిస్తాడు. ధర్మపరంగా కల్మషం లేకుండా, ధైర్యంగా మాట్లాడటం సత్త్వగుణం కలిగిన వారి లక్షణం. ఇక్కడ రామప్ప చేసిన పని ఇదే మిగిలిన నలుగురు స్వార్థపరులు. స్థిరమైన అభిప్రాయం లేకుండా సమయాన్ని బట్టి మారే తత్వంతో ఉన్న రజోగుణం కలిగినవారు.

ఐదవ కథనంలో రామప్ప అవినీతిని ఎదిరించడం ప్రధాన విషయం. మంచివారి మౌనం సమాజానికి కీడుచేస్తుంది. అవినీతిని ఏ సమయంలోనైనా ఎదిరించాలి. అది మంచివారి లక్షణం. రైలులో టికెట్ కలెక్టర్, బస్సులో పోలీసు అధికారి, రాజకీయ నాయకుడు, కార్యకర్తలు, భూదాన్ ఉద్యమకారుడు మొదలైనవారి బాధ్యతా రాహిత్యాన్ని ప్రశ్నిస్తాడు. తాను చేస్తున్నది మంచిపని అయినప్పుడు ఎవరేమనుకున్నా లెక్కచేయని దీక్ష అనేది సత్త్వగుణం. బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినవారందరూ స్వార్థపరులు. రజోగుణం కలిగినవారు.

తరువాతి కథనాలలో జైలులో స్నేహితులైన సోమనాథదావు, రఘుపతిరావు, దామోదరం, రాజశేఖరాలు బయటికి వచ్చిన తరువాత ప్రవర్తిస్తున్న తీరుని ధైర్యంగా నిర్మోహమాటంగా విమర్శిస్తాడు. ఇది మంచివారి లక్షణం. తప్పుని ఎత్తిచూపించడం ఉత్తమ వ్యక్తులు చేయవలసిన పని అని రామప్ప పాత్ర నిరూపించింది. దేశం గురించి, సమిష్టి మేలు గురించి త్యాగం చేయవలసిన బాధ్యతను, నిజమైన స్వాతంత్ర్య లక్షణాలు గురించి నినదిస్తాడు. ఉన్నతంగా ఆలోచించడం, ఆదర్శంగా జీవించడం మంచివారి లక్షణం. జ్ఞానంతో ధర్మపరంగా సమాజ శ్రేయస్సు గురించి వారు ఆలోచిస్తారు. "...ఏ దిశలో, ఏస్థానంలో, ఏ స్థాయిలో, ఏ పరిధిలో ఉన్నప్పటికీ ఒక మానవుడు తోటి మానవుని విషయంలో మానవునిగా ప్రవర్తించడం, గౌరవించడం అందుకై ప్రయత్నించడం కనీస ధర్మంగా, కర్తవ్యం సర్వదా ఆచరణీయం.

**ముగింపు:**

మానవుని జీవితం అరిషడ్వర్గాలతో ఉండే కామ, క్రోధ, లోభ, మధ, మోహ, మాత్సర్యాలతో కూడుకొని ఉన్నటువంటిది. **"ఈ అరిషడ్వర్గాలు అసహనము, అశాంతి, అసంతృప్తి, ఆందోళన, అహంకారము..."**లను కలిగిస్తుంది. వీటినుండి బయటపడడానికి సత్త్వగుణాన్ని మానవుడు అలవరచుకోవాలి. 18 కథనాలు కలిగిన 'రామప్ప రభస'లో రామప్ప పాత్ర ఎక్కడ కూడా స్వార్థంగా ప్రవర్తించలేదు. నిజాయితీగా కర్తవ్య బోధ చేయడంలో వెనుకడుగు వేయలేదు. త్రికరణ శుద్ధితో దేనిని విశ్వసించాడో దానినే ఆచరించాడు. **"అనుష్టానములు, ఆచారములు ముఖ్యముకాదు. విచారమే ముఖ్యము..."** అంటే ఆదర్శవంతమైన ఆచరణే ముఖ్యమని రామప్పలోని సత్త్వగుణం నిరూపించింది. మానవ సంక్షేమాన్ని, మానవ ప్రగతిని లక్ష్యంగా పెట్టుకొని, తోటి మానవులకు దోహదకారిగా ఉండే మంచి గుణములను ప్రతి మానవుడు పెంపొందించుకోవాలి.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. రామప్ప రభస, వట్టికోట ఆళ్వారు స్వామి,, సంపాదకులు, సంగిశెట్టి శ్రీనివాస్, ప్రచురణ : కవిలె, తెలంగాణ రీసర్చ్ అండ్ రెఫరెల్ సెంటర్, హైద్రాబాద్, 1984, పేజి నెం. 17 మరియు 109
2. తత్త్వమార్గమూ2, డా॥ ఉమర్ అలీషా, ప్రచురణ ం శ్రీ ఉమర్ అలీషా గ్రంథమండలి, పిఠాపురం, తూర్పు గోదావరి జిల్లా 2020, పేజి నెం. 18
3. త్రిపురాం రహస్యము, శ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ, ప్రచురణ : శ్రీరామణాశ్రమము, తిరువణ్ణామలై, 1983, పేజి నెం. 27

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# గజేంద్ర మోక్షం - త్రిగుణ ప్రభావం

**డా. నందూరి అనంతలక్ష్మి,**
సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ సిటి కళాశాల(స్వ.ప్ర),
హైదరాబాదు.

ముల్లోకాలు , ముక్కంటి, త్రిమూర్తులు, త్రిగుణాలు, త్రిశూలం మొదలైన పదాలతో మూడు అంకె సంఖ్యాశాస్త్రంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించింది. త్రిగుణాలు అనే పదంలోని మొదటి భాగమైన 'త్రి-3 సంఖ్యను, రెండవ భాగమైన 'గుణాలు' ఒక పదార్థం యొక్క లక్షణాలను తెలియజేస్తున్నాయి. త్రిగుణ అనేపదంలోని సత్వం, రజస్సు, మరియు తమస్సు అనే 3 మానవ లక్షణాల సమితి మానవుడిపై చూపే ప్రభావాన్ని భగవద్గీత, ఆయుర్వేద మరియు భారతీయ శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. మానవ స్వభావం, ప్రవర్తన, భావోద్వేగాలు మరియు చర్యలు ఆ సమయంలో ఈ త్రిగుణాలలో ఒకదాని ఆధిపత్యం ద్వారా ప్రభావితమవుతాయి. మహాభారత ఇతిహాసములోని భీష్మపర్వము 25వ అధ్యాయము మొదలు 42వ అధ్యాయము వరకు 18 అధ్యాయములు భగవద్గీతగా ప్రసిద్ధము. కురుక్షేత్ర సంగ్రామ ఆరంభంలో సాక్షాత్తు కృష్ణభగవానుడు అర్జునునకు బోధించిన జ్ఞానము, గుణత్రయ విభాగయోగము భగవద్గీతలో పదునాల్గవ అధ్యాయము. ఈ అధ్యాయములో శ్రీకృష్ణుడు అర్జునునకు త్రిగుణములను వివరించాడు. ఒకరి జీవితంలో త్రిగుణాల మూలం మరియు అనుబంధాన్ని శ్రీకృష్ణుడు ఈ క్రింది విధంగా వివరించాడు.

**"సత్వం రజస్తమ ఇతిగుణాః ప్రకృతి సమ్భవాః!**
**నిబధ్నన్తి మహాబాహో దేహే దేహీ నమవ్యయమ్" (14.5)**

ప్రకృతి కారణంగా సంభవించే సత్త్వరజస్తమో గుణాలు నాశన రహితమైన ఆత్మను నశించే శరీరమునకు బంధిస్తున్నాయి.

**"తత్ర సత్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ఏ**
**సుఖ సంగేన బధ్నాతి జ్ఞాన సంగేన చానఘ ఏఏ" (14.6)**

ఈ మూడు గుణాలలో సత్వగుణము నిర్మలమైనది అయినా సుఖమునందలి ఆసక్తిచేత, జ్ఞానాభిమానము వలన మనుష్యుని బంధిస్తుంది.

**"రజోగుణాత్మకం విద్ధి తృష్ణాసజ్గాసముద్భవమ్ ఏ**
**తన్ని బధ్నాతి కౌన్తేయ కర్మసంగేన దేహినమ్ ఏఏ" (14.7)**

అపరిమితమైన కోరికలు మరియు ఆకాంక్షల వలన రజోగుణము ఉద్భవించుట వలన అది కర్మలయొక్క, కర్మఫలముల యొక్క ఆసక్తిని కల్గించి జీవిని బంధిస్తుంది.

**"తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ఏ**

**ప్రమాదాలస్య నిద్రాభిస్తన్నిబధ్నాతి భారత ఏఏ" (14.8)**

అజ్ఞానం వలన పుట్టిన తమోగుణము మోహకారణము. మానవుని బంధించు బుద్ధిహీనత, సోమరితనము, నిద్ర అనునవి తమోగుణ ఫలములై వున్నాయి.

**"సత్వం సుఖే సంజయతి రజ్జ కర్మణి భారతఏ**

**జ్ఞాన మావృత్య తుతమః ప్రమాదే సంజయత్యుత ఏఏ" (14.9)**

మానవుని సత్వగుణము సౌఖ్యమునందు, రజోగుణము కర్మలయందు, తమోగుణము జ్ఞానమును కప్పివేయుట ద్వారా బుద్ధిహీనత యందు బంధిస్తాయి.

**"మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రాం పక్షయోఃఏ**

**సర్వారంభ పరిత్యాగీ గుణాతీతః సఉచ్యతే ఏఏ" (14.25)**

మానావమానములయందు మిత్రులయందు, శత్రువులయందు, సమభావముతో ప్రవర్తించువాడును,
విద్యుక్త కర్మలను ఆచరించుచు కర్తృత్వాభిమానము లేనివాడును అయినవాడు త్రిగుణాతీతుడై బ్రహ్మపదాన్ని పొందడానికి అర్హుడౌతాడని శ్రీకృష్ణుడు అర్జునునకు వివరించాడు. వివిధ భారతీయ శాస్త్రాలు కూడా త్రిగుణాలను వివరించాయి.

**"సత్వం రజస్తమశ్చేతి త్రయః పోక్తా మహాగుణాః" (అష్టాంగ సంగ్రహ 1.29)**

భౌతికశక్తి యొక్క మూడు రీతులు లేదా మనస్సు యొక్క 3 లక్షణాలను త్రిగుణాలు అంటారు. వీటిని ఆయుర్వేద సాహిత్యంలో మహాగుణాలని కూడా అంటారు.

**"మోక్షో రజస్తమోభ్యభావాత్ బలవత్కర్మ సంక్షయాత్ ఏ**

**వియోగః సర్వ సంయోగైర పునర్భవ ఉచ్యతే ఏఏ" (చరక సంహిత 1.142)**

శక్తివంతమైన గత క్రియలు కర్మల ప్రభావాలను నాశనం చేసిన తరువాత రజస్సు మరియు మనస్సులో రజస్సు మరియు తమస్సు లేనప్పుడు మాత్రమే మోక్షం సాధించబడుతుంది అని చరకసంహితలో పేర్కొనబడింది.

**"రజస్తమోభ్యాం యుక్తస్య సంయోగోభ్యయమనన్తవాన్ ఏ**

**తాభ్యాం నిరాకృతాభ్యాం తు సత్వ వృద్ధ్యాని వర్తతే ఏఏ" (చరక సంహిత 1.36)**

రజస్సు మరియు తమస్సుల వినాశనంతో పాటు సత్వగుణంలో ఉప్పొంగడం విముక్తి లేదా మోక్షానికి కీలకమని చరకుడు పేర్కొన్నాడు.

**"నిద్రా హేతుస్తమః సత్వం బోధనే హేతురుచ్యతే ఏ**

**స్వభావఏవ వా హేతుర్గరీయాన్ పరికీర్త్యతే ఏఏ" (సుశ్రుత సంహిత 4.35)**

నిద్రనుండి మేల్కొలపడానికి సత్వగుణ సమృద్ధి సహాయ పడుతుంది. అయితే శరీరంలో తమోగుణ సమృద్ధి కారణంగా నిద్ర సంభవిస్తుంది.

తాళ్ళపాక అన్నమాచార్యులు కూడా 'జో అచ్యుతానంద జోజో ముకుంద' అనే జోల పాటలో ఈ త్రిగుణాలను పేర్కొన్నారు.

**"తొమ్మిదీ వాకిళ్ళ దొడ్డిలోపలనూ**
**ఆర్గురూ శత్రులు మిత్రులైదుగురూ**
**అంతటా ముగ్గరు మూర్ఖులున్నారు**
**తెలివి తెలిపేటివాడు దేవుడున్నాడు" //జోఅచ్యుతానంద...//**

వ్యక్తి యొక్క నవద్వారాల ద్వారా మనస్సు బయటికి ప్రయాణిస్తుంది. అంతేకాక కామ,క్రోధ, లోభ మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులు, మిత్రులైన పంచేంద్రియాలు, మూర్ఖత్వం నిండిన సత్త్వరజస్తమో గుణాలనే ఆ గుణాలు వ్యక్తిని అంటిపెట్టుకొని వుంటాయి. కాని వీటిని నియంత్రించడానికి భగవంతుడున్నాడని అన్నమయ్య పేర్కొన్నాడు. వ్యాసప్రోకమైన భారతాన్ని పరీక్షిత్తునకు చెప్పింది వ్యాసుని కుమారుడైన శుకమహర్షి.

**"పరమ పూరుషు డొక్కడాద్యుడు పాలనోద్భవ నాశముల్**
**పొంది జేయు ముకంద పద్మజ శూలి సంజ్ఞలబ్రాకృత**
**స్ఫురిత సత్త్వరజస్సమంబుల బందు నందు శుభస్థితుల్**
**హరి చరాచర కోటి కిచ్చు ననంత సత్త్వ నిరూఢుడై".**

ఈ అనంత విశ్వానికి అధీశ్వరుడైన పరమపురుషుడు ఒక్కడే. ఆయనే సత్త్వరజస్తమో గుణాలను స్వీకరించి హరి, విరించి, రుద్రుడనే ముమ్మూర్తులును ధరించి ఈలోకాలను రక్షిస్తూ, సృష్టిస్తూ, అంతం చేస్తూ ఉంటాడు. అందులో అనంత సత్త్వగుణ సంపన్నుడైన శ్రీహరి చరాచర ప్రపంచానికి అపార శుభాలను అనుగ్రహిస్తాడు.

అష్టాదశ పురాణాలలో ప్రశస్తి వహించిన శ్రీమద్భాగవతాన్ని బమ్మెర పోతనామాత్యుడు తెలుగులోనికి అనువదించాడు. పోతన తెనిగించిన భాగవతంలో త్రిగుణాలు ప్రస్తావించబడ్డాయి.

విదేహారాజుతో అంతరిక్షుడు నిత్రివర్ణాత్మకమై సర్గస్థితిలయ కారిణియగు మాయ ఇట్టిది – మాయ తెలుపు (సత్త్వగుణం), ఎరుపు (రజోగుణం), నలుపు (తమోగుణం) అనే మూడు వర్ణాలు (గుణాలు) కలిగి, సృష్టి స్థితిలయలకు కారణమవుతుంది అని త్రిగుణాలను వివరించాడు.

కపిలుడు దేవహూతికి భక్తియోగమును తెలియజేస్తూ నిభక్తి యోగం తామస, రాజస, సాత్విక భేదంబులంద్రివిధంబై యుండు అని అన్నాడు. అనగా భక్తి తామసం, రాజసం, సాత్వికంఅని మూడు విధాలు అని అర్థం.

**"అనుపమ పాపకర్మ పరిహారముకై భజనీయుడైన శో**
**ధన చరితుండితండనుచు భావమునం దలపోసి భక్తిచే**
**ననితర యోగ్యతన్ భగవదర్పణ బుద్ధినొనర్చి కర్మముల్**
**జనహితకారియై నెగడ సాత్త్విక యోగ మనంగ జప్పడున్"**

పూర్వం తెలియక చేసిన పాపాలను పరిహారం చేసేది భగవద్భక్తి ఒక్కటే అనే విశ్వాసంతో భజింపదగిన పవిత్ర చరిత్రుడు భగవంతుడే అని మనస్సులో భావిస్తూ, సమస్త కార్యాలూ భగవదంకితంగా ఆచరిస్తూ లోకులకు మేలు చేకూర్చే పనులు చేస్తూడండటం సాత్త్వికభక్తి. ఇతరులను హింసపెడుతూ ఆడంబరం, అసూయ, రోషం, అజ్ఞానం, భేదబుద్ధి కలిగి నన్ను భజించేవాడు తామసుడు. అట్టివానిది తామసభక్తి. లక్షలు వెచ్చించి ఆడంబరంతో కూడిన

పూజాద్రవ్యాలతో అష్టైశ్వర్యాల కోసం పేరు ప్రతిష్ఠల కోసం పూజనీయుడనైన నన్ను పూజించుట రాజసభక్తి అవుతుంది.

ఈ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొని శ్రీమదాంధ్ర మహాభాగవతంలోని గజేంద్రమోక్షంలో గజేంద్రునిలోని త్రిగుణాలను, వాటి ప్రభావాలను పరిశీలిద్దాము, గజరాజు పూర్వజన్మలో ద్రవిడ దేశాన్ని పాలించే ఇంద్రద్యుమ్నుడనే మహారాజు. ఇతడు విష్ణుభక్తుడు. ఒకనాడు ఇంద్రద్యుమ్నుడు విష్ణువును ఏకాగ్ర చిత్తంలో ధ్యానం చేస్తూ ఉన్న సమయంలో అక్కడికి వచ్చిన అగస్త్యమునిని గమనించక పోయేసరికి అగస్త్యుడు ఆగ్రహించి అజ్ఞానంతో కూడిన ఏనుగుగా జన్మించమని శపించాడు. సత్త్వగుణ సంపన్నుడైన ఇంద్రద్యుమ్నుడు గజరాజుగా జన్మించినప్పటికి పూర్వపుణ్యం వల్ల జ్ఞాన సంపన్నుడయ్యాడు.

వ్యక్తి యొక్క నవద్వారాల ద్వారా మనస్సు బయటికి ప్రయాణిస్తుంది. అంతేకాక కామ,క్రోధ, లోభ మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులు, మిత్రులైన పంచేంద్రియాలు, మూర్ఖత్వం నిండిన సత్త్వరజస్తమో గుణాలనే ఆ గుణాలు వ్యక్తిని అంటిపెట్టుకొని వుంటాయి. కాని వీటిని నియంత్రించడానికి భగవంతుడున్నాడని అన్నమయ్య పేర్కొన్నాడు. వ్యాసప్రోక్తమైన భారతాన్ని పరీక్షిత్తునకు చెప్పింది వ్యాసుని కుమారుడైన శుకమహర్షి.

**"పరమ పూరుషు డొక్కడాఢ్యుడు పాలనోద్భవ నాశముల్**
**పొంది జేయు ముకుంద పద్మజ శూలి సంజ్ఞలప్రాకృత**
**స్ఫురిత సత్త్వరజస్తమంబుల బందు నందు శుభస్థితుల్**
**హరి చరాచర కోటి కిచ్చు ననంత సత్త్వ నిరూఢుడై".**

ఈ అనంత విశ్వానికి అధీశ్వరుడైన పరమపురుషుడు ఒక్కడే. ఆయనే సత్త్వరజస్తమో గుణాలను స్వీకరించి హరి, విరించి, రుద్రుడనే ముమ్మూర్తులును ధరించి ఈలోకాలను రక్షిస్తూ, సృష్టిస్తూ, అంతం చేస్తూ ఉంటాడు. అందులో అనంత సత్త్వగుణ సంపన్నుడైన శ్రీహరి చరాచర ప్రపంచానికి అపార శుభాలను అనుగ్రహిస్తాడు.

అష్టాదశ పురాణాలలో ప్రశస్తి వహించిన శ్రీమద్భాగవతాన్ని బమ్మెర పోతనామాత్యుడు తెలుగులోనికి అనువదించాడు. పోతన తెనిగించిన భాగవతంలో త్రిగుణాలు ప్రస్తావించబడ్డాయి.

విదేహరాజుతో అంతరిక్షుడు నిత్రివర్ణాత్మకమై సర్గస్థితిలయ కారిణియగు మాయ ఇట్టిదె – మాయ తెలుపు (సత్త్వగుణం), ఎరుపు (రజోగుణం), నలుపు (తమోగుణం) అనే మూడు వర్ణాలు (గుణాలు) కలిగి, సృష్టి స్థితిలయలకు కారణమవుతుంది అని త్రిగుణాలను వివరించాడు.

కపిలుడు దేవహూతికి భక్తియోగమును తెలియజేస్తూ నిభక్తి యోగం తామస, రాజస, సాత్విక భేదంబులంద్రివిధంబై యుండు అని అన్నాడు. అనగా భక్తి తామసం, రాజసం, సాత్వికంఅని మూడు విధాలు అని అర్థం.

**"అనుపమ పాపకర్మ పరిహారముకై భజనీయుడైన శో**
**ధన చరితుండితండనుచు భావమునం దలపోసి భక్తిచే**
**ననితర యోగ్యతన్ భగవదర్పణ బుద్ధినొనర్చి కర్మముల్**
**జనహితకారియై నెగడ సాత్త్విక యోగ మనంగ జప్పడున్"**

భజింపదగిన పవిత్ర చరిత్రుడు భగవంతుడే అని మనస్సులో భావిస్తూ, సమస్త కార్యాలూ భగవదంకితంగా ఆచరిస్తూ లోకులకు మేలు చేకూర్చే పనులు చేస్తూదండటం సాత్త్వికభక్తి. ఇతరులను హింసపెడుతూ ఆడంబరం, అసూయ, రోషం, అజ్ఞానం, భేదబుద్ధి కలిగి నన్ను భజించేవాడు తామసుడు. అట్టివానిది తామసభక్తి. లక్షలు వెచ్చించి ఆడంబరంతో కూడిన పూజాద్రవ్యాలతో అష్టైశ్వర్యాల కోసం పేరు ప్రతిష్ఠల కోసం పూజనీయుడనైన నన్ను పూజించుట రాజసభక్తి అవుతుంది.

ఈ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొని శ్రీమదాంధ్ర మహాభాగవతంలోని గజేంద్రమోక్షంలో గజేంద్రునిలోని త్రిగుణాలను, వాటి ప్రభావాలను పరిశీలిద్దాము, గజరాజు పూర్వజన్మలో ద్రవిడ దేశాన్ని పాలించే ఇంద్రద్యుమ్నుడనే మహారాజు. ఇతడు విష్ణుభక్తుడు. ఒకనాడు ఇంద్రద్యుమ్నుడు విష్ణువును ఏకాగ్ర చిత్తంలో ధ్యానం చేస్తూ ఉన్న సమయంలో అక్కడికి వచ్చిన అగస్త్యమునిని గమనించక పోయేసరికి అగస్త్యుడు ఆగ్రహించి అజ్ఞానంతో కూడిన ఏనుగుగా జన్మించమని శపించాడు. సత్త్వగుణ సంపన్నుడైన ఇంద్రద్యుమ్నుడు గజరాజుగా జన్మించినప్పటికి పూర్వపుణ్యం వల్ల జ్ఞాన సంపన్నుడయ్యాడు. పాలసముద్రంలోని త్రికూట పర్వత గుహలలో నివసించే గజరాజు సహచర ఏనుగలతో కలిసి విహరిస్తూ ఒక సరస్సులో ప్రవేశించాడు. గత జన్మలో హూహు అనే పేరు గల ఒక గంధర్వుడు శాపవశాన మకరరాజుగా జన్మించి అదేసరస్సులో నివాసం ఉంటున్నాడు. ఇతర ఏనుగులతో క్రీడిస్తూసరస్సును అల్లకల్లోలం కావించిన గజరాజు కాలిని మొసలి గట్టిగా పట్టుకుంటుంది. గజరాజుమొసలి కోరలకు చిక్కిన కాలితో వేయి సంవత్సరాలు పోరాడింది. మొసలిని ఓడించడానికి లేదా సమానంగా పోరాడడానికి సాధ్యంకాక పూర్వపుణ్యం వలన కలిగిన జ్ఞానం వలన తనలో తానేఈ విధంగా అనుకొన్నది.

**"నానానేకప యూథముల్ వనములోనం బెద్దకాలంబు స**
**న్మానింపన్ దశలక్ష కోటి కరణీనాథుండనై యుండి మ**
**ద్దానాంబ్ల పరిపుష్ట చందన లతాంతచ్ఛాయలందుండ లే**
**కీ నీరాశ నిటేల వచ్చితి భయంబెట్లో కదే యీశ్వరా" !**

ఈ ఒక్క పై పద్యంలోనే గజరాజు యొక్క త్రిగుణాలు స్పష్టంగా వ్యక్తమవుతున్నాయి. నినానానేకప యూథముల్ వనములోనం బెద్దకాలంబు సన్మానింపన్–అడవిలో చాలాకాలంగా పెక్కుఏనుగుల సమూహాల గౌరవాన్ని పొందాను అనడంలో గజేంద్రుని యొక్క రాజసాహంకారము, నిదశలక్షకోటి కరణీనాథుండనై – పది లక్షల కోట్ల ఆడ ఏనుగులకు అధినాధుడనై అనడంలో తామసాహంకారము, మద్దానాంబ్ల పరిపుష్ట చందనలతాంతచ్ఛాయలొ – నా దాన జలధారలతో పెరిగిన మంచి గంధపుచెట్ల నీడలు అనడంలో సాత్వికాహంకారం కనిపిస్తుంది. ఈ త్రిగుణాలతో నిండి యుండటం వలన గజేంద్రునికి భగవత్సాక్షాత్కారం లభించలేదు. చివరకు సత్త్వ రజస్తమో గుణాలనుండి బయటపడిన గజేంద్రుడు

**"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె దనువున్ డస్సెను శ్రమంబయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరంబెఱుగ మన్నింపందగున్ దీనునిన్**
**రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా"!**

అని భగవంతుని ప్రార్థించాడు, కొంచెము కూడా శక్తిలేదు, ధైర్యము పోయింది. ప్రాణాలు పోతున్నవి, మూర్ఛ వస్తోంది, శరీరం అలసిపోయింది, నీవే నాకు దిక్కు, ఈ దీనుణ్ణి రక్షించు అని తనలో ఉన్న సత్త్వరజస్తమో గుణాలను విడిచి పెట్టి ప్రార్థించిన తరువాతనే గజేంద్రునికి భగవదనుగ్రహం కలుగుతుంది. వ్యక్తిని బంధించే ఈ త్రిగుణాలనుండి బయటపడితేనే ఏవ్యక్తి అయినా ఏదైనా సాధించగలడని వ్యక్తమవుతున్నది.

**ఆధార గ్రంథాలు**

1. ఆరుద్ర( 2007): సమగ్రాంధ్ర సాహిత్యం (ప్రథమ భాగము) , తెలుగు అకాడమి, హైదరాబాదు.
2. రాధాకృష్ణమూర్తి సూరపరాజు(2004): శ్రీమద్భగవద్గీత- శంకరభాష్యము (సంస్కృతమూలము-తెలుగుఅనువాదము)హైదరాబాదు.
3. పోతన బమ్మెర (2006) : శ్రీమహాభాగవతము, మొదటి, రెండవ సంపుటములు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
4. శ్రీపోతన భాగవత మధురిమలు (2009), గీతాప్రెస్, గోరఖ్ పూర్.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# మహాభారతంలో కౌశికుని కథ - సత్వరజోగుణములు

**డా॥ సి. నర్సింహులు,**
సహాయ ఆచార్యులు,
యం.వి.యస్. ప్రభుత్వ ఆర్ట్స్& సైన్స్ కళాశాల (స్వయం),

మానవభౌతిక ప్రకృతికి సంబంధించిన గుణాలు మూడు. అవి సత్వగుణం, రజోగుణం, తమోగుణం. ఈ గుణత్రయ విభాగంలో సత్వగుణం వల్ల జ్ఞానం, రజోగుణం వల్ల మోహం, తమోగుణం వల్ల అవివేకము కలుగుతుందని గీతలో చెప్పబడింది. సత్వగుణం పవిత్రమైనది, జ్ఞానతృష్ణ కలవారుగా ఉంటారు. రజోగుణం ఉండడం వల్ల ప్రాపంచిక భోగాల మీద ఆసక్తి కలుగుతుంది. మరియూ గర్వము, అహంకారము పెరుగుతాయి. తమోగుణం అధికంగా ఉన్నవారిలో సోమరితరము, నిర్లక్షము, అజ్ఞానము అధికంగా ఉంటాయి. ఈ గుణం కలిగినవారు నిప్రయోజకులౌతారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు...

**సత్వం సుఖే సజ్జయతి రజ: కర్మణి భారత:**
**జ్ఞానమావృత్యతు తమ: ప్రమాదే సంజత్యుత**

సత్వగుణము సుఖమును ఇస్తుంది. రజోగుణము కర్మలు చేయడంలో ఆసక్తి కలుగజేస్తుంది. తమోగుణము మనలోవున్న జ్ఞానమును కప్పివేసి నిర్లక్షమును, సోమరితనమును కలుగజేస్తుంది.

ప్రస్తుతము భారతారణ్య పర్వములో కౌశికుని కథ నుండి సత్వ, రజోగుణాలను తెలుసుకుందాము...

సకలవేదవేదాంగవేత్త యైన కౌశికుడను ఒక బ్రాహ్మణుడుండేవాడు. అతను చెట్టు మొదట్లో కూర్చొని వేదాధ్యయనం చేస్తుండగా చెట్టు కొమ్మమీద ఉన్న ఒక కొంగ విడచిన రెట్ట అతనిపై పడింది. అతడు కోపంతో దానికేసి చూడగానే అది మరణించి క్రింద పడిపోయింది. "అయ్యో! కోపవశుడనై చేయకూడని పని చేశాను కదా!" అని విచారిస్తూ అతడు భిక్షాటనానికై గ్రామంలోని పవిత్రమైన కుటుంబాల దగ్గరకు వెళ్ళాడు.

పుర్వం వెడుతున్న ఇంటికే వెళ్లి 'భిక్షాం దేహి' అన్నాడు. గిన్నెలు తోముకొంటున్న అ యింటి కుటుంబిని 'వస్తున్నాను, నిలబడు' అంది. ఇంతలో ఆకలితో చాలా బాధపడుతున్న ఆమె భర్త వచ్చాడు. అప్పుడా పతివ్రత ఆ బ్రాహ్మణుని సంగతి చూడకుండా తన భర్తకు పాద్య-ఆచమనాదులు యిచ్చి భోజనం పెట్టింది. ఆమె మనోవాక్కాయలచే భర్తనే దైవంగా భావిస్తూ వుండేది. భర్తకు శుశ్రూష చేస్తున్న ఆమెకు బ్రాహ్మణుని మాట జ్ఞాపకం వచ్చింది. అలా మరచిపోయి, ఆలస్యం చేసినందుకు ఆమె సిగ్గుపడుతూ భిక్షం తీసుకొని వెళ్ళింది. ఆమెను చూచి ఆ బ్రాహ్మణుడు – "భిక్షం ఇస్తాను, ఆగమని చెప్పి, నన్ను పంపనేలేదేమిటి!" అన్నాడు. ఆ బ్రాహ్మణుడు క్రోధంతో మండిపడుతున్నాడు. అతనిని చూచి ఆ సాధ్వి వినయపూర్వకంగా – "విద్వాంసుడా! నన్ను క్షమించు. నాకు నా భర్త దేవత. ఆయన ఆకలితో ఉన్నాడు. అందుచేత ఆయనకు శుశ్రూష చేసి వచ్చాను" అంది.

న్నావు. పెద్దలసేవ చేసినట్లు లేదు. బ్రాహ్మణులంటే ఏమనుకొన్నావు, అగ్నివంటి వారు. పృథ్విని కూడా కాల్చివేయగలరు" అన్నాడు బ్రాహ్మణుడు.

అప్పుడు ఆ గృహిణి ఇలా అంది. " తపోధనా! నేను కొంగను కాను. ఈ కోపదృష్టి నన్నేమి చేయజాలదు. దేవతలతో సమానులైన విప్రులను నేనెన్నడు అవమానించను. నేను చేసిన ఈ అపరాధం క్షమించు. విప్రులు ఎంత మహిమసంపన్నులో నాకు తెలుసు. అగస్త్యుడు మొదలైన మహాప్రభావశాలుల గూర్చి విన్నాను. నాకు దేవతలందరూ నా భర్త తరువాతనే. పతి శుశ్రూషయే పరమధర్మం అను విశ్వాసంతో నా ధర్మాన్ని ఆచరిస్తున్నాను."

ఆమె ఈ విధంగా తాను అనుసరిస్తున్న ధర్మాన్ని గూర్చి వివరించి బ్రాహ్మణులకు ఉండవలసిన లక్షణాలను వివరించి చెప్పింది.

బ్రాహ్మణోత్తమా! మనుష్యుల శరీరాలలో దాగి ఉన్న శత్రువు క్రోధమే. "క్రోధమోహాలను విడచినవాడే బ్రాహ్మణుడు" అని దేవతలంటారు –

**"క్రోధః శత్రుః శరీరస్థో మనుష్యానాం ద్విజోత్తమ,**
**యః క్రోధమోహౌ త్యజతి తం దేవా బ్రాహ్మణం విదుః".**

ద్విజోత్తమా! నీవు కూడా స్వాధ్యాయ నిరతుడవై శుచిగా ఉన్నావు. కాని ధర్మతత్త్వం నీకు సరిగా బోధపడలేదని నా అభిప్రాయం. ఇక్కడ కౌశికుని రజోగుణం మనకగుపిస్తుంది.

మిథిలలో ధర్మవ్యాధుడున్నాడు. తల్లిదండ్రుల సేవచేస్తూ, సత్యమే పలుకుతూ, జితేంద్రియుడై యున్నాడు. అతని వద్దకు వెళ్లి అడిగి ధర్మాలు తెలుసుకో. నేనేమైనా అధికంగా మాటలడితే క్షమించు.

ఆ మాటలు విని బ్రాహ్మణుడు – "మంగళప్రదురాలా! నీవు చేసిన నింద నాకు చాలా సంతోష జనకంగావుంది" అని పలికి, తనను తానే నిందిచుకుంటూ ఇంటికి వెళ్లాడు.

ఆ గృహిణి కొంగను గూర్చి చెప్పడంచేత, అనేకమైన ధర్మసమ్మతమైన విషయాలు బోధిచడంచేత నమ్మకం కలిగి కౌశికుడు ధర్మవ్యాధుణ్ణి కలవడానికై మిథిలకు వెళ్లాడు. నలుగురినీ అడుగుతూ ధర్మవ్యాధుని మాంస విక్రయశాల మూలలో నిలబడి నిరీక్షించాడు.

ఆ ద్విజుడు వచ్చినట్లు తెలియగానే ధర్మవ్యాధుడు తొందరగా అతని దగ్గరికి వెళ్లి "పతివ్రత పంపగా వచ్చావని నాకు తెలుసు. ఏమి కావాలో చెప్పు" అన్నాడు. ఆ బ్రాహ్మణునికి ఈ మాట రెండవ ఆశ్చర్యహేతు వయినది.

"ఇది నీవు ఉండడానికి తగిన చోటు కాదు; మా ఇంటికి వెళదాం, రా" అంటూ ధర్మవ్యాధుడు కౌశికుణ్ణి తన ఇంటికి తీసికొని వెళ్లి అర్ఘ్యపాద్యాదుల చేత అతనిని సత్కరించాడు. బ్రాహ్మణుడు ధర్మవ్యాధునితో "ఈ ఘోరమైన మాంసవ్యాపారం నీకు తగినది కాదేమో అనిపిస్తున్నది" అన్నాడు.

"విప్రోత్తమా! ఇది నా తండ్రి తాతల నుండి వస్తూన్న కులోచితమైన వృత్తి. దీనినే అనుసరిస్తూ నా ధర్మంలోనే ఉన్న నా విషయంలో తప్పుపట్టకుము" అన్నాడా ధర్మవ్యాధుడు.

**"కులోచితమిదం కర్మ పితృపైతామహం పరమ్,**
**వర్తమానస్య మే ధర్మే స్వే మన్యుం మా కృథా ద్విజా"**

నేను వృద్ధులైన నా తల్లిదండ్రులకు శ్రద్ధతో సేవచేస్తున్నాను. సత్యమే పలుకుతాను. ఎవరిమీద నాకు అసూయలేదు. యథాశక్తిగా దానంచేస్తాను. దేనిని నీచంగా చూడను. నాకంటే ఎక్కువ బలవంతుడిని దూషించను.అని అంటూ ధర్మవ్యాధుడు వర్ణాశ్రమధర్మాలను బోధించాడు.

ఇంకా తన అలవాట్లు గూర్చి, "నేను ఇతరులు చంపిన వరాహాలు, దున్నలు మొదలైన వాటితో వ్యాపారం చేస్తాను కాని స్వయంగా వేటిని చంపను; మాంసం తినను. పగలంతా ఉపవాసం ఉండి రాత్రి మాత్రమే భోజనం చేస్తాను" అని చెప్పాడు.

కౌశికుడడుగగా అతడు ఇంకా అనేక ధర్మాలను జీవస్వరూపం మదలైన విషయాలను, కర్మ ప్రాధాన్యాన్ని, బ్రహ్మవిద్యకు సంబంధించిన విషయాలను విస్తృతంగా బోధించాడు. త్రిగుణాల స్వరూప స్వభావాలను వర్ణించి చెపుతూ, సకల ప్రాణుల ప్రవర్తన కూడా ఈ సత్వ, రజస్, తమోగుణాలను అనుసరించి జరుగుతుంటుందని అన్నాడు.

"శూద్రుడు సద్గుణాలను అలవరుచుకొన్నట్లయితే వైశ్యుడు గాను, క్షత్రియుడు గాను కూడా కావచ్చును. ఋజుస్వభావం అలవరుచుకొని బ్రాహ్మణుడు కావచ్చును" అన్నాడు.

**"శూద్రయోనౌ హి జాతస్య సద్గుణానుపతిష్ఠతః,**
**వైశత్వం లభతే బ్రహ్మన్ క్షత్రియత్వం తథైవ చ.**
**ఆర్జవే వర్తమానస్య బ్రాహ్మణ్యమభిజాయతే"**

ధర్మవాధుడు నాలుగు పురుషార్థాలకు సంబంధించిన అనేక ధర్మాలు బోధించి కౌశికుణ్ణి ఇంటిలోనికి తీసికొని వెళ్లి తన తల్లిదండ్రులకు చూపించాడు. వృద్ధులైన ఆ యిరువురు ఎంతో ఆనందంతో శుభ్రములైన వస్త్రాలు ధరించి సుఖమైన ఆసనాలమీద ఆసీనులై ఉన్నారు. ధర్మవ్యాధుడు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి, వాళ్ల ఆశీస్సులు అందుకొని, ఆ బ్రాహ్మణుని గూర్చి వాళ్లకు తెలిపాడు. వాళ్లు అతనిని స్వాగతంతో సత్కరించారు. అతడు వాళ్ల క్షేమసమాచారాలు తెలుసుకొన్నాడు. నాకీ తల్లిదండ్రులే సకల దేవతాస్వరూపులు. నేను, నా భార్య, పుత్రులూ కూడా ఎల్లవేళలా వీరి శుశ్రూష చేస్తూంటాం. ఎల్లప్పుడూ వీళ్లకు అనుకూలంగా ఉన్న మాటలే మాటలాడతాను. అప్రియములనెన్నడూ పలకను. వీళ్లకు ప్రియమైనది ఏదైనా, అది ధర్మవిరుద్ధమైనా కూడా, అది ధర్మమే, అను భావనతో చేస్తాను.

ఈ కథలో రజోగుణం కలిగిన కౌశికుణ్ని సత్వగుణం కలిగిన పతివ్రత, ధర్మవ్యాధుడు మారుస్తారు. కావున ప్రస్తుతము, సత్వగుణాన్ని ఆచరిస్తే సకలం సంతోషంగా వుంటారు.

## ఆధార గ్రంథాలు

1. పుల్లెల శ్రీరామచంద్రుడు,2012. మహాభారత సారసంగ్రహం, శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్, కూకట్ పల్లి, హైదరాబాద్ -85.
2. పాటిబండ మాధవ శర్మ,1971. ఆంధ్ర మహాభారతము, (అరణ్య పర్వము) శివాజీ ప్రెస్ 1732 గంజి బజార్, సికింద్రాబాద్.

# శ్రీపాద స్వాతి కథల్లో త్రిగుణాలు

**డా. క్యాథరీనా,**
సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ సిటీ కళాశాల (స్వ.ప్ర),
హైదరాబాదు.

సాహిత్య ప్రక్రియల్లో సృజనాత్మక రచనలలో కథ ప్రప్రదమంగా ఉంటుంది. మానవ చరిత్రను పరిశీలిస్తే ఎన్నెన్నో కథలు శ్రుతులుగానో, స్మృతులుగానో నిలుస్తాయి కథలలో మానవుల మనోభావాలు, చిత్తవిభ్రమలు, చిత్తక్షోభ, రాగద్వేషాలు జీవితాన్ని పరిపూర్ణం చేసే త్రిగుణాలు కనిపిస్తుంటాయి. నేను తీసుకున్న స్వాతిగారి కథల్లో త్రిగుణాలు అన్ని కథల్లో ఎక్కువ తక్కువలుగా కనిపిస్తాయి. అవి ఏవిధంగా వున్నాయి అనేది ఒక్కోకథను పరిశీలించినట్లయితే విషదమౌతుంది.

మానవత్వానికి గోడలు కట్టుకుంటే మనజీవితాలు ఎలావుంటాయో గోడలు పగల గొట్టుకుంటే మానవత్వం ఎలా దర్శనమిస్తుందో చూపిస్తాయి. గోడలు సంపుటి లోని కథానికలు వైవిధ్య పూరితమైన మానవ స్వభావాన్ని చిత్రించిన ఈ కథానికల్లో పాటించిన కొలమానం మానవత్వంతో పాటు అన్ని కథల్లోనూ మానవ జీవితంలోని త్రిగుణాలు దర్శనమిస్తాయి.

హిందూ ధర్మ శాస్త్రాల్లో చెప్పబడిన ప్రధాన గుణములు తామస (తమోగుణము) రాజస (రజోగుణము) సత్వగుణము. ఈ సత్వగుణము మిగతా రెండింటికంటే పవిత్రమైనది, క్షేమదాయకమైనది. సత్వగుణప్రధానంగా జీవించే వారు సమాజంలో చాలా అరుదు వీరు జ్ఞానులు, పుణ్యలోకాలకు చేరుకునేవారు. రజోగుణ స్వభావం గలవారు ప్రాపంచిక భోగాల మీద ఆసక్తి, అశాంతి కలిగి వుంటారు. ఆశ ప్రధాన లక్షణంగా కలిగివుంటారు. ఇక తమోగుణ లక్షణం సోమరితనం, అజ్ఞానం, జడత్వం, నిర్లక్ష్యము మొదలైన గుణాలు ప్రధానంగా కలిగి ఉంటారు.

అయితే నేను తీసుకున్న శ్రీపాద స్వాతి గారి కొన్ని కథల్లో త్రిగుణాలు ఎక్కువ, తక్కువ కొలమానాల్లో కనిపిస్తాయి. అవి ఏవిధంగా వున్నాయో ఒక్కో కథను పరిశీలించినట్లైతే విశదమౌతుంది.

**"మనసున్న మనిషి"** కథలో జానకిరామయ్యను పెంచిన తండ్రి చాలా ప్రేమతో పెంచాడు అనడానికి నిదర్శనం తన కొడుకుతో రాముడు నీకు తెలుసు నువ్వు నా ప్రాణంలో ప్రాణం --- నువ్వు ఈ ఇంటికి వచ్చాకే నా దశ తిరగి పట్టిందల్లా బంగారమైంది నీ మాట పెగలడంలేదు కాని ఒరే నువ్వు నాకీ గొడ్లపాక పంచన ఎండలో దొరికావు. ఏ అమ్మ ఒదిలేసి వెళ్ళిందో కాని నువ్వు నాబిడ్డవైనావు నీకు చేతనైతే నిన్ను పెంచిన అమ్మను క్షమించు అనటంలో ఆమె ఎంత రాక్షసో మనం అర్థం చేసుకోవచ్చు అలాంటి అమ్మను క్షమించి ఆమె అనారోగ్యంతో

వున్నప్పుడు భార్యభర్తలిద్దరు సపర్యలు చేస్తూ ఒకరోజు డాక్టర్ని ఇంటికి పిలుచుకు వచ్చారు. డాక్టర్ వస్తూనే తెల్ల బోయాడు. గొంతు పెగుల్చుకుని జానికిరామయ్యగారూ --- మీ మంచితనం చూస్తుంటే నాకు నోటమాట రావడంలేదు. అపకారికి ఉపకారం అని పద్యాల్లో చదువుకున్నాను గాని కళ్ళారా చూడటం ఇదే మొదలు అని అనడంలోనే వుంది ఆ పెంచిన తల్లి ఎంత గయ్యాళో వారినెంతగా కాల్చుకుతిన్నదో.ఏదేమైనా మనిషి కష్టాల్లో
ఉన్నప్పుడు కాఠిన్యానికి పోలేరుకదా! వారు చేసిన సేవకు మసకబారిన రమణమ్మ కళ్ళల్లో జానకిరామయ్య రూపమే విశ్వమంతా పరచుకున్నట్టు కనిపించింది. ఇది సత్వగుణానికి ప్రతీకగా నిలిచిన కథ.

అభ్యుదయం కథలో ప్రధానపాత్ర వసుమతి, చిన్నప్పటి నుండి స్వతంత్ర భావాలతో పెరిగిన మనసు వాళ్ళకో, వీళ్ళకో ఊడిగం చేస్తూ గడపటానికి సుతరామూ సమ్మతించదు. అది కన్న తల్లిదండ్రులైనా, కన్న పిల్లలైనా సరే. అందుకే తను స్వతంత్రంగా బ్రతకాలనుకుంది పిల్లల మీద ఆధారపడటం ఇష్టంలేని తను
ఓ పత్రికాఫీసులో ఉద్యోగం సంపాదించి సమర్థవంతంగా, సంయమనంతో పనిచేస్తూ కాలంవెళ్ల బోసుకుంటుంది. కానీ ఆ పత్రికాఫీసులోని పైఅధికారి వెకిలిచేష్టలను భరిస్తూనే తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ అతనికిబాగా బుద్ధిచేప్తుంది. ఈకథ అన్నితరాలని ఆలోచింప చేసేదే అవకాశం, అవసరం, మనిషిని నిలబెట్టాలంటే సహనంతో పాటు తెలివి అవసరం అని అయితే సహనం చేతకానితనం కాదంటూ చెప్పడం ప్రశంసించదగ్గ విషయం.

**"కాంప్లెక్స్ నీడలో"** అనే కథ ఇప్పటికీ చాలా కుటుంబాలలో జరుగుతున్నదే తల్లి దండ్రుల పక్షపాత ధోరణితో పిల్లల మనసులు ఎంతగా నలిగిపోతాయో అనుభవించిన వారికి తెలుస్తుంది. రాజ్, జయ దంపతులకు ఒకడే కొడుకు. వాడికి 11 సంవత్సరాలు వచ్చినా ఇంకెవరూ వద్దు అనే భావన రాజ్‌లో వుంటుంది. ఎందుకంటే తను చిన్నప్పుడు అనుభవించిన తల్లిదండ్రుల పక్షపాత ధోరణియే దానికి కారణమని వివరిస్తాడు భార్య జయకు అక్క తెల్లగా అందంగా వుంటుంది ---తెలివైనది. నేను రంగులేక పోవడం నాతప్పాని పెద్దగా తెలివితేటలు లేకపోవడం నాతప్పాని అడుగడుగునా అక్కను పొగడడం నన్ను ఎద్దేవా చేస్తూ మాట్లాడటం నిజంచెప్తే ఆశ్చర్యపోతావ్ జయా చిన్నప్పుడు అక్క చచ్చిపోతే గాని పీడవదలదనుకునే వాడిని. అంతక్రౌర్యంగా ఎలా అనుకునే వాడినో నాకే తెలీదు. అందుకే నా పిల్లల్లో ఇలాంటి కాంప్లెక్స్ రాకూడదనే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్కరే ఉండాలను కున్నాను. అని ఒక్కరితోనే సరిపుచ్చుకున్నాటండే అతని మనసు ఎంత గాయపడిందో ఇలాంటి విషయాలు తల్లిదండ్రులు ఎంతమంది గమనిస్తారు? ఏదో ఒక విషయంలో పిల్లల్లో అభద్రతాభావాన్ని కలుగజేసే తల్లిదండ్రులు ఇంకా ఈ సమాజంలో
ఉన్నారనేది గమనార్హం. ఈ కథ రజోగుణానికి మంచి ఉదాహరణ.

అదే విధంగా కొడుకు కథలో స్వార్థంతో కూడిన కొడుకు కన్నా తమని నమ్మివచ్చిన కోడలి శ్రేయస్సు ముఖ్యం అనుకుంటారు. అదేవిధంగా కోడలు భర్తకు ముందే వివాహమైందని తెలుసుకొన్నాగాని ఇంటి దగ్గర పరిస్థితి బాగోలేక వారందర్ని ఎదిరించి వెళ్లలేక క్యాన్సర్ నాల్గవ స్టేజ్‌లో వున్న అత్తగారికి సేవ చేస్తూ సహనంగా వుండటం గమనార్హం.

కథలోకి తొంగిచూస్తే తులసిని ఏరికోరి చేసుకుంటాడు సంపత్, ఆమె ఆర్థిక పరిస్థితిని గమనించి కేవలం ఒక బంధుత్వానికి, అవసరానికి మాత్రమే స్వీకరించాడు. కానీ ఆమె మాత్రం భర్త ఆదరణ కోసం కాలం గడిపింది.

ఎక్కడో అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడని తులసి అదృష్టవంతురాలనీ అందరూ అనుకుంటారు కాని తన స్నేహితుని ద్వారా సంపత్‌కు ముందే వివాహం జరిగిన విషయం ఇంకా ముంబాయిలో ఉద్యోగం అనే సంగతి తెలుస్తుంది. సంపత్ కూడా ఒకరోజు ఫోన్‌లో చెప్పాడు. అసలు విషయం అప్పుడే మామగారు కూడా వింటారు. కొడుకు గురించి తెలుసుకున్న తండ్రి కోడలుచూపించిన సహనానికి, ఆదరణకు కానుకగా ఆమెకు పూర్తి స్వతంత్ర జీవనం కొనసాగించమని చెప్పాడు. కారణం కాలం దేనినైనా మారుస్తుందనే ప్రాథమిక విషయం అందరికీ తెలుసు. పెళ్ళయి భర్త తనను తీసుకెళ్ళకపోయినా అత్తామామలు దగ్గర వున్నందుకే వసుమతికి ఆ గౌరవం స్వేచ్ఛ దొరికాయి. కొన్ని సార్లు సహనంగా ఉండటమే సరైనదని ఈకథద్వారా తెలుస్తుంది.

ఈ విధంగ శ్రీపాద స్వాతి కథల్లో మానవ జీవితంలోని త్రిగుణాలు చిన్నచిన్న కథల రూపంలో కనిపిస్తూ అన్ని వర్గాల, వయసుల వారిని ఆలోచింపచేసే విధంగా ఉండటం హర్షనీయం.

## ఆధార గ్రంథం

1. గోడలు కథా సంపుటి - శ్రీపాద స్వాతి -2010

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# కథ - త్రిగుణములు

**పి. కుసుమ కామేశ్వరి,** ఎం.ఎ., ఎం.ఫిల్,
తెలుగు శాఖాధిపతి,
శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల,
రాజమహేంద్రవరం.

**"సత్త్వం రజస్తమ ఇతి గుణా: ప్రకృతి సమ్భవాః**
**నిబధ్నన్తి మహాబాహో దేహీ దేహినమవ్యయమ"**

భౌతిక ప్రకృతి సత్త్వరజస్తమో గుణములనెడి గుణములను కలిగియుండును. నిత్యుడైన జీవుడు భౌతిక ప్రకృతితో సంపర్కమును పొందినప్పుడు ఈ గుణములచే బద్ధుడగును.

ఇది సాక్షాత్తూ భగవంతుడు చెప్పిన మాట అంటే ప్రతీ జీవుడూ ఈ త్రిగుణములచే బంధింపబడి ఉంటాడు అన్నది వాస్తవం. అయితే సత్త్వగుణము మిగిలిన రెండు గుణముల కంటె ఉన్నతమైనది, పవిత్రమైనది. ఈ గుణమునందున్న వారు సౌఖ్యము చేత, జ్ఞానము చేత బద్ధులగుదురు. రజోగుణ బద్ధుడు అపరిమితమైన కోరికలచే కామ్యకర్ముడు అవుతాడు. మరి తమోగుణము మోహ కారణము. బుద్ధిహీనత, నిద్ర, సోమరి తనము వంటి ఫలితాలను అందించును.

అంటే మానవుడు తాను ఏ గుణముచే బద్ధుడైనచో అతని కర్మలు వాటిని బట్టియే ఉండును. సత్త్వగుణముతో చేసే కర్మ పుణ్యకర్మ అది నిర్మలము - శుద్ధము. రజోగుణము నందు ఆచరించు కర్మలు కేవలం తాత్కాలిక సుఖమును అందించును. భౌతిక ఆనందము కొరకు చేయు ఏ కార్యమైనా అది దుఃఖపూరితంగా ఉండును. ఇక తమోగుణంతో ఉన్న కర్త జ్ఞానహీనుడు అవుతాడు. అతడు చేసే ఏ పనీ ఉపయుక్తము కాదు. వర్తమానమున దుఃఖమును కలిగించును. మూర్ఖుడు వలన ఏ విధమైన ప్రయోజనము ఉండదు సరికదా వాని వలన అనేక కష్టాలు కలుగును. విడివిడిగా ప్రకృతిలో కానవచ్చే త్రిగుణములు ఇవే. అయితే ఒకో గుణాన్ని ఒకొక్కరు కలిగి ఉండటం అనేది చాలా సబబు. మహర్షులు, యోగులు నిత్యం సత్త్వ గుణంతో ఉంటూ అలౌకిక నిత్యానందాన్ని పొందుతారు. రజోగుణ సంపన్నులై మానవులు తమ ఐచ్ఛిక కామ్యముల వెంట పరుగిడుతూ సుఖిస్తూ, దుఃఖిస్తూ ఉంటారు. ఇక తమో గుణం కలిగిన వారిని పశుతుల్యులుగా చెప్పవచ్చు. ఇలా ఒకొక్కరూ ఒకో గుణాన్ని పొంది ఉండటం జరుగుతూ ఉంటుంది. అయితే సత్త్వగుణం మిగిలిన రెండు గుణాలనూ అధిగమించిన నాడు ఆధ్యాత్మిక మార్గాన ఉన్నతుడు అవుతాడు. అదే రజోగుణం సత్త్వతమో గుణాలను అధిగమించిన నాడు స్వార్థపరుడైన వాడిగా మిగిలిపోతాడు. తమోగుణం ఎక్కువైతే పశువుగా మారిపోతాడు. ఏ గుణాన్ని పెంచుకోవాలి, దేన్ని తగ్గించుకోవాలి అన్నది మానవుని కర్మల మీద అతని విజ్ఞత మీద ఆధారపడి ఉంటుంది. ఈ మూడు గుణాలను

కలిగిన మానవులను మన పురాణ, ఇతిహాసాల కావ్యాల నుండీ చూస్తూనే ఉన్నాము. రజోగుణ సంపన్నులైన దేవతలనూ, సత్త్వగుణ స్థితులైన దానవులనూ కూడా మన పురాణాలలో" దర్శించవచ్చు. అయితే ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్యంలో ఈ త్రిగుణములతో కూడిన పాత్రలతో అనేక నవలలు, నాటికలు కథలు కనబడతాయి. ఒకే పాత్ర ఆయా సందర్భాలలో ఒకో గుణంతో కర్తవ్య నిర్వహణ చేసే పాత్రలు కూడా కనిపిస్తాయి. **"ప్రతి జీవితం ప్రత్యేక జీవితం. ఒకరికీ మరొకరికీ సంబంధం లేదు"** అంటారు. దేవరకొండ బాలగంగాధర్ తిలక్ స్వార్థం మాత్రమే నిండిపోయిన ఈ సమాజంలో మానవత్వం ఎలా పతనమవుతోందో **'తిలక్ కథలు'** లో వివరిస్తారు. పరిపక్వత, సంపూర్ణత కలిగిన తిలక్ రాసిన కథలలో **"నల్లజర్ల రోడ్డు"** అనే కథలో ఈ త్రిగుణాలకూ ప్రతీకలైన పాత్రలు కన్పిస్తారు.

అవసరానికీ, అవకాశానికీ వ్యక్తిలో ఒకోగుణం ఏ విధంగా ప్రేరేపించబడుతుందో తిలక్ ఈ కథలో చక్కగా వివరిస్తారు. మర్నాడు కలెక్టరు గారి ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు దగ్గరుండి చూసుకోవాలనే నెపంతో (ఒక విధమైన స్వార్థంతో) రాత్రికి రాత్రి కారులో ప్రయాణమైన భూషణం, రామచంద్రం పాత్రలు ఆ సమయానికి మూర్ఖంగా ప్రవర్తించే రజోగుణ సంపన్నులు. రామచంద్రాన్ని పాము కాటేసినప్పుడు, అర్ధరాత్రి, కారడవిలో అతనికి చావు ఎలాగో తప్పదు, తామైనా తప్పించుకు గూడెం వైపు వెళ్లిపోదామా అని ఆలోచించేటప్పుడు తమ స్వార్థాన్ని మాత్రమే ఆలోచించుకునే రజోగుణం వారిలో కనిపిస్తుంది. ఈ కథలో దాదాపు అన్ని పాత్రలు రజోగుణంతోనే ఉంటాయి. కేవలం వారి సుఖం, వారి స్వార్థం. అయితే రామచంద్రాన్ని కాపాడటానికి ముందుకు వచ్చిన సిద్ధయ్య, అతని కూతురు సూరీడు నిస్వార్థంగా పనిచేసి, పాము విషాన్ని తొలగించే సాత్త్విక మూర్తులు. అర్ధరాత్రి పూట ఆడపిల్ల అడవిలో వేరు ముక్క కోసం వెదుతూ వుంటే చూస్తూ ఉటారే కానీ ఏ మగవాడు సాయానికి వెళ్ళడు. సాయం చేయకపోగా ఆ చలి రాత్రిలో 4 నెలల గర్భవతి అయిన సూరీడుని, భూషణం తన కోరిక తీర్చు, డబ్బులిస్తానని అడగడంతో అతనిలోని రజోగుణం కూడా దిగజారి తమోగుణంగా మారిపోతుంది. పశువుగా ప్రవర్తించాడే అనిపిస్తుంది.

ఏ స్వార్థం లేకుండా కేవలం తమ వద్దనున్న మంత్ర విద్యతో పాము విషాన్ని తొలగించి బ్రతికించిన రామచంద్రం నుండి పైకాన్ని ఏ మాత్రం స్వీకరించని శుద్ధ సత్త్వం సూరీడు పాత్ర. గడ్డు కాలాన్ని దాటి కలెక్టరు గారి ఇంట్లో పెళ్లికి వెళ్లాలని బయలుదేరితే, అకస్మాత్తుగా సిద్ధయ్యకి పాము కరిచింది, కొంచెం ఇంటికి చేర్చడానికి సాయం చేయమని అర్థించిన సూరీడుకి చేతిలో రెండు నోట్లు పెట్టి బస్సు ఎక్కి పట్నానికి వెళ్లిపోయిన వారిలో స్వార్థం కంటే దిగజారిపోయిన మూర్ఖత్వం కనిపిస్తుంది. తమోగుణంతో జ్ఞానవిహీనులైన వ్యక్తులుగా ఆ కథలో పాత్రలు కనిపిస్తాయి. మీరుంటే ధైర్యంగా ఉంటుంది రండిబాబూ అన్న సూరీడుతో మేం వుండి మాత్రం ఏం చెయ్యగలం? అవతల కలెక్టరు గారింట్లో పెళ్లి అంటూ బస్సు ఎక్కేసిన మానవత్వాన్ని ఏ కల్మషం ఎరుగని సత్త్వగుణం (సూరీడు) నోరావలించి గుడ్లప్పగించి చూస్తూ నిలబడింది – అంటారు తిలక్.

ఈ కథనే నేను ఎందుకు ఎంచుకున్నాను? అంటే నేటి కాలంలో యువత కేవలం రజో, తమో గుణాలతో ప్రవర్తిల్లుతూ, అధునేతనం, ఆదునికీకరణ అంటూ వైదిక ధర్మాలకూ, పురాణ పఠనాలకూ, పెద్దల ఆచారాలకూ,

అన్నింటికీ విభిన్నమైన జీవన శైలిని అవలంబిస్తున్నారు. మన ప్రబంధాలు, మహాకావ్యాలు చదవక పోయినా కనీసం, ఆధునిక సాహిత్యంలోని కవితలు, కథలు అయినా, కనీసం పేర్లు అయినా చెబితే వాటిపట్ల అనువక్తులు అవుతారేమో అనే ఆశతో కథలు అనే అంశంలో తిలక్ గారి "నల్లజర్ల రోడ్డు" కథలోని త్రిగుణముల ఆవిష్కరణ ఎలా జరిగిందో చూపే ప్రయత్నం చేసాను. ఇలాంటి గుణ చిత్రణే కాళీపట్నం రామారావు గారి **"భయం"** కథలోనూ కన్పిస్తుంది. ప్రతీ వ్యక్తీ తన స్వార్థానికీ, తన సుఖ సంతోషాలకే ప్రాధాన్యమిస్తూ, మంచితనం, మానవత్వం మరచిపోయి, త్రిగుణాత్మకమైన విశ్వాన్ని కేవలం ద్విగుణాత్మకంగా మార్చేస్తున్నారు. రజోగుణంతోనే జీవనం సాగించేస్తున్నారు. మనిషి చేసే కర్మల ననుసరించే ఫలాలు పొందుతాడు. ప్రస్తుతానికి సుఖాన్ని పొందినా, సత్త్వగుణ సంపన్నుడు కానంతవరకూ ఏ విజయాన్ని పొందలేడు. ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందలేడు. దానవ రాజైనా దానం విషయంలోనూ, ధర్మం విషయంలోనూ సాత్త్వికంగా ప్రవర్తించాడు కనుకే బలిచక్రవర్తి విష్ణువుచే వరాన్ని పొందాడు. మహర్షి అయినప్పటికీ తన శిష్యుడి పట్ల స్వార్థంతో రజోగుణంతో వర్తించాడు కనుకే శుక్రాచార్యుడు ఒక కంటిని కోల్పోవలసివచ్చింది. కనుక మన ప్రవర్తనలే, మన కర్మలే మన ఫలితాలను నిర్ణయిస్తాయి.

**"రజోగుణము నందుండి మరణించువాడు కామ్యకర్మ రతుల యందు జన్మించును. తమో గుణము నందుండి మరణించువాడు జంతు రాజ్యమున జన్మించును.** అని గీతలో కృష్ణభగవానుడు స్పష్టంగా వివరించాడు. కనుక మానవ జన్మను పొందిన జీవుడు తన ప్రయత్నపూర్వక సత్త్వగుణ సాధనచే ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నతపథం వైపు చేరాలి కానీ, మరింత పతనమై నీచస్థితికి చేరరాదు. అవసరానికీ, అవకాశానికీ,కోపాలకీ, ఆవేశాలకీ, ప్రేమలకీ, ఆకర్షణలకీ, వ్యామోహాలకీ లోనై జీవును పతనం కారాదు. సత్త్వ గుణాన్ని స్వీకరించాలి. రజోగుణాన్ని సంస్కరించాలి. తమో గుణాన్ని సంహరించాలి. ఇదే రాముడు చేసి చూపించాడు. మనకి ఆదర్శప్రాయుడై నిలిచాడు. తమోగుణ సంపన్నురాలైన తాటకిని సంహరించాడు. రజోగుణ ప్రేరితమైన అహల్యను సంస్కరించాడు. సత్త్వగుణవిలసితురాలైన సీతను స్వీకరించాడు. ఇదే రామాయణం - మన జీవన పారాయణం. రజ, తమో గుణాలను తగ్గించుకుంటూ సత్త్వగుణ సాధనలో త్రిగుణ రాహిత్య స్థితిని పొందేలా మనిషి ఎదగాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు**

1. భగవద్గీత - భక్తి వేదాంత బుక్ ట్రస్ట్ -2014
2. తిలకి కథలు- విశాలాంధ్ర బుక్ హౌస్-2004-దేవరకొండ బాలగంగాధర తిలక్
3. భయం- కథానిలయం -కారా మాస్టారు-1999

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# మహాభారతంలో త్రిగుణములు

**డా. పి. కమలసుధారాణి,**
సహాయాచార్యులు, తెలుగుశాఖ,
సిటీ కళాశాల, హైదరాబాద్.

ఆదికవి నన్నయ రచించిన మహాభారతం సర్వశాస్త్ర సంగ్రహం. ఏ విషయానికి సంబంధించిన జ్ఞానాన్ని పొందాలన్న భారతంలో నాడు-నేడు కూడా పొందవచ్చు. అందుకు ఆనాడే భారతాన్ని గూర్చి ఇలా చెప్పారు.

**"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని**
**యధ్యాత్మవిదులు వేదాంతమనియు**
**నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని**
**కవి వృషభులు మహాకావ్యమనియు**
**లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని**
**యైతిహాసికులితి హాసమనియు**
**పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్ఛ**
**యంబని మహిగొనియాడు చుండ**
**వివిధ వేదతత్త్వ వేది వేదవ్యాసు**
**డాదిముని పరాశరాత్మ జుండు**
**విష్ణు సన్నిభుండు విశ్వ జనీనమై**
**పరుగుచుండుజేసె భారతంబు"**

అంతే కాదు మానవ జీవనం త్రిగుణాలైన సత్త్వ, రజో, తమో గుణాలతో నిండి ఉంటుంది. ఒక్కొక్కరిలో ఒకో గుణం ఎక్కువగా ఉంటుంది. దానఫలితం ప్రభావం తెలుసుకొనడానికి మహాభారతం చక్కని కరదీపిక వంటిది. నన్నయ మంచి కథకుడు. ఉత్తమమైన కథలతో సందర్భానుసారంగా ఎన్నెన్నో విషయాల విశ్లేషణను చేశాడు. తద్వారా ఎవరికి ఏది కావాలో అది స్వీకరించవచ్చు. మానవ జీవితం అనేక విషయాలతో ముడిపడి ఉంటుంది. అందుకే అనేక పాత్రల ద్వారా నన్నయ మానవ జీవనసౌఖ్యానికి అవసరమైన విషయాలను చెప్పాడు. ఉదా:చక్కని శిష్యుడు అంటే జ్ఞానం కోసం తపించే వాడిగా కచుని పాత్ర ద్వారా నైతిక విలువలను బోధించాడు. మృతసంజీవని విద్య కోసం కచుడు రాక్షస గురువైన శుక్రాచార్యుని వద్దకు వచ్చాడు. ఆ సందర్భంలోనే కచుని

కుమార్తె దేవయాని కచుని పట్ల ఆకర్షితురాలైంది. అంతే కాకుండా మిగతా రాక్షస శిష్యులు కచుని పట్ల ఈర్ష్యా, ద్వేషాలు పెంచుకున్నారు. రజోగుణానికి ప్రతీకగా ద్వేషాన్ని, కోపాన్ని చెప్పవచ్చు. అనేకసార్లు కచుని ఇబ్బంది పెట్టారు. చివరికి కచుని చంపి, బూడిద చేసి, ఆ బూడిదను సురాపానంతో కలిపి శుక్రాచార్యునికి ఇచ్చారు. సురాపాన ప్రియుడైన శుక్రాచార్యుడు అది తాగేశాడు. గోధూళివేళయైనా కచుడు రాలేదు. దేవయాని దుఃఖిస్తూ తండ్రి శుక్రాచార్యుని వద్దకు వెళ్ళింది. దివ్యదృష్టితో శుక్రుడు కచుని బూడిద రూపంలో తన ఉదరంలో ఉన్నాడని గ్రహించాడు. తన ఉదరంలో ఉన్న కచునికి మృతసంజీవిని విద్య బోధించాడు. అప్పుడు కచుడు శుక్రాచార్యుని ఉదరం చీల్చుకొని బయటకు వచ్చి, తిరిగి ఆయన్ని మృతసంజీవని విద్య ద్వారా బ్రతికించాడు. ఆ తర్వాత దేవయాని కచునికి తన ప్రేమని చెప్పగా కచుడు అది తప్పని, తామిద్దరు సహోదరులమని వారించాడు. అదీగాక గురుపుత్రి సోదరి వంటిదని నచ్చచెప్పాడు. అందుకు కోపించిన (క్రోధం) దేవయాని కచునికి మృతసంజీవిని విద్య పని చేయరాదని శపించింది. కచుడు కూడా దాసీ జీవితం పొందుతావని శపించాడు. ఈ కథ మానవ జీవనంలోని క్రోధగుణానికి ప్రతీకగా చెప్పవచ్చు. అంతేకాదు క్రోధం వలన ఎన్ని అనర్థాలుంటాయో గ్రహించవచ్చు. రజోగుణ ప్రధానమైన కథలెన్నో మహాభారతంలో సందర్భానుసారంగా చెప్పబడ్డాయి. అవి వినడం లేదా చదవడం వలన ఎవరైనా సక్రమంగా ఉండటానికి, క్రోధాన్ని అదుపు చేసుకోవడానికి ఆస్కారం ఉంది.

సత్త్వ గుణము. సత్త్వము అనగా శాంతము. మహాభారతంలో శాంతానికి ప్రతీకగా చెప్పదగిన పాత్ర ధర్మరాజుది. అయితే కర్ణుడు కూడా ఒకానొక సందర్భంలో గురువుకి నిద్రాభంగం కలుగుతుందని ఇంద్రుడు పురుగురూపంలో వచ్చి ఉరువులు కొరుకుతున్నా శాంతంగా బాధని మ్రింగి భరించాడు. కానీ ధర్మరాజు శాంత స్వభావాన్ని చూస్తే మానవ జీవనంలో దాని ప్రాధాన్యం అర్థమవుతుంది. విద్యాభ్యాసంలో, ఆ తర్వాత అనేక సందర్భాల్లో గొడవలు ఎన్ని వచ్చినా తమ్ములను ఆదరిస్తూ వంశ ప్రతిష్ట కోసం ఎన్నో కష్టాలు అనుభవించటానికి కూడా వెనుదీయని శాంతమూర్తి. పాండవులలో ప్రథముడైన ధర్మజుని వల్లనే వారికి కీర్తి, సౌఖ్యాలు చివరికి దొరికాయని పలువురి అభిప్రాయం. మాయాజూదంలో ఓడినా, అడవులలో నివసించినా, అజ్ఞాతవాసం చేసినా ఆడితప్పని వాడని, ధర్మానికి ప్రతీక అని ధర్మరాజుని అనడానికి కారణం ఆయన శాంత గుణమే.

తమోగుణం అనగా సోమరితనం, అతినిద్ర. ఇది దాదాపు మానవులలో సహజమైన గుణం అనడంలో సందేహం లేదు. కౌరవులు సోమరులు, పాండవులలో భీమునిది అతినిద్ర. వెరసి వీరిద్దరిలో ఉన్న తమోగుణం వలన అకాలంగా అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చింది. దుర్యోధనుని అహంకారానికి, శకుని అండ తోడై కౌరవులు కొంత తమోగుణంతో పెరిగారు. ఎంత సామర్థ్యం ఉన్నా అతిగా తినడం వలన భీముడు ఎక్కువ నిద్రపోయేవాడు. ఆ అతినిద్ర వలననే లక్కఇల్లు తగలబడే వరకు లేవలేకపోయాడు. కానీ కృష్ణుని అండ వలన పాండవులు రక్షించబడ్డారు.

సత్త్వ గుణానికి నలదమయంతుల కథ కూడా ప్రతీకగా చెప్పవచ్చు. నల, దమయంతులు ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులై ఇష్టపడ్డారు. కానీ స్వయంవరం జరిగే సమయానికి దిక్పాలకులు కూడా వచ్చి నలుడినే దమయంతి దగ్గరకి తమ పక్షాన రాయబారిగా పంపారు. విధిలేక నలుడు దమయంతి దగ్గరకు రాయబారిగా వెళ్ళాడు. కానీ

దమయంతి శాంతిగా నలునితో దప్పికొన్నట్టి వారికాదప్పికా సలిలంబుహితవో, ఆజ్యంబు హితవో – అంటూ సున్నితంగా దిక్పాలకులని తిరస్కరించింది. చివరికి సహనంతో తన ఇష్టదైవాన్ని ప్రార్థించి, నలుని వరించింది. కనుక పరిస్థితులు అనుకూలించకపోయినా శాంతంగా ఆలోచించి ప్రవర్తించాలనే విషయాన్ని ఈ కథ ద్వారా గ్రహించవచ్చు.

నాడు రచించబడిన భారతం ఈనాటికీ ప్రమాణంగానే ఉండటం గమనార్హం. కారణం మానవ జీవన వ్యవస్థకు, మనుగడకు మూలమైన కుటుంబవ్యస్థ ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చక్కగా వివరించింది భారతం. కుటుంబవ్యవస్థకు మూలమైన వివాహవ్యవస్థ, బంధాలు, అనుబంధాలు అన్నీ కలిసి సమాజం, దేశం ఎలా ఉండాలో కూడా భారతంలోని కథలు పండిత పామరులకు అర్థమయ్యేలా బోధిస్తున్నాయి. వయసులో చేసే పొరపాట్లు తద్వారా కలిగే అవమానాలు శకుంతలోపాఖ్యానం కథలో వివరించారు. ఒక వ్యక్తి ఉన్నత సంస్కారాలతో బ్రతకడం ఎంత అవసరమో, దానికి సత్త్వ, రజో, తమో గుణాలను అదుపులో ఉంచుకోవడం అంతే అవసరమని చెప్పే కథలెన్నో భారతమంతా చెప్పబడినాయి.

ఒక స్త్రీకి జరిగిన అవమానం వలన భారతంలో కురుక్షేత్రానికి కారణమైందని కవిత్రయ భారతంలో చెప్పబడింది. ఇది నాడు నేడు కూడా గమనించాల్సిన సున్నితమైన అంశం. సత్త్వ, రజో, తమోగుణాలు లేని మానవ జీవితం లేదనడంలో అతిశయోక్తి లేదు. ఎంత శాంతంగా ఉన్నవారైనా చలిస్తారు అనడానికి నన్నయ భారతంలో ఒక సందర్భం చెప్పవచ్చు.

**"ఎంత శాంతులయ్యు, ఎంత జితేంద్రులయ్యు**
**కడు వివిక్తమైన చోట కాముసక్తి నోర్వగలరే**
**జనుల్..."** అంటూ గంగా దేవిని చూసిన సందర్భం చెప్పబడింది. కాముసక్తి అంటే ఇష్టంగా గ్రహించినా ఆ ఇష్టం కష్టమైతే మరలా రజోగుణంగా మారడం సహజమని గ్రహించాలి. ప్రాచీన కాలం నుండి ఇప్పటివరకు కూడా పరిస్థితుల వలన మనుష్యులు ఈ త్రిగుణాలకి లోనవడం సహజం. అయితే వాటి ప్రభావం వలన కలిగే ఫలితాలను గమనిస్తూ ముందడుగు వేయాలి. అంటే భూతకాలాన్ని గమనిస్తూ, వర్తమానంలో సమన్వయం చేసుకుంటూ, భవిష్యత్తు నిర్మాణం చేసుకోవాలన్నదే ఈ త్రిగుణాల సారాంశంగా భావించాలి. అప్పుడే నవనాగరిక జీవనయానం ఫలవంతమవుతుందని గ్రహించాలి.

**ఆధార గ్రంథాలు**

1. నన్నయ – శ్రీ మన్మ హభాంతము ఉద్యోగపర్వము ద్వితీయ భాగము ఆంధ్రతాత్పర్య నీలకంతీయ వ్యాఖ్యానువాద సహితము – అనంతపురం. ప్రచురణ ఆర్ష విజ్ఞాన ట్రస్టు హైదరాబా దు – 1990
2. శ్రీమదాంధ్ర మహాభారతము – (సరళ వ్యాఖ్యాన సహితం)సంపుటము – 1 ఆదిపర్వము మొదటి భాగము (1,2,3,4 ఆశ్వాసములు) – ప్రధాన సంపాదకుడు డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానములు – 2013

# త్రిగుణస్వరూప-స్వభావవివేచనమ్ మహాభారత గ్రంథోక్త ప్రకారం

**డా॥ సంతోష్ కుమార్ జోషి**
సంస్కృత అకాడమీ
ఉస్మానియావిశ్వవిద్యాలయము, హైదరాబాద్

**పరిచయం**

స్థావరజంగమాత్మకమైన జగత్తులో ఎన్నో విశేషాలు మనకు కనబడుతుంటాయి. అనేక విషయాల సమాహారమే ఈ జగత్తు. ఈ జగత్తులో పర్వతాలు, నదులు, చెట్లు, గుట్టలు, పుట్టలు, పశువులు, పక్షులు మనుషులు ఇలా అనేకరకాలైన విషయ సమాహారం మనకు కనబడుతుంది. ఈ అన్నింటిలోను తనయొక్క బుద్ధిచేత మరియు మాటచేతను మిగితా వాటిన్ననింటిని కూడ తన అధీనంలో పెట్టుకొని తన జీవనాన్ని సుఖంగా కొనసాగించడానికి నిరంతరం ప్రయత్నం చేసేవాడు మనిషి. మనుషుల సమూహాన్నే మనం సమాజం అని పిలుస్తాము. ఇలాంటి సమాజంలో అనేక రకాలైన మనస్తత్వాలతో కూడిన మనుషులు ఉంటారు. మనుషులలో అనేక రకాల మనస్తత్వాలు, భిన్న భిన్న ప్రవర్తనలు కనబడుతుంటాయి, మానవజాతంతా ఒకటైనప్పుడు ఇన్ని వ్యత్యాసాలుండటానికి కారణమేంటి అనే ప్రశ్న కలుగుతుంది. అదేవిధంగా ఒకే వ్యక్తి విభిన్న సందర్భాలలో విభిన్న రీతులతో ప్రవర్తిస్తుంటారు దీనికి కూడ కారణమేంటి అనే ప్రశ్న కలుగుతుంది. ఈ ప్రశ్నలన్నింటికి సమాధానాలను సంస్కృత సాహిత్యంలో విభిన్న శాస్త్రకారులు వారి శాస్త్రాలలో ఇచ్చారు. ఆయా శాస్త్రకారులు మనుష్యులలో ఉన్న తేడాలకు, ఒకే మనిషిలో ఉండే భిన్నభిన్న ప్రవర్తనలన్నింటికి కారణం త్రిగుణాలే అని వారి వారి గ్రంథాలలో స్పష్టంగా త్రిగుణాలయొక్క స్వరూపాన్ని స్వభావాన్ని గురించి విస్తృతంగా చర్చించారు.

**త్రిగుణాలను వివరించే సంస్కృతసాహిత్యం**

వేదాలలో, ఉపనిషత్తులలో త్రిగుణాలకు సంబంధించి మరియు స్వభావాన్ని గురించిన ప్రసంగాలు చాలా కనిపిస్తాయి. భగవద్గీతలో గుణత్రయ విభాగయోగం 14 అధ్యాయంలో, దైవాసుర సంపద్విభాగయోగం 16 అధ్యాయంలోను ఇతరత్ర ఆయా సందర్భాలలోను త్రిగుణాలకు సంబంధించిన, మరియు స్వభావాన్ని గురించిన చర్చ విస్తృతంగా లభిస్తుంది. సర్వధర్మాలు స్వభావంతోనే కలుగుతాయని గౌడపాదకారికా గ్రంథంద్వారా తెలుస్తుంది. సత్వరజస్తమో గుణలక్షణాలు, వాటి స్వరూపం మొదలైనవిషయాలు సాంఖ్యదర్శనంలో దాని ప్రకరణగ్రంథమైన సాంఖ్యకారికలోను చెప్పబడింది. వాయుపురాణంలో దేవీభాగవతంలోను త్రిగుణాలకుసంబంధించిన చర్చలు కనబడుతున్నాయి. బల్లులు, మల్లులు, నటులు. న్యాయవాదులు మొదలైన వృత్తులుచేసేవారు రాజస స్వభావం కలిగినవారని అక్కడ చెప్పబడింది. అలాగే ధర్మతత్పరులు సాత్వికులని దేవీభాగవతంలో చెప్పబడింది. అలాగే రామాయణంలో త్రిగుణాల యొక్క స్వరూపం వాటి చర్చ ప్రస్తావించబడింది. అదేవిధంగా జ్యోతిష గ్రంథాలలో మరియు ఆయుర్వేద

గ్రంధాలలోను త్రిగుణాలకు సంబంధించిన విషయాలు ఎన్నో ప్రస్తావించబడ్డాయి. ఈ విధంగా సంస్కృత వాఙ్మయంలోని అనేక శాస్త్రాలలో వేద, ఉపనిషత్, ఆయుర్వేద, జ్యోతిష, ఇతిహాస పురాణాలు మొదలైన గ్రంధాలలో ఈ త్రిగుణాలకు సంబంధించిన అదేవిధంగా స్వభావానికి సంబంధించిన విషయాలు చెప్పబడ్డాయి.

పంచమవేదమైన మహాభారతంలో అనేక పర్వాలలో త్రిగుణాల విషయాలు చెప్పబడ్డాయి. విశేషంగా శాంతిపర్వంలో, వనపర్వంలో, అశ్వమేధపర్వంలోను త్రిగుణాలకు సంబంధించన విషయాలు స్పష్టంగా సవిస్తరంగా చెప్పబడ్డాయి.

**త్రిగుణాలస్వరూపము:**

సత్వం రజస్సు, తమస్సు అనేవి దేవతల గుణాలని రజస్సు, తమస్సు రాక్షసులగుణాలని తెలుసుకోవాలి.

1, తలపాగ చుట్టుకొన్నవాడు ముప్పేట వస్త్రంతో కప్పుకున్నట్లు దేహి సత్వరజస్తమో గుణాలతో కప్పబడి ఉంటాడు.

2 త్రిగుణాల సామ్యావస్థకు అవ్యక్తప్రకృతి అని పేరు. అవ్యక్తం సమస్త ప్రాకృత కార్యాలయందు వ్యాపించి స్థిరమై నాశంలేనిదై ఉంటుంది.

గుణ వైషమ్యం ఏర్పడితే అవి పంచభూతాల రూపాన్ని ధరిస్తాయి. ఆ భూతాల వలన నవద్వారాలు గల నగరం అంటే శరీరం నిర్మాణమవుతుంది. ఆ శరీరమందు ఉండే జీవాత్మను విషయాలవైపు ప్రేరణచేసే పదకొండు ఇంద్రియాలు పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు మనస్సుతో పాటు ఉన్నవి, ఇంద్రియాల అభివ్యక్తి మనసుద్వారా జరుగును, బుద్ధి ఆ నగరానికి అనగా శరీరానికి యజమాని దశేంద్రియాలకంటే పదకొండవదైన మనస్సు అన్నింటికంటే శ్రేష్ఠమైంది. దీనిలో మూడు స్రోతస్సులుంటాయి. అవి చిత్త రూపం ప్రవాహం. అవి గుణమయాలై ఆ మూడూ నాడులద్వారా మాటిమాటికి నింపబడి ప్రవహించుచుండును. ఈ గుణాలు పరస్పరం ఒకదానికొకటి పరస్పర విరుద్ధాలై, అన్యోన్యాశ్రితాలై, అన్యోన్య సహకారులై ఒకదాన్నొకటి అనుసరిస్తూ పరస్పరమిశ్రితాలై ఉంటాయి. 3

అన్యోన్య మిధునాః-భార్యభర్తలవలె ఒకేకార్యాన్ని కలిగించేవి. అన్యోన్యానుజీవినః-విత్తు మొలకవంటివి. అన్యోన్యాపాశ్రయః-మూడు దండములు కలిపి కట్టినదానివలె, అన్యోన్యానువర్తిః-ప్రధాన గుణభావంతో కలిసి, రాజు సేవకుడు అనువారివలె, అన్యోన్యవృత్తిషక్తాః-అగ్ని నీరు, అన్నం మొదలైనవి మూడుగుణాలు కలవియై ఉంటాయి. 4

మిధునం – అంటే మధించునది అని అర్థం, అనగా రూపుమాపునది, అణిచివేయునది. తమసః మిధునం – అంటే తమస్సు ఉద్రేకం పొందగా సత్వం అణిచివేయబడుతుంది. సత్వం ఉద్రేకం పొందగా తమస్సు, రజస్సు అణిచి వేయబడతాయి. రజస్తమస్సులు మాత్రం ఒకదానికొకటి ఉద్దీపనం చేసుకుంటాయి. ఈ రెండింటికి పరస్పరం నశింపచేసుకునే విధానం లేదు.

**పరస్పరవిరుద్ధగుణాలు:**

తమస్సు సత్త్వం, సత్త్వం రజస్సు, రజస్సు సత్త్వం, సత్త్వం తమస్సు. ఇవి ఒకదాన్ని నిరోధిస్తే ఒకటి వృద్ధి పొందుతూ ఉంటాయి. ఉదా: తమస్సును నిరోధిస్తే-రజస్సు వృద్ధిపొందుతుంది, రజోగుణం నిరోధిస్తే- సత్త్వగుణం పెరగుతుంది 5. అని మహాభారతంలోని శాంతిపర్వంలో త్రిగుణాలస్వరూపం చెప్పబడింది. అదేవిధంగా భగవద్గీతలో సత్త్వం, రజస్సు, తమస్సు అనే ఈ మూడు ప్రకృతి వలన పుట్టిన గుణాలు. ఇవి నాశరహితుడైన జీవున్ని దేహంలో బంధిస్తున్నాయని చెప్పబడింది. 6

**తమోగుణం:**

తమస్సు అంధకారస్వరూపం. దీంట్లో మూడు గుణాలుంటాయి, దానికే మోహమని ఇంకొక పేరు, అది అధర్మాన్ని సూచిస్తుంది. పాపకర్మలను ఆచరించే వారియందు తప్పకుండా ఉంటుంది. వేరేగుణాలతో కలిసి గోచరిస్తుంది. 8 భగవద్గీతలో కూడ ఇదే లక్షణం చెప్పబడింది. 7

**రజోగుణం:**

రజోగణం ప్రకృతిరూపమని చెబుతారు. ఇది సృష్టి ఉత్పత్తికి కారణం, దీని ప్రవృత్తి సమస్త భూతరాశిలో కనిపిస్తుంది. కనిపించే జగత్తంతా దీని స్వరూపమే. 9

**సత్త్వగుణం:**

సర్వ భూతాలయందు ప్రకాశం లాఘవం (ధర్మజ్ఞానాదిరూపమగు సౌష్ఠవం) శ్రద్ధ గర్వంలేకపోవడం మొదలైనవిశేషాలు సత్త్వంలో ఉంటాయి. శ్రీమద్భగవద్గీతలో ఈ మూడు గుణాల యందు ప్రకాశం కలిగి ఉపద్రవంలేని సత్త్వగుణం నిర్మలంగా చేసి సుఖాభిలాషచేత జ్ఞానాభిలాషతో ఆత్మను బంధిస్తుంది.

**తమోగుణస్వరూపం:**

మోహం, అజ్ఞానం, త్యాగం లేకపోవుట, కర్మల నిర్ణయం చేయలేకపోవుట, నిద్ర, గర్వం, భయం, లోభం, స్వయంగా శుభకర్మల యందు దోషాలను చూపుట, స్మరణశక్తి లోపించుట, పరిణామాన్ని ఆలోచించకుండుట, నాస్తికత్వం, దుశ్చరిత, నిర్విశేషత (మంచిచెడ్డల గురించి వివేకరం లేకపోవడం) ఇంద్రియ శైథిల్యం, హింసాదులయందు ప్రవృత్తి,అకార్యాన్ని కార్యంగా, అజ్ఞానాన్ని జ్ఞానంగా తెలుసుకునట, పని చేయకపోయినను చేసినట్లు అభిమానం కలుగుట, మైత్రి లేకపోవుట, పనియందు మనసునుంచక పోవుట, అశ్రద్ధ, మౌర్ఖ్యంతోకూడిన విచారణ, కుటిలత్వం బోధపడకుండుట, పాపంచేయుట, అజ్ఞానం, ఆలస్యం, మొదలైనవాటివల్ల శరీరం భారమగుట, భక్తిభావం లేకపోవుట, అజితేంద్రియత, నీచ కర్మలయందు ఆసక్తి, ఈ దుర్గుణాలన్నీ తమోగుణానికి సంబంధించినవి. ఇవికాక లోకంలో నిషిద్ధ గుణాలు ఏవున్నాయో అవన్నీ తమోగుణానికి సంభంధించినవే.10

దేవతలను, వేదాలను నిందించడం, దానం చేయకపోవడం, అభిమానం, మోహం, క్రోధం, అసహనశీలత, ప్రాణులయందు మాత్సర్యం మొదలైనవి, వ్యర్థమైన పనులను మొదలుపెట్టడం. అపాత్రదానాలు, వ్యర్థమైన భోజనం చేయడం మొదలైనవి మరియు, ఎక్కువగా మాట్లాడటం, అక్షమ మొదలైన ప్రవర్తన కలవారు ధర్మమర్యాదను తప్పి ఎలాంటి పాపకర్మనైనా ఆచరిస్తారు.11 తామసప్రవృత్తి కలవారు క్రోధపరాయణులు, రాగద్వేషాలు

కలిగినవారని, వీరు రాజుల యొక్క కార్యాలను నిర్వహిస్తుంటారని, వేదాదివిద్యలను అభ్యసిస్తారని దేవీభాగవతంలో చెప్పబడింది.

**తామసప్రకృతి:**

తామసప్రకృతి తమం, మోహం, మహామోహం, క్రోధం, తామిస్రం, అంధతామిశ్రం అని ఐదు విధాలుగా చెప్పబడింది. ఇదే విషయం పతంజలి యోగదర్శనంలో అవిద్యాస్మితరాగద్వేషాభినివేశాః! అని పంచక్లేశాలుగా చెప్పబడింది. తామిస్రం అంటే క్రోధమని అర్థం ద్వేషంకాదు, అంధతామిస్రం కూడ అభినివేశం కాదు మరణమే, ఇక్కడ తామిస్ర అంధతామిస్ర శబ్దాలతో క్రోధమరణాలనే తీసుకోవాలి కాని రాజసములైన ద్వేషాభినివేశాలు కాదు. 13 తామసగుణాలు కలిగినవారు మరుజన్మలలో పశువులుగా పక్షులుగా నీచాతి నీచమైన జన్మలనెత్తి నీచాతినీచమైన పనులను చేస్తుంటారు. ఈ విధంగా విపరీత యోనులయందు పుట్టిన ప్రాణులు పుణ్య కర్మాచరణతో ఉత్తమోత్తమ గతులను పొందవచ్చునని చెప్పబడింది. శ్రీమద్భగవద్గీతలో నీచమైన గుణప్రవృత్తి కలిగిన తామసులు నీచస్థితిని పొందుతారని చెప్పబడింది. 14 తమోగుణ మభివృద్ధి చెంది మరణించినప్పుడు మూఢ యోనుల యందు జీవుడు పుడుతాడని కూడ చెప్పబడింది. 15

**రజోగుణస్వరూపం**

రజోగుణానికి సంతాపమే రూపం, ఆయాసం, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు, ఐశ్వర్యం, నిగ్రహం, సంధి,హేతువాదం, మనస్సు ప్రసన్నంగా లేకపోవడం, సహనశక్తి, బలం, శూరత్వం, మదం, రోషం, వ్యాయామం, కలహం, ఈర్ష్య, ఇచ్ఛ, పైశున్యం, యుద్ధం చేయుట, మమత్వం, కుటుంబపోషణ, వధ, బంధనం, క్లేశం, క్రయవిక్రయాలు, ఖేదనం, ఛేదనం, ఇతరుల రహస్యాలను అందరికి చెప్పడం, ఉగ్రత, నిష్ఠురత, అరచుట, ఏడ్చుట. ఇతరుల తప్పులను ఎత్తి చూపుట, లౌకిక విషయాలను గురించి ఆలోచించుట, పశ్చాత్తాపం, మత్సరత, నానావిధాలైన సాంసారిక భావాలతో కూడి ఉండుట, అసత్యభాషణం, మిథ్యాదానం, సంశయపూర్ణవిచారణ, తిరస్కారంగా మాట్లాడటం, నిందాస్తుతి, ప్రశంస, ప్రతాపం, బలాత్కారం, స్వార్థబుద్ధితో రోగికి పరిచర్య, పెద్దలశుశ్రూష, సేవావృత్తిచేయుట, తృష్ణ, ఇతరుల నాశ్రయించి ఉండుట, వ్యవహార కుశలత, నీతి, ప్రమాదం, పరివాదం, పరిగ్రహం ఇవి అన్నీ రజోగుణాలుగా చెప్పబడ్డాయి. 16 ప్రపంచంలో స్త్రీలు, పురుషులు, భూతాలు, ద్రవ్యాలు, మొదలైన వాటిలో వేరు వేరు సంస్కారాలుంటాయి, అవన్నీ రజోగుణ ప్రేరణవల్లే కలుగుతాయి. 17

సంతాపం, అవిశ్వాసం, సకామభావంతో వ్రతాల నాచరించడం. కామ్యకర్మలు, పూర్తకర్మలు బావులు చెరువులు తవ్వించడం, యజ్ఞయాగాది కర్మల నాచరించడం, యజనాదిష్టక్కర్మల నాచరించడం మొదలైనవన్నీ రాజసగుణసంబద్ధాలే,18 ద్రోహం, మాయ, శఠత, మోసం, చౌర్యం, హింస, ఘృణ పరితాపం, అశాస్త్రీయ జాగరణం, దంబం, దర్పం, రాగం, సకామభక్తి, విషయ ప్రేమ, విలాసాలు, ప్రమోదాలు, అన్నిరకాల జూదం, గొడవలుపడటం, వివాదాలు, స్త్రీలతో సంబంధాలు, నృత్యగీత వాద్యాల యందు ఆసక్తి మొదలైనవన్నీ రాజసాలే. 19

భూతభవిష్యద్వర్తమానపదార్థాలను గురించి చింతించేవారు. ధర్మార్థకామాలను సేవించేవారు, స్వేచ్ఛాచారులు, సర్వవిధ భోగాలతో ఆనందించేవారు అందరూ రజోగుణంతో కూడుకున్నవారే. 20

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

ఇలాంటి వారు ఈ లోకంలో మాటిమాటికి పుడుతూ కర్మలు చేస్తూ, ఛస్తూ ఉంటారు. మనిషి ఈ గుణాలన్నంటిని తెలుసుకొని ఈ జ్ఞానంతో రజొగుణ బంధంలో చిక్కుకోకుండా ఉండటానికి ప్రయత్నించాలి. 21 విషయాసక్తి విషయాభిలాష విషయాభిమానం గల రజోగుణం కర్మసంగంతో ఆత్మను బంధిస్తుంది, 22 రజోగుణం వృద్ధిపొందినప్పుడు లోభం వ్యాపకం కర్మారంభం అశాంతి మొదలైన గుణాలు కలుగుతాయని చెప్పబడింది. అదేవిధంగా రాజసగుణం కలిగినవారు చేదును, పులుపును, ఉప్పును, మిక్కిలి వేడిని, కారాన్ని, దాహాన్ని కలిగించే, దుఃఖాన్ని, శోకాన్ని రోగాన్ని కలగచేసే ఆహారాన్ని ఇష్టపడతారని ఆహార విశేషాలు చెప్పబడ్డాయి. భగవద్గీతలో 23 రాజసిక ప్రవృత్తి కలిగినవారు భల్లులుగా, మల్లులుగా, నటులుగా ఉంటారు, జూదం మద్యపానం మొదలైనవాటియందు ఆసక్తికలిగి ఉంటారు, అదేవిధంగా వాక్కును ఉపయోగించే వృత్తిని చేస్తుంటారని వామనపురాణంలో చెప్పబడింది. 24 దేవీభాగవతంలో కూడ రాజసప్రవృత్తి కలిగినవారు వేదవిద్వాంసులుగా, రాజులకు పురోహితులుగా యజనయాజనాది షట్కర్మ నిరతులుగా ఉంటారని చెప్పబడింది. 25

**సత్వగుణస్వరూపము:**

ఈ లోకంలో సంపూర్ణ ప్రాణికోటికి మేలు చేసేది సత్వగుణం, సత్వగుణ లక్షణాలు ఈ విధంగా చెప్పబడ్డాయి. ఆనందం, ప్రసన్నత, ఉన్నతి, ప్రకాశం, సుఖం, కృపణత లేకపోవడం, నిర్భయతం, తొట్రుపాటు లేకుండుట. సంతోషం, శ్రద్ధ, క్షమ, ధైర్యం, అహింస, సమత, సత్యం, సరళత, క్రోధం లేకపోవుట, అనసూయ, పవిత్రత, సమర్థత, చతురత, సద్విషయాలయందు పరాక్రమం ఇవన్నీ సత్వగుణాలు. 26

విశ్వాసం, లజ్జ, తితిక్ష, త్యాగం, పవిత్రత, అలసత్వం లేకపోవుట, కోమలత్వం, మోహంలేకుండుట, ప్రాణులయందు దయకలిగి ఉండుట, చాడీలు చెప్పకపోవుట, మోహం లేకపోవుట హర్షం,(పుత్రోత్పత్తి) సంతోషం, గర్వంలేకుండుట, వినయం, సత్ప్రవర్తన, శాంతికర్మలందు(ముక్తి) ఆసక్తి, ఉత్తమబుద్ధి, ఆసక్తి లేకుండుట, లౌకిక భోగాలయందు ఉదాసీనత, బ్రహ్మచర్యం, సర్వవిధాల త్యాగం, నిర్మమత్వం, కర్మఫలమందు కోరిక లేకపోవుట, ధర్మపాలన, ఇవన్నీ సత్వగుణాలయొక్క కార్యాలు. 27

సకామంతో చేసిన పనులన్నీ వ్యర్థాలే అని తెలుసుకొని పైన చెప్పబడ్డ గుణాలతో సత్వమునే ఆశ్రయించి వేదాలకు ఉత్పత్తి స్థానమైన పరబ్రహ్మ పరమాత్మయందు నిష్ఠకలిగి యుండువారు ధీరపురుషులుగా చెప్పబడతారు. 28 ఈ ధీరపురుషులు సమస్త పాపాలని విడిచి శోకరహితులవుతారు. స్వర్గానికి పోయి అనేక భోగాలననుభవించి యోగబలంతో అనేక విధాలైన దేహాలను సృష్టించుకొని ధారణచేస్తారు. 29

సత్వగుణ సంపన్నులైన మహాత్ములు స్వర్గవాసులైన దేవతల వలె ఈశిత్వ, వశిత్వ, లఘుత్వాది సిద్ధులను పొంది అనేక ఆకారాలను ధరిస్తారు, వారు ఊర్ధ్వస్రోతస్సులని, వైకారిక దేవతలని పిలవబడతారు. మనస్సుతో అనేక విషయాలను సృష్టిస్తారు. ఈ విధంగా సత్వసంపన్నులైన వ్యక్తులు ఏ విషయాలను కోరుకుంటారో అవన్నీ వారికి తప్పక సిద్ధిస్తాయి.

**గుణత్రయసమిష్టిస్వరూపం**

ఈ మూడుగుణాలను వేరుగా వర్ణించడం సాధ్యంకాదు. అసంభవం కూడ. ఎందుకంటే ఈ మూడు గుణాలు ఎప్పుడూ కలిసే ఉంటాయి. ఈ మూడు గుణాలు పరస్పరం ఒకదాన్ని ఒకటి ఆశ్రయిస్తూ, అనుసరిస్తూ ఉంటాయి.30 సత్వగుణం ఉన్నంత వరకు రజోగుణంకూడ ఉంటుంది. తమోగుణం ఉన్నంతవరకు సత్వగుణం రజోగుణం కూడ ఉండునని చెప్పబడుతుంది.

ఈ గుణాలు ఒకప్పుడు సకారణంగా మరొకప్పుడు నిష్కారణంగా ఎప్పుడూ కలిసిఉంటాయి, కలిసి మెలిసి శరీరమందు సంచరిస్తూ యాత్రను కొనసాగిస్తాయి.31 ఈ విధంగా జరుగుచున్నప్పటికి ఈ గుణాలు ఒకదాన్నొకటి అనుసరిస్తున్నను ఒకగుణానికి న్యూనత్వం, ఇంకో గుణానికి ఆధిక్యం కనబడును. పశుపక్ష్యాదులలో తమోగుణం అధికంగా ఉన్న స్థలాల్లో రజోగుణం తక్కువగా ఉండును దానికంటే సత్వం ఇంకా తక్కువగా ఉండును. మనుష్యులలో రజోగుణ మధికంగా ఉన్న స్థలాలలో తమోగుణం స్వల్పంగాను సత్వగుణం మరీ తక్కువగాను ఉండును. ఊర్ధ్వస్రోతస్సులు అనగా దేవతలలో సత్వగుణ మధికంగా ఉన్నచోట తమోగుణం స్వల్పంగా రజోగుణం మరీ తక్కువగా ఉండునని నిశ్చయించుకోవాలి.

సత్వం ఇంద్రియాల ఉత్పత్తికి కారణం, దానిని వైకారికహేతువని అంటారు. ఇది ఇంద్రియాలను వాటి విషయాలను ప్రకాశింప చేయును. సత్వగుణం కన్న గొప్పనైన ధర్మహేతువు మరొకటి శాస్త్రాలయందు చెప్పబడలేదు.

సత్వగుణ సంపన్నులు స్వర్గాది ఉన్నత లోకాలను, రజోగుణ ప్రధానులు మనుష్య లోకంలో మధ్యమగతిని, తమోగుణ ప్రధానులైన మనుషులు అధోగతిని నీచయోనుల యందు గాని నరకమందుగాని జన్మిస్తారు.32

1 సత్వం రజస్తమశ్చేతి దేవాసురగుణాన్ విద్ధు। సత్త్వం దేవగుణం విద్యాదితరావసరౌ గుణౌ॥ శాంతిపర్వం 216-18

2 ఉష్ణీషవాన్ యథా వస్త్రై స్త్రిభిర్భవతి సంవృత్త। సంవృతోయం తథా దేహీ సత్త్వరాజసతామస్త్రై॥ శాంతిపర్వం 217-12

3 తమోరజస్తథా సత్వం గుణానేతాన్ ప్రచక్షతే। అన్యోన్యమిథున్నా సర్వే తథాన్యోన్యానుజీవినః । । అన్యోన్యాపాశ్రయాశ్చాపి తథాన్యోన్యానువర్తిన్న।అన్యోన్యవ్యతిషక్తాశ్చ త్రిగుణ్ణా పంచధాతవః మహాభారతం ఆశ్వమేధికపర్వం ॥36,4,5

4 మహాభారతం శాంతిపర్వం 36-6

5 మహాభారతం శాంతిపర్వం 36-7

6 సత్వం రజస్తమ ఇతి గుణ్ణా ప్రకృతిసంభవాః! నిబధ్నంతి మహాబాహెూ దేహే దేహినమవ్యయం॥ భగవద్గీత 14-5

7 తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినాం। ప్రమాదాలస్య నిద్రాభిస్తన్నభధ్నాతి భారత॥ భగవద్గీత14.8

8 మహాభారతం శాంతిపర్వం 36.10

9 తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్। సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ॥ భగవద్గీత 14-6

10 మహాభారతం ఆశ్వమేధికపర్వం 36-12-16

11 మహాభారతం ఆశ్వమేధికపర్వం 36.17-21

12 తామసా క్రోధసంయుక్తా రాగద్వేషపర్ణా పున్న। రాజ్ఞాం కర్మకరానిత్యం కించిదధ్యయనే రత్ణా॥ దేవీభాగవతం 5-20-44

13 తమో మోహో మహామోహస్తామిస్రః క్రోధసంజ్ఞితః। మరణత్వన్ధతామిస్రః తామిస్త్ర క్రోధ ఉచ్యతే॥ మహాభారతం ఆశ్వమేధికపర్వం 36-33

14 జఘన్య గుణవృత్తిస్థా అధోగచ్ఛంతి తామసాః। భగవద్గీత 14-18

15 తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే। భగవద్గీత 14-15

16 మహాభారతం ఆశ్వమేధికపర్వం37, 2-7

17 సంస్కారా యే చ లోకేషు ప్రవర్తంతే పృథక్ పృథక్। నృషు నారీషు భూతేషు ద్రవ్యేషు శరణేషు చ॥ మహాభారతం ఆశ్వమేధికపర్వం37-8

18 మహాభారతం ఆశ్వమేధికపర్వం 37,9-11

19 మహాభారతం ఆశ్వమేధికపర్వం 37,12,13,14

20 మహాభారతం ఆశ్వమేధికపర్వం 37,16

21 రజో గుణా వో బహుధా బహుధానుకీర్తితా యథావదుక్తం గుణవృత్తమేవ। నరో పి యో వేద గుణానిమాన్ సదా స రాజసైః సర్వగుణైః విముచ్యతే॥ మహాభారతం ఆశ్వమేధికపర్వం 37-18

22 రజోరాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవం,। తన్నిభధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్॥ భగవద్గీత 14.7

23 కట్వమ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణరూక్షవిదాహినః। ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥భగవద్గీత 17-9

24 భల్లా మల్లా నటాశ్చైవ పురుషా శాస్త్రవృత్తయ్హ । ద్యూతపానప్రసక్తాశ్చ జఘన్యా రాజసో గతిః॥ క్షత్రియశ్చైవ రాజ్ఞశ్చైవ పురోహితాః। వాగ్యుద్ధప్రధానాశ్చ మధ్యమా రాజసీ గతిః॥ వామనపురాణం 12 అధ్యాయం

25 రాజసా వేదివిద్వాంస్ష క్షత్రియాణాం పురోహితాః। షట్కర్మనిరతాః సర్వే విధివన్మాంసభక్షకాః॥ దేవీభాగవతం 5-20-42

26 మహాభారతం ఆశ్వమేధికపర్వం 38-2,3

27 మహాభారతం ఆశ్వమేధికపర్వం 38-6-8

28 మహాభారతం ఆశ్వమేధికపర్వం 38-9,10

29 ఈశిత్వం చ వశిత్వం చ లఘుత్వం మనసశ్చుతే ని ఊర్ధ్వస్రోతస ఇత్యేతే దేవా వైకారికా స్మృత్ణా మహాభారతం ఆశ్వమేధికపర్వం 39.-12

30 మహాభారతం ఆశ్వమేధికపర్వం 39-3

31 మహాభారతం ఆశ్వమేధికపర్వం 38-4

32 ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః। జఘన్య గుణసంయుక్తా యాంత్యధస్తామసా జనాః॥ మహాభారతం ఆశ్వమేధికపర్వం 39-10

33 మహాభారతం ఆశ్వమేధికపర్వం 39,16-21

34 త్రయోగుణాః ప్రవర్తంతే హ్యవ్యక్తా నిత్యమేవ తు। సత్త్వం రజస్తమశ్చైవ గుణసర్గః సనాతనః॥మహాభారతం ఆశ్వమేధికపర్వం 39,16-22

35 మహాభారతం ఆశ్వమేధికపర్వం 39,23,24

36 మానాపమానయోస్తుల్యస్తుల్యో మిత్రారిపక్షయోః।

**సర్వారంభపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥ భగవద్గీత-14-24**

**మాం చ యో వ్యభిచారేణ భక్తియోగేన సేవతే।**

**స గుణాన్సమతీత్యైతాన్బ్రహ్మభూయాయ కల్పతే॥ భగవద్గీత-14-25**

**విభిన్నవిషయాలలో గుణత్రయస్థితి:**

సూర్యుడు సత్వగుణ ప్రధానుడు. సూర్యోదయాన్ని చూచి భయాన్నిపొందే చోరులు తమోగుణ ప్రధానులు. మండుతున్న సూర్యుని చూచి బాధపడే బాటసారులు రజోగుణ ప్రధానులు. స్థావర ప్రాణులయందు తమోగుణం ప్రధానంగా ఉంటుంది, వాటిలో పెరుగుదల రజస్సు, చిక్కదనం సాత్వికం. గుణభేదంతో పగలు, రాత్రి, మాసం పక్షం, సంవత్సరం, వర్షం, ఋతువులు, సంధ్యా సమయాలు అన్నీ మూడు విధాలుగా ఉండును. గుణభేదాలను బట్టి, దానం, యజ్ఞానుష్ఠానం, లోకాలు, దేవతలు, విద్యలు అన్నీ మూడు విధాలుగా ఉండును. భూతభవిష్యద్వర్తమానాలు, ధర్మాధర్మాలు, ప్రాణాపానవుదానాలు త్రిగుణాత్మకాలే. ఈప్రపంచంలో గల ప్రతివస్తువు భిన్నభిన్న స్థానాలలో వేరువేరు విధంగా లభిస్తుస్తుంది. ఆ వస్తువులన్నీ త్రిగుణమయాలే. 33 ఈ ప్రకారంగా మూడుగుణాల ఉనికి ప్రతిచోట ఉంటుంది. ఈ మూడుగుణాలు అవ్యక్తాలై ప్రవాహరూపంలో నిత్యములూ, సత్వరజస్తమస్సుల సృష్టి సమస్తమైనది అతిప్రాచీనం అతి నవీనం కూడ. 34

ప్రకృతిని తమం , వ్యక్తం, శివం, ధామం, రజస్సు, యోని, సనాతనం, ప్రకృతి, వికారం, ప్రళయం, ప్రధానం, ప్రభవాప్యయం, అనుద్రిక్తం, అనుమానం, అకంపం, అచలం, ధ్రువం, సత్తు, అసత్తు, అవ్యక్తం, త్రిగుణాత్మకం అనే 22 పేర్లతో పిలుస్తారు. ఆధ్యాత్మిక తత్వమును చింతనచేసే వ్యక్తి తప్పక ఈ పేర్లను తెలుసుకోవాలి. 35

మనిషి ఈ త్రిగుణాలయొక్క స్వరూపాన్ని స్వభావాన్ని తెలుసుకొని క్రమంగా గుణవివర్జితుడై గుణాతీతస్థితిని పొందాలి అనేది సారాంశంగా మనం గ్రహించాలి. అయితే గుణాతీత స్థితిని ఎలా పొందాలనే విషయం భగవద్గీతలో ఈ విధంగా చెప్పబడింది. ఎవరైతే ఉదాసీనునిగా ఉంటూ గుణాలతో చలించడో, గుణాలు
ఉన్నాయి కాబట్టి అవి ప్రవర్తిస్తున్నాయని ఆలోచిస్తూ చలించడో అటువంటివాడు సుఖ దుఃఖాలను, మట్టిని బంగారాన్ని, మానావమానాలను ఇష్టానిష్టాలను, నిందాస్తుతులను మిత్రశతృవుల విషయాలను సమానంగా చూస్తాడో అలాంటివాడు ధీరుడై సమస్త కార్యాలను వదిలిపెట్టేవాన్ని గుణాతీతుడని అంటారు. అలాంటి గుణాతీతుడు భక్తియోగంతో నన్ను సేవించుచూ ఈ గుణత్రయాన్నతిక్రమించి బ్రహ్మత్వాన్ని పొందటాని కర్హుడని గీతలో చెప్పబడింది. 36

**ఆధార గ్రంథాలు**

1. శ్రీమద్భగవద్గీత – కాశీనాథుని నాగేశ్వరరావు 1950
2. శ్రీమహాభారతం – శలాకరఘునాథశర్మ – ఆర్షవిజ్ఞానట్రస్ట్ – 2001.
3. డా.రామగోపాలకృష్ణమూర్తిః, కమ్భంపాటి (2005) బృహత్పరాశరహోరాశాస్త్రమ్, గోల్లపూడి వీరాస్వామి సన్స్ రాజమహేంద్రి ఆన్ధ్రప్రదేశః.
4. డా. శలాకరఘునాథశర్మ (2001) మహాభారతం శాంతిపర్వం, ఆర్షవిజ్ఞానట్రస్ట్, హైదరాబాద్.
5. శ్రీ కోటేశ్వరశర్మ శ్రీరామచంద్రుల (1996) సాంఖ్యకారికలు, ఆర్షవిజ్ఞానట్రస్ట్ , హైదరాబాద్.
6. ప్రొ శశిరేఖా.పి(సం) (2023) సాంఖ్యాకారికా, సంస్కృత అకాడమీ, హైదరబాద్.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక    సంపుటి -27 : సంచిక - 6 (2)    UGC CARE List Approved Journals
హైదరాబాద్    ఏప్రిల్ - 2024

# తెలుగు స్త్రీవాద కథ – రజోగుణం

**డా. యు. ఝాన్సీ,**
తెలుగు అధ్యాపకురాలు,
రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్,
నూజివీడు ప్రాంగణం, ఏలూరు జిల్లా.

శ్రీ శ్రీ భావకవిత్వాన్ని ఉద్దేశించి **"ఆకాశపు దారుల వెంట హడావిడిగా వెళ్తున్న కవిత్వాన్ని భూమార్గం పట్టిస్తాను... భూకంపం పుట్టిస్తాను..".** అంటారు. ఈ మాటలు నాకు గుర్తొచ్చినప్పుడెల్లా, నా మనసులో వాడ్రేవు వీరలక్ష్మీగారి కథలు, ఆ కథల్లోని పాత్రలు నా మదిలో మెదులుతాయి. నిజానికి నాకు అభిమానపాత్రమైన రచయితల్లో వాడ్రేవు వీరలక్ష్మీగారు ఒకరు. స్త్రీవాద కథాసాహిత్యం ప్రారంభమైన తొలినాళ్లలో కథా వస్తువులో, భావజాలంలో, భాషలో చాలా వాడి, వేడి మనకి కనిపిస్తుంది. ఒక రెండుమూడు దశాబ్దాలు గడిచేసరికి, రచయితలు కథావస్తువులను మరింత లోతుగా, ఆలోచనా భావజాలాన్ని మరింత పదునుగా, భారతీయ సంస్కృతికి సరిపోయే రీతిలో వారి కథలను తీర్చిదిద్దడం హర్షణీయం. ఈ కోవకు చెందిన రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీ గారు.

వెన్నెల ముగ్గు కథతో కథా రచయిత్రిగా సాహిత్య జీవితం ప్రారంభించిన ఈమె ఉత్సవ సౌరభం, 1996 కొండ ఫలం, 2009 కిటికీ బయట 2014 పేర్లతో మూడు సంపుటాలు వెలువరించారు. ఈ వ్యాసంలో నాలుగు కథలు తీసుకుని, వాటిలో వున్న రజోగుణాన్ని వివరించడం జరిగింది.

**ఈ విషానికి ఈ తేనె చాలు:**

ఈ కథలో హెడ్ మిస్ట్రెస్‌గా పనిచేసిన వింధ్య అనే మహిళ ఏ విధంగా ఇతరులకు ఆదర్శవంతమయ్యిందో వివరిస్తూ ఆమె ఎదుర్కొన్న సనాతన సంప్రదాయ పద్ధతులు ఆమెను ఏవిధంగా మానసికంగా బలహీన పరిచాయో తెలియచేసే కథ ఇది.

**ఇతివృత్తం:**

వింధ్య హెడ్ మిస్ట్రెస్. వేరే స్కూల్కి బదిలీ అవుతారు. ఈ బదిలీకి నెలరోజులు ముందే ఒక యాక్సిడెంట్‌లో తన భర్తను కోల్పోతారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆమె ఆ బాధనుండి తేరుకోలేకపోతుంది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయబడిన ప్రవచనాలు ఆమెకు నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయి. ఆమె పనిచేసే స్కూల్లో సైన్స్ టీచరుగా పనిచేస్తున్న అనురాధ ఈమెకు మంచి స్నేహితురాలవుతుంది. వింధ్య జీవితం అనురాధను ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అనురాధకు పెళ్లయిన నెలకే ఆ పెళ్లి విఫలమవుతుంది. ఆడుతూపాడుతూ చదివి, సరదాగా సంపాదించుకున్న ఉద్యోగం అప్పుడు ఆమెకు ఆధారం అవుతుంది. సమాజం నుంచి తనను తాను రక్షించుకోవడానికి మార్గాలు వెతకడం ప్రారంభిస్తుంది. మెడనుంచి మంగళసూత్రం తీయకుండా వుంచుకోవడంలో ఆమెకు భద్రత కనిపిస్తుంది. తన భర్త గల్ఫ్ దేశంలో వున్నాడని చెప్పుకుంటూ ఒక అబద్ధపు జీవితంలో బ్రతుకుతూ

వుంటుంది. నిజాయితీగా జీవించడం ఎలా అని తనలో తాను చాలాసార్లు మధనపడుతుంది. వింధ్య మేడం జీవితవిధానం తనకు అర్థం అవడం మొదలవగానే తన మనసులోని చిక్కులు వాటంతట అవే విడిపోసాగాయి. బలవంతపు గృహిణి వేషాన్ని ఒక్కొక్కటిగా విప్పడం మొదలుపెడుతుంది.తన వివాహజీవితం విచ్ఛిన్నం కావడానికి కారణం తను కాకపోయినప్పటికీ ఒక ఆత్మన్యూనతా భావం పీడిస్తూవుండేది. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని సంకోచిస్తూ మానేసుకున్న సరదాలెన్నో ఒక్కటొక్కటిగా రెక్కలు విప్పుకుంటూ తనలో నుండి బయటకు రాసాగాయి. వాటిలో ఒకటి పంజాబీ డ్రస్సు వేసుకోవడం, తనను తాను ప్రేమించుకోవడం. ఈ క్రమంలో వింఏఆధ్యను ఆరాధించడం మొదలుపెడుతుంది. ఒకసారి వింధ్య ఎవ్వరికీ చెప్పకుండా ఒక రెండు వారాలపాటు సెలవుపెడుతుంది. ఏం జరిగిందో అనురాధకు అర్థంకాక, చాలా బాధపడుతుంది. సెలవులు ముగించుకొని వింధ్య వచ్చాక, అనురాధ చాలా ఆప్యాయంగానూ బాధగాను చెప్పకుండా ఎక్కడికి వెళ్లిపోయారని అణకువతో కూడిన ప్రశ్నను సంధిస్తుంది. దానికి వింధ్య సమాధానంగా 'ప్రవచనాల్లో భాగంగా ఆచార్యులు ఏదో పూజా కార్యక్రమం ప్రారంభించారు. భర్త లేని వారందరూ లేచి వెనక్కి వెళ్లమని చెప్పారు. సువాసినీ పూజట. చాలమంది ఆడవాళ్లు మౌనంగా లేచి, ఏదో తప్పు చేసిన వాళ్లలాగా వెనక్కివెళ్లిపోతున్నారు. నేనూ లేచాను బాధగానూ, అవమానంగానూ, అప్పుడు ఆచార్యుల వారు కొన్నిమాటలు పలికారు. గతజన్మలలో చేసిన అపరాధాల కారణంగా స్త్రీలు ఈ జన్మలో విధవలవుతారని అది వారి దురదృష్టమని, వాళ్లకి శుభసమయాల్లోకి రావడానికి అర్హత లేదని చెప్పారు.

ఆ మాటలు నన్ను వెంటాడాయి. ఇదంతా నిజమేనేమో అనే భావం నన్ను నమిలేసింది. భారతీయ స్త్రీ ఈ వైధవ్య ముద్ర మోసి తీరాలేమో! "ఇలా బయటకు వచ్చి ఆత్మగౌరవాలు కాపాడుకోగలగటానికి మేమెంత కష్టపడ్డాం? మాకోసం ఎందరెందరో పడిన కష్టం ఎంత విలువైనది? ఇలా నలుగురిలో ధైర్యంగా, గౌరవంగా బతికే మమ్మల్ని ఈ పీఠాధిపతులు మళ్లీ ఇలా గోతుల్లోకి తోసి పారేస్తారా? అని ఎంతో భయమేసింది. మరొక సందర్భంలో వినోద అనే ఆమె ఈ విధంగా చెబుతుంది. **"ఈ ఆడవాళ్లు మళ్లీ వెనక్కి వెళ్లిపోతున్నారు. హిందూమతోద్ధారకులు, పీఠాధిపతులు వీధికొకరు తయారయ్యారు. వాళ్లే వీళ్లని ఇలా పాడుచేస్తున్నారు. శాస్త్రంలో ఏముందో వీళ్లకీ తెలియదు, వాళ్లకీ తెలియదు. ఎంతకష్టపడి బయటకొచ్చాం మనం? మళ్లీ మనల్ని ఎక్కడికి తీసుకుపోతారో అంటుంది".** ఈ మాటలు వింధ్యలో చాలా ధైర్యాన్ని, నూతన ఆలోచనను రేకెత్తించాయి. ఈ కథ స్త్రీలలో వున్న బలహీనతలను, సమాజంలో జరుగుతున్న అంధవిశ్వాసాలను ప్రశ్నించే రీతిగా చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే స్త్రీల సమస్యలను కొత్త దృక్కోణంతో చూసేటట్లు చేసింది. స్త్రీ వాదానికి ఇదొక మలుపుగాను, మైలురాయిగా చెప్పవచ్చు. తీసుకున్న వస్తువుని రూపాన్ని చక్కగా సమన్వయం చే స్తూ రచయిత్రి చక్కగా వివరించారు. ఈ కథ మొత్తంలో మనకు రజోగుణమే కనిపిస్తుంది.

**పునరుత్థానం కథ – ఇతివృత్తం:**

కథలో ఇద్దరు స్నేహితులు సెలవుల్లో తమ సొంత ఊరికి వస్తారు. వారి చిన్ననాటి జ్ఞాపకాల్లో భాగమైన ఆదిలక్ష్మిని పలకరించడానికి వెళ్తారు. ఆమెను కలిసి, ఆమెతో మాట్లాడిన తర్వాత, వారు జీవితంలో ఎదుర్కొంటున్నటువంటి సమస్యలన్నిటికీ పరిష్కారం దొరికినట్లుగా భావించి, నూతనోత్సాహంతో తిరిగి ఇంటికి బయలుదేరుతారు. ఇది ఈ

కథలోని ప్రధాన ఇతివృత్తం.ఈ కథ ఉత్తమ పురుషలో మొదలవుతుంది. రాజు, అతని స్నేహితుడు. వారు మంచి స్నేహితులే కాదు బంధువులు కూడా. రాజు అతనికి మేనత్త కొడుకు. అతని కంటే 10 ఏళ్లు చిన్నవాడు. వారి ఊరిలో ఒక ఆమె ఉండేది.ఆమె పేరు ఆదిలక్ష్మి. తాటాకుల వేసిన మట్టి ఇల్లు. మరి భర్త చిన్నపాటి కామందు. పేకాటలో చాలా భూమి పోగొట్టుకున్న వారికి ముగ్గురు పిల్లలు. చాలా కష్ట పరిస్థితుల్లో కూడా ఆమె జీవితం పట్ల ఎంతో ఆశతో, ఆశే కాకుండా అనుభవించాలని తపనతో ఉండేది. ఆ ఇంటికి ఎప్పుడు ఎవరు వెళ్ళినా చాలా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేది. ఇంటి చుట్టు పూల మొక్కలు. అన్ని కాలాల్లోనూ విరగబూసి ఉండేవి. ఎత్తయిన మట్టి అరుగులు నున్నని గచ్చులా ఉండేవి. వాటి నిండా తెల్లటి ముగ్గులు ఎప్పుడు వాళ్ల ఇంట్లో సంక్రాంతి పండుగ నెలకొని ఉన్నట్లు అనిపించేది. ఆ అరుగుల మీద కూర్చుంటే కట్టెల పొయ్యి మీద మరుగుతున్న వాసన, గుమగుమలాడేమే కాక, అక్కడున్న కొద్దిసేపు ఆమె మమ్మల్ని ఎంతో ఉత్సాహపరిచే ఉల్లాసంగా కూడా ఉండేది. మా ఊళ్లో మాలాంటి యువకుల అందరికీ ఆమె ఒక ఆరాధ్య అని చెప్పుకోవచ్చు. మిగతా ఆడవాళ్ళతో కలిసి ఆమె వెళ్తుంటే, లాగి విడిచిన బాణంలా నడుస్తూ అందరిలోనూ కొట్టొచ్చినట్టు ఉండేది. చాటుగా అందరం ఆమెను చూసేవాళ్ళం. అందరూ ఆమె గురించి గుసగుసగా చెప్పుకునేవాళ్ళు. కానీ ఆమె ఆ మాటల్ని లక్ష పెట్టేది కాదు, వ్యతిరేకించే అందరూ అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. ఆమె పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతూ వచ్చింది. ఉన ్న కాస్త భూమి కూడా పోయి, రోగిష్టి భర్తను కోల్పోయి, బ్రతుకు తెరువు కోసం విశాఖపట్నం చేరింది. మేము ఎప్పుడు ఊరు వెళ్లినా ఆమె ఇంటికి వెళ్లి ఆమెను పలకరించకుండా వచ్చే వాళ్ళమే కాదు. గత సంవత్సరం సెలవులకు వెళ్ళినప్పుడు ఆ ఇంటి రూపురేఖలన్నీ మారిపోయి శిథిలాలు తప్ప అక్కడ ఏమీ లేదు. ఆమె గురించి అడిగితే ఆమె పొట్టచేత పట్టుకొని పట్టణానికి వెళ్లిందని తెలిసింది. రెండవ సంవత్సరం ఏదో ఒక ఆశతో ఆమె ఇంటివైపు వెళితే అక్కడ మా కళ్ళకు అద్భుతమే కనిపించిందని చెప్పాలి. లోపలకి వెళ్లి చూస్తే అక్కడ ఆదిలక్ష్మి ఉంది. మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించింది. చాలా విషయాలు మాట్లాడి వచ్చేస్తుంటే మా మీద ఉన్న ప్రేమ కొద్దీ ఆ చెట్టును ఉన్న రెండు పువ్వులు కోసి మా ఇద్దరికీ ఇచ్చింది. పూలు తెంపొద్దు అని అన్నా వినలేదు. రాకరాక వచ్చారు. ఇవి తప్ప మా దగ్గర ఏమీ లేవు ఇవ్వటానికి అని అంటూ మమ్మల్ని సాగనంపింది. నేను ఎట్లా చార్జింగ్ అవుతున్నా తెలియట్లేదు. హై వోల్టేజ్ లో ఉన్నాను. రాజు మాటమాటికీ నా చెయ్యి నొక్కుతున్నాడు. మేము వచ్చేస్తుంటే సంతోషంగా చెప్పింది.

మా చిన్న అమ్మాయిని పెంచుకోవడానికి ఇచ్చేసాను కదా దానికి బాసర ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చిందట' ఎక్కడ ఆదిలక్ష్మి? బాసరలో ఇంజనీరింగ్ కాలేజ్ పెట్టారని కూడా మాకు తెలియదు. ఎక్కడ ఇంజనీరింగ్ సీటు? ఎలా కలిశాయి విడిపోయిన కుటుంబపు శకలాలు?! ఏ ఆశ వల్ల అతుక్కుంటాయి? బతుకు బరువైనప్పుడల్లా ఎవరో ఒక ఆదిలక్ష్మి శిధిలాల నుంచి కొత్త జీవితాన్ని నిర్మించుకుంటూ దారి చూపుతూనే ఉంటుందేమో! మనం ఈ జనారణ్యాల్లోంచి వెతుక్కో గలిగితే చాలు.

ఈ కథలోని వస్తువు చాలా వైవిధ్యభరితమైనది. రచయిత్రి కథకు పెట్టిన పేరులోనే కథా వస్తువుని సూచన ప్రాయంగా తెలియజేశారు. పునరుత్థానం అంటే నూతన జీవము, నూతన ఉత్తేజం, నూతన జీవితం, ఇలా అనేక

అర్థాలున్నాయి. ఇది ప్రధానంగా క్రైస్తవ లోకంలో వాడే పదం. ఏసుప్రభు సిలువలో మరణించి, మూడవరోజు మరణాన్ని గెలిచి, తిరిగి బ్రతకడాన్ని పునరుద్ధానం అంటారు.

ఆ విషయాన్ని ఈ కథలో రచయిత్రి చాలా చక్కగా, సందర్భోచితంగా వాడారు. నేటి యాంత్రిక జీవనంలో ఉరుకులు, పరుగులు, కష్టాలు, కడగండ్లు సర్వసాధారణం. మన గోడు చెప్పుకోవడానికి ఆత్మీయులు లేకపోవటం మరొక దురదృష్టకరమైన విషయం. ప్రతి మనిషి ఎదుర్కొంటున్నట్లు... అంటే ఇలాంటి సంక్లిష్టమైన పరిస్థితుల్లో మన చుట్టూ ఎవరో ఒకరు మనల్ని ఉత్తేజపరచడానికి, మనలో నూతన ఉత్సాహాన్ని కలిగించడానికి ఎవరో ఒకరు ఉంటారని, వారెవరో మనమే వెతికి పట్టుకోవాలని రచయిత్రి వివరించారు. ప్రతి వ్యక్తి తనకున్న కష్టాలను, సమస్యలను చూసి కృంగిపోకుండా తనకంటే క్లిష్టపరిస్థితుల్లో ఉన్న వారిని చూసి, తనను తాను ధైర్య పరుచుకోవాలి అని రచయిత్రి పరోక్షంగా వివరించారు.

ఈ కథలో అరచి, గగ్గోలు పెట్టేసే పరిస్థితులు వున్నప్పటికి, ఏ పాత్రను కిక్కురు మననివ్వకుండా, కథని చాలా చక్కని విధానంలో నడిపించి మొత్తం రజోగుణంతో కప్పేసిన ఘనత రచయిత్రిది.

ఈ కథలో అరచి, గగ్గోలు పెట్టేసే పరిస్థితులు వున్నప్పటికీ, ఏ పాత్రను కిక్కురు మననివ్వకుండా, కథని చాలా చక్కని విధానంలో నడిపించి మొత్తం రజోగుణంతో కప్పేసిన ఘనత రచయిత్రిది.

**తన్మయి:**

ఈ కథలో తాయారు అనే 80ఏళ్ల ముసలామె గతించిపోయిన జీవితంలోని కష్టనష్టాలను, ఒడుదుడుకులను తలచుకుంటూ బాధపడకుండా తనకు ఆ వయసులో కలిగిన చిన్నచిన్న సంతోషాలను, ఆనందాలను ఆస్వాదిస్తూ ఆ వయసులో కూడా జీవితాన్ని ఆస్వాదిస్తూ తన్మయం చెందిన ఒక జీవితాన్ని మన కళ్లముందు సాక్షాత్కరింపచేశారు రచయిత్రి.

ఈ కథలో తాయరుకి హైస్కూల్తోనే చదువు ముగించి, సొంత మేనత్త కొడుక్కిచ్చి, వివాహం జరిపించి, అత్తింటికి పంపిస్తారు. చిన్నప్పటి నుండి తాయరుకి పాటలంటే ప్రాణం. ఎక్కడ ఏ పాట విన్నా... వెంటనే నేర్చుకునేది. ఎప్పుడు పాటలు పాడుతూ టీచర్ల మన్ననలు పొందేది. స్కూల్లో జరిగే ఉత్సవాల్లోనూ వేడుకల్లోనూ తనదే ప్రార్థనాగీతం.

¬ పెళ్లితో చదువు, పాట ఒక్కసారే ఆగిపోయాయి. పెళ్లి, పిల్లలు మళ్లీ పిల్లల పెళ్లిళ్లు. ఈ చక్రం తిరిగి తిరిగి తాయారుకి 80 ఏళ్లు వచ్చాక, కాస్త మందగిస్తుంది. ఆ వయసులో తన మేనకోడలు భువన ద్వారా తనలో వున్న కళను కొన్ని సందర్భాల్లో వెలికితీసి, అందరి మన్ననలు పొందుతుంది. ఆమె పిల్లలు కూడా ఆమెలో వున్న కళను చూసి ఆమెను ప్రోత్సహిస్తూవుంటారు. అలా ఆమె తన జీవితపు చివరిదశలో కూడా తన కళను, తన జీవితాన్ని ఆస్వాదిస్తూ తన్మయం చెందుతుంది.

ఈ కథలను ఉద్దేశించి పి.సత్యవతి గారు ఇలా అంటారు. ఈ కథల నిండా అనేక మంది స్త్రీలు, వారంతా పురుషాధిక్య సమాజపు సంకెళ్లలో బంధితులై, అణిగిపోయిన వారు కారు. తమ జీవనోత్సాహాన్ని కాపాడుకుంటూ తామున్న చోటును నివాసయోగ్యంగానే కాక అందమైన తోటలా చేసుకున్న వాళ్లు, తమ ఆశయాల ను కాపాడుకున్న వాళ్లు జీవితపు ఆటుపోట్లకు తట్టుకొని, తల ఎత్తుకొని నిలబడిన వాళ్లు, ఎక్కువ చదువులు 3, పెద్ద ఉద్యోగాలు

లేకపోయినా తమకు స్వభావసిద్ధంగా వచ్చిన స్థిమితాన్ని, సంతోషాన్ని పోగొట్టుకోకుండా నిలుపుకున్న వాళ్లను.

**ముగింపు:**

ఉత్సవ సౌరభం సంకలనంలోని ఒక కథలో రచయిత్రి ఇలా అంటారు. “ఈ లోకంలోని సుఖదు:ఖాలను దగ్గరకు తీసుకునే హృదయం ఒక్క సాహిత్యమే ఇవ్వగలదు.” మరొక సందర్భంలో లోకంలోని అందరి అను భవాలను నావి చేసుకొని నేను అనుభూతి చెందితే లోకమంతా నాది అవుతుందని అనిపిస్తే నాలోని వ్యక్తిగత దు:ఖం ఎక్కడ మిగిలింది? అని ప్రశ్నిస్తారు.

ఈ కథల ద్వారా రచయిత్రి ప్రధానంగా ఇతరుల బాధల్లో మనమొక ఊరటగా నిలవాలని, అకారణ భయా లను తొలగించుకొని, హేతువాద దృష్టితో స్త్రీలంతా ఆలోచించాలని, పితృస్వామ్య భావజాలం గురించిన స్పృహ కలిగి, జీవితాన్ని ప్రేమిస్తూ, తమని తాము ప్రేమించుకుంటూ తమ జీవితాన్ని ఆస్వాదిస్తూ ప్రగతిపథంలో నేను సైతం అంటూ పయనించాలని ఆశించారు.

## ఆధార గ్రంథాలు

1. వీరలక్ష్మీదేవి, వాడ్రేవు. 2014. “కిటికీ బయట వెన్నెల, మరికొన్ని కథలు. హైద్రాబాద్: విజయశ్రీ ప్రచురణ 82%వ3).
2. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1995. ‘కథాశిల్పం. హైద్రాబాద్: విశాలాంధ్ర ప్రచురణలు. సుదర్శనం.ఆర్.ఎన్.1989. ‘సాహిత్య నేపథ్యం.’ నవోదయ పబ్లిషర్స్. హైద్రాబాద్.

# శ్రీమద్భగవద్గీత - త్రిగుణాల పరిశీలన

**వాడ్రేవు నాగమణి,**
టి.పి.టి., ఎమ్.ఏ. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం
లెక్చరర్, ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల,
రాజమహేంద్రి.

మానవుని ప్రవర్తనను, జీవితాన్ని ప్రతిబింబింపజేసే ముఖ్యమైన అంశం గుణము. ఇది సత్త్వ, రజస్తమోగుణ భేదాలతో మూడు రకాలు. ఇవి ఆయా సందర్భాన్నిబట్టి దాదాపుగా ప్రతివ్యక్తిలోను కనిపిస్తుంటాయి. కాని ఇది అన్నివేళలా సరైనది కాదు. సాత్త్వికత ఉన్నతమార్గంవైపు నడిపిస్తే, రజో, తమో గుణాలు మనిషిని చేసే పనినుండి వెనుకకు నెడుతూ ఉంటాయి. సత్త్వగుణంలో యుక్తాయుక్త విచక్షణ, శాంతం, క్షమ ప్రధానాంశాలుగా ఉంటాయి. రజోగుణంలో క్రోధం, ఉద్రేకం, శోకం ప్రధానమైతే తమోగుణంలో విపరీతమైన వ్యామోహం ముఖ్యంగా కనబడుతుంది. కాబట్టి మనిషికి మేలుచేసే సత్త్వగుణాన్ని అలవరచుకోవడం విద్యార్థి దశనుండి ఎంతైనా అవసరం.

**ఉద్దేశ్యం:**

**"మొక్కై వంగనిది మానై వంగదు"** కాబట్టి చిన్నతనం నుండి సాత్త్వికమార్గంవైపు అనురక్తిని కలిగియుండి, సదాచార సంపన్నులుగా మెలగడం శ్రేయోదాయకం. అటువంటి గుణాన్ని భగవద్గీత ద్వారా మానవాళి గ్రహింపగలదని తెలియజేయడమే ఈ పరిశోధన పత్రంయొక్క ప్రధాన ఉద్దేశ్యం. దానివలన మెరుగైన సమాజస్థాపన జరుగుతుందని ఆశించవచ్చు.

**సత్త్వగుణం:** అర్జునుడంతటి మహావీరుడే కురుక్షేత్ర సంగ్రామ సమయంలో వెనుకడుగు వేసిన విషయం అందరికీ విదితమే. అటువంటిది సామాన్య మానవుని గురించి చెప్పనేల? కారణమేమైనప్పటికీ, శ్రీకృష్ణుడు అర్జునుని సందేహాన్ని తొలగించి, స్థితప్రజ్ఞత, భక్తి-ముక్తి మొదలైన యోగాలను వివరించి, త్రిగుణాత్మకమైన ఈ లోకం పోకడను కళ్ళకు కట్టినట్లుగా చూపినాడు. భగవద్గీతలో పద్నాలుగవ అధ్యాయంలో సత్త్వ, రజస్తమో గుణాల స్వరూపాన్ని, భగవత్ప్రాప్తికి ఉపాయాల్ని బోధించెను. సత్త్వగుణమనేది కేవలం నడవడిలోనే కాదు, తినే ఆహారంలో కూడా ఏ విధంగా ఉందో తెలియజేసెను. ఇది పదిహేడవ అధ్యాయంలో కనిపిస్తుంది.

**"సత్త్వం రజస్తమ ఇతి గుణ్ణా ప్రకృతి సంభవాః !**
**నిబధ్నంతి మహాబాహెూ దేహే దేహినమవ్యయమ్" !!**

ఈ గుణాలు మూడింటిలో సత్త్వగుణం నిర్మల ప్రధానమైనది. సత్త్వగుణం జీవుని సుఖాలలో నిమగ్నం చేస్తుంది. దానికి కారణం ఇంద్రియనిగ్రహం.

**"సర్వద్వారేషు దేహే స్మిన్ ప్రకాశ ఉపజాయతే !**
**జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత !!**

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

శ్రేష్ఠములైన కర్మలను ఆచరించుట వలన సాత్త్వికఫలమైన సుఖం, జ్ఞానం వైరాగ్యం మొదలైన ఫలితాలు కలుగుతాయి. **"సత్త్వాత్ సంజాయతే జ్ఞానం"** అనేది గ్రహించవలెను. సత్త్వగుణ స్థితులైనవారు స్వర్గలోకాది ఊర్ధ్వస్థితిని పొందుతారు.

అర్జునుడు త్రిగుణాతీతుడైన వ్యక్తి లక్షణములను గూర్చి శ్రీకృష్ణుని ప్రశ్నించెను. కృష్ణుడు సమాధానాన్ని తెలియజేసి, శ్రద్ధను గురించి, సాత్త్వికాహారాన్ని గురించి ఈ విధంగా తెలియజేసెను. అంతేగాక సాత్త్వికులు దేవతలను మాత్రమే పూజిస్తారు. వారి ఆహారవిధానం కూడా సాత్త్వికంగానే
ఉంటుంది.

**"ఆయుః సత్త్వబలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః !**
**రస్యా స్నిగ్ధా స్థిరా హృద్యా ఆహార్యా సాత్త్విక ప్రియాః !!**

ఆహార విషయంలోనేకాక యజ్ఞము, దానము, తపస్సు మొదలైన విషయాల్లోను సాత్త్విక విధానాన్ని పాటించడం ఉత్తమమని గ్రహించాలి. శాస్త్రోక్తంగా ఈ యజ్ఞం చేయడం నా కర్తవ్యమని భావించి, మనస్సులో దృఢంగా నిశ్చయించుకొని, ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే యజ్ఞమే సాత్త్వికయజ్ఞం.

**"దేవద్విజ గురుప్రజ్ఞా పూజనం శౌచమార్జవమ్ !**
**బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉద్యతే" !!**

ఏ పని చేసినా మనసా, వాచా, కర్మణా శుద్ధమై, సత్యమై, ఇతరులకు మేలు చేకూర్చేది కావాలి.

**"శ్రద్ధయా పరయా తప్తం**
**తపస్త్రివిధం నర్లై !**
**అఫలాకాంక్షిభిరుక్తై**
**సాత్త్వికం పరిచక్షతే" !!**

ఇది సాత్త్వికమైన తపస్సు లక్షణం. శ్రద్ధతో ఆచరిస్తేనే యోగులవుతారు. అలాగే **"దానం కూడా చేయడం కర్తవ్యం"** అనే భావనతో మెలగాలి. అయితే ఆ దానం తగిన ప్రదేశంలో, దుర్భిక్షాది కాలంలో, ఆకలి దప్పులతో బాధపడేవారికి, అంగవైకల్యం కలవారికి, రోగులకి, బ్రాహ్మణులు, పండితులు, బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు మొదలైన వారికి, ముఖ్యంగా పాత్రత కలిగినవారికి మాత్రమే మాత్రమే, ఏమీ ఆశించకుండా, నిస్వార్థభావంతో తప్పకచేయాలి. ఈ విధంగా సాత్త్వికగుణం సర్వశ్రేయోదాయకమని భావించాలి. అయితే త్రిగుణాతీతుడై ఉండడం భగవత్ప్రాప్తికి సాధనమని గ్రహించాలి. అది ఆహారంతో కష్టసాధ్యమే అయినప్పటికీ ముక్తిదాయకం కదా!

మానావమానములయందు, మిత్రులయందు, శత్రువులయందు సమానంగా ప్రవర్తించేవాడు, విద్యుక్త కర్మలను ఆచరిస్తూ, కర్తృత్వమనే అభిమానం లేనివాడు మాత్రమే త్రిగుణాతీతుడవుతాడు. నిర్మలమైన భక్తితో, ఎల్లప్పుడూ భగవదారాధన చేసే పురుషుడు త్రిగుణాతీతుడై, సచ్చిదానంద ఘనపరబ్రహ్మ ప్రాప్తికి అర్హతను పొందుతాడు.

ముగింపు:

ముగింపు:

**"నేటి బాలలే రేపటి పౌరులు"** కాబట్టి, చిన్నతనంనుండి మన హిందూ ధర్మశాస్త్రాలలోని మంచి విషయాలను బోధిస్తూ, సనాతన సంప్రదాయపు బాటలో నడవడానికి ఇటువంటి పుస్తకాలు సహాయకారులు కాగలవని ఆశిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు**

1. శ్రీమద్భగవద్గీత (తాత్పర్య సహితము) (గీతాతత్త్వ వివేచీ అనుసారము) 77, గీతాప్రెస్, గోరఖ్‌పూర్ (ఉ.ప్ర) 273005. హిందీమూలం: శ్రీ జయదయాళ్ జీ గోయన్దకా అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వేంకటరామయ్య.

# మనుచరిత్ర - ప్రవరుని సత్వగుణం

**డాక్టర్ పప్పల వెంకటరమణ,**
ఎం.ఏ., పి.హెచ్.డి., (గోల్డ్ మెడల్),
తెలుగు విభాగాధిపతి,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు),
శ్రీకాకుళం.

ఆంధ్ర కవితా పితామహుడు వ్రాసిన మనుచరిత్ర మానవజాతి మణిదీపం. నేటి సమాజంలోని యువతకు వ్యక్తిత్వ వికాసమును కలుగజేయుటలో మరియు సాత్విక గుణములు కలిగించుటలో ముందు వరుసలో ఉంటుంది.

త్రిగుణములు - అనగా సత్వగుణం రజోగుణం, తమోగుణం. ఈ మూడు హిందూ ధర్మశాస్త్రాలలో చెప్పబడిన ప్రధాన గుణములు. భగవద్గీత ప్రకారం సత్వగుణం వల్ల జ్ఞానం, రజోగుణం వల్ల మోహం, తమోగుణం వల్ల అజాగ్రత్త, అవివేకము, మరపు, పరాకు మొదలైనవి కలుగుతాయి. సత్వగుణం కలిగిన వారు స్వర్గలోకాలకు వెళుతున్నారు. రజోగుణం కలిగినవారు మానవలోకంలో జన్మిస్తున్నారు. తమోగుణ ప్రవృత్తి గలవారు అధోలోకాలకు వెళ్తున్నారు. సత్వగుణం అధికంగా కలిగిన వ్యక్తులు ప్రశాంతంగా ఉంటారు, దైవము వైపుకు తిరుగుతారు, మృదువుగా మాట్లాడతారు. రజోగుణం అధికంగా కలిగిన వ్యక్తులు ప్రశాంతంగా ఉండరు. ఎప్పుడూ ఏదో ఆలోచన, ఆందోళన, అసంతృప్తి, అశాంతి, ఏదో చేయాలని తపన చేస్తూ ఉండటం. ప్రాపంచిక విషయాలపై అమిత ఆసక్తి, దానితో నిరంతరం కర్మ రంగంలోకి దూకడం చేస్తుంటారు. తమోగుణం అధికంగా ఉంటే సోమరితనం, తీవ్రమైన కామకోరికలు, నిద్ర, ఇతరుల దయాదాక్షిన్యాలపై ఆధారపడటం, దుర్మార్గపు ఆలోచనలు, తిండి ధ్యాస ఎక్కువగా కలిగి ఉంటారు. ఈ మూడు గుణాలు ప్రతివారిలోనూ ఉంటాయి. ఏదో ఒక గుణం ప్రభలంగాను, మరొకటి సాధారణంగాను, వేరొకటి తక్కువగాను ఉంటుంది. ఎక్కువ తక్కువలే గాని అందరిలోనూ ఉండేది ఈ త్రిగుణములే. వీటిలో ఏ లక్షణములతో ప్రవర్తిస్తున్నాము మోహముతోనా, స్వార్థంతోనా లేక త్యాగముతోనా అనే దానిని బట్టి ఏ గుణముతో ప్రవర్తిస్తున్నామో సులువుగా గుర్తించవచ్చు. గుర్తించిన తరువాత వాటిని మార్పు చేసుకోవాలి.

ఆంధ్ర సాహిత్యంలో భారత రామాయణంలోని పాత్రల తరువాత వరూధిని ప్రవరులే ప్రసిద్ధ పాత్రలు. ఈ రెండు పాత్రలు తెలుగు సాహిత్యంలో వెలుగు దీపాలు. సత్వగుణముతో సౌందర్యానికి సంప్రదాయానికి నిలయము ప్రవరుడు. ఉదయాన్నే నిద్రలేచి భగవన్నామస్మరణచేసి, నిత్యాగ్నిహోత్రం, నిత్యాన్నదానం అతని నిత్యకృత్యం. ఇంద్రియ నిగ్రహం గలవానిగా, ధనాపేక్ష రహితునిగా, తీర్థయాత్ర పట్ల ఆసక్తిగలవానిగా, హృదయ నిర్మలత్వం, తప్షసంపన్నత, వేదోక్త మార్గం, సచ్చీలత, నిషిత పరిశీలనాశక్తి, ప్రకృతి అందాలపట్ల ఆత్రుత, అమాయకత్వం, బ్రాహ్మణత్వం, ఏకపత్నీవ్రత్యం ధర్మప్రవృత్తి, సౌశీల్యము, మాతా పితృభక్తి మొదలగు సాత్వికగుణాలు సమాజంలోని

యువతీ యువకులకు వ్యక్తిత్వ వికాసమును పెంపొందింపజేయును. ప్రవరుని రూపురేఖా విలాసాలను, సత్వ గుణములను గూర్చి తెలుపుతూ పెద్దన చెప్పిన పద్యములో...

**"ఆపురి బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా**
**షా పరశేషభోగి వివిధా ధ్వర నిర్మల ధర్మ కర్మ దీ**
**క్షా పరతంత్రుడంబరుహ గర్భ కులాభరణంబనారతా**
**ధ్యాపన తత్తరుండు ప్రవరాఖ్య డలేఖ్యతనూ విలాసుడై"**

వరూధిని తమోగుణముతో ఆకర్షణీయమైన శక్తి గలది. ఆమె కామాగ్నిలో మైనమై కరిగిపోక వజ్ర హృదయుడై నిలిచి శీల రక్షణ చేసుకున్న ప్రవరుని మహనీయత నేటి యువతకు సత్వగుణము పెంపొందుటలోను, వ్యక్తిత్వ వికాసమును కలిగించుటలోను ఆదర్శనీయం - ఆచరణీయం.

అరుణాస్పదపుర వాస్తవ్యుడొక శ్రోత్రియ బ్రాహ్మణ కుమారుడు ప్రవరాఖ్యుడు జయంత- వసంత- కంతులను చక్కదనంబున గెలువజాలిన సుందరుడు. వివిధాధ్వర నిర్మల ధర్మ దీక్షా పరతంత్రుడు. అనారతాధ్యాపన తత్పరుండు. యవ్వనముందు యజ్ఞ ధనాఢ్యుడు, అనుకూలవతి సోమిదమ్మ అతని పత్ని. తల్లిదండ్రులకు సేవచేస్తూ సుఖముగా కాపురముండినవాడు. అతిథి పూజాతత్పరుడు తీర్థ సందర్శనాభిలాషి, పాదలేపనం లభించగా ముందు వెనుక చూసుకోకుండా, ఫ్రీ టిక్కెట్టు దొరికితే దొరికిందే తొందరగా విమాన ప్రయణానికి తయారయ్యే ఆత్రగాడివలే హిమాలయ భూములను దర్శించడానికి వెళ్లెను. పాదలేపనం కరిగిపోగా అప్రయోజకుడై దిగులుపడుతూ తమోగణముతో విరాజిల్లుతున్న వరూధిని ఉన్న కోనలోకి వెళ్ళినాడు. ఆకలిగొన్న మాంసాహారి వంటింట్లోకి వచ్చిన కుందేలుని విడువనట్లే వరూధిని ప్రవరుణ్ణి వలపు చూపుల వలలో చిక్కించుకుని దక్కించుకోవడానికి నానా తంటాలు పడ్డది. ప్రవరునికి తన సోమిదమ్మయందే గాని వరూధినియందు అనురాగము లేదు. వరూధిని యందు మనసుపడితే గృహస్థధర్మం పతనమై వ్యక్తిత్వం కోల్పోయి నేటి సమాజానికి ఆదర్శవంతుడు కాలేడు.

నేటి యువకులు కూడా సత్వగుణము గలిగిన ప్రవరునివలె ఏకపత్నీవ్రతులై యుండి పర స్త్రీ వ్యామోహాన్ని విడనాడి భార్యయందు ప్రేమానురాగాలు కలిగియుండి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవలెను.

అనాది నుండి నేటి వరకు సమాజంలో స్త్రీని భోగవస్తువుగా పరిగణించేవారు ఉన్నారు. మనుచరిత్రలోని సత్వగుణ సంపన్నుడైన ప్రవరుని వంటి వారు వర్తమాన పరిస్థితుల దృష్ట్యా సామాన్యులు స్త్రీకాంక్ష వదిలిపెట్టి, స్త్రీ పురుష సంబంధం ఏకప్రియానురక్తంగా మారి దాంపత్య ధర్మంగా రూపుదిద్దుకొని సాంఘిక జీవితానికి అంతిమంగా పునాదియైన కుటుంబంగా నిలబడి, ఆదర్శవంతమైన సమాజసాధనకు కృషిచేసింది. ఇది నేటి సమాజానికి ఆదర్శనీయమైనదిగా, అనుసరణీయమైనదిగా వెలుగొందుచూ వ్యక్తుల మానసిక ప్రవృత్తిలో మార్పులు తీసుకువస్తుంది. ఇది మనుచరిత్ర సాధించిన గొప్ప విజయం.

ఈ గ్రంథం స్త్రీ పురుషులు శారీరక, మానసిక సంబంధాల గురించి తెలియజేస్తుంది. సకల ప్రాణికోటికి

సామాన్యమైన మైధునవాంఛని అణగదొక్కాలని చూడటం కుదరనిపని. అలా అని చెప్పి శరీరవాంఛలని తమోగుణము కలిగిన వరూధినివలె విచ్చలవిడిగా వదిలివేస్తే అది విపరీతానికి దారితీస్తుంది. శృంగార సుఖం అన్నివేళలా ఆనందాన్ని అందివ్వలేదని నేటి మానవలోకానికి సందేశాన్ని అందించింది. ఇందులో ప్రవరుడు, మాయాప్రవరుడు, స్వరోచి, ఇందీవరాక్షుడు, మనోరమ కళావతి విభావసి వంటి పాత్రలు మనుషులలోని విభిన్న వృత్తుల సంఘర్షణని వివరించేటువంటివి. త్రిగుణములలో ఒక్కొక్కరు ఒక్కొక్క గుణము తద్వారా సమాజ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడును.

బాహ్య సౌందర్యమునేగాక అంతఃసౌందర్యమును కూడా గుర్తింపగల ధీశాలి ప్రవరుడు. గృహస్థుడగువాడు నిర్లిప్తుడై, ఇంద్రియ విజయమును సాధించి, భగవత్ కైంకర్య రూపముగా, నిత్యనైమిత్తికాది కర్మలను యధావిధిగా కొనసాగించును. భగవద్భక్తి మార్గమున మోక్ష సామ్రాజ్యము నదిరోహింపగలడను పరమ సత్యమును బాగుగా గుర్తించిన ప్రవరుడు కామినీ విలాస విభ్రమములకు ఎట్లు లోనగును. మొహంధులైన వారు చేయు వెకిలి చేష్టలకును, పసలేని మాటలకును విజ్ఞానియగు ప్రవరుడు మోహమునేల పొందును. యువకుడై యుండియు ప్రవరుడు ముగ్ధమోహనాంగియగు వరూధినికి లోబడలేదు. ఇంద్రియ విజయం నిష్కామ కర్మయోగమున సాధింపవచ్చుననుటకు ప్రవరుడే నిదర్శనం. ఇనుపకచ్చడాలు కట్టుకొనిన మునిమృచ్చుల మనస్సులనైనను వికలము చేయగల తమోగుణము గలిగిన వరూధిని కోరికను తృణప్రాయముగా తిరస్కరించగలిగెను. ఇలాంటి విషయాల్ని బోధించే ప్రబంధాలు మానవజాతిలో సత్వగుణాభివృద్ధికి, తద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింపజేస్తాయి.

పరిపూర్ణ వికాసం కలిగిన ప్రవరునికి వరూధినిపై ఆగ్రహంకాని, జుగుప్సకాని ఏర్పడలేదు. ఆమెకు వివేకము కలిగించుటకు ఉపనిషత్తులలోని సారమును బోధించెను. మోహంధులకు వివేకమును కలిగించి వారిని సన్మార్గగాములను చేయుట విద్యావంతుల కర్తవ్యం. కార్యసాధకునికి కావలసిన లక్షణములన్నియు సత్వగుణ విరాజితుడైన ప్రవరునిలో గలవు.

దేశ రాజధాని నడిబొడ్డున బలాత్కరించబడి బలి అయిపోయిన "నిర్భయ"ను మింగేసిన మగ మద మృగాలున్న నేటి సమాజానికి మనుచరిత్రలోని సత్వగుణ సంపన్నుడైన ప్రవరుని పాత్ర అత్యంత ఆదర్శనీయం. తీవ్రములైన కామముతో కూడిన కోరికలతో మీద పడుతున్న తుమోగుణంగల వరూధిని వంటి వారిని చీత్కరించుకొని **"చెప్పకుమిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై దేనియల్"** అంటూ ప్రవరుడు పలికిన మాటలు సమాజానికి పసిడి మూటలు. నేటి యువతకు కళ్ళు తెరిపించి వారిలో మార్పులు తీసుకువచ్చి సత్వగుణం కలిగిన వారిగా మార్పుచెంది మనోవికాసాన్ని కలిగించును.

వరూధిని ప్రవరునిపై మనసు పడిందని చెప్పినప్పుడు జవాబుగా తన కులం గురించి, తల్లిదండ్రుల గురించి, ఇంటికి వెళ్లకపోతే జరిగే నష్టం గురించి అమాయకంగా చెబుతాడు. ధర్మాధర్మాల గురించి వాదించుకున్నారు. అలింగనం ఆఖరి ఆయుధంగా వరూధిని ప్రయోగించింది. పాషాణమైన హృదయముగల ప్రవరుని మీద ఈ ప్రయోగం ఫలించలేదు. నేటి మన యువత నిగ్రహం కోల్పోకుండా తమ జీవిత గమ్యం వైపు ప్రయాణం సాగించాలి.

పరాయి స్త్రీని తల్లిగా, తోబుట్టువుగా భావించుట ప్రవరుని యొక్క వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. తీవ్రమైన తామసగుణం కలిగిన వరూధినిని సోదరిగా భావించాడు. నా సేవలకి నా తల్లిదండ్రులు ఎదురుచూస్తారు. నేను తొందరగా ఇంటికి వెళ్లాలన్న ప్రవరుని మాటల్లో తల్లిదండ్రులను గౌరవించి వారి ఋణం తీర్చుకోవాలని సామాజిక ధర్మం తెలుస్తుంది. నేడు వివాహము పేరుతో ఎందరో యువతులను మోసం చేస్తున్న నిత్య పెళ్ళికొడుకు వంటివాడు మాయాప్రవరుడు. ఇతడు కూడా వరూధిని వలె తీవ్రమైన తామసగుణం గలవాడు. వరూధినికి కల్లబొల్లి కబుర్లు చెప్పి అవకాశం చూసుకుని తన కోర్కె తీర్చుకొని ఆమె గర్భానికి కారకుడై చల్లగా జారుకున్నాడు. నేడు ఎందరో అభాగినులు ఇలాంటివారి మాయలో పడి దిక్కుగానక తనువులు చాలించుకుంటున్నారు. తమ వ్యక్తిత్వాన్ని కోల్పోయి తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారు. అలాంటి వారికి సాత్వికుడైన ప్రవరుని చరిత్ర ఒక దిక్సూచి వంటిది. జరిగే పరిణామాలను గూర్చి జాగృతం చేస్తుంది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని వారికి దిశానిర్దేశం చేస్తుంది.

**ఆధార గ్రంథములు**

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం – ఆరుద్ర (రెండవ సంపుటం–2003), తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. వ్యాస ప్రభాకరం – వేటూరి ప్రభాకర శాస్త్రి (1990), ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.
3. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం–1999) డాక్టర్ జి. నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. మనుచరిత్ర – మన చరిత్ర (2012) – ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, తెలుగు అకాడమీ, హైదరాబాద్.

# భగవద్గీత త్రిగుణాత్మక సందేశం

**డా॥ ఎం. మునిలక్ష్మి,**

తెలుగు అధ్యాపకురాలు,

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

జగద్గురువైన శ్రీకృష్ణుడు మానవునికి ఉపదేశించిన గొప్ప సందేశం భగవద్గీత. ఇది సర్వజనులకు హితము కలిగిస్తుంది కనుక విశ్వజనీనం. సర్వకాల, సర్వావస్థలలో, సర్వమానవులకు ఉపకరించి మానవుని సత్పురుషునిగా తీర్చిదిద్ది, మానవ జీవిత గమ్యానికి ఉత్తమ గతులకు మార్గనిర్దేశం చేయడంలో ఉపకరిస్తుంది. మనలోని సూక్ష్మబుద్ధిని, సునిశిత జ్ఞానాన్ని వికసింపజేసి స్థితప్రజ్ఞులుగా తయారుచేస్తుంది.

భగవద్గీతలోని ఏడు వందల శ్లోకాలను గీత అని పిలుస్తారు. ఇది మహాభారతంలో భీష్మపర్వంలో 25వ అధ్యాయం నుండి 42వ అధ్యాయం వరకు ఏడు వందల శ్లోకాలతో పద్దెనిమిది అధ్యాయాలుగా విభజింపబడి ఉంది. 'ప్రతి యుగానికీ ప్రతి నాగరికతకీ తగిన సందేశాన్ని అందించగలిగింది భగవద్గీత. దీని అర్థగాంభీర్యం ఎంతటిదనగా దీనిపై వంద వ్యాఖ్యానాలు వ్రాసినా, ఇంకా వంద వ్యాఖ్యానాలకు అవకాశం ఉంటుంది అన్నది మహాపురుషులు అరవిందుల వారి ఉవాచ.

సుఖ సంతోషాలను కోరుకునే మానవుడు ఇహలోకంలో శాంతిని సౌఖ్యాన్ని పొందడానికి గీత మార్గదర్శి కనుక ప్రపంచవ్యాప్తంగా భగవద్గీత అత్యుత్తమ గ్రంథంగా నిలిచింది. కుటుంబంలోను, సమాజంలోను ఒక వ్యక్తి నడుచుకొనే విధానం, ప్రవర్తించే తీరు అతని గుణగణాలను, వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తాయి. అందులో ముఖ్యమైనవి త్రిగుణాలు. అవే సత్త్వరజస్తమో గుణాలు. వాటి ఆవిర్భావ లక్షణాలను భగవద్గీతలో గుణత్రయ విభాగంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశిస్తాడు.

మానవులలో ఉన్న సాత్త్వికం, రాజసం, తామసం అన్న ఈ త్రిగుణాలు వారి స్వభావానికి గుర్తులు. వారి వారి స్వభావాన్ననుసరించి మానవుడు ఆయా కర్మలను ఆచరిస్తాడు. వ్యక్తిలో ఉన్న ఈ మూడు గుణాలు ఏవిధంగా పనిచేస్తాయో మనిషిని ఏ విధంగా తన వైపుకు మలచుకొంటాయో భగవద్గీత తెలుపుతుంది. సృష్టిలో పుట్టిన ప్రతి జీవి మరణించక తప్పదు అన్న ఎరుక కలిగి ఉన్నప్పటికీ మానవుడు త్రిగుణాల శక్తిచే బంధింపబడతాడు. ఎవరికి వారే అన్నట్లుగా స్వార్థ చింతనతో జీవితాన్ని గడుపుతాడు. అందుకే వినాశకారకాలైన దుర్గుణాలను అధిగమించి పరమాత్మలో ఐక్యం కావాలన్న సందేశం మనకు భగవద్గీతలో కనబడుతుంది.

"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశక మనామయమ్
సుఖ సజ్గేన బధ్నాతి జ్ఞానసజ్గేన చానఘ" ॥6॥

అంటే సత్త్వగుణము నిర్మలమై, ప్రకాశవంతమై ఎటువంటి వికారాలు లేకుండా ప్రకాశిస్తూ ఉంటుంది. అయినప్పటికీ ఆనందం, జ్ఞానశక్తి వలన మానవుడు బంధింపబడి ఉంటాడు. దీని వలన అతడి మనస్సు ఎటువంటి మలినము లేకుండా స్వచ్ఛంగా ప్రశాంతంగా జీవించడానికి అవకాశముంటుంది. సత్త్వగుణము గలవాడు అద్దంవలె ప్రకాశిస్తూ సత్యం, న్యాయం, ధర్మం, అహింస, వినయ విధేయతలు కలిగి ఉంటాడు. సౌమ్యత, ఆత్మనిగ్రహం, భావ పవిత్రత కలిగి సాత్త్విక జీవనాన్ని గడుపుతాడు. మానవుడు రజోగుణాన్ని అలవరచుకొన్నట్లయితే ఎలా ఉంటాడో భగవద్గీత చెబుతుంది.

"రజోరాగాత్మకం విద్ధి తృష్ణాసజ్గసముద్భవమ్ ।
తన్నిబధ్నాతి కౌన్తేయ కర్మసజ్గేన దేహినమ్ " ॥7॥

రజోగుణము రాగాత్మకమైనది. తృష్ణ, విషయాసక్తులు కలది. ఇది జీవాత్మను కర్మలతో బంధించడం వల్ల మానవుడు ప్రతిఫలాన్ని ఆశిస్తూ జీవన పోరాటంలో పరుగులు పెడుతూ కోరికల సాధనే జీవన లక్ష్యంగా సాగుతాడు. గౌరవంకోసం, సంపదలకోసం ఆరాటపడుతాడు. దానితో సుఖము కోల్పోయి తృష్ణకు బంధీ అవుతాడు.

"తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్య నిద్రాభ్ఞి తన్ని బధ్నాతి భారత" ॥8॥

తమస్సు అజ్ఞానము నుంచి పుడుతుంది. ఏ పనీ చేయడానికి ఆసక్తి లేక మనిషి అలసత్వము కలిగి ఉంటాడు. సోమరితనం, నిద్ర, ప్రమాదాలతో బంధీయై ఏ పనీచేయక, చేయాలనిపించక నిద్రావస్థలో జడపదార్థములాగా జీవిస్తాడు. అందులోనే సుఖమును వెతుక్కొంటాడు.

"సత్త్వం సుఖే సజ్ఞయతి రజ్ఞ కర్మణి భారత ।
జ్ఞానమావృత్యతు తమ్మ ప్రమాదే సజ్ఞయత్యుత" ॥9॥

సత్త్వగుణం జ్ఞానాన్ని తద్వారా సుఖాన్ని కలిగిస్తుంటే, రజోగుణం కర్మలపట్ల రాగద్వేషాల పట్ల ఆసక్తిని కలిగిస్తుంది. తమోగుణం జ్ఞానాన్ని కప్పివేసి వివేకాన్ని నశింపజేస్తుంది. ఫలితంగా ఎన్నో ప్రమాదాలు ఎదుర్కోవలసి వస్తుంది. సరైన నిర్ణయాలు తీసుకోలేక జీవితం అస్తవ్యస్తమయ్యే అవకాశం ఉంటుంది.

త్రిగుణాలు మనిషి మనసులో రేపే అలజడిని గమనిస్తే రజస్తమోగుణాలను అణచి సత్త్వగుణం, సత్త్వతమో గుణాలను అణచి రజోగుణం, సత్త్వరజోగుణాలను అణచి తమోగుణం అధిగమించడానికి ప్రయత్నిస్తుంటాయి.

జ్ఞానం వ్యక్తిని పవిత్ర పరుస్తుంది. ఆత్మను శుద్ధి చేస్తుంది. ప్రాపంచిక విషయాలపట్ల అనాసక్తిని కలిగించి విధ్యుక్త ధర్మాన్ని ప్రబోధిస్తుంది. మానవుడు చేసే పనులను బట్టే అతనికి సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. వారి ప్రవర్తననుబట్టే వారి శ్రద్ధాసక్తులు పరిగణింపబడుతాయి.

**"ఊర్ధ్వం గచ్ఛన్తి సత్వస్థా మధ్యేతిష్ఠన్తి రాజస్నా ।**

**జఘన్య గుణవృత్తిస్థా అధోగచ్ఛన్తి తామస్నా" ॥8॥**

సత్త్వగుణ సంపన్నులు ఉన్నత శిఖరాన్ని, రజోగుణం గలవారు మధ్యస్థాన్ని, తమోగుణస్థులు క్రింది స్థాయిని పొందుతారని అర్థం. కనుక మానవుడు నిరంతరము అప్రమత్తతో గుణాల ప్రభావాన్ని పరిశీలించుకుంటూ రజో తమో గుణాల నుంచి సత్త్వ గుణం వైపుకు మళ్ళడమే ముక్తికి మార్గం. సుఖ జీవనానికి సోపానం.

**ఆధార గ్రంథాలు**

1. శంభారావము (శ్రీమద్భగవద్గీతా రహస్య ప్రకాశము) 1987, తృతీయ సంపుటము, కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య, వరల్డ్ టీచర్ ట్రస్ట్ ప్రచారణ, విశాఖపట్టణము 530002.
2. శ్రీమద్భగవద్గీతా సందేశం (2022), స్వామి రంగనాధానంద, రామకృష్ణమఠం, దోమలగూడ, హైదరాబాదు 500029.
3. భగవద్గీత వ్యక్తిత్వ వికాసం (2014), డా శ్రీ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ప్లాట్ నెం. 301, రామన్న టవర్స్, ఫస్ట్లైన్, రామన్నపేట, కొరిటెపాడు,గుంటూరు A.P 522002.

# శ్రీ మద్రామాయణము – త్రిగుణములు

**శ్రీమతి పి. శారద,** ఎం.ఏ. సంస్కృతం,
సంస్కృత ఉపన్యాసకురాలు,
భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల, సైనిక్ పురి,
సికింద్రాబాద్.

'గుణము' అనగా బంధించుట, జీవులను బంధించేవి సత్త్వము, రజస్సు, తమస్సు అను ఈ త్రిగుణములు.

**"సత్వం రజస్తము ఇతి గుణ్ణా ప్రకృతి సంభవాః !**
**నిబధ్నన్తి మహా బాహో దేహే దేహి నను వ్యయమ్"!!**

జీవుడు ప్రకృతితో సంపర్కము కలిగినప్పుడు అతడు ఈ గుణముల చేత బద్ధుడగును. భౌతిక ప్రకృతిక శక్తి ఈ త్రిగుణములను కలిగి వుండును. ప్రకృతిచే తయారు చేయబడిన శరీరము, మనస్సు, బుద్ధి ఈ మూడింటికి కూడా త్రిగుణములు వుండును. ఈ గుణములే నాశనము లేని జీవాత్మను, నాశనమయ్యే దేహమును బంధించును. అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో గుణత్రయ విభాగము నందు అర్జునునికి బోధించెను. ఈ త్రిగుణాలు ఆత్మకు అతీతమైనవని ఎవరు గ్రహిస్తారో వాళ్ళు వివేకవంతులు. **"గుణాతీతుడైన స్థితప్రజ్ఞుడే బ్రహ్మాంశ సంభూతుడు"** అని భగవద్గీతలో శ్రీకృష్ణుని సందేశము. కాబట్టి స్థితప్రజ్ఞత్వాన్ని సాధించినవారే నిత్యజీవన వ్యవహారంలో ప్రశాంత మనస్కులై ,సుఖమయ జీవితాన్ని అందుకొనగలరు. ఆధునిక సమాజంలోని ప్రతి మానవుడు ఈ గుణత్రయ ప్రభావాలను నిమిత్తమాత్రులుగా దర్శించాలి.సుఖదుఃఖాలకు ఆనందించక, విచారం చెందక మనోనిబ్బరంతో జీవనాన్ని గడపవలెను. ఈ త్రిగుణాలు సత్, చిత్, ఆనంద స్థితులకు ప్రతీకలు.

**సత్త్వగుణ లక్షణములు:**

**"సత్త్వం సంజాయతే జ్ఞానం"** ప్రశాంతంగా ఆలోచించడం, మనోనిగ్రహాన్ని కల్గివుండటం సత్త్వగుణ లక్షణం.సత్త్వగుణ ప్రభావం వలన మానవుడు పరిశుద్ధుడై జ్ఞాన ప్రకాశుడై పాపఫలితాల నుంచి విముక్తిని పొందును. సత్త్వగుణము పొందటం పూర్వజన్మ కర్మవశమే అయినా, జ్ఞానం చేత సాధించవచ్చును. మంచిమాటలు వినటం, దేవుని కీర్తన చేయటం, భగవత్ స్వరూపాన్ని దర్శించటం పవిత్ర వస్తువుల వాసనలను ఆఘ్రాణించటం, విద్వాంసులతో మైత్రి మొ!!వి సత్త్వగుణ అభివృద్ధిని కలిగించేవి. సుఖదుఃఖాలలో,ఇష్టాయిష్టాలలో సమానముగా వుండటం, తనను నిందించినా ,స్తుతించినా ఎటువంటి వికారాన్ని ప్రదర్శించక పోవటం, మతిమీరిన ధనను, బంగారముపై కాంక్ష లేక పోవటం, గౌరవాగౌరవములను సమానంగా చూడటం, శతృ–మిత్ర పక్షాలకు సమానంగా చూడటం, ఆ భగవంతుని భక్తియోగంలో ఉపాసించటం అటువంటి వారిని గుణత్రయాతీతులని చెప్పవచ్చును. అటువంటి గుణత్రయాతీతులు ఈ జీవితంలోనే దుఃఖాలనుంచి విముక్తిని పొంది బ్రహ్మానందాన్ని (అమృతత్వాన్ని) అనుభవించును. ఇటువంటి వారు మరణించిన తర్వాత ఉత్తమ జ్ఞానులు పొందదగిన స్వర్గాది పుణ్యలోకాలు, ఉత్తమలోకాలను పొందగలరు.

**"సుగుణాన్ సమతీ త్యైతాన్, బ్రహ్మ భూయయకల్పతే".**

**రజోగుణ లక్షణములు:**

**"రజో రాగాత్మకం సిద్ధి, తృష్ణా సంగ సముద్భవమ్ !**
**తన్ని బధ్నాతికౌంతేయ, కర్మ సంగేన దేహినమ్"!!**

దేహాన్ని బంధించును. ఉద్రేకం, మోహం ఎక్కువగా వుండుట, ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి కలిగి వుండుట, ధనము, బంగారము పై మితిమీరిన ఆశ, కార్యములో ప్రయత్నం, కర్మలను విస్తృతంగా ఆరంభించుట, చంచలమైన మనస్సు, అన్నింటిపట్ల కోరిక కల్గి, అవి తనకే స్వంతం కావాలన్న కోరిక, లోభత్వము, కామ్య, నిషిద్ధ కర్మములను ప్రారంభించుట, మనశ్శాంతి లేకుండుట, ఇంద్రియ నిగ్రహము లేకుండుట, ధర్మానికి ప్రాధాన్యమివ్వకుండుట మొదలగునవి రజోగుణ లక్షణాలుగా భగవద్గీతలో చెప్పబడెను. **"రజసి ప్రళయం గత్వా కర్మ సంగిషు జాయతే".** రజోగుణం అధికంగా కలిగిన మానవులు వలన సమాజంలో కుటుంబ కలహములు, సాంఘిక కలహములు, రాజకీయ మనస్పర్థలు కలిగి శాంతిబధ్రతలకు విఘాతం కలుగును. రజోగుణం అధికంగా కలిగిన మానవులు మరణానంతరము తిరిగి కర్మ యందు ఆసక్తికల మనుష్యవర్గంలో జన్మించును.

**తమోగుణ లక్షణములు:**

**"తమస్సు"** అనగా అంధకారం, అజ్ఞానం.

**"తమస్త్వజ్ఞానజం విద్ధి, మోహనం సర్వదేహినామ్!**
**ప్రమాదాలస్య నిద్రాభి, స్తన్ని బధ్నాతి భారత"!!**

**"ఓ పార్థా! అజ్ఞానం చేత పుట్టిన తమోగుణం బద్ధ జీవులందరికీ భ్రాంతిదాయకం. పొరపాట్లు, ఆలస్యం, నిద్ర అనేవి ఈ తమోగుణ లక్షణాలు"** అని శ్రీకృష్ణుడు అర్జునునికి భగవద్గీతలో ఉపదేశించెను. అజాగ్రత్తగా వుండుట, సోమరితనం, నిద్ర వీటి వలన వివేకం నశించును. తమోగుణం అధికమైతే అంధకారం, సోమరితనం, భ్రాంతి పడుట, అకారణ భీతి, పొరపాట్లకు ఆస్కారం ఏర్పడును. పైగా ఇవన్నీ ఒకదానికొకటి కారణమగును. మానవుడు వీటి ఫలితాల పర్యవసానం నుంచి కోలుకోలేడు. తమోగుణం అధికంగా కలిగిన మానవులు ప్రగతికి బదులు పతనం చెందుతుంటారు. వారు అజ్ఞానం కారణంగా దేనినీ యధాతథంగా అవగాహన చేసుకోలేరు. వారు మరణించిన తరువాత అధోలోకాలను మరియు నీచ యోనులలో జన్మను పొందును. వీరి వలన సమాజము కూడా ప్రగత చెందక పతనమగును.

**శ్రీమద్రామాయణం - సత్వగుణ ప్రాముఖ్యత:**

"సర్వేషు రమంతి ఇది రామః! భగవంతుడైన శ్రీమన్నారాయణుడు ధర్మ సంరక్షణార్థం భువిలో అయోధ్యానగరంలో మానవునిగా, శ్రీరామునిగా అవతరించిన జీవన విధాన దర్శనమే "శ్రీమద్రామాయణం". ఈ రామాయణమును వాల్మీకి మహర్షి నారదుని ఆదేశం మేరకు, బ్రహ్మ దేవుని వరం చేత ధర్మార్థకామముల గురించి,

సర్వశృతి మనోహరంగా, పాఠకులందరికీ అనుకూలంగా వుండే విధంగా ఏడు కాండలతో, 500 సర్గలుగా 24,000 శ్లోకాలతో రచించెను. ఈ గ్రంథము అందరిచేత అన్ని కాలాల వారు పారాయణం చేసే "ఆదికావ్యము"గా విరాజిల్లెను. ఈ రామాయణ గ్రంథంలో ఆదిపురుషుడు, సదాచార సంపన్నుడు, సత్యవ్రతుడు, ఏకపత్నీవ్రతుడు, మహాపరాక్రమ శాలి, ఆడిన మాట తప్పని ధర్మశాలి, పితృవాక్య పరిపాలకుడు, రావణాది దుష్టరాక్షససంహారం చేసిన వీరుడు మొదలగు సత్త్వగుణములు కలిగిన ఆ శ్రీరాముని దివ్య చరిత్రను రచించి వాల్మీకి మహర్షి 'అక్షర తపస్వి'గా,' ఆదికవి' గా ప్రసిద్ధి పొందెను.

రామాయణం భారతీయ, ధార్మిక, నైతిక జీవితాలకు దర్పణం వంటిది. రామాయణం లౌకిక జ్ఞానాన్ని ఆ కాలంలో స్త్రీలకు గౌరవ సన్మానాలుండేవి. అన్నీ ధర్మ, కర్మ అనుష్టానాలు భార్యతో కలిసి భర్తనే నిర్వహించును. స్త్రీలు ఆకాలంలో పాండిత్యాన్ని కలిగి ధర్మమును, నీతిని ఆచరించేవారు. పతిసేవయే స్త్రీకి ప్రథమ కర్తవ్యంగా వుండేది. తల్లిదండ్రులకు సంతానం మీద అతి వాత్సల్యం, సంతానానికి తల్లిదండ్రుల మీద భక్తి, గౌరవాలుండేవి. రామాయణ కాలంలో భార్యాభర్తల మధ్య ప్రేమ, గౌరవము, నమ్మకము వుండి వైవాహక జీవితమును సుఖంగా గడపేవారు. కనుక అధునిక సమజంలోని ప్రతి ఒక్కరూ రామాయణాన్ని చదివి, అర్థం చేసుకొని, వాటి నుంచి సత్త్వగుణాలను అభివృద్ధి చేసుకొని ఆదర్శమైన, ప్రశాంతమైన జీవనమును గడుపుచూ సమాజ శ్రేయస్సుకు పాటుపడవలెను.

శ్రీ మద్రామాయణంలో శ్రీరాముడు స్థితప్రజ్ఞుడు. అయోధ్యకాండలో శ్రీరామునికి మరి కొద్ది సేపట్లో రాజ్యాభిషేకం జరుగుతుండగా కైకేయి రాముని దగ్గరకు వచ్చి దశరథ మహారాజు తనకు ఇచ్చిన రెండువరాల గురించి కోరగా, అప్పుడు శ్రీరాముడు దానిని సంతోషంతో అంగీకరించెను. ఈ "స్థితప్రజ్ఞత" అనే సత్త్వగుణమును సమాజంలోని ప్రతి మానవుడు సాధన చేయవలెను. దీనివల్ల దుఃఖములన్నీ నశించి మనస్సు ప్రసన్నమగును, అలాగే అరణ్యవాసంలో శ్రీరాముడు తపస్సులు, యజ్ఞాలు చేసుకొనే ఋషులకు రాక్షస సంహారం చేసి భయవిముక్తిని కలుగజేసెను. దీనిని ఆదర్శంగా తీసుకొని సమాజంలోని ప్రతివ్యక్తీ అంతఃశత్రువులైన దుష్టగుణాలను సత్పురుషులు సేవ మరియు సత్సాంగత్యాము ద్వారా తొలగించుకొని సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకొనవలెను.

శ్రీ మద్రామాయణంలో సీతాదేవి పాతివ్రత్య ధర్మాన్ని అనుసరించి, రాజ్యభోగాలను త్యజించి రాముని కష్టనష్టాలలో పాలుపంచుకొంటూ, ఎన్నో ఒడిదుడుకులు, క్లిష్ట సమస్యలు వచ్చినా, ఆత్మ స్థైర్యదంతో, శాంతముతో, నిష్కల్మష ప్రేమతో శ్రీరాముని ఆరాధిస్తూ, తన లవకుశులి ద్దరిని చక్కగా తీర్చిదిద్ది శ్రీ రామునికి అప్పచెప్పను. కావున ఆధునికకాలంలోని స్త్రీలందరూ సీతలోని ఈ సత్త్వగుణములను ఆదర్శంగా తీసుకొని వైవాహిక జీవితమును ప్రశాంతముగా, సుఖముగా గడపవలెను. అదేవిధంగా సుగ్రీవుడు తన నాయకత్వంతో, సమర్థత కల్గిన మంత్రి, వానరసేనతో, నిశ్చలమైన మనస్సుతో, శక్తియుక్తులకు తగినట్లుగా శ్రీ రామునికిచ్చిన మాటను బాధ్యతగా నెరవేర్చుట ద్వారా మన జాతికి ఆదర్శ ప్రాయుడయ్యెను. సుగ్రీవునిలోని ఈ సత్వగుణాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ అలవర్చుకొని తద్వారా దేశ సమాజ అభివృద్ధి కొరకు పాటుపడవలెను.

శ్రీ మద్రామాయణంలో హనుమంతుని ద్వారా అంకుంఠితమైన కార్యదీక్ష, కఠినమైన బ్రహ్మచర్యం, స్వామిభక్తి, జ్ఞాననిష్ఠ, నిష్కామ భావంతో కూడిన సేవాతత్పరత, సీతాదేవిని వెతుకుటలో చూపిన నైపుణ్యం, సమయస్ఫూర్తి, కార్యదక్షత, సూక్ష్మదృష్టి, బహుముఖ ప్రజ్ఞత్వము, త్యాగబుద్ధితో నిస్వార్థంగా జీవించటం అనే ఈ సత్వగుణాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకొని తమ వ్యక్తిత్వాన్ని మరియు సమాజమును ఉన్నతంగా నిర్మించవలెను. అలాగే రామాయణం లోని రావణాసురుడు, కుంభకర్ణులు కామ, క్రోధ, లోభ, మెరీహ అనే రజో, తమోగుణాలను అదుపులో పెట్టుకోలేక దశ ఇంద్రియ భోగాలలో పదిడి పతనమయోను. కావున సమాజం లోని ప్రతి వ్యక్తి రజో తమోగుణాలను అదుపులో పెట్టుకొంటూ, సత్వగుణాలను గాలను వృద్ధి చేసుకొంటూ ప్రశాంతమైన జీవనమును గడువుట ద్వరా సమాజం శాంతి నిలయకుగును.

**ఉపసంహారము:**

సమాజంలోని అసమానతలకు, అశాంతికి దారిద్ర్యానికి కారణం సమాజంలోని వ్యక్తులు అధికశాతం తమోగుణాన్ని కలిగి వుండుటమే. ముందుగా ఆ తమస్సులో నుంచి బయటపడి రజోగుణమును అలవర్చుకోవాలి. రజోగుణము వలన మానవులలో ఉత్సాహము, చురుకుగా పనిచేయుట వుండును. కానీ ఈ గుణం మానవులలో అశాంతిని కలిగిస్తుంది. పని చెయ్యటంలో జరిగిపోయే మంచి, చెడుల వల్ల కలిగే కష్టసుఖాలను ఎదుర్కోవలసి వస్తుంది.

కనుక సమజంలోని ప్రతి ఒక్కరూ శరీరానికి, మునస్సుకు చైతన్యాన్ని కలిగించే ప్రాణాయామం, యోగాసనం చేయటద్వారా,సాత్వికమైన ఆహారం ద్వారా, ఎటువంటి కల్మషం లేకుండా, ధార్మికత, ప్రశాంతత, ఆత్మనియంత్రణ మరియు ఆధ్యాత్మిక భావనద్వారా రజోగుణాన్ని తగ్గించుకొంటూ, సత్వగుణాన్ని పెంపొందించుకోవాలి.

సత్వగుణం జ్ఞానానికి హేతువు. సత్వగుణంలో విచక్షణాజ్ఞానం, వివేకం, ఆలోచనాశక్తి ఎక్కువగా వుండును. సత్వగుణం కల్గినవాళ్ళు తమ మేధాశక్తితో ఏకాగ్రతతో, ఉద్యోగంలో, వ్యవసాయంలో, కుటుంబంలో అన్నిరంగాలలో విజయాన్ని సాధిస్తారు. సత్వగుణం అన్నిటికంటే పవిత్రమైనది. క్షేమదాయకమైనది. ఈ సత్వగుణంతో చేసిన కర్మలు పవిత్రమైన ఫలితాలనిచ్చును. కనుకు సమజంలోని ప్రతివ్యక్తి సత్వగుణ ప్రధానంగా జీవించి, మరణానంతరము బ్రహ్మజ్ఞానులుండే పవిత్రలోకాలకు చేరుకొనుటకు, జీవన్ముక్తు లగుటకు ప్రయత్నము చేయవలెను.

**ఆధార గ్రంథములు**

1. శ్రీ భగవద్గీత – శ్రీభాగవతుల సుబ్రహ్మణ్యం (2015), నవరత్న బుక్ హౌస్, విజయవాడ.
2. సంస్కృత సాహిత్య చరిత్ర –డా॥ ముదిగంటి గోపాలరెడ్డి, (1986),డా॥ ముదిగంటి సుజాతారెడ్డి – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. వాల్మీకి రామాయణము. – ఉప్పులూరి కామేశ్వరరావు(2013), టి.ఎన్.పి. పబ్లిషర్స్. హైదరాబాద్.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# ప్రహ్లాద చరిత్ర హిరణ్యకశిపుడు త్రిగుణాలు

**డా॥ ఎం. సమత,**
సహ ఆచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
వర్ధన్నపేట, వరంగల్.

సత్వ, రజో,తమో గుణాలే త్రిగుణాలు. రజో తమో గుణాలను అధిగమించి సన్మాన తిరస్కారాలను సమానంగా, మిత్రులను, అమిత్రులను ఒకేలాగా అన్నింటిని సమదృష్టితో చూసేవాడే గుణాతీతుడు. త్రిగుణాల వ్యక్త రూపమే సృష్టి. గుణ ప్రేరణతోనే పనులు చేస్తారు. ఆ కనిపించే గుణాలను బట్టి వారు సత్వ, రజో, తమో గుణాలలో ఏ గుణానికి చెందినవారో గుర్తించవచ్చు.

రజో గుణం కలిగిన వారు విషయ కాంక్ష కలవారై తాము అనుకున్నది సాధించే వరకు పట్టు వదలరు. అది ఎంత కష్టమైనా సాధించి తీరుతారు. హిరణ్యకశిపుడు రాక్షసరాజు తమ్ముడైన హిరణ్యాక్షుడి మరణాన్ని చూసిన తాను మరణాన్ని తప్పించుకొని శాశ్వతంగా నిలచిపోవాలని కోరుకున్నాడు. అందుకోసం భయంకరమైన తపస్సు చేశాడు. హిరణ్యకశిపుడిలోని రజోగుణానికి కోరిక తోడైనందున తమోగుణమైంది. తపస్సు అజ్ఞాన జనితము, దేహధారులకు అవివేకాన్ని కలిగిస్తుంది. ప్రమాదకరంగా మార్చుతుంది. ఈ తమోగుణం చేత పట్టు వదలక తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమంటే అసాధ్యమైన కోరిక కోరాడు. గాలి, ధూళి, నీరు, నిప్పు, నింగి, నేల, దిక్కులు, రాత్రి, పగలు, చీకటి వెలుగులో కాని, రాక్షసుల చేతకాని, దేవతల చేత కాని, మృగాల చేత గానీ, నరుల చేతగాని, పాముల చేత గాని, మరణం రాకూడదని కోరుకున్నాడు. దేవుడు వరమిచ్చాడు.

వరసంపన్నుడైన హిరణ్యకశిపుడు కన్ను కానక , తన ఇష్టం వచ్చినట్లు అందరిని హింసిస్తూ త్రిలోకనాథుడయ్యాడు. తమో గుణం కలిగిన రాక్షసరాజు నలుగురి కుమారులలో సత్త్వగుణం కలిగిన ప్రహ్లాదుడొక్కడు.

కొడుకుపై ప్రేమ వున్నా, తన పగ, ప్రతీకారమే ముఖ్యమనుకున్న హిరణ్యకశిపుడు కుమారుడిని చంపడానికి సిద్ధపడ్డ కథనే ప్రహ్లాద చరిత్ర. ఈ కథ మహా భాగవతంలోని సప్తమస్కంధంలోనిది. రజో తమో గుణాలున్న హిరణ్యకశిపుడిలో మనం గ్రహించాల్సిన సత్వగుణం చదువుకిచ్చిన విలువ, మర్యాద, గౌరవం.

ప్రహ్లాదుడు పుట్టకతోనే హరివర సంపన్నుడు. జ్ఞానం కలిగినవాడు సత్వగుణం కలిగినవాడు. ప్రహ్లాదుడి సత్వగుణం నిర్మలమైనది. జ్ఞానం నందు ఆసక్తి కలిగినది. భగవతత్త్వానికి మోక్ష సాధనకు ఆరాటపడుతుంది.ప్రహ్లాదుడి గుణాలను శత్రువులు సైతం అనగా దేవతలు తమ సభలో పొగిడేవాళ్ళు. ప్రహ్లాద చరిత్రలో ప్రహ్లాదుడిని పరిచయం చేస్తూ పోతనామాత్యుడు అతని సాత్వికగాణాలను వర్ణించాడు.

**"తనయందు నఖిల భూతములందు నొకభంగి సమహితత్వంబున జరగువాడు।**
**పెద్దల గొడగన్న భృత్యునికైవడి జేరి నమస్కృతుల్ సేయువాడు।**

**కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన మాతృభావము సేసి మరలువాడు।**
**తల్లిదండ్రులు భంగి ధర్మవత్సలతను దీనులగావ జింతించువాడు।**
**సఖులయెడ సోదరస్థితి జరుపువాడు, దైవతములంచు గురువుల దలచువాడు**
**లీలలందును బొంకులు లేనివాడు, లలిత మర్యాదుడైన ప్రహ్లాదుడధిప"।**

ప్రహ్లాదుడు సమస్త ప్రాణులను తనలాగే భావించేవాడు, పెద్దలు ఎదురైతే సేవకుడిలా ఎదురెళ్ళి నమస్కరిస్తాడు. పరస్త్రీలు ఎదురైతే మాతృభావనతో పక్కకు తొలగిపోతాడు. దిక్కులేని వారికి తల్లిదండ్రుల్లాగా ఆదరిస్తాడు. స్నేహితులను సోదరుల్లాగా, గురువులను దైవంగా, అబద్ధాలు చెప్పనివాడు.

ప్రహ్లాదుడిలా అందరినీ సమానంగా చూడటం చాలామందికి ఎప్పటికీ సాధ్యం కాని విషయం. ఎదుటి వ్యక్తి ఆడ, మగ, పేద, గొప్పలాంటి వాటితో సంబంధం లేకుండా తనలాగా ఒక ప్రాణి అని గుర్తించటం కష్టం. నేను తప్ప, మనం అనేది రానురాను కరువవుతున్నది. కడుపున పుట్టిన పిల్లలనే నైతిక విలువలు నశించిన స్త్రీ పురుషులు చంపుకుంటున్నారు. సామాజిక మాధ్యమాలలో నోరులేని జీవులపై జరుగుతున్న అమానుషాలు చూస్తున్నాము. అలాంటిది సాటి మనిషిగా చూడటం అందునా రాకుమారుడి యొక్క గొప్పతనం. పెద్దలకు నమస్కరించమని పిల్లలకు పదే పదే చెప్పాల్సి వస్తున్నది. స్త్రీలను మాతృభావంతో చూస్తే సమాజంలో ఇన్ని ఆకృత్యాలు జరిగేవి కావు. ప్రతి తల్లిదండ్రులు మగ పిల్లలకు చిన్నప్పటి నుండి స్త్రీని గౌరవించడం, సాటి మనిషి అని నేర్పిస్తే ఇలాంటి ఘోరాలు జరగవు. ప్రహ్లాదుడిలో వినయ విధేయతలు, పెద్దల పట్ల గౌరవం, సమదృష్టి, సహృదయత, సత్యసంధత, అందం, ఐశ్వర్యం వున్నా భోగభాగ్యాలపై కోరిక లేకపోవడంలాంటి ఇన్ని సాత్విక గుణాలతో పాటు నారాయణుడిపై భక్తి కూడా వుంది.

పిల్లలకు అన్ని అందుబాటులో వుంటే రజోతమో గుణాలతోనే ప్రవర్తిస్తారు. మామూలుగా తల్లిదండ్రులు తాము జీవితంలో పొందలేని వాటిని పిల్లలకు అందజేయాలనే తాపత్రయంతో కోరినది కోరినట్లు ఇచ్చుకుంటూ వెళుతుంటారు. పిల్లలేమో తల్లిదండ్రుల శ్రమను గుర్తించక విలాసాలలో మునిగిపోతున్న నేటి యువతరము మనకు సాక్ష్యం. గమ్మతైన విషయమేమిటంటే ఇన్ని మంచి లక్షణాలున్న ప్రహ్లాదుడు తండ్రి దృష్టిలో సోమరిగా కనిపించటం.

**"లభ్యంబైన సురాధిరాజపదమున్ లక్షింపడశ్రాంతమున్॥**

సంప్రాప్తించిన సురాధిరాజ పదవిని కూడా లెక్క చేయడు. రాకుమారుడిలా రాజసంగా పౌరుషంగా వుండడెందుకు, మామూలు వాడిలాగా వుంటాడు. చదువు చెప్పిస్తే మనసు వికసించి బాగుపడతాడేమో అని హిరణ్యకశిపుడు భావించాడు. రజోతమో గుణాలకు నిలయమైన రాక్షస రాజులో ఒక్క చదువు విషయంలో మాత్రం సాత్విక గుణం కనిపిస్తుంది.

**"చదవని వాడజ్ఞుండగు, జదివిన సదసద్వివేక చతురత గలుగుం,**
**జదువగ వలయును జనులకు జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రి".**

ప్రహ్లాదుడితో తండ్రి చదువు చాల ముఖ్యం. చదువుకోనివాడు అజ్ఞానిగా వుంటాడు. చదువుకొమ్మని తన కొడుకు చదువుకోసం ఆరితేరిన ఆచార్యులైన చండామార్కులను పిలిపించి మా అబ్బాయి అజ్ఞానంతో నా పరాక్రమం, ఘనకార్యాలు కనీసం వాసనమాత్రమైన రాలేదు. అన్ని శాస్త్రాలను నేర్పించండి అని అప్పగించాడు. కుమారుడి చదువు కోసం మంచి గురువుల నెన్నుకున్నాడు. ఈ తరంలో తల్లిదండ్రులు పిల్లల కోసం గురువు గురించి తప్ప అన్ని వసతులు చూస్తున్నారు. గురువును గురించి ఎప్పుడు వాకబు చేస్తున్నారంటే ఎంసెట్, నీట్ లాంటి పరీక్షల శిక్షణలో మాత్రమే చూస్తున్నారు. గుణ సంపన్నుడైన ప్రహ్లాదుడు గురువులు చెప్పిన అన్ని శాస్త్రాలను, విద్యలను నేర్చుకున్నాడు. గురువులకేనాడు ఎదురు చెప్పలేదు. తన దృష్టిలో గురువు చెప్పే విద్యలు అసత్యాలని, భ్రమలని తెలిసినా వారు చెప్పినట్లే నడచుకునేవాడు.

హిరణ్యకశిపుడిలో మరొక సాత్విక గుణం. తన కుమారుడు ఎంతవరకు చదువుకున్నాడో తెలుసుకోవాలనుకోవటం. ఇది ప్రతి తల్లిదండ్రుల కర్తవ్యం. పిల్లలు ఏం చదువుతున్నారో? ఎలా చదువుతున్నారో తెలుసుకుంటుంటే పిల్లలు దారి తప్పకుండా వుంటారు. నేటి కాలంలో చాలా మంది తల్లిదండ్రులకు పిల్లలను పట్టించుకునే తీరిక ఉండదు. హిరణ్యకశిపుడు తన కుమారుడిని, గురువులను పిలిపించాడు. నాయనా ప్రయత్నం సఫలం కావాలంటే ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి కలసిరావాలి. నీవు బాగా చదువుకుంటున్నావా? గురువులు చెప్పిన వాటిలో నీకు నచ్చినది చెప్పమని కోరాడు.

ప్రహ్లాదుడు హరి నామస్మరణం మాత్రమే తనక నచ్చినదన్నాడు. హిరణ్యకశిపుడు పిల్లలు పెద్దలను అనుకరిస్తాడు. నీకివి ఎవరు నేర్పారు?శ్రీహరిని మనం కీర్తించకూడదని బోధించాడు. ప్రహ్లాదుడు సత్వగుణం కలిగిన వాడు కాబట్టి తండ్రికి ఎదురు చెప్పక గురువులను జూచి కోరికలను జయించి భగవంతుని ధ్యానించే జ్ఞానుల మనస్సులో మీరు, మేము అనే భేదాలుండవు అని పలికాడు. గురువులు రాజుతో తప్పయింది అని తీసుకెళ్ళి అన్ని విద్యలు నేర్పించారు. బుద్ధిమంతుడయ్యాడని భావించాడు.వారి దృష్టిలో బుద్ధిమంతుడంటే రజోతమో గుణాలు కలిగినవాడిగా మారాడని భావించి తండ్రి వద్దకు తీసుకువెళ్లారు. తండ్రి ప్రసన్నంగా నిన్ను చూసి చాలా కాలమైంది. ఏమి నేర్చుకున్నావు అని అంటూనే ఒక మాములు తల్లిదండ్రుల్లాగా నీతోడి దైత్య విద్యార్థులు నీతిశాస్త్రంలో నీకంటే బాగా చదువుతున్నారంటే నీవు ఎప్పుడు నీతిశాస్త్రము చదువుకొని పండితుడవుతాడని ఎదురుచూస్తున్నాను అన్నాడు.

ప్రహ్లాదుడు చదివించిరి నను గురువులు, అన్ని శాస్త్రాలు చదువుకున్నాను అంటూ విష్ణువు గురించి అనర్గళంగా మాట్లాడాడు. శత్రువులను పొగుడుతున్న ప్రహ్లాదుడిని చూచి తండ్రి కోపంతో రగిలిపోయాడు. అంతవరకున్న సాత్విక గుణం హిరణ్యకశిపుడిలో మాయమైంది. ప్రేమ పోయింది, తమోగుణం నిండిపోయింది. కుమారుడిని వధించమని మూర్ఖంగా ఆజ్ఞలిచ్చాడు.తమోగుణం కలిగిన క్రూర రాక్షసులు శూలాలు చేత్తో పట్టుకొని ఆనందంతో గంతులు వేస్తూ ప్రహ్లాదుడిని బాధించారు. ఎన్ని శిక్షలు వేసిన ప్రహ్లాదుడిలో మార్పు లేదు. వక్రమార్గంలో (తండ్రి దృష్టిలో) అల్లరిచిల్లరగా తిరిగే ప్రహ్లాదుడిని మళ్ళీ గురువుల వద్దకు పంపాడు.

ప్రహ్లాదుడు ఈసారి గురువులు లేనప్పుడు తోటి విద్యార్థులకు జ్ఞాన బోధ చేసేవాడు. రజో, తమో, సత్త్వ

గుణాలలో భగవంతుడున్నాడని రాక్షస భావాన్ని విడిచిపెట్టి అన్ని ప్రాణులపై దయాదాక్షిణ్యాలు కలిగి ఉంటే భగవంతుడు కరుణిస్తాడని బోధించేవాడు. గురువులు ప్రహ్లాదుడిని తండ్రి వద్దకు తీసుకెళ్ళి అతడి మాటలను చెప్పారు. హిరణ్యకశిపుడికి కోపం పెరిగిపోయింది. శ్రీహరి ఎక్కడున్నాడని ప్రశ్నించాడు. ఈ స్తంభంలో ఉన్నడా? అంటూ బలంగా కొట్టాడు. అందునుండి వెలువడిన నరసింహుడిని చూసి హిరణ్యకశిపుడు శ్రీహరిపై శత్రుత్వంతో, మనసు రోషంతో రగిలిపోతూ హృదయ చాంచల్యం వల్ల తామస గుణంతో రెచ్చిపోయాడు. శత్రువును చంపాలని ప్రయత్నించాడు, కాని చివరకు తానే మరణించాడు.

హిరణ్యకశిపుడి త్రిగుణాలలో ఒక్క చదువు విషయంలోనూ, కుమారుడి విషయంలోనే సాత్విక గుణం కనిపిస్తుంది. కుమారుడు తన వారసుడిలా తయారు కావడం లేదనే కోపంతో అది కూడా మాయమైపోయింది. రాక్షసులు తమోగుణం కలవారు అనడానికి హిరణ్యకశిపుడే ఉదాహరణ. ప్రహ్లాదుడు సత్వ గుణం కలిగినవాడు. రజోతమో గుణాలపై సత్వగుణం విజయం సాధించింది.

## ఆధార గ్రంథాలు

1. పాపయ్య శాస్త్రి. జంధ్యాల, సంపాదకుడు 2010, పోతన మహ భాగవతం (సప్తమ, అష్టమ, నవమ, స్కంధములు)– తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.
2. మల్లికార్జునం కుందుకూరు, 2015 శ్రీ మద్భగవద్గీత ( అనువాదం), రామకృష్ణ మఠం,దోమల గూడెం, హైదారాబాద్ – 500029.
3. సూర్య చంద్రం గొల్ల 2012, సత్యాన్వేషణ, త్రిగుణాలు–1, ఏ స్పిరిచ్యువల్ బ్లాగ్ ఇన్ తెలుగు, సత్యదర్పణం, బ్లాగ్ స్పాట్ కాం.
4. రంగారావు అనంతాత్మకుల, 2022, మనం – మనలోని త్రిగుణాలు భక్తిప్రభ. డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. ప్రభన్యూస్.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# మానవ జీవితం త్రిగుణాత్మకం

**డా॥ ఎం. రమేశ్ బాబు**

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు

కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

హైదరాబాదు.

త్రిగుణాలుగా పరిగణించబడుతున్న సత్వ, రజో, తమో గుణాలు భిన్న భిన్న మోతాదులలో ఉండడం వల్లనే మనిషి స్వభావం రూపుదిద్దుకుంటుందని చెప్పవచ్చు. ఒక వ్యక్తిలో ఏ గుణం యొక్క లక్షణాలు అధికంగా ఉంటే ఆ వ్యక్తి, ఆ స్వభావాన్ని ప్రదర్శిస్తాడు. ఈ గుణాల తేడాల వల్లనే లోకంలోని మనుష్యుల వ్యక్తిత్వాలలో ఇన్ని తేడాలు కనిపిస్తాయి. ఇలా మనలోనే ఉండే ఈ త్రిగుణాలే మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. కాబట్టి మనలోని ఈ త్రిగుణాలను ఎప్పటికప్పుడు సరిచేసుకొని నడుచుకున్నపుడే మన జీవితం సార్ధకమౌతుంది. అంటే మనుషలుగా ఒక సహజ స్వభావంతో జన్మించిన మనం సాధనతో మాధవత్వానికీ ఎదుగనూ వచ్చు లేదా దానవత్వానికీ దిగజారనూవచ్చు. అలాంటి ఈ త్రిగుణ స్వరూప స్వభావాలను, ప్రాధాన్యతను తెలుసుకోవడానికి సత్సాంగత్యం, సద్గ్రంధ పఠనం ఉపకరిస్తాయి. గీతాచార్యుడు (శ్రీకృష్ణుడు) భగవద్గీతలో చెప్పినట్లుగా

**"పురుషః ప్రకృతిస్థోహి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్**

**కారణం గుణ సంగోస్య సదసద్యో నిజన్మసు"**

అనగా పురుషుడు (జీవుడు) ప్రకృతి నుంచే పుట్టి, సుఖదుఃఖాలని అనుభవిస్తున్నాడు. ఈ జీవుడు మంచి, చెడ్డ జన్మలు ఎత్తడానికి కారణం త్రిగుణాలతో జీవుడికి గల సంబంధమే. కాబట్టి ఈ జన్మనే కాదు, వచ్చేజన్మలలో కూడా మంచి చెడు పుట్టుకలు ఏర్పడటానికి కూడా ఈ త్రిగుణాలే ముఖ్య హేతువులుగా తెలుస్తున్నది. చివరగా మరే జన్మ ఎత్తకుండా మోక్షప్రాప్తిని పొందాలన్నా ఈ త్రిగుణాల ప్రకృతి తత్వాన్ని తెలుసుకోవాల్సింది ఇదే విషయాన్ని

**"య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహః ।**

**సర్వథా వర్తమానోపి న స భూయోభిజాయతే" ॥**

అనగా "ఎవడీ ప్రకారముగా గుణములతో కూడిన ప్రకృతిని తెలుసుకుంటాడో, అతడు ఏ విధముగా ఉన్నప్పటికినీ మరల జన్మింపడు" అంటాడు గీతాచార్యుడు. సూటిగా మోక్షప్రాప్తికి ఉపాయాన్ని, మార్గాన్ని చూపెడుతున్నాడిక్కడ. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ త్రిగుణాల గూర్చి, గీతాచార్యుడు ప్రత్యేకంగా 'గుణత్రయ విభాగ యోగం' అనీ భగవద్గీతలో 14వ అధ్యాయంలో దాదాపు 25 శ్లోకాలలో ఈ త్రిగుణాల యొక్క స్వరూపం, స్వభావాలను వివరిస్తాడు. మొదటి శ్లోకంలోనే

**"పరం భూయ్యః ప్రవక్ష్యమి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।**

**యద్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥**

**"జ్ఞానములలో అత్యుత్తమమైన పరమజ్ఞానమును నీకు మరల తెల్పబోవుచున్నాను. ఆ పరమజ్ఞానము తెలుసుకొనిన మునులు సంసార బంధముల నుండి విముక్తులై పరమసిద్ధిని పొందారు"** అంటాడు గీతాకారుడు. ప్రపంచంలో అనేక జ్ఞానములు (ఉదా:- భౌతిక జ్ఞానము, సంగీత జ్ఞానం, శాస్త్ర జ్ఞానము, శిల్ప, గణిత వంటి జ్ఞానము) ఉన్నను వాని అన్నింటిలో భగవానుని దృష్టిలో ఆధ్యాత్మిక జ్ఞానమే సర్వశ్రేష్టమని అందులో ఈ త్రిగుణ స్వరూపమే ముఖ్యమని చెబుతున్నాడు **"ఈ త్రిగుణ స్వరూప పరమ జ్ఞానాన్ని పొందిన జనులు నాతో ఐక్యము నొందిన వారై అనగా నా స్వరూపాన్నే పొంది జనన, మరణ రహితులై పునరావృత్తి లేక యుందురు. వీరు సృష్టి కాలమున జన్మింపరు. ప్రళయ కాలమున నశించరు"** అంటూ రెండవ శ్లోకంలో

**"ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్య మాగతాః ।**

**సర్గేపి నోపజాయంతే, ప్రలయే నవ్యథంతిచ" ॥**

అని వివరిస్తాడు. అనగా పునరపి జననమ్, పునరపి మరణమ్ అను దానిని తప్పించుకొనినవారై, ఈ సంసార చక్రము నుండి విడివడి పరమానందమును అనుభవింతురు. కాబట్టి ఈ సంసార వ్యథల నుండి, బాధల నుండి తప్పించుకొనవలెనన్న ఈ త్రిగుణాత్మక ఆత్మజ్ఞాన మొకటియే శరణ్యము అని ఘంటాపథంగా వివరిస్తున్నాడు. అలాగే ఈ త్రిగుణ స్వరూపాన్ని ఇంకా వివరిస్తూ, ఈ విభాగంలోని (గుణ త్రయ విభాగ యోగం) ఐదవ శ్లోకంలో

**"సత్త్వం రజస్తమ ఇతి గుణ్ణా ప్రకృతి సంభవాః ।**

**నిబధ్నంతి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్" ॥**

**"ఓ మహాబాహు (గొప్ప భుజములు గల అర్జునా), ప్రకృతి వలన బుట్టిన సత్త్వం, రజస్సు, తమస్సు అను గుణములు మూడునూ నాశరహితమైన ఆత్మను, ఈ దేహము నందు బంధించి వేస్తున్నవి"** అంటాడు.

అలాగే ఈ త్రిగుణాలు ప్రకృతి సంభవాలే అని చెబుతునే దేహాభిమానము కలవాని పైననే ఈ గుణముల ప్రభావము ఉండునని తెల్పుతాడు గీతాచార్యుడు. ఈ గుణత్ర విభాగ యోగంలోనే ఆరవ శ్లోకం నుండి 18 వ శ్లోకం వరకు సత్వ, రజ, తమో గుణాల లక్షణాలు వివరిస్తూ సత్వగుణం నిర్మలమైనది, ప్రకాశమైనది వికారరహితమైనదని, ఇది జీవుని సుఖములలో నిమగ్నం చేయునని, సత్సాంగత్యం, సచ్ఛీలత, సద్గ్రంథ పఠనం, సద్వాక్కు, సేవాతత్పరత సత్ప్రవర్తన, సమత్వం, సమయపాలన ఇవన్నీ సద్గుణ సంపదలుగా పేర్కొంటూ సత్వగుణ సంపన్నుడైన మనిషి సర్వదా సంతుష్టుడై ఉంటాడని చెబుతాడు. ఇలా సత్వగుణం వృద్ధి చెందించుకొని మరణించిన జీవుడు ఉత్తమ కర్మలను ఆచరించెడి వారు చేరే నిర్మలములైన స్వర్గాది దివ్యలోకములను పొందును. సత్త్వగుణస్థితులు స్వర్గాది ఉర్ధ్వలోకములకు పోవుదురు అని సత్త్వగుణ ప్రాధాన్యాన్ని వివరిస్తాడు.

రజో గుణ లక్షణాలను తెల్పుతూ ఈ రజోగుణం రాగాత్మకం, అది కామమునకు సంబంధించినది. ఇది ఆసక్తుల నుండి ఉత్పన్నమౌతుంది. జీవాత్మను కర్మలచే, కర్మ ఫలములచే బంధిస్తుంది. ఈ రజో గుణము వృద్ధి చెందినపుడు మృత్యువు ప్రాప్తించినచో అతడు కర్మాసక్తులైన మానవులలో జన్మించును. రజోగుణ స్థితులైన జీవులు ఈ మధ్యలోకము (మానవ లోకము నందే ఉంటారు అంటాడు)

ఇక చివరిదైన తమో గుణ లక్షణాలను వివరిస్తూ తమోగుణము అజ్ఞానము వలన కలుగుతుంది. సమస్త ప్రాణులకు మోహమును, మఱపునును, సోమరితనాన్ని, నిద్రను కలుగజేస్తుంది. వ్యర్థ చేష్టలు, శాస్త్ర విహిత కర్తవ్య పాలనము నందు చులకన భావాన్ని కలిగి యుంటాడు. పరాకు, బద్ధకము, అతి నిద్రలతో జీవున్ని ముక్తి సాధన నుండి దూరము చేసి జన్మమృత్యు రూప సంసారము నందు చిక్కుకొనునట్లు చేస్తుంది. ఈ విధముగా తమో గుణము జ్ఞానమును కప్పివేసి ప్రమాదాదులలో ముంచివేస్తుంది. ఇలాంటి తమోగుణం వృద్ధి చెందించుకొని మరణించిన జీవుడు పశు పక్షి కీటకాది నీచ జన్మలలో ఉండిపోయి, నరకములను పొందుదురు. కాబట్టి ఓ అర్జునా

**"నాన్యం గుణేభ్య కర్తారం యదా ద్రష్టాను పశ్యతి ।**

**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోధిగచ్ఛతి ॥**

అనగా **"ద్రష్టయైన వాడు ఈ గుణములే గుణములంది వర్తించున్న పనియూ, ఈ త్రిగుణములు తప్ప వేరుగా కర్తలు లేరనియు తెలుసుకొని, త్రిగుణములకు అతీతముగా సచ్చిదానంద ఘన పరమాత్మ స్వరూపుడైన నా తత్వమును తెలిసికొనుము. అప్పుడు తడు, నా స్వరూపమునే పొందును"** అని నిష్కర్షగా వివరిస్తాడు. ఇంకా

**"గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహ సముద్భవాన్ ।**

**జన్మ మృత్యు జరా దుఃఖైః విముక్తో మృత మశ్నుతే" ॥**

అని 20వ శ్లోకంలో ఫలశృతి లాంటి విషయన్ని వివరిస్తాడు. అనగా దేహోత్పత్తికి కారణరూపములైన ఈ మూడు గుణములను అధిగమించిన పురుషుడు జన్మ, మృత్యు, జరా(వార్ధక్య) దుఃఖము నుండి విముక్తుడై పరమానందాన్ని పొందును అంటూ గీతాచార్యుడు త్రిగుణ స్వరూపాన్ని వివరిస్తాడు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ గుణాలకు అతీతుడిగా ఎలా ఉండాలో వివరించమన్న అర్జునునకు గీతి చార్యుడు ఈ త్రిగుణాతీత లక్షణాలను కూడా ఇలా వివరిస్తాడు.

**త్రిగుణాతీతుని లక్షణాలు:**

**"సమ దుఃఖసుఖః స్వస్థ సమలోష్టాశ్మ కాంచనః ।**

**తుల్య ప్రియాప్రయో ధీరః తుల్య నిందాత్మ సంస్తుతిః" ॥**

అనగా త్రిగుణాతీతుడు స్వస్వరూపము నందే నిరంతరము స్థితుడై యుంటాడు. సుఖదుఃఖములను సమానముగా భావిస్తాడు. మట్టి, రాయి, బంగారములయందు సమభావాన్ని కలిగి యుంటాడు. ప్రియ, అప్రియాలకు గాని, నిందాస్తుతులకు గాని తొణకడు. అంటూనే ఇంకా మాన, అవమానములయందును, మిత్రుల యందును, శత్రువుల యందును సమభావముతో ప్రవర్తిస్తాడు. తన విద్యుక్త కర్మలను ఆచరిస్తునే కర్తృత్వ అభిమానము లేనివాడు త్రగుణాతీతుడు. ఇలాంటి వాడు మాత్రమే సచ్చిదానంద ఘన పరబ్రహ్మ ప్రాప్తికి అర్హుడవుతాడు – అని స్పష్టంగా గీతాచార్యుడు వివరిస్తాడు.

ఈ విధంగా మానవ జీవితమంతయూ ఈ త్రిగుణ స్వరూపమే అని స్పష్టముగా తెలియ జేస్తుంది మన భగవద్గీత. మనం చెబుతున్న దేవతలు, మనుష్యులు, రాక్షసులు, పశు పక్ష్యాదులు జన్మ రహస్యమంతా ఈ త్రిగుణ స్వరూపంలోనే ఉన్నట్లుగా తెలుస్తుంది. కాబట్టి ఈ త్రిగుణములకు అతీతుడుగా ఉన్నపుడే మనిషి మోక్ష ప్రాప్తికి అర్హుడవుతాడు అని స్పష్టం చేస్తుంది భగవద్గీత.

**ఆధార గ్రంథాలు**

1. గీతా మకరందము శ్రీకాళహస్తి (1985) – శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి.
2. శ్రీ మద్భగవద్గీత గోరఖ్‌పూర్ (2012) – (తత్త్వవివేచనీ– ఆంధ్రానువాదం) జయదయాల్ గోయందకా
3. శ్రీ భగవద్గీత – పరమార్థం కళాకీముది ప్రచురణ.

# జగన్నాథ కథ- సత్త్వగుణ ప్రాధాన్యం

**దేవరకొండ ప్రవీణ్ కుమార్**
పరిశోధక విద్యార్థి
ఆంధ్రవిశ్వకళాపరిషత్
విశాఖపట్టణం

**"సత్త్వాత్ సంజాయతే జ్ఞానం, రజసో లోభ ఏవచ॥**
**ప్రమాదమోహౌ తమస:భవతో(అ) జ్ఞానమే '[1]**

సత్త్వగుణం,రజోగుణం,తమోగుణం అనబడే త్రిగుణాలు భగవంతుని మాయకు ప్రకృతి నుండే ఉద్భవించాయి. ఇది సృష్టి ఆదినుండి జీవరాశులకు ఆవహించి ఉన్నాయి. వీటి ప్రభావం నుంచి తప్పించుకోవడం త్రిమూర్తులకు సైతం సాధ్యపడదు.ఇవి జీవుణ్ణి దేహానికి బంధించి ఉంటాయి.ఈ త్రిగుణాలు ప్రతిజీవిలో వివిధ అనుపాతాలలో(పాళ్ళలో) కలిసుంటాయి కనుక వ్యక్తికి,వ్యక్తికి మధ్య స్వభావ స్పందనలలో వ్యత్యాసం కనిపిస్తుంది. సత్త్వగుణం ఎక్కువగాను,రజోగుణం,తమోగుణం తక్కువగాను ఉండే వ్యక్తిని సాత్త్వికుడని లేదా సత్త్వగుణ ప్రధానుడని అంటారు.అదేవిధంగా రాజసికుడు,తామసికుడు పేర్కొనబడతారని భగవద్గీతాది ప్రాచీన ఐతిహాసిక పురాణ గ్రంథాలు తెలియజేస్తున్నాయి.

**"ఈ మూడులోకాల్లోను, ఈ త్రిగుణాలతో కూడి ఉండనిది ఏది లేదు." [2]**

**సత్త్వగుణం:** ఇది స్వచ్ఛం, కాంతిమంతం,దోషరహితం అయినది.దీనివలన సుఖాసక్తి, జ్ఞానాసక్తి కలుగుతాయి.సత్త్వగుణాధిక్యతతో ఉన్నప్పుడు నిష్క్రమించే జీవి పుణ్యలోకాలను పొందుతుంది. సాత్త్విక శ్రద్ధ కలవారు దేవతలనారాధిస్తారు. వారు రసవంతం,చమురు కలిగిన పుష్టికరమైన ఆహారాన్ని ఇష్టపడతారు. అది ఆయుష్షును,బుద్ధిబలాన్ని,దేహబలాన్ని,ఆరోగ్యము మరియు సుఖసంతోషాలను వృద్ధిచేస్తుంది.వారు ఫలాపేక్షలేకుండా, ఇది నా కర్తవ్యం అనే భావంతో యజ్ఞాలు చేస్తారు. నియమబద్ధులై,ఫలాశ లేకుండా చేయబడిశారీరక,మానసిక తపస్సులు సాత్త్వికమైనట్టివి.వీరుదేశకాలపాత్రలను గుర్తించి,ప్రత్యుపకార మపేక్షించకుండా, కర్తవ్యతా బుద్ధితో దానంచేస్తారు.రాగద్వేషాలకులోను కాకుండా అభిమానాన్ని విడిచిపెట్టి,ఫలాలను త్యజించి, విధియుక్తంగా చేయబడినది సాత్త్విక కర్మ.

**"త్రిగుణాల గురించి 'భవానీ సౌందర్యలహరి'లో ఈ క్రింది విధంగా ఉంది."[3]**

1. తమోగుణం వలన భూమి, పర్వత,వృక్ష,పాషాణాలు మొదలైన స్థావరాలన్నీ పుట్టాయి. ఆదిశక్తి ఈ రూపంలో ఆవిర్భవించింది.

2. రజోగుణం వలన మనుష్యులా మృగాలు, పక్షులు,పురుగులు,జలచరాలు మొదలైన 'జంగము' (చర) ప్రాణులు పుట్టుకొచ్చాయి. ఆదిపరాశక్తి రజోగుణ విజృంభణ ఇది.

3.'సాత్త్వికగుణం' వలన జ్ఞానస్వరూపులైన దేవతలు,మహర్షులు ఆచార్యులు,ఆళ్వారులు నయనారులు,అవతార పురుషులు,అవధూతలు వివిధ రకాల దేవీ దేవతా స్వరూపాలు ఉద్భవించారు. ఆది పరాశక్తి యొక్క 'సత్త్వగుణ' స్వరూప ప్రతిబింబాలు వీరంతా। వీరు భూలోకంలోని సర్వప్రాణికోటిని ఉద్ధరించటానికి అవతరించి తన భోధలతో,కవిత్వాలతో-కళలతో మిగతా రాజస-తామస మానవులనుఆధ్యాత్మికత వైపు మరలించి ఉద్ధరించే కారణ జన్ములు. త్రిగుణాల గురించి ఆంధ్రమహా భారతం శాంతిపర్వంలో భీష్ముడు ధర్మరాజుకు ఇలా వివరించాడు."

**"విను గుణములు మాయకునొడ**
**లని యెఱింగి,తమోరజస్సులడచి**
**సుసత్త్వంబున నిలిచి సద్వివేకంబున**
**నదియుంద్రోచి విమల బోధాత్మడగున్"[4]**

మిథ్యాజ్ఞనమే మాయ. మాయకు మానవునిలో గుణత్రయం (సత్త్వరజస్తమములు)శరీరం.కాబట్టి మాయతత్త్వం గ్రహించి, మొదట తమస్సును, ఆ తర్వాత రజస్సును వదిలివేయాలి. అప్పుడు ఆత్మశుద్ధసత్త్వ రూపంతో వెలుగుతూ ఉంటుంది. అటు తరువాత ఆ సత్త్వాన్ని కూడా తొలగించుకోవాలి. అపుడు కేవలం జ్ఞానం-విమల బోధ కలిగి ఆత్మ పరమాత్మగా పరిణమిస్తుందని చెబుతూ గుణత్రయ రాహిత్యమే మాయా నాశనం అని వివరిస్తాడు.

ఇంతటి మహత్తరమైన సత్త్వగుణ ప్రాధాన్యం ఆధునిక సాహిత్యంలో కూడా కొన్నిచోట్ల కనిపిస్తుంది.ముఖ్యంగా సాత్త్విక దృక్పథంతో వచ్చిన కథలను,రచనలను పాఠకులు ఎక్కువగా ఆదరిస్తారని పరిశోధకుల మాట.జగన్నాథ శర్మ గారు రచించిన కథలలో సాత్విక ప్రధానమైన కొన్ని కథలను ఈ పరిశోధన పత్రంలో పరిచయం చేస్తున్నాను.

**రచయిత పరిచయం:**

అయలసోమయాజుల నీలకంఠేశ్వర (ఎ.ఎన్) జగన్నాథ శర్మ 13.04.1956 లో పార్వతీపురంలో జన్మించారు. చిన్ననాటి నుండి కథలపట్ల మమకారం పెంచుకున్నారు.పదిహేనవ ఏటనే కథలు రాయడం ప్రారంభించారు.ఇప్పటి వరకూ సుమారుగా అయిదువందల కథలు రాశారు. ఈయన రాజధాని కథలు (యువ మాస పత్రిక), అగ్రహారం కథలు (ఆదివారం ఆంధ్రజ్యోతి), మా ఊరి కథలు(పల్లకి వార పత్రిక) పాఠకుల ఆదరణ పొందాయి.

జగన్నాథ రధచక్రాల్, కథాచక్రాల్ కథలతో పాటు అగ్రహారం,శౌర్యచక్ర,చార్మినార్, ఛానెల్ 18నవలలు రాశారు.సినిమా,టి.వి.రచయితగా కూడా జగన్నాథ శర్మ ప్రసిద్ధులు.అరణి,అనీలజ,వైనతేయ,శివసతీపురంశర్మ, లహరి వీరి కలంపేర్లు.జగన్నాథ శర్మ రాసిన కథలన్నీ చిన్న చిన్నవిగా ఉన్న ఇందులో పాఠకులను ఆలోచించే విధానం ఎంతో ఆసక్తిగా ఉన్నాయి.

జగన్నాథ కథాచక్రాల్ అనే కథల సంపుటి నుండి గ్రహించిన దేవుడిడ్లీ అనే కథను పరిశీలిస్తే మానవత్వాన్ని ఇతివృత్తంగా తీసుకొని సాత్త్విక గుణ ప్రధానంతో రాసిన కథ ఇది. పెళ్ళికని వేరే ఊరెళ్ళిన ఒకతను అక్కడ హొటల్లో సంప్రదాయాన్ని చూసి ఆశ్చర్యపోయే ఘట్టం ఈ కథలో ప్రధాన వస్తువు. హొటల్ వచ్చిన వాళ్ళంతా

ఒక ప్లేట్ ఇడ్లీ దేవుడికి అంటూ చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగించడంతోపాటు ఆసక్తి రేకెత్తిస్తుంది.అసలు దేవుడిడ్లీ అని ఎందుకంటున్నారో చివరివరకు చూస్తుండగా అదే హోటల్లోకి ఒక బిచ్చగాడు వస్తాడు. సాధారణంగా ఇలాంటివారిని హోటల్లోకి రానివ్వరు.కానీ ఆ చలమయ్య హోటల్లో మాత్రం అలాంటివి కనిపించవు.అతడు వచ్చి దేవుడిడ్లీ అని చెప్పగానే సర్వర్ ఒక్క రూపాయి తీసుకోకుండా ఇచ్చి వెళ్తాడు. ఆ క్షణం చలమయ్య హోటల్ విషయం అర్థమవుతుంది.**"ధర్మం చేయడానికి కూడా టైం చిక్కని ఈ వేగవంతమైన జీవితంలో ధర్మానికి ఓ చక్కని అవకాశాన్ని కల్పించింది చలమయ్య హోటల్అనే ఈ మాటలు మానవత్వాన్ని ప్రతిబింబించే చక్కని బాటలు"**[5] ఇది ఎంతో సాత్త్వికంగా నడిచినకథ.ధర్మం చేయడానికి ఎక్కడికో పరుగెత్తక్కర్లేదు. మనకు చేతనైన దాంట్లో చేయవచ్చు అని నిరూపించిన కథ ఇది.

ఇందులోనే 'గుర్తు'అనే మరో కథలో సామాజిక విలువలు, నైతిక విలువలు,మానవత్వం మూడింటిని మేళవించి సత్త్వగుణ ప్రధానంగా చక్కని ఇతివృత్తంతో కథను నడిపించారు రచయిత. కొంటే కారే కొంటానంటూ ఎలాగైనా కారుకొన్న అతను ఎంతో ముచ్చటపడి డ్రైవ్ చేసుకుంటూ సుమతిని కలుసుకొని కారును చూపిస్తాడు. కారు కొన్న సందర్భంగా అతని పేరుని ఎంబ్రాయిడరీ చేసిన ఖర్చీఫ్‌ని ప్రజెంట్ చేసింది సుమతి.**"దీనిని పాడు చేయకు అని అందిస్తుంది. ఒకడు కార్ డ్రైవ్ చేసుకుంటూ స్పీడ్ పెంచుకుంటూ ముందుకు వెళ్తూ ఉంటాడు. అప్పుడే ఒక్కసారిగా ఫట్‌మంటూ శబ్దం వినిపించగానే కార్ ఆపి దిగుతాడు. కొత్త కారు ముందుభాగంలో సొట్ట పడి ఉంటుంది.ఎవరో రాయితో కొట్టారని"** [6]చుట్టుపక్కల చూస్తాడు. ఒక పన్నెండేళ్ళ కుర్రాడు చేతిలో రాయితో కనిపిస్తాడు. వెంటనే వాడి నెత్తిమీద రెండిచ్చి తిడతాడు. ఈ సందర్భంగా అతనిలో తమోగుణం తారసపడుతుంది. అసలు ఎందుకు కొట్టావు అని అడగ్గా దూరంగా అక్కడ వాలులో కింద ఒక మనిషి పడిపోయి ఉన్నాడు. మా నాన్న సార్ పాపం పక్షవాతం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రాయి తగిలి కింద పడ్డాను. ఆయన కూడా కింద పడ్డారు. తిరిగి లేపటానికి నాకు బలం చాలటంలేదు.ఎవరినైనా ఆపుదామంటే ఎవరు ఆపట్లేదు. కేకేసి ఆపుదామంటే ఆగట్లేదు. చేసింది లేక రాయి విసిరాను.తప్పే। అని చెప్తాడా కుర్రాడు.ఏడవకు అన్నాడతను. అతనిలోని తమోగుణం కాస్త తప్పుకొని సత్త్వగుణం సాత్త్వికత రూపంలో సంతరించుకుంది. వెళ్ళి కుర్రాడి తండ్రిని లేపి సుమతి ఇచ్చిన ఖర్చీఫ్‌తో గాయాలను తుడిచి దాన్నే కట్టుగా కడతాడు. వెళ్ళిరా అని పంపించి, కారు దగ్గరకు వెళ్ళి సొట్టభాగాన్ని ప్రేమగా నిమురుతాడు, ఆ సొట్టభాగాన్ని సంవత్సరం అయినా అలాగే ఉంచుతాడు. ఇది ఆ పాత్రలోని సత్త్వగుణానికి ప్రతీక.

**ముగింపు:**

పై కథలన్ని సత్త్వగుణ ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాయి. అందరిలో త్రిగుణాల కలయిక ఉన్న సందర్భాన్ని బట్టి సాత్వికతను ప్రదర్శించేవారు మహోన్నతులు. ఇలాంటి వారు చాలా అరుదు. కానీ అన్ని సమయాల్లో ఓర్పు, సహనంతో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవడం సత్త్వగుణ సంపన్నుల లక్షణం. నేటి సమాజంలో సత్త్వగుణం అనేది మరుగున పడిపోతుంది. ఎందుకంటే చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు అందరికీ ప్రతి చిన్న విషయం కూడా చిరాకుగానే ఉంటుంది. ఓపిక తక్కువ,విషయావగాహన ఉండదు.ఏ ఒక్కరు ఏ ఒక్క నిమిషం ప్రశాంతమైన

వాతావరణాన్ని నిర్మించుకొలేక జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. ఇది నేటి సమాజం యొక్క పరిస్థితి. ఈ ధోరణి మారాలంటే ప్రజలలో ఆధ్యాత్మిక చింతన, ధ్యానంపై అవగాహన, ఓర్పు,నేర్పు ఇలా అన్ని సమపాళ్ళల్లో ఉండాలి.ప్రాచీన పురాణ,భారత ఇతిహాసముల ద్వారా త్రిగుణాల విశిష్టతను బాల్యదశ నుంచే నేర్చుకొనేలా,ఆచరించేలా తల్లితండ్రులు బాధ్యత వహించాలి.విద్యావ్యవస్థలో కూడా సాత్త్విక జీవన సౌలభ్యం కోసం సమూల మార్పులు చేపట్టాలి.

**పాదసూచికలు:**

| | | |
|---|---|---|
| 1.భగవద్గీత | - | 14వ అధ్యాయం,17వ శ్లోకం |
| 2.భగవద్గీత | - | 18వ అధ్యాయం,40వ శ్లోకం |
| 3.భవానీ సౌందర్యలహరి | - | పుట, 5 |
| 4.ఆంధ్ర మహా భారతం | - | శాంతి పర్వం 124 పుట |
| 5.దేవుడిడ్లీ | - | పుట, 9 |
| 6.గుర్తు | - | పుట , 57,58 |

## ఉపయుక్త గ్రంథసూచి


1. జగన్నాథ శర్మ ఏఎన్..(2013).. జగన్నాథ కథ చక్రాల్.. అమరావతి పబ్లికేషన్స్ గుంటూరు..
2. భక్తి వేదాంత ప్రభుపాదులు..(1998).. భగవద్గీత యధాతధము.. భక్తి వేదాంత బుక్ ట్రస్ట్ హైదరాబాద్
3. తిక్కన..(2013).. కవిత్రయ విరచిత ఆంధ్ర మహాభారతము.. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ తిరుపతి
4. నిర్మల ప్రభావతి పవని.... భవాని సౌందర్య లహరి. స్వామి ఆఫ్ సెట్ ప్రింటర్స్ విజయవాడ

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# భగవద్గీత మరియు వివేకచూడమణిలో రజోగుణం యొక్క విశ్లేషణం

**అరుణ గెంటి**
పరిశోధక విద్యార్థి,
ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, **హైదరాబాద్**

ప్రకృతి చతుర్వింశతి తత్త్వాత్మకం. మహత్తత్త్వం, అహంకారం, పంచతన్మాత్రలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచ మహాభూతాలు, మనస్సును కలిపి ప్రకృతి అని అనబడుతుంది. ఈ మూల ప్రకృతి త్రిగుణాత్మక సత్త్వరజస్తమం అనబడే గుణత్రయం, సామ్యావస్థలో ఉండడం వల్ల అవ్యక్తావస్థ. ఈ సామ్యావస్థ విచ్యుతమైతే ప్రకృతి వికృతి అవుతుంది. అంటే సృష్టి ఆరంభించబడుతుంది.

సృష్టి ఆరంభంలో సత్వగుణం ప్రవృద్ధమైనప్పుడు జ్ఞానాత్మకమూ, సుఖాత్మకమూ అయిన మహత్తత్త్వం ఉత్పన్నమవుతోంది. పిదప రజస్తమోగుణాలు వివృద్ధాలైనప్పుడు అభిమానాత్మకయైన అహంకారం ఉత్పన్నమవుతోంది. సత్వ, రజ, తమోగుణాలలో రజోగుణం గురించి భగవద్గీత మరియు వివేకచూడామణి ఆధారంగా విశ్లేషణ చేయతలచాను.

**భగవద్గీత – స్వామి నిర్వికల్పానంద వ్యాఖ్య:**

**వివేకచూడామణి – శ్రీ స్వామి చిన్మయానంద వ్యాఖ్య:**

జ్ఞానయోగియైన శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో గుణత్రయ విభాగంలో త్రిగుణాల గురించి చెప్పెను. రజోగుణం గురించి ఈ విధంగా చెప్పెను.

**(గుణత్రయ విభాగ యోగం శ్లో. 7)**

> **"రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గ సముద్భవమ్।**
> **తన్ని బధ్నాతి కౌంతేయ కర్మసఙ్గేన దేహినమ్"॥**

రజోగుణం రాగాత్మకం, తీష్ణ నుండి ఉత్పన్నమవుతుంది. ఇది జీవులకు వివిధ కర్మలయందు రాగాన్ని కలిగించి, వివిధ ఫలాలను పొందవలెననీ ఆశను పురికొల్పి బంధిస్తోంది.

**(భగవద్గీత గుణత్రయ విభాగం. శ్లో.12)**

> **"లోభః ప్రవృత్తి రారమ్భ కర్మణా మశమ్న స్పృహ।**
> **రజస్యేతౌని జాయన్తే వివృద్ధీ భరతర్షభః॥**

రజోగుణం ఉన్న మనుష్యులు ఎప్పుడూ ఉన్న దానితో సంతోషపడక ఇంకా ఇంకా కావాలని కోరుకుంటారు. ఎప్పుడో శ్రీకృష్ణుడు ఈ లక్షణాలను చెప్పాడు. ప్రస్తుత సమాజంలో, ఎందరో ఇలాంటివారు కన్పిస్తున్నారు. 1992లో హర్షద్ శాంతిలాల్ మెహతా అనే భారతీయుడు స్టాక్ బ్రోకర్ లోభానికి గుర్రై సామాన్య మానవులను వంచించి

ధనమును సంపాదించెను. చివరకు జైలుపాలై మరణించెను. ఇది ఒక తార్కాణం. రాజసిక కర్మల యొక్క ఫలము దుఃఖము అనడానికి ఇంకా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. దైనందిన జీవితంలో కుటుంబ సభ్యుల మధ్య వాగ్వివాదాలు అన్నీ రజోగుణానికి చెందినవి.

ఫ్రాన్స్ దేశంలో విచక్షణారహితంగా జరుగుతున్న ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం. అసుర అంశలో పుట్టిన వానిలో కూడా రజోగుణం యొక్క ప్రవృత్తి కనిపిస్తుంది.

**"దమ్భో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవచ।**
**అజ్ఞానం చాభజాతస్య పార్థ సంపద మాసురీమ్"॥**

**(భగవద్గీత దైవాసుర సంపద్విభాగ యోగం శ్లో.4)**

రాక్షసమైన స్థితిని పొందిన వారిలో కపటమైన ధర్మాచరణం, కర్తవ్య – అకర్తవ్యాల పట్ల అవివేకం కన్పిస్తాయి.

ఈ మధ్యకాలంలో అయ్యగారి సాయికృష్ణ అనే పురోహితులు తన కర్తవ్యమైన ధర్మమును ఆచరించకుండ భార్యా పిల్లల గురించి ఆలోచించకుండ వేరే అమ్మాయి వ్యామోహంలో పడి ఆమెను దారుణంగా హత్య చేసాడు. ఇవి అన్నీ అసుర గుణాలే కదా!

దీని గురించే ఆదిశంకరులు రచించిన వివేక చూడామణి అనే గ్రంథంలో ఈ విధముగా వివరింపబడింది.

**"క్రామక్రోధ లోభ దంభాద్యసూయా**
**అహం కారేర్ష్యామత్స రాదాస్తుఘోరాః।**

**"ధర్మఏతే రాజస్నా పుం ప్రవృత్తిః**
**యస్మాదేషా తధజో బంధహేతుః॥**

**(భగవద్గీత దైవాసుర సంపద్విభాగ యోగం శ్లో.112)**

కామ, క్రోధం, లోభం, దంభం, అసూయ, అహంకారం మొదలైన గుణాలన్నీ రజోగుణము నుండే ఉద్భవించి వ్యక్తం అవుతున్నాయి. వ్యక్తి మనస్సులోని నీచ ప్రవృత్తి నుండి రజోగుణం ఆధారంగా ఈ గుణాలన్నీ పుడుతున్నాయి. అశాంతితో నిండిన మనస్సు నుండి పుట్టి, వృద్ధి చెంది పూర్తి వ్యక్తిత్వాన్నే ఛిన్నాభిన్నం చేస్తాయి. మరియు శంకరాచార్యులు ఈ విధంగా విక్షేప శక్తి గురించి చెబుతూ

**"విక్షేపశక్తీ రజస్ణ క్రియాత్మికా**
**యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణే"।**

**"రాగదయోస్మాః ప్రభవన్తి నిత్యం**
**దుఃఖాదయో యే మనసోవికారాః"॥** **(భగవద్గీత దైవాసుర సంపద్విభాగ యోగం శ్లో.111)**

రజోగుణానికి విక్షేపశక్తి ఉంది. దీని స్వభావమే క్రియాశీలత్వం, కర్మ ప్రవాహమంతా దీనినుండే జన్మిస్తుంది. మనోవికారాలైన రాగము, దుఃఖము మొదలైనవన్నీ కూడ దీని నుండే ఉద్భవిస్తున్నాయి. మాయ రజోగుణంగా

వ్యక్తమయినప్పుడు మనస్సులో విక్షేపంగా, అలజడిగా గుర్తింపబడుతుంది. మనస్సులో అశాంతినీ, అలజడినీ కలిగించేది రజోగుణం. దీని నుండే అన్ని కర్మలూ జన్మిస్తున్నాయి.

ఇలాంటి లక్షణాలు ఇప్పుడు ఉన్న యువతలో బాగా కన్పిస్తున్నాయి. చదువుకునే విద్యార్థులలో మరియు ఉద్యోగాలు చేస్తున్నా వారిలో తీవ్ర అలజడి మనోవ్యాకులం, అశాంతి కన్పిస్తున్నాయి. ఎప్పుడూ మారుతున్న ప్రపంచంలోని అవసరాలు మరియు అస్థిరత్వం వారిలో ఈ లక్షణాలని ప్రేరేపిస్తున్నా ఏమో. ఈ వత్తిడిని తట్టుకోలేక ఎందరో ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

ఈ యొక్క పరిస్థితిని ఎదుర్కోడానికి జీవన విధానంలో మార్పులు ఎంతో అవసరం. పిల్లలకు చిన్నప్పటి నుంచే భగవత్ ధ్యానం, ఆధ్యాత్మిక చింతన, యోగ మొదలైనవి వారి దైనందిన చర్యలో భాగంగా చేస్తే ఈ సమస్య నుంచి వారిని కాపాడిన వారమవుతాం. ఈ ప్రయత్నాలన్నీ సత్వగుణం పెంపొందించడానికి దోహదం అవుతాయి.

**(భగవద్గీత దైవాసుర సంపద్విభాగ యోగం శ్లో.6)**

**"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశక మనామయమ్।**
**సుఖపజ్గేన బధ్నాతి జ్ఞానసజ్గేన చానఘ॥**

సత్వగుణం స్పటికము వలె నిర్మలమూ, శాంతమూ, ప్రకాశ స్వభావమూ అయి ఉంది. ఇది జ్ఞానశక్తిని, సుఖాశక్తిని కలిగించి ఆత్మను బంధిస్తుంది.

**ఆధార గ్రంథాలు**

1. వివేకచూడామణి - ఆదిశంకరాచార్య , స్వామి చిన్మయానంద వ్యాఖ్య... తెలుగు అనువాదం.. శ్రీమతి అన్నపూర్ణ, విజయవాడ.(2004 ,)చిన్మయారణ్యకం పబ్లికేషన్స్ ట్రస్ట్, భీమవరం.
2. శ్రీమద్భగవద్గీత, స్వామి నిర్వికల్పానంద..(2014). రామకృష్ణ మఠం..దోమలగూడ, హైదరాబాద్.

# వాడ్రేవు వీరలక్ష్మి దేవి కథలు త్రిగుణముల ప్రస్తావన

**హిమబిందు వేదుల** (తెలుగు),
పరిశోధక విద్యార్థిని,
ఆంధ్ర విశ్వ కళాపరిషత్,
విశాఖపట్టణం.

**"సత్త్వం సుఖే సజ్జయతి రజ:కర్మణి భారత:**
**జ్ఞానమావృత్య తు తమ: ప్రమాదే సంజయత్యుత"॥"1**

త్రిగుణములు అనగా భగవద్గీత ప్రకారం భౌతిక ప్రకృతి యొక్క గుణములు. అవే సత్త్వ,తమో,రజో గుణములు. ఇవి హిందూ ధర్మ శాస్త్రంలో చెప్పబడిన ప్రధాన గుణములు. సత్త్వగుణం వల్ల జ్ఞానం, రజో గుణం వల్ల మోహం, తమో గుణం వల్ల అజాగ్రత్త, అవివేకం,మరపు మొదలైనవి కలుగుతాయి. సత్త్వగుణం కలిగినవారు పైలోకాలకు వెళుతున్నారు. రజోగుణం కలిగినవారు మానవలోకంలో జన్మిస్తున్నారు. తమోగుణ ప్రవృత్తి కలవారు అధ:లోకాలకు వెళుతున్నారు.

**త్రిగుణములు వాటి స్వభావం:**

**సత్త్వగుణం:** సత్త్వగుణం సుఖాలు కలిగిస్తుంది.మోక్షాన్ని అందిస్తుంది.వీరు సాత్వికంగా ఉంటారు. ఓర్పు,సహనం ఎక్కువ.వీరి నిర్ణయాలు గొప్పగా ఉంటాయి.ఇది చాలా పవిత్రమైనది.ఈ గుణంతో చేసే పనులు పవిత్రమైన ఫలితాలను ఇస్తాయి.

**రజో గుణం:** రజో గుణం కలవారికి కోరికలు ఎక్కువ. ఏదో చేయాలనే తృష్ణ కలిగి ఉంటారు. ప్రాపంచిక భోగాలపై ఆసక్తి కలుగుతుంది.ఈ గుణం అభివృద్ధి చెందినపుడు లోభం,అశాంతి పెరుగుతాయి.

**తమో గుణం:** అజ్ఞానంచే జనించేది తమోగుణం. ఈ గుణం వల్ల జడత్వం, నిర్లక్ష్యము, సోమరితనం ఏర్పడతాయి.

ఆధునిక కాలంలో ఈ ప్రధాన గుణాలను వాడ్రేవు వీరలక్ష్మి దేవి కథలలో పరిశీలించవచ్చు.శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మి దేవి విశాఖపట్టణం జిల్లా కొయ్యూరు మండలంలో ఉన్న తోటలూరు అనే గ్రామంలో జన్మించారు. తన తల్లితండ్రులు వాడ్రేవు విశ్వేశ్వర వెంకట చలపతి, సత్యవతి దేవి. ఆమె బాల్యమంతా తూర్పు గోదావరి జిల్లా మన్య ప్రాంతమైనా రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామంలో గడిచింది. ఈమె ఒక గొప్ప రచయిత్రి. తన కథలలో పాత్రలు పాఠకుని కళ్ళ ముందు నిలబడతాయి. బివేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్, సమభావం కథలలో సత్త్వ,రజ,తమో గుణాలను గమనించవచ్చు.

**తమోగుణ పరిశీలన:**

**'ఆయన ఉదయం తొమ్మిది లోపు భోజనం చేస్తాడట.మళ్ళీ రెండు గంటలకి వచ్చి మళ్ళీ తింటాడు. మళ్ళీ అన్ని వేడిగా వండాలి. సాయంత్రం అయిదు దాటకుండా టిఫిన్. రాత్రి మళ్ళీ తొమ్మిది గంటలకు అన్ని**

**కొత్తగా వేడి వేడిగా వంట. ఏదీ నిమిషం ఆలస్యం కాకుండా ,నోట్లో మాట నోట్లో ఉండగానే అందించెయ్యాలిట.'2**

పై వాక్యాన్ని గమనిస్తే భార్యభర్తల మధ్య సంభాషణ అనేది తెలుస్తుంది. ఇక్కడ భర్తలో తమోగుణం ప్రస్ఫుటమవుతుంది.అతనిలో భర్త అనే పొగరు,అజ్ఞానం,చిరాకు మనకి కనపడతాయి. తన భార్యపై పెత్తనం మాత్రమే కనపడుతుంది. ఇక్కడ భర్తలో మనం గమనించాల్సిన అంశాలు బద్ధకం, నిర్లక్ష్యం, సోమరితనం, అతినిద్ర, విచ్చలవిడిగా తిరగడం మనం చూడవచ్చు. ఇవన్నీ కూడా తమోగుణ ప్రధాన లక్షణాలు. భార్యని ప్రేమించడం, గౌరవించడం అనేవి అతను ఎక్కడా చేయలేదు.ఎందుకంటే అతను అధికమైనా తమోగుణ లక్షణాలు కలిగి ఉన్నాడు.

**"కార్పణ్యదోషోపహతస్వభావ:పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతా:**

**యచ్ఛ్రేయ:స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తే హం శాధిమాం త్వాం ప్రపన్నం" 2**

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునికి గీతాసారం భోదిస్తాడు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు భయంతో. లోభముతో, పిరికితనంతో పూర్తి స్థాయి తమోగుణ లక్షణాలు కలిగి ఉంటాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునునికి సాత్వికంగా విషయాన్ని బోధపరుస్తాడు.

అదేవిధంగా మనలో కూడా  కొన్ని సంధర్భాలలో ప్రతి చిన్న విషయానికి భయం, ఆందోళన, బద్ధకం ఏర్పడతాయి. అర్జునుడు ఏ విధంగా అయితే ఎదుర్కొని కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధిస్తాడో మనము కూడా మనలో ఉన్న బద్ధకాన్ని, అతినిద్ర, లోభమును వదిలి భవిష్యత్ పై ఆశతో అడుగులు ముందుకు వేస్తే విజయం వరిస్తుంది.

**రజోగుణ పరిశీలన:**

**'ఆ మాటల్లో పొగరు,లెక్కలేనితనం కొట్టొచ్చినట్టు కనిపించేయి. భార్య స్నేహితురాలిగా నాకు అతను ఇచ్చే గౌరవం అది. ఒకవేళ భార్య స్నేహితురాలు తన పై ఉద్యోగి అయితే ఏం చేస్తాడో?' 3**

రజోగుణం అంటేనే క్రోధము అని చెప్పవచ్చు. ఈ వాక్యం గమనిస్తే భర్త అనే అహంకారం కనపడుతుంది. ఆడది అనే చులకన భావం కనిపిస్తుంది. తన భార్య తనకి సమయానికి అన్ని అందిస్తూ అతగాడికి పూర్తిగా బానిసగా మారిపోయింది.ఆమెకి స్వేచ్ఛ లేదు. తన భర్త సుఖాలకి అలవాటు పడిపోయి ఏ పని చేయకుండా పూర్తిగా రజోగుణ లక్షణాలు కలిగి ఉన్నాడు.

**'రాత్రి రావ్‌తో ఆ విషయం అంతా చెప్పేను. అంతా విని అన్నాడు. అతను ఆమెలోని చైతన్యాన్ని చాకిరీతో చంపేసాడు. ఆమె నుంచి ఏ ఆనందం పొందవచ్చునో అతనికి తెలియదు.' 4**

ఈ వాక్యంలో రావ్ సాత్త్వికంగా ఆలోచించి చాలా చక్కగా భార్యభర్తలను అర్ధంచేసుకొని విషయ విశ్లేషణ చేశాడు.'ప్రతి మనిషిలో ఏదో ఒకచోట ప్రేమైనా,కోపమైనా,బద్ధకమైనా ఒకదాని తర్వాత ఒకటి మనకు కనిపిస్తాయి.

**సత్త్వగుణ వివరణ:**

**"తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పర:**
**వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా"5**

కృష్ణ చైతన్యము లేకుండా ఇంద్రియములను నియంత్రించుట ఏ ఒక్కరికి సాధ్యపడదు. ఒకసారి దుర్వాస ముని అంబరీషునితో కలహించి అనవసరమైనా గర్వముతో క్రోధితుడై తన ఇంద్రియములను నియంత్రించలేకపోయెను. కానీ అంబరీషుడు గొప్ప శక్తి సంపన్నుడు, భగవద్భక్తునిగా ఆ ముని చేసే ప్రతి పనిని మౌనంగా భరించి చివరకు విజయం సాధించెను. అందుకే చేసే ప్రతి పని ధర్మబద్ధమై ఉండాలి. ప్రపంచంలో అందరూ త్రిగుణములు కలిగి ఉంటారు.కానీ అన్ని గుణాలలో సత్త్వగుణం మేలు. కనుక అందరూ సాత్త్వికంగా ఉండడం మంచిది.

**'చాలా రోజుల తర్వాత ఆలోచించగా అర్థమయింది.ఆమె అందరితో ఉంటూనే,అందరినీ విచారిస్తూనే,సేవ పంచుతూనే తనదైన లిమిట్‌లో ఉండేవారు. మాతో ఉంటూ కూడా,లేనట్టుగా ఉండడం మాకు అలవాటు చేశారు.అందుకే ఈనాడు లేకపోయినా ఉన్న భావనే మాకు కలుగుతోందన్న మాట.' 5**

సమభావం కథలో బామ్మగారికి సంబంధించినవి పై వాక్యాలు. ఆమె పూర్తిగా సత్త్వగుణ సంపన్నురాలు అని చెప్పవచ్చు.ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో తెలిసినవారు సాత్త్వికులు, తెలివైనవారు.ఆమెకు హద్దులు తెలుసు.మంచిచెడులపై అవగాహన ఉంది. ఓర్పు,సహనం ఆమెకు అలంకారాలు. సరియైన సమయంలో ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడం తెలివైనవారి లక్షణం.కథలో బామ్మ అదే చేశారు.

**ముగింపు:** ప్రతి ఒక్కరూ ఈ త్రిగుణములను కలిగి ఉంటారు.వారి స్వభావం చేతనో, వారు చేసే పనుల ద్వారా వారి గుణములు బయటకు వస్తాయి.సాధారణంగా మానవులందరూ తమో,రజోగుణ లక్షణాలను కలిగి ఉంటారు. సత్త్వగుణం కలిగిన వారు చాలా అరుదు. ప్రస్తుత సమాజంలో తమోగుణం,రజోగుణం పెరిగిపోయి చాలా తేలికగా తప్పుడు పనులు చేసేస్తున్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే అందరిలో సత్త్వగుణ లక్షణాలు పెరగాలి.అందరూ సాత్త్వికంగా ఆలోచించాలి. రాముడు సత్త్వగుణ లక్షణాలు కలిగినవాడు కనుకే అంత గొప్పవాడు అయ్యాడు. మహాభారతంలో శ్రీకృష్ణుడు, ధర్మరాజు ఇలా ఎంతోమంది మహానుభావులు ఉన్నారు. వారిలా పూర్తిస్థాయిలో మనం మారకపోయిన కొంతమేర మన అలవాట్లు, పద్ధతి మార్చుకుంటే సమాజంలో అవినీతి, అరాచాకాలు, దోపిడిలు, నేరాలు,ఆడపిల్లలపై అఘాయిత్యాలు తగ్గుతాయి. వాడ్రేవు వీరలక్ష్మీ దేవి కథలో చెప్పినట్టుగా కుటుంబంలో అందరూ ఒక్కటిగా కలిసి ఉండాలి. మంచి చెడుల మధ్య తేడా ఇంట్లోనే నేర్పించాలి.సంస్కారం అనే బీజాన్ని తల్లితండ్రులే నాటాలి. అప్పట్లో సమిష్టి కుటుంబాలు కానీ నేడు అన్ని వ్యష్టి కుటుంబాలే అవడంవలన తెలిసి తెలియనితనంతో అనవసరమైన సుఖాలకు అలవాటుపడి వారి జీవితాలను నాశనం చేసుకొని,ఎదుటివారి జీవితాలను నాశనం చేస్తున్నారు.ఇవన్ని మారాలంటే ప్రతిఒక్కరూ సత్త్వగుణాన్ని పెంపొందించుకోవాలి. అలా జరగాలంటే మనందరిలో ఆధ్యాత్మికత పెరగాలి. ధ్యానం చేయడం ఎక్కువగా శాఖాహారానికే ప్రాముఖ్యతను

ఇవ్వడం. ఇలా మనలో చిన్న,చిన్న మార్పులు చేసుకుంటే సత్త్వగుణ లక్షణాలు పెరిగి జీవితం సుఖమయం అవుతుంది.

**ఆధారగ్రంథాలు**


1. భక్తి వేదాంత ప్రభుపాదులు..(1998).. భగవద్గీత యధాతథము.. భక్తి వేదాంత బుక్ ట్రస్ట్ హైదరాబాద్.
2. ఉత్సవ సౌరభం – వాడ్రేవు వీరలక్ష్మి దేవి. (1996) – రాజా పబ్లికేషన్స్ .
3. కొండఫలం – వాడ్రేవు వీరలక్ష్మి దేవి – (2010) – శ్రీ ప్రచురణ పబ్లికేషన్స్ – హైదరాబాద్.
4. వాల్మీకి రామాయణం – 2022.. భక్తి వికాస్ ట్రస్ట్. గుజరాత్

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# సత్త్వగుణానికి ప్రతీక - మహాసాధ్వి సీతాదేవి

**నోసిన వెంకటేశ్వర్లు**
పరిశోధక విద్యార్థి
తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం
ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయము,
గుంటూరు, ఆంధ్రప్రదేశ్

గుణం అంటే స్వభావం అనే అర్థంలో సహజంగా చెబుతుంటాము. గుణం అంటే ఒక వ్యక్తి అంతర్ పరిస్థితి అని కూడా అని చెప్పవచ్చు. కర్మ అంటే బహిర్ కార్యకలాపం. మన గుణాన్ని బట్టే మన కర్మలు కూడా ఉంటాయి. కర్మల వలన గుణాలు కూడా మారుతూ ఉంటాయి. గుణం, కర్మ ఇవి రెండూ ఒకదానికొకటి పెనవేసుకొని ఉంటాయి.

అంతర్ పరిస్థితిని బట్టి మనుష్యులను సత్వ గుణ ప్రధానులుగా, రజోగుణ ప్రధానులుగా, తమోగుణ ప్రధానులుగా విభజించవచ్చును. పై మూడు గుణాలు ప్రతి మనిషిలోనూ ఉంటాయి. వీటి కారణముగానే జీవుడు ఈ దేహములో బంధించబడుతున్నాడు.

**1. సత్త్వ గుణము:**

ఈ గుణము నిర్మలమైనది. జ్ఞానము నందు ఆసక్తి కలిగి చేసే ప్రతి పనిలో భగవంతుడిని చూస్తూ ఉంటారు. మంచి బుద్ధి కలిగి ఉంటారు. ఈ గుణం మిగిలిన రెండు గుణాల కంటే చాలా పవిత్రమైనది, క్షేమకరమైనది. ఈ గుణముతో చేసే పనులు మంచి ఫలితాలను ఇస్తాయి. సత్త్వగుణం కలిగి జీవించి మరణించిన వారు జ్ఞానులు ఉండే పవిత్ర లోకాలను చేరుకుంటారు. వీరు చాలా ప్రశాంతంగా ఉంటారు. మృదువుగా మాట్లాడతారు. దైవం మీదనే ఆధారపడతారు.

**2. రజోగుణము:**

రజోగుణము అనగా క్రోధము. ఈ గుణం కలవారు ప్రశాంతంగా ఉండరు. ఆందోళన పడుతూంటారు. ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉంటారు. ఆందోళన పడుతూ, అశాంతితో జీవిస్తూ ఉంటారు. ఏదో చేయాలనే తపన ఉంటుంది కానీ ఏమీ చేయలేరు. ప్రాపంచిక విషయాలపై ఎక్కువ ఆసక్తి ఉంటుంది.

**3. తమోగుణము:**

ఈ గుణము అధికంగా ఉంటే సోమరితనం, ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడడం, చెడు ఆలోచనలు, తిండి మీద ధ్యాస ఉంటాయి. ఈ గుణం కలవారు కేవలం శారీరక అవసరాలకే ప్రాముఖ్యత ఇస్తారు. కష్టాలకు, ఇబ్బందులకు భయపడుతూ ఉంటారు. వీరు చాలా నిర్లక్ష్యముగా ఉంటారు. మూర్ఖత్వంతో ప్రవర్తిస్తూ ఉంటారు.

**రామాయణం సీత:**

అనాదిగా మన భారతీయ జనజీవితాలను ప్రభావితం చేస్తున్న మహేతిహాసాలు రెండు అవి :

1. రామాయణం 2. మహాభారతం

ఈ రెండింటిలో రామాయణం ప్రభు సమ్మితాలుగా సంభావింపబడిన వేదాలలోని పరమార్థాలని కాంతా సమ్మితంగా లోకానికి ఉపదేశించిన మొట్టమొదటి మహాకావ్యం రామాయణం. రామాయణాన్ని మనం హృదయంతో ఆస్వాదిస్తాము, అనుభవిస్తాము. రామాయణం రాముని పేరుమీద రచించబడిన కావ్యం. ఇందులో రాముడే నాయకుడు. తక్కిన పాత్రలన్నీ అతని వలన అతని చుట్టే తిరుగుతూ ఉంటాయి. రాముడు పురుష ప్రపంచానికే ఒక ఆదర్శమూర్తి, ఆదర్శస్ఫూర్తి. అలాంటి శ్రీరాముని ధర్మపత్ని, రామాయణ కావ్య నాయిక సీత. వాల్మీకి మహర్షి తన రామాయణ కావ్యాన్ని " సీతాదేవి మహాచరిత్ర "గా పేర్కొన్నారు.

**"కావ్యం రామాయణం కృత్యం**
**సీతాయాశ్చరితం మహత్**
**పౌలస్త్యవధ మాత్యేవ**
**చకార చరితవ్రత"**

అని పేర్కొన్నాడు. రాముడు ఏకపత్నీవ్రతుడు. ఆదర్శపురుషుడు. సీత పాతివ్రత్యానికి ఆదర్శం. సీతారాముల దాంపత్యం బారతీయ వివాహ వ్యవస్థకే ఒక ఆదర్శం. రామనాయకమైన రామాయణంలో శ్రీరామునితో సమప్రధానమైన పాత్ర సీత. అందుకే స్వామి వివేకానందుడు మహాసాధ్వి సీతమ్మను గురించి **"ఏ దేశపు వాఙ్మయమునైనను శ్రీరామచంద్రుని వంటి పురుషోత్తములు లభించిన లభింపవచ్చునేమోగాని సీతవంటి యాదర్శ చారిత్రయగు పతివ్రతా తిలకము లభించుట దుర్లభము "** అని గొప్పగా చెప్పాడు. అందుకే కొంతమంది సీత లేకుంటే రామాయణం లేదు. ద్రౌపది లేకుంటే భారతం లేదు అని అంటుంటారు.

**సీతాదేవి సత్త్వగుణము:**

క్షమ, దయ, ధైర్యం, వివేకం, ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన, ఆదర్శవంతమైన స్త్రీ పాత్ర సీత. సీత లేనిదే రామాయణం లేదు. సీత లేకుండా రాముని జీవితాన్ని అసలు ఊహించలేము. రామాయణంలో ఏ ఘట్టం తీసుకున్నా అందులోని సీత గుణగణాలు ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శప్రాయంగా నిలుస్తాయి.

**1. ధర్మమూర్తి:**

సీత ఒక ఇల్లాలిగా తన భర్త బాధ్యతలో, కర్తవ్య దీక్షలో తను కూడా పాలుపంచుకొన్నది. రాముడు తండ్రికిచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసానికి వెళ్లినప్పుడు తన భర్త అడుగుజాడల్లోను అతని కష్టసుఖాల్లోను నడిచిన సాధ్వీమణి సీతాదేవి.

**2. దయాశీలి:**

అన్ని దానాలలోకెల్లా అన్నదానమే మిన్న అని అంటారు. అతిధిని దేవుడిగా భావించే సంస్కృతి మనది. మనం తినకపోయినా మన ఇంటికి వచ్చిన అతిధులకు కడుపునిండా అన్నం పెట్టే గొప్ప సంప్రదాయం మనది. అదే భావనతో మారువేషంలో తన ఇంటికి వచ్చిన దశకంఠునికి తక్ష్మణుడు గీసిన రక్షణ గీతను దాటి అన్నం పెట్టి అన్నదానమే మిన్న అని చాటిన స్త్రీమూర్తి సీత.

**3. ధైర్యశాలి:**

సీతాదేవి చాలా ధైర్యవంతురాలు. అరణ్యవాస సమయంలో ఆమె అడవులలో, క్రూర మృగాలు ఉన్న ప్రాంతాలలో నివసిస్తున్నప్పటికీ ఏమాత్రం భయపడలేదు. ముఖ్యంగా లంకలో ఉన్నప్పుడు రావణుడి ముందు ఆమె చూపిన ధైర్యం అనన్యసామాన్యం. అగ్ని ప్రవేశ సమయంలో కూడా ఆమె ఎంతో ధైర్యంగా అగ్నిప్రవేశం చేసింది. నీతిమంతులు దేనికీ భయపడరు అనే దానికి సాదృశ్యం సీతాదేవి.

**4. అభిమానవతి:**

సీతమ్మకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ. చిత్రకూటానికి సీతారాములు వచ్చారని తెలిసి ఆమె తండ్రి జనకుడు వారిని వనవాసం పూర్తయ్యే వరకు మిథిలకు వచ్చిఉండమని అడిగినప్పుడు ఆ మాటలను సున్నితంగా సీతాదేవి తిరస్కరించింది.

**5. జంతు ప్రేమికురాలు:**

వనవాస సమయంలో తమ ఇంటికి చుట్టుప్రక్కన ఎన్నో పక్షులను, కుందేళ్ళను ఆమె పెంచుకునేది. అదే ప్రేమతో జింకను తనకోసం తీసుకురమ్మని భర్తను బ్రతిమాలుతుంది.

**6. వివేకవంతురాలు:**

రావణాసురుడు తనను అపహరిస్తున్న సమయంలో రాముడికి తన ఆనవాళ్లు చిక్కడం కోసం తన నగలను జారవిడిచిన వివేకవంతురాలు సీత.

**7. క్షమాగుణం:**

రావణాసురుని సంహరించిన తరువాత సీతను అశోకవనం నుండి విడిపించి తీసుకువెళుతున్నప్పుడు తను బందీగా ఉన్నప్పుడు తనను మాటలతో హింసించిన రాక్షస స్త్రీలను క్షమించిన గొప్ప మహిళ సీతమ్మ, రాక్షస స్త్రీలు వారి యజమాని మాటలను జవదాటక వారి వృత్తిధర్మమును వారు నిర్వర్తించారని చెప్పి వారికి ఏ కీడును కలిగించని గొప్ప క్షమామూర్తి సీతమ్మ.

పై లక్షణాలే కాకుండా ఎన్నో ఆదర్శవంతమైన లక్షణాలు ఉన్న సాధ్వీమణి, మహా పతివ్రత సీతమ్మ తల్లి. రామాయణంలోని ప్రతి సన్నివేశంలో సీతమ్మకు సంబంధించి చూస్తే మనకు ఎక్కువ శాతం సత్త్వగుణం లక్షణాలే కనిపిస్తాయి.

**ముగింపు:**

ప్రతి మనిషిలో సత్త్వగుణము, రజోగుణము, తమోగుణములు ఉంటాయి. ఈ మూడు గుణాలలో సీతమ్మను సత్త్వగుణమునకు ప్రతీకగా చెప్పవచ్చునని నా అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు**

1. డా. కాసల. నాగభూషణం: (2011) తిక్కన సీతబీ కిరణ్మయి పబ్లికేషన్స్, చెన్నై.
2. ఆతుకూరి. మొల్ల (2008) మొల్ల రామాయణము. ఎమెస్కో సాంప్రదాయ సాహితి.
3. శ్రీ పురిపండా. అప్పల స్వామి(2009) నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరు రోడ్, విజయ వాడ –2.

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2024

# సత్త్వగుణ సంపన్నుడు ప్రహ్లాదుడు

**ఎమ్. ప్రదీప్,**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,

**ఉద్దేశ్యం:**

పురాణ శబ్దానికి బ్రహ్మాండ పురాణంలో '**యస్మాత్ పురాహ్యనక్తీదం పురాణం తేనతత్ స్మృతం**' అని వ్యుత్పత్తి కలదు. ఈ వ్యుత్పత్తిని అనుసరించి పురాణం అతీతానాగత వృత్తములను తెలిపేదని తెలుస్తుంది. దీనిని బట్టి పురాణాలలో సత్త్వరజస్తమో గుణాలను గూర్చిన పరిపూర్ణ సారము నిబిడీకృతమై ఉంటుందని అర్థమవుతుంది. అలాంటి పురాణరాశిని ఎందరో ఋషులు అనేక కాలాలలో నిర్మించారు. ఈ పురాణరాశిని ఇరవై ఎనిమిదవ మహాయుగంలో వ్యాసపీఠాన్ని అధిష్ఠించిన కృష్ణద్వైపాయనులవారు అష్టాదశ మహా పురాణములుగా, ఉప పురాణములుగా విభజించి మానవాళికి అందించారు. సకల చరాచర సృష్టికి గుణత్రయ భేదము ఉన్నట్లుగానే పురాణములకు కూడా ఆ భేదము ఉన్నది. అట్టి భేదాన్ని అనుసరించి పురాణములు సాత్వికములు, రాజసములు, తామసములు అని వర్గీకరించబడ్డాయి. అందులో సాత్వికములు విష్ణు సంబంధమైన పురాణాలు కాగా, రాజసములు బ్రహ్మ సంబంధమైన పురాణాలు. ఇక తామసములు శివ సంబంధమైన పురాణాలు. ఇలాంటి పురాణాలలో శ్రీమహావిష్ణువు భక్తుల గాథలను తెలియజేసే సాత్వతపురాణము భాగవతము. భాగవతుల (విష్ణుభక్తుల) కథను చెప్పినదవుట చేత భాగవత నామము సార్థకము. పలువురి మతాన్ననుసరించి భక్తి జ్ఞాన వైరాగ్య తత్త్వములను ప్రతిపాదించునది భాగవతము. ఈ విధముగా మనిషిని మనీషిగా మార్చగలిగిన ఈ సాత్వత సంహితలో ప్రహ్లాద చరిత్ర, గజేంద్రమోక్షం, వామన చరిత్ర, రుక్మిణీ కళ్యాణము, కుచేలోపాఖ్యానం పంచరత్నములుగా విలసిల్లుతున్నాయి. ఈ భాగవత పంచరత్నములలో మొదటిదైన ప్రహ్లాద చరిత్రలో ప్రహ్లాదుని సత్త్వగుణమును వ్యాసములో ఆవిష్కరించి నేటి కాలానికి చక్కని నడవడిని గురించి తెలియజేయడం నా వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**విషయ వివరణ:**

సత్త్వగుణము త్రిగుణాలలో నిర్మలమైనది, ప్రకాశవంతమైనది, దోష రహితమైనది. జ్ఞానాభిలాష చేత జీవుని బంధించునది. ఇక రజోగుణము రాగాత్మకమైనది. కోరికను, ఆసక్తిని కలుగజేయుచు కర్మలు, కర్మ ఫలముల చేత జీవుడిని బంధించునది. తమోగుణము అజ్ఞానము వలన పుట్టినది. ఇది భ్రాంతి, మరపు, బద్ధకము, నిద్ర చేత జీవుడిని బంధిస్తుంది. ఈ త్రిగుణాలు ప్రతి జీవునిలో ఉంటాయి. ఈ త్రిగుణాల మధ్య ఎల్లప్పుడూ పోటీ నెలకొని ఉంటుంది. వీటిలో రజో, తమో గుణాలను అణచివేసి ఉత్తమమైన సత్త్వగుణమును వృద్ధి చేసిన జీవుడు ఉన్నతిలోకి రాగలడు. ప్రహ్లాదుడు నృసింహస్తుతి చేస్తున్న సమయంలో తనను గురించి తాను తెలియజేస్తున్న

సందర్భంలో **'తామస వంశ సంభవుడ దైత్యుడ నుగ్ర రజోగుణుండ'** అని అంటాడు. దీనిని బట్టి ప్రహ్లాదుడు తమోగుణంతో నిండిన రాక్షస వంశంలో పుట్టాడని అలాగే ఉగ్రమైన రజోగుణము గలవాడని తెలుస్తుంది. అలాంటి ప్రహ్లాదుడు శుద్ధ సత్త్వగుణ సంపన్నునిగా కీర్తి గడించడానికి కారణం అతని సంస్కారవంతమైన నడవడే మూలకారణము.

**"స్థితప్రజ్ఞత అంతిమ రూపం భక్తి, దీనికి సహకరించునది జ్ఞానము,**
**నిర్భయత్వానికి, నిర్వికారానికి పరాకాష్ట వైరాగ్యం,**
**పరమాత్మను తెలుసుకొనుటయే తత్త్వము" .........** ఈ నాలుగు లక్షణాలు సత్త్వగుణమునకు నాలుగు స్తంభాల వంటివిగా చెప్పుకోవచ్చు.

ఈ నాలుగు సత్త్వగుణ లక్షణాలను కలిగిన ప్రథమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడు.

1. **భక్తి:**

**"ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత**
**మగు హృషీకేశు సన్నిధి నా విధమును**
**గరుగుచున్నది దైవయోగమును జేసి**
**బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంత మగుచు". (పోతన భాగవతము 7-149)**

ఈ పద్యం ప్రహ్లాదుని భక్తిని తేటతెల్లం చేస్తున్నది. అయస్కాంతం వైపుకు ఇనుము ఆకర్షించబడు విధంగా, దైవ నిర్ణయానుసారం, నా మనసు సర్వేంద్రియాలకు అధిపతి అయిన విష్ణుమూర్తి సన్నిధిలో ఆకర్షింపబడుతోంది, ఇంకే విషయంలోనూ నా మనసు నిలవటం లేదంటూ లోకంలో సహజమైన సాన్నిహిత్యం గల వస్తువులతో అలౌకికమైన భక్తిని ప్రకటించాడు.

**2. జ్ఞానము:**

**"ఎల్ల శరీరధారులకు నిల్లను చీకటినూతిలోపలం**
**ద్రెళ్ళక వీరు నే మను మతిభ్రమణంబున భిన్ను లై ప్రవ**
**ర్తిల్లక సర్వము న్నతని దివ్యకళామయ మంచు విష్ణునం**
**దుల్లము జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ!"**
**(పోతన భాగవతము 7-142)**

ఈ పద్యం వలన ప్రహ్లాదుని సత్య జ్ఞానం స్పష్టమవుతున్నది. లోకులందరూ అజ్ఞానంతో, ఇల్లనే చీకటిగోతిలో పడి తల్లడిల్లుతూ ఉంటారు. "నేను వేరు, ఇతరులు వేరు" అనే చిత్త భ్రమ భేద భావంతో ఉంటారు. అట్టి భేద భావంతో మెలగకుండా విశ్వం అంతా విష్ణు దేవుని లీలా విశేషాలతో నిండి ఉందని గ్రహించాలి. అలా గ్రహించి ఆ విష్ణుదేవుని మనసులో నిలుపుకొని, తాము అడవులలో నివసించినా ఉత్తమమే అంటూ ప్రహ్లాదుడు చెప్పిన

మాటలు స్థిరమైన జ్ఞానచిత్తాన్ని చిత్రిస్తున్నాయి.

**3. వైరాగ్యం:**

**"పాఱుడు లేచి దిక్కులకు బాహువు లొడ్డుడు బంధురాజిలోఁ**
**దూఱుడు ఘోరకృత్య మని దూఱుడు తండ్రిని మిత్రవర్గముం**
**జీరుడు మాతృసంఘము వసించు సువర్ణగృహంబులోనికిం**
**దానిడు 'కావరే' యనుడు తాపము నొందుడు కంటగింపుడున్"**

**(పోతన భాగవతము 7-194)**

ఈ పద్యం ద్వారా ప్రహ్లాదుని వైరాగ్య చింతన విశదమవుతున్నది. ఆ రాక్షసులు ఎంత హింసిస్తున్నా ప్రహ్లాదుడు దూరంగా పారిపోడు, కొడుతుంటే చేతులయినా అడ్డం పెట్టుకోడు, చుట్టాల గుంపులోకి దూరి దాక్కోడు, ఇది "ఘోరం, అన్యాయం" అని తండ్రిని నిందించడు, స్నేహితులను సాయం రమ్మనడు, తన తల్లి, సవితి తల్లి మున్నగు తల్లులు నివాసం ఉండే బంగారు మేడల లోనికి పరుగెట్టి, "కాపాడండి" అని గోలపెట్టడు అసలు బాధపడనే పడడు, వేదన చెందడు. తండ్రిని గానీ, బాధిస్తున్న రాక్షసులను గానీ అసహాయంగా చూస్తున్న వారిని గానీ ఎవరినీ ద్వేషించడు, ఎంతటి విచిత్రం, ఇలాంటి పిల్లవాడు ఎక్కడైనా ఉంటాడా?అనే ప్రశ్నలు మనలో ఉత్పన్నమయ్యేటంతటి తన వైరాగ్య భావాన్ని విస్పష్టం చేశాడు.

**4. తత్త్వము:**

**"తన యందు నఖిల భూతము లందు నొకభంగి**
**సమహితత్వంబున జరుగువాఁడు**
**పెద్దలు బొడగన్న భృత్యునికైవడి**
**జేరి నమస్కృతుల్ చేయువాఁడు**
**కన్నుదోయికి నన్యకాంత లడ్డం బైన**
**మాతృభావము జేసి మరలువాఁడు**
**తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను**
**దీనుల గాము జింతించువాఁడు**
**సఖుల యెడ సోదరస్థితి జరుపువాఁడు**
**దైవతము లంచు గురువుల దలఁచువాఁడు**
**లీల లందును బొంకులు లేనివాఁడు**
**లలితమర్యాదు డైన ప్రహ్లాదు డధిప"! (పోతన భాగవతము 7-115)**

పైపద్యాన్ని బట్టి నలుగురిలో చక్కని వివేకము కలిగిన వాడు, సకల ప్రాణులను తనతో సమానంగా చూసేవాడు, సజ్జనులు కనబడితే సేవకుడిలా దగ్గరికి వెళ్లి నమస్కరించేవాడు, పరస్త్రీలు కనబడితే తల్లిలా భావించి ప్రక్కకు తప్పుకునేవాడు, దిక్కులేని వారిని చూస్తే వారిని సొంత బిడ్డల లాగా కాపాడేవాడు, మిత్రులను అన్నదమ్ముల వలె ఆదరించేవాడు, గురువులను దైవంతో సమానంగా చూసేవాడు, వినోదానికైనా అబద్ధాన్ని ఆడని వాడు, మర్యాద తెలిసిన వాడు ప్రహ్లాదుడు అని అర్థమవుతుంది.

**ముగింపు:**

ఆధునిక పరిశోధకులు వ్యక్తి ప్రవర్తన మీద అనువంశిక, పరిసరాల ప్రభావం ఉంటాయని మనో వైజ్ఞానిక శాస్త్రం ఆధారంగా చెప్తున్నారు. కానీ వ్యక్తి ప్రవర్తనలో అనువంశిక, పరిసరాల ప్రభావానికి కట్టుబడని పురాణ పాత్రగా మనం ప్రహ్లాదుని చూడవచ్చు. ప్రహ్లాదుడు పుట్టింది దానవ జాతిలో. పెరిగింది దానవుల మధ్యలో. అయినా ప్రహ్లాదుని ప్రవర్తనలో ఎక్కడా కూడా దానవత్వం కనిపించదు. ప్రాచీన భారతీయ సంస్కృతి చెప్పిన త్రిగుణాలలో సత్వగుణాన్ని ఆశ్రయించుకుని స్థిరమైన చిత్తంతో తరించిన ప్రహ్లాదుడు ప్రాతఃస్మరణీయుడు. నిండైన మానవత్వానికి నిర్మలమైన దైవత్వానికి ప్రతీకగా ప్రతిఫలిస్తున్న సార్ధక నామధేయుడైన ప్రహ్లాదుడు –సత్త్వ గుణ సంపన్నుడు.

**ఆధార గ్రంథాలు**

1. తిరుమల తిరుపతి దేవస్థానములు, పోతన భాగవతము, మూడవ సంపుటము, తిరుపతి 2010
2. రమేష్‌బాబు, చందవోలు. త్రిగుణాలు, అచ్చంగా తెలుగు ప్రచురణ, హైదరాబాద్ 2021.
3. శ్రీమద్భగవద్గీత (శ్లోక తాత్పర్యములు), గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ 2022
4. సూర్యనారాయణ శర్మ, వేదుల. అంతరార్థ భాగవతము, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ 2015.

# త్రిపురాసుర సంహారం - త్రిగుణాత్మక పరిశీలన

**డాక్టర్ వీపూరి వేంకటేశ్వర్లు,**
పి.జి.టి. తెలుగు, సెయింట్ జోసఫ్స్ ఆంగ్ల పాఠశాల,

**ఉపోద్ఘాతం:**

త్రిపురాఖ్యానమ్ భాగవతంలోని సప్తమస్కంధంలో పదవ అధ్యాయంలో ఉంది. దీనిని పోతన 20 గద్య పద్యాలలో తెనిగించారు.

మయుని దుశ్చర్య చేత విహతయశుడైన పరమేశ్వరుడు శ్రీహరి సాయంతో త్రిపురదహనం కావిస్తాడు. త్రిపురాలు అంటే జీవునికి ఉండే స్థూల, సూక్ష్మ కారణ శరీరాలు. పరమేశ్వరుడు జ్ఞానానికి అధిపతి. కాబట్టి జీవుడు పరమేశ్వరుణ్ణి ఆశ్రయించి, ఆయన అనుగ్రహం వల్ల ఈ దేహత్రయాన్ని లేకుండా చేసుకొని, ముక్తిని సాధించుకోవాలన్న ఆధ్యాత్మిక సందేశం ఇందులో ఉంది.

అంతేకాదు జీవుడు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలనే పురత్రయంలో సంచరిస్తున్నాడు కాబట్టి ఎవరైతే అవస్థాత్రయాన్ని అధిగమించి సాక్షిరూపులవుతారో, వారు త్రిపురహరులై తరిస్తారు.

**సంక్షిప్త కథ:**

దేవతల దాడులకు తట్టుకొనలేని రాక్షసులకు తలదాచుకునే తావులేక, వాళ్ళు రాక్షసశిల్పి అయిన మయునివల్ల బయటకు కనబడకుండా, ఎక్కడికైనా వెళ్ళగలిగేటట్లు త్రిపురాలను ఏర్పాటు చేసుకొని, వాటితో లోకాలను శోకాలపాలు చేయసాగారు. దానితో దేవతలు శంకరుణ్ణి శరణు వేడగా, ఆయన ఆ మూడు పట్టణాలను దహించి వేసాడు. అయినా మయుడు ఆ దహించబడిన రాక్షసులనందరినీ తెచ్చి సిద్ధరసంతో నిండిన ఒక కూపంలో పడవేసి, బ్రతికించసాగాడు. దీన్ని గమనించిన శ్రీహరి, తానొక గోవు రూపంలో బయలుదేరి – బ్రహ్మను దూడగా చేసికొని – తమ అందచందాలకి, సిద్ధరస కూపాన్ని కాపలా కాస్తున్న వారు మురిసిపోయేలా చేష్టలు చేస్తూ, మొత్తం ఆ రసాన్ని త్రాగేసారు. ఆ తర్వాత శ్రీహరి సూచనపై శంకరుని బాణం త్రిపురాలను, రాక్షసగణాల్ని ధ్వంసం చేసింది.

**ప్రతీకాత్మక సౌందర్యం:**

ఈ కథ ఎప్పుడో ఒకప్పుడు జరిగిపోయింది కాదనీ, అన్ని కాలాలలో మళ్ళీ మళ్ళీ జరుగుతూనే ఉంటుందని సూచించడానికే పోతన **“.... ఇట్లు విశ్వజనీనంబగు త్రిపురాసుర సంహారంబున నఖిలలోకులును సంతసిల్లిరి” - (1-405)** అని ఈ కథను వర్ణించాడు. మూలంలో ‘విశ్వజననము’ అనే పదప్రయోగం లేదు. పోతన ఈ కథలోని ఆధ్యాత్మిక రహస్యాన్ని దర్శించినవాడు. కాబట్టే ఈ పదప్రయోగాన్ని చేయగలిగాడు.

అసురులు శ్రీహరి అండచే బలవంతులైన దేవేంద్రాదుల ఉద్ధతికి తట్టుకోలేక భయపడి, మాయావి అయిన మయుణ్ణి శరణువేడగా, మయుడు వెంటనే తన యోగబలంతో ఇనుము, వెండి, బంగారాలతో

